




# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 214: గురువారం 2 ఏప్రిల్ 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్



# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం



ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.

- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపీలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

బిల్లు తీసుకురాబోతున్న కేంద్ర ప్రభుత్వం

2



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.

మిగతా 2 లో

# జగన్‌లాంటి మనిషిని చూడలే నేను చూడలే

## మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం విధ్వంసం

- అమరావతి ఇక ప్రజా రాజధాని.. ఇంచుకూడా కదలించలేరు
- వింజమూరు పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు



**నెల్లూరు, ఏప్రిల్ 1:** నా జీవితంలో వైసీపీ లాంటి పార్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని.. ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టంచేశారు. వింజమూరులో సీఎం పర్యటించారు. వింజమూరులో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని.. ఆమోదం పొంది గురువారం రాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

## అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

.. వివరాలు 2లో

## ఐదుకోట్ల ఆంధ్రులు గర్వించే రోజు

- అమరావతికి లోక్‌సభ ఆమోదంపై లోకేశ్ ట్వీట్

ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించే చరిత్రాత్మక రోజు ఇదంటూ ఎక్స్ వేదికగా ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.



2

## దోచుకోవడానికే అమరావతి ప్లాన్

3

- అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం
- మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్





## నాటో నుంచి తప్పుకుంటాం

అది 'కాగితపు పులి' కూటమి..

ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..

తోసిపుచ్చిన కీర్ స్టార్మర్

4

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ

# ఏపీ పర్యాటకానికి 'ఢిల్లీ' దన్ను



కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం వేళ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం హస్తిన పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

2

- కేంద్ర మంత్రి షెకావత్‌తో నేడు కందుల దుర్గేష్ భేటీ!
- రూ. 915 కోట్ల విలువైన 9 కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు సిద్ధం
- రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, విశాఖలో లలిత కళా అకాడమీకి విజ్ఞప్తి
- డిప్యూటీ సీఎం సూచనతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' పునర్ముద్రణపై చర్చ



## ఒంటిమిట్టలో అయోధ్య వైభవం


- కల్యాణ వేదికకు అద్భుత పుష్పాలంకరణ!
- త్రేతాయుగంనాటి దృశ్యాలను తలపించిన యాక్రిలిక్ పెయింటింగ్
- 9 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 80 వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ

3

## ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు

- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేల మంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం

4




## నరసరావుపేట ఎమ్మెల్యేపై టీడీపీ హైకమాండ్ సీరియస్

3

- రెండు రోజుల్లో అమరావతికి రావాలని చంద్రబాబు ఆదేశం



## నేతన్నలకు ఉచిత విద్యుత్

3

చేనేత మగ్గాలకు 200.. మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ





# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.




## జగన్ లాంటి మనిషిని నేను చూడలే

మొదటి పేజీ తరువాయి

63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'నాపై కోపంతో పోలవరం ప్రాజెక్ట్‌ను గోదావరిలో కలిపేశారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తాం. శ్రీశైలం, పోలవరంతో ఉదయగిరి ప్రాంతానికి నీటి కొరత ఉండదు' అని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరగడం లేదని.. అందుకే ఖ4 ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

**బిల్లు తీసుకురాబోతున్న కేంద్ర ప్రభుత్వం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్లు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# చంద్రబాబు కృషి వల్లనే అమరావతి సాకారం


- రైతుల పక్షాన చంద్రబాబుకు మంత్రి నారాయణ కృతజ్ఞతలు
- జగన్‌ను కుతంత్రాలు ఇక సాగవన్న మంత్రులు



**అమరావతి, ఏప్రిల్ 1 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినందుకు ప్రధాని మోదీకి సైతం ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం రాజధాని బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంతో అమరావతిలో మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా పేరు పేరునా మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం.. ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచు కూడా అమరావతిని కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా ఐదేళ్లపాటు మూడు ముక్కలాట ఆడిందంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాష్ట్ర రాజధానిగా శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 14 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి ఆనం వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొలువుదీరిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ లబ్దిదారులకు నెలకు రూ.4 వేల చొప్పున నగదు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దొంగ నాటకాలను గుర్తించి.. తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. లోక్‌సభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బుధవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఏపీ రాజధానిగా అమరావతిని రాష్ట్ర ప్రజలంతా ఆమోదించారన్నారు. 33 వేల ఎకరాల భూములను రైతులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఇచ్చారని తెలిపారు. ఆనాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మేము అనుకూలమని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కొల్లు రవీంద్ర తెలిపారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ చాలా ఘోరాలు, పాపాలు చేశారని వివరించారు. భూములు ఇచ్చిన రైతులు, మహిళలపై లాఠీఛార్జి చేయించారన్నారు. వారిపై అక్రమంగా కేసులు సైతం పెట్టించి జైలుకు పంపించారని చెప్పారు. చివరకు ఆ ప్రాంతంలో పరదాలు కట్టుకుని జగన్ వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. న్యాయస్థానం టూ దేవస్థానం అని మహిళలు చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో అడుగు పని కూడా చేయకుండా జగన్.. అమరావతిని చంపేందుకు ఎన్నో కుట్రలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అద్భుతమైన అమరావతి ఆవిష్కృతమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉండేలా కట్టుదిట్టమైన చట్టం అవుతుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని చెప్పారు. వైసీపీ నేతలు చేస్తున్న కుట్రలు, వారు చేసే వ్యాఖ్యలు దుర్మార్గంగా ఉన్నాయని మంత్రి రవీంద్ర తెలిపారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని అభ్యంతరాలు ఎందుకు చెప్పలేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సూటిగా ప్రశ్నించారు. మళ్లీ నేడు అమరావతిపై విషం చిమ్మేందుకు వైఎస్ జగన్ యత్నించారని విమర్శించారు. ఐదేళ్ల పాటు గడ్డి పీకాడా?.. ఇప్పుడు ఎలా ప్రశ్నిస్తారంటూ వైఎస్ జగన్‌పై ఆయన నిప్పులు చెరిగారు. కేంద్రం అందిస్తున్న సహకారంతో సీఎం చంద్రబాబు అమరావతిలో అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. కేసుల భయంతో గత ఐదేళ్లుగా కేంద్రాన్ని నిధులు కూడా అడగలేక పోయారని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

# అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

- రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే
- ఎక్స్ వేదికగా చంద్రబాబు హర్షం



**అమరావతి, ఏప్రిల్ 1:** లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ఏపీ పర్యాటకానికి 'ఢిల్లీ' దన్ను

**కేంద్ర మంత్రి షెకావత్‌తో నేడు కందుల దుర్గేష్ భేటీ!**

**రూ. 915 కోట్ల విలువైన 9 కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు సిద్ధం**

**రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, విశాఖలో లలిత కళా అకాడమీకి విజ్ఞప్తి**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌సూచనతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' పునర్ముద్రణపై చర్చ**



అమరావతి, ఏప్రిల్1(మనసులో మాట): కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం వేళ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం హస్తిన పర్యటనకు బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆయన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులతో పాటు, సుమారు రూ. 915 కోట్ల విలువైన 9 నూతన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని ఆయన కేంద్రాన్ని కోరనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో ఏపీని పర్యాటక హబ్‌గా మార్చేందుకు మంత్రి దుర్గేష్ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మచిలీపట్నం బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ (రూ. 120 కోట్లు), మంగళగిరి పానకాల స్వామి ఆలయం (రూ. 95 కోట్లు), అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం (రూ. 213 కోట్లు) వంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధికి నిధులు కోరనున్నారు. అలాగే లంబసింగి, లేపాక్షి పర్యాటక అభివృద్ధికి, బౌద్ధ క్షేత్రాల వద్ద టెంట్ సిటీల ఏర్పాటుకు డీపీఆర్‌లను సమర్పించనున్నారు. తిరుపతి, విశాఖపట్నంలను దేశంలోని 50 ఐకానిక్ పర్యాటక కేంద్రాల జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక సూచన మేరకు తెలుగు భాషా చరిత్రలో అద్భుత గ్రంథమైన 'సూర్యరాయాంధ్ర నిఘంటువు'ను ఆధునిక సాంకేతికతతో పునర్ముద్రించేందుకు కేంద్ర సహాయాన్ని మంత్రి కోరనున్నారు. 1.1 లక్షల పదాలతో కూడిన ఈ నిఘంటువును నేటి తరం చదువరులకు అందుబాటులోకి తేవడం ద్వారా తెలుగు భాషా వైభవాన్ని చాటాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. రాజమండ్రిలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తెలుగు పద్య నాటకం, వీధి నాటకాలకు పునర్జీవం పోయాలని మంత్రి దుర్గేష్ ప్రతిపాదించనున్నారు. దీనితో పాటు విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం, విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో 'కళాక్షేత్ర' ఆడిటోరియం నిర్మాణం, అమరావతిలో సాహిత్య అకాడమీ కేంద్రం ఏర్పాటుపై కీలక చర్చలు జరపనున్నారు. అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి కోసం విశాఖలో ఐసీసీఆర్‌బ్రాంచ్ ఏర్పాటు అత్యవసరమని కేంద్రానికి వివరించనున్నారు. ఈ ఢిల్లీ పర్యటన ఏపీ పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మద్దతుతో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.



# ఐదుకోట్ల ఆంధ్రులు గర్వించే రోజు

**అమరావతికి లోక్‌సభ ఆమోదంపై లోకేశ్ ట్వీట్**

**అమరావతి,ఏప్రిల్ 1:** రాజధాని అమరావతి ప్రాంతంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అంటూ లోక్ సభ ఆమోదం తెలపడంతో సందడి మొదలైంది. వైసీపీ మినహా సభలోని అన్ని పార్టీలు రాజధానిగా అమరావతికే ఓటేశాయి. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించే చరిత్రాత్మక రోజు ఇదంటూ సంతోషం వ్యక్తం చేశారు. 'నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్– నా రాజధాని అమరావతి అని ఐదు కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చరిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంట్ వేదిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఒకే రాష్ట్రం– ఒకే రాజధాని నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. అమరావతి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష. అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం. కోట్లాది ప్రజల కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా చరిత్ర–సంస్కృతికి ఆలవాలమైన అమరావతిని నిలిపింది. జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి..' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. ఏపీ రాజధాని అమరావతికి లోక్ సభ ఆమోదం తెలపడంతో ఢిల్లీకి మంత్రి లోకేశ్ వెళ్లనున్నారు. ఇవాళ రాత్రికి ఆయన దేశ రాజధానికి బయలుదేరనున్నారు. బిల్లుకు సహకరించిన ఎంపీలు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపనున్నారు. గురువారం నాడు రాజ్యసభలో బిల్లుపై చర్చ సమయంలో ఢిల్లీలోనే ఉండనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.



# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

**అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం**

**రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు**

**కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం**

**మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్**

**అమరావతి, ఏప్రిల్ 1:** చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్దాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్ధసారధి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్-బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

# ఇక అమరావతే ఆంధ్రాకు శాశ్వత రాజధాని

**గత వైకాపా అరచాకంతో రాజధాని లేకుండా పాలన**

**ఆనాటి రైతులకు తీవ్ర వేధింపులు..మహిళలపై దాడులు**

**లోక్‌సభ చర్చలో ఎంపి పురంధేశ్వరి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని భాజపా ఎంపీ పురందేశ్వరి అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన పక్రియ అరాచకంగా జరిగిందన్నారు. ఆనాడు చర్చ లేకుండానే రాష్ట్ర విభజన చేశారు. పార్లమెంట్‌లో లైట్లు, కెమెరాలు ఆపి బిల్లు పాస్ చేశారు. చట్టాన్ని గౌరవించి విభజనను ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత ఏపీకి రాజధాని అవసరం వచ్చింది. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధప్రదేశ్ పాలన ప్రారంభమైంది. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టింది. రాజధానికి 29వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడింది. త్యాగం చేసిన రైతుల పట్ల గత ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించిందని పురందేశ్వరి అన్నారు. వైసీపీ హయాంలో రాజధానిపై తీవ్ర అస్థిరత నెలకొందని.. రాజధానిపై గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. అమరావతి తొలి ప్రజా రాజధానిగా గుర్తింపు తెచ్చుకుందని ఎంపీ తెలిపారు. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టిందని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు ఎంపీ. వైసీపీ వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడిందని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో ఏపీలో అరాచక పాలన సాగిందని విమర్శలు గుప్పించారు. ఆడవారని కూడా చూడకుండా నానా హింసలు పెట్టారని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరించలేదన్న కాంగ్రెస్ విమర్శలు సరికాదన్నారు. రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం హడ్కో నిధులు విడుదల చేసిందని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

# ఒంటిమిట్టలో అయోధ్య వైభవం

- సీతారాముల కల్యాణ వేదికకు అద్భుత పుష్పాలంకరణ!
- త్రేతాయుగంనాటి దృశ్యాలను తలపించిన యాక్రిలిక్ పెయింటింగ్
- 9 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 80 వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ



**ఒంటిమిట్ట:** కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో కల్యాణ వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా రూపొందించిన ఈ వేదిక భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది. రంగురంగుల పుష్పాలతో అలరారుతున్న వేదికపై, ప్రాచీన ఆలయాలలోని దశావతారాల సెట్టింగు, రామాయణంలోని ముఖ్య ఘట్టాలతో కూడిన యాక్రిలిక్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగుదనం ప్రతిబింబించేలా చెరుకులు, టెంకాయ గెలలు, అరటి మరియు మామిడాకులతో పాటు, విదేశీ జాతుల పుష్పాలను కూడా అలంకరణకు ఉపయోగించారు. హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం వంటి పుష్పాలతో వేదిక కనువిందు చేస్తోంది. ఇందుకోసం 5 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్‌ను వినియోగించారు. అదేవిధంగా, ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మరో 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో అత్యద్భుతమైన పుష్పాలంకరణలు చేపట్టారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజులపాటు 100 మంది అలంకరణ నిపుణులు, మరో 100 మంది టీటీడీ సిబ్బంది ఈ అలంకరణ పనుల్లో పాల్గొన్నారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి పరవశించిపోతున్నారు.





## ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు

ఒంటిమిట్ట: వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టింది. ప్రధాన కల్యాణ వేదికకు ఎదురుగా 120 గ్యాలరీలు ఏర్పాటు చేసింది. గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల కిట్‌తో పాటు ఈసారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించనుంది. 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు.

# నేతన్నలకు 'ఉచిత విద్యుత్' కానుక

- చేనేత మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ
- ఏడాదికి రూ. 150 కోట్ల భారం భరించనున్న ప్రభుత్వం: మంత్రి గొట్టిపాటి



**అమరావతి:** కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో కీలక హామీని నెరవేరుస్తూ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు గొప్ప ఊరటనిచ్చింది. బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ఈ పథకం కింద సాధారణ చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు (పవర్ లూమ్స్) 500 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందిస్తామని, దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ. 150 కోట్లకు పైగా అదనపు భారం పడుతుందని ఆయన వెల్లడించారు. యువగళం పాదయాత్రలో భాగంగా అనంతపురం జిల్లా ధర్మవరంలో చేనేత కార్మికుల కష్టాలను స్వయంగా చూసిన నారా లోకేశ్ ఇచ్చిన హామీని నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను అపార అనుభవంతో గాడిలో పెడుతున్నామని, 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూఅప్ భారం లేకుండా పాలన సాగిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన వనరులైన సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ విధానాల ద్వారా విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తున్నామని మంత్రి తెలిపారు. లో-వోల్టేజీ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడంతో పాటు నియోజకవర్గానికి ఒక 'నమూనా సోలార్ గ్రామాన్ని' అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని, వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లు అందించాలని, వినియోగదారుల అనుమతితోనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని, వినియోగదారుల సంతృప్తి స్థాయిని 90 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# నరసరావుపేట ఎమ్మెల్యేపై టీడీపీ హైకమాండ్ సీరియస్



- లిఖితపూర్వక వివరణకు ఆదేశం!
- ఎస్పీ కార్యాలయంలో భీష్మించుక కూర్చున్న అరవిందబాబు తీరుపై పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం
- రెండు రోజుల్లో అమరావతికి రావాలని చంద్రబాబు ఆదేశం

**అమరావతి:** పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వ్యవహరించిన తీరుపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రస్థాయిలో మండిపడింది. క్రమశిక్షణ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యేకు స్వయంగా ఫోన్ చేసిన పల్లా, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే:**

మంగళవారం మధ్యాహ్నం నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కార్యాలయానికి వెళ్లారు. జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా తాను సిఫార్సు చేసిన రామినేని ప్రసాద్ పేరును ఎందుకు ఆమోదించడంలేదని ఎస్పీని నిలదీశారు. 8 నెలల క్రితమే లేఖ ఇచ్చినా ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆర్డర్ కాపీ ఇచ్చే వరకు కదిలేది లేదని ఎస్పీ చాంబర్‌లోనే భీష్మించుక కూర్చున్నారు. దాదాపు 10 గంటల పాటు అక్కడే ఉండిపోవడమే కాకుండా, ఆ సమయంలో మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చిన ఫోన్లను కూడా ఆయన లెక్కపెట్టలేదని సమాచారం.

**చంద్రబాబు ఆరా:**

ప్రభుత్వ అధికారులతో ఇలాంటి వాగ్వాదానికి దిగడంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలి తప్ప, అధికారుల వద్ద ఇలా ప్రవర్తించడం సరికాదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో ఎమ్మెల్యే అరవిందబాబును అమరావతికి పిలిపించి వివరణ తీసుకోవాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఎమ్మెల్యే తీరుపై అటు పోలీస్ వర్గాల్లోనూ చర్చ నడుస్తోంది. గతంలోనూ ఆర్డీవో కార్యాలయంలో ఆయన ఇదే తరహాలో వ్యవహరించడంపై పార్టీ నాయకత్వం గుర్తు చేస్తోంది.



సంపాదకీయం

# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల!

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండదు.



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు

- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం

**న్యూయార్క్, ఏప్రిల్ 1 :** ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీయులే ఉన్నట్లు సమాచారం.

## తెల్లవారకముందే చేదు వార్త..

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకే వేలాది మంది ఉద్యోగుల ఇన్-బాక్స్‌ల్లో 'టర్మినేషన్' మెయిల్స్ ప్రత్యక్షమయ్యాయి. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా, కనీసం మేనేజర్లు లేదా హెచ్ఆర్ విభాగం నుండి సమాచారం లేకుండానే ఈ మెయిల్స్ పంపడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. "మీ పాత్రతో ఇక కంపెనీకి అవసరం లేదు" అంటూ వచ్చిన ఒక్క మెయిల్‌తో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారి కెరీర్ ముగిసిపోయింది. మెయిల్ వచ్చిన వెంటనే కంపెనీ ల్యాప్‌టాప్‌లు, అంతర్గత వ్యవస్థల యాక్సెస్‌ను నిలిపివేయడం ఉద్యోగులను మరింత షాక్‌కు గురిచేసింది.

## లాభాల్లో ఉన్నా ఎందుకీ కోత?


ఒరాకిల్ ప్రస్తుతం ఆర్థికంగా పటిష్టంగానే ఉంది. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో సంస్థ లాభాలు 95 శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ డేటా సెంటర్ల రంగంలో 156 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ ప్రాజెక్టుల కోసం ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల అప్పు తీసుకున్న ఒరాకిల్, నిర్వహణ ఖర్చులను తగ్గించుకునే క్రమంలోనే ఈ ఉద్యోగాల కోతకు పాల్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఏడాదికి 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా చేయవచ్చని సంస్థ అంచనా.

## భారత్‌పై తీవ్ర ప్రభావం

ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది పని చేస్తుండగా, అందులో దాదాపు 40 శాతం మంది ఈ లేఆఫ్స్ బారిన పడ్డారు. ముఖ్యంగా అమెరికా, కెనడా వంటి దేశాల్లో కఠినమైన కార్మిక చట్టాల దృష్ట్యా, ఖర్చు తక్కువగా ఉండే భారతీయ విభాగాలపైనే మేనేజ్‌మెంట్ ఎక్కువ వేటు వేసినట్లు తెలుస్తోంది. మేనేజీరియల్ స్థాయి నుంచి ఇంజనీర్ల వరకు ఈ జాబితాలో ఉన్నారు.

## పరిహారం షరతులతోనే..

తొలగించిన ఉద్యోగులకు మూడు నెలల అదనపు జీతం, సర్వీసులో ఉన్న ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం వంటి ప్రయోజనాలను కంపెనీ ప్రకటించింది. అయితే, ఈ ప్యాకేజీ అందరికీ వర్తించదు. కంపెనీ నిర్ణయించిన గడువులోగా 'సామరస్యపూర్వకంగా' రాజీనామా చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు అందుతాయని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ భారీ లేఆఫ్స్ కేవలం మొదటి విడత మాత్రమేనని, రానున్న నెల రోజుల్లో మరిన్ని కోతలు ఉండవచ్చనే వార్తలు ఇప్పుడు ఐటీ వర్గాల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.




# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయన్న ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 1:** అమెరికా- ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.



# నాటో నుంచి తప్పుకుంటాం

- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్



**వాషింగ్టన్/లండన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నాటో కూటమిని ఒక 'కాగితపు పులి'గా అభివర్ణించిన ట్రంప్, దాని విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరిపే సైనిక చర్యల్లో నాటో దేశాలు తమకు అండగా నిలవడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. "కష్టకాలంలో సహకరించని మిత్రదేశాల కూటమిలో కొనసాగడం వల్ల ప్రయోజనం లేదు. ఇరాన్ విషయంలో వాళ్లు మాకు మద్దతు ఇవ్వడం లేదు, అందుకే నాటో నుంచి వైదొలిగే ఆలోచన చేస్తున్నాం" అని ట్రంప్ కుండబద్దలు కొట్టారు.


## బ్రిటన్ నేవీపై విమర్శలు..

ఇదే క్రమంలో బ్రిటన్ యుద్ధ నౌకల దుస్థితిని ట్రంప్ నేరుగా ఎద్దేవా చేశారు. "మీకు అసలు నావికాదళమే లేదు. ఉన్నవన్నీ చాలా పాతబడిపోయాయి. మీ వద్ద ఉన్న విమాన వాహక నౌకలు కూడా పనిచేయని స్థితిలో ఉన్నాయి" అంటూ విమర్శలు గుప్పించారు. రక్షణ వ్యయంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు ఏమైనా సలహా ఇస్తారా అని ప్రశ్నించగా.. "నేను ఎవరికీ సలహాలు ఇవ్వను, ఆయనకు నచ్చింది ఆయన చేసుకోవచ్చు" అని పొడిగా సమాధానమిచ్చారు.

## స్టార్మర్ దీటైన జవాబు..

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వెంటనే స్పందించారు. నాటో అనేది ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన సైనిక కూటమి అని, దానికి బ్రిటన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. "నాపై, ఇతర దేశాలపై ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే, కానీ నేను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటన్ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఉంటుంది" అని స్టార్మర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెను కలకలం రేపుతున్నాయి. ఒకవేళ అమెరికా నిజంగానే నాటో నుంచి తప్పుకుంటే, ప్రపంచ భద్రతా ముఖచిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
అమరావతి
ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు
పల్నాడు | బాపట్ల | ప్రకాశం

# పునర్విభజన నేపథ్యంలో..
# టిడిపి కోటలపై చంద్రబాబు
# ఫోకస్



- నియోజకవర్గాలలోని గ్రామాలపై అధ్యయనం
- సుధీర్ఘకాలం టిడిపి వెంట ఉన్న గ్రామాలలో గుర్తింపుకు ఆదేశం
- కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలపై ప్రత్యే దృష్టి
- 2024లో వచ్చిన మెజారిటీ తగ్గకుండా ఉండాలని సూచన
- నిత్యం ప్రజల్లో ఉండే విధంగా కార్యాచరణ
- నియోజవర్గం రెండుగా మారుతుందని నిర్లక్ష్యంగా ఉండవద్దు
- 2029 కల్లా రాజకీయ ముఖచిత్రమే మారే అవకాశం

**అమరావతి, పొలిటికల్ బ్యూరో (మనసులో మాట)**

నియోజవకవర్గాల పునర్విభనతో రాష్ట్ర భౌగోళిక స్వరూపమే మారిపోనుంది. ఎన్నికల సమయం ఇంకా మూడుళ్ళు ఉన్నప్పటికీ కేంద్రం ప్రకటించిన పునర్విభజన ప్రక్రియతో అన్నీ పార్టీలలో భయం నెలకొంది. పైకి గంభీరంగా కనిపిస్తున్నా లోపల మాత్రం బెరుకు కనిపిస్తోంది. ఈ నేపధ్యంలో పునర్విభన కారణంగా ఎవరి నష్టమో.. ఎవరికి లాభమో తెలయదు కాని అన్నీ పార్టీలు వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నాయి. అధికార పార్టీ నియోజకవర్గాల పెంపుకు సంబంధించి తయ చేతిలో ఉన్నప్పటికీ 2029 నాటికి రాజకీయ పరిస్థితులు ఏ విధంగా మారనున్నాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా తనకు అనుకూటమైన నియోజకవర్గఆలను గుర్తించి ఆ తరువాత ప్రత్యర్ధి పార్టీల నియోజకవర్గాలను గుర్తించాలని ఎమ్మెల్యేలకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లుగా సమాచారం అందుతోంది. ఒక వైపు రాజధాని అంశం తెలమీదకు తీసుకువచ్చి ఇది మాఘనతేన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని టిడిపి భావిస్తోంది. 2024 ఎన్నికల్లో సతం ఇదే ఫార్ములాను ఉపయోగించిన టిడిపి మళ్ళీ 2029లో కూడా ఇదే స్టాటజీని అమలు పరిచే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్రంలో రాజధాని అనేది లేకుండా చేయాలని మూడు ముక్కలాటలు ఆడిన జగన్మోహనరెడ్డి మళ్ళీ అదే పాట పాడుతున్నారని పార్లమెంట్ నుంచే టిడిపి మొదలు పెట్టింది. ఒక వైపు ప్లామెంట్‌లో అమరావతి బిల్లు పై చర్చ జరుగతోన్న తరుణంలోనే వైసిపి అధినేత జగన్ మళ్ళీ మచిలీపట్నం విజయవాడ,గుంటూరును కలిపి మావిగన్ పేరుతో రాజధాని ఏర్పాటు చేయాలని ప్రెస్ మీట్ పెట్టఆరు. దీనిని మరో అస్త్రంగా టిడిపి తీసుకుంది. ఇదిఇలా కోనసాగిస్తూనే టిడిపికి పట్టున్న గ్రామాలపై అద్యయనం చేయాలని పార్టీ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు మండలాలు ఉంటాయి. వాటిలో టిడిపికి ఎక్కువగా బలం మున్న గ్రామాలు, మండలాలను పరిశీలించి గుర్తించాలని కేడర్‌కు చెప్పినట్లు తెలుస్తోంది.

**సుధీర్ఘ కాలం టిడిపి వెంట నడిచిన గ్రామాల గుర్తింపు:**

ఏ ఎన్నికలు వచ్చినా తిరుగులేని మెజారిటీని తీసుకొచ్చిన గ్రామాలపై ప్రధాన దృష్టి సాధించాలని టిడిపి అధినేత చంద్రబాబు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 2014, 2024లో జరిగిన ఎన్నికలను పరిగణలోకి తీసుకుని ఏఏ గ్రామాలు అత్యధిక మెజార్టీని తీసుకొచ్చాయి. అక్కడ ఏమి చేస్తే మరింత మెజారిటీ తీసుకురావచ్చు అన్న కోణంలో అద్యయనం చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాలపైనే దృష్టిఉంచాలని పేర్కొన్నట్లు గా సమాచారం. రాయలసీమలో ఇప్పటికే పూర్తి స్థాయి మెజారిటీని సాధించే దిశగా అడుగులు టిడిపి అడుగులు వేస్తోంది.

**కొత్త ఏర్పడే నియోజకవర్గాలపై ఫోకస్**

రాష్ట్రంలో సుమారు 87 అసెంబ్లీ , 13 పార్లమెంట్ నియోజవక వర్గాలు రానున్న నేపధ్యంలో వాటి పైనే యువత దృష్టి పెట్టాలని కూడా హిద్భోద చేస్తున్నారు. ప్రస్తుతం ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలు రెండుగా మారే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం కొత్తగా ఏర్పడే నియోజకవర్గం ఏ మండలాతో కలి వస్తుందో కొంత తెలిసినా.. పూర్తి స్థాయిలో మాత్రం తెయడం లేదు. దీంతో నియోజకవర్గంను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఫిర్యాదులు కూడా అధిష్టానంకు అందుతున్నట్లు తెలుస్తోంది. తాము ఏ నియోజక వర్గంలో పోటీ చేయాలని భావిస్తున్నారో వారు అదే నియోజకవర్గంలో కార్యక్రమాలు చేస్తున్నారు. కొత్తగా ఏర్పడే నియోజకవర్గంలోని మండలాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో అధిష్టానం ఆగ్రహంచి పునర్విభజన పూర్తయ్యే వరకు నియోజకవర్గఆలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా, నిత్యం ప్రజల్లో ఉండే విధంగా కార్యచరణ సిద్దం చేసుకోవాలని అధిష్టానం ఆదేశించినట్లుగా తెలుస్తోంది. మెత్తం మీద టిడిపి ముందు నుంచే వ్యూహాత్మకంగా వెళ్లాలని భావిస్తోంది.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సీట్లు జిల్లా వారీగా (ఇది ప్రస్తుత అంచనాల ఆధారంగా సిద్ధం చేసిన సమాచారం)

**గ్రేటర్ రాయలసీమ**
**(6 జిల్లాలు)**
అనంతపురం 14-21 (+7)
కర్నూలు 14-21 (+7)
కడప 10-15 (+5)
చిత్తూరు 14-21 (+7)
నెల్లూరు 10-15 (+5)
ప్రకాశం 12-18 (+6)
మొత్తం: 74-111 (+37)

**గుంటూరు కృష్ణా**
గుంటూరు 17-25 (+8)
కృష్ణా 16-24 (+8)
మొత్తం: 33-49 (+16)

**గోదావరి జిల్లాలు**
**(ఈస్ట్‌వెస్ట్)**
ఈస్ట్ గోదావరి 19-28 (+9)
వెస్ట్ గోదావరి 15-22 (+7)
మొత్తం: 34-50 (+16)

**ఉత్తరాంధ్ర**
విశాఖ 15-23 (+8)
విజయనగరం 9-15 (+6)
శ్రీకాకుళం 10ి15 (+5)
మొత్తం: 34-53 (+19)

**ముఖ్య గణాంకాలు**
మొత్తం సీట్లు: 175-263 (+88)
మ్యాజిక్ ఫిగర్: 132
ప్రతిపక్ష హోదా: ది26

మంత్రివర్గంప్రస్తుతం: 26
పెంపు తర్వాత: 39 వరకు
పెరుగుదల: +13
ఎమ్మెల్సీలుప్రస్తుతం: 58
పెంపు తర్వాత: 8788 వరకు
పెరుగుదల: +29/+30
ఎంపీలు (లోక్‌సభ)ప్రస్తుతం: 25
పెంపు తర్వాత: 3738 (అంచనా)
పెరుగుదల: +12/+13

రాజ్యసభ ప్రస్తుతం: 11
అసెంబ్లీ సీట్లు పెరిగినా వెంటనే మార్పు ఉండదు. భవిష్యత్తులో జనాభా/ డిలిమిటేషన్ ఆధారంగా మారే అవకాశం. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 175 నుంచి 263కి పెరుగుతూ మొత్తం 88 సీట్లు అదనంగా రానున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 132 సీట్లు అవసరండ మంత్రివర్గం, ఎమ్మెల్సీలు, ఎంపీ సీట్లు కూడా పెరిగే అవకాశం ఉంది.



# విధ్వంసం.. తిరోగమనం..

## స్వార్థ రాజకీయాలే జగన్ కు తెలుసు

- అమరావతిపై మరోసారి వైసీపీ విషం కక్కింది
- రాష్ట్రం రాజధాని అంశంపై పార్లమెంటులో వైసీపీ తీరు సరికాదు
- ప్రజాభీష్టాన్ని జగన్ ఎన్నడూ గౌరవించలేదు
- అలజడి, అశాంతి నెలకొల్పడమే వైసీపీ లక్ష్యం
- బెంగళూరులో ఉండే జగన్ కు పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత లేదు
- జనసేన పార్టీ అమరావతికి కట్టుబడి ఉంది
- తెనాలిలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



**గుంటూరు, ఏప్రిల్ 1, (మనసులో మాట):** 'ప్రజలకు అవసరమైంది.. ప్రజాభీష్టం మేరకు జరిగేది.. ప్రజావసరాలను తీర్చే ఏ ప్రక్రియ జగన్ కు పట్టదు.. ఇష్టముండదు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం, అధికారం కోసం అలజడులు సృష్టించడం మాత్రమే ఆయనకు తెలిసిన పని. ఓ బాధ్యతగల పార్టీ అధినేతగా ఆయన ఎప్పుడూ ప్రవర్తించలేదు. రాష్ట్రానికి సంబంధించి అమరావతి రాజధానిగా చట్టంలో గుర్తించే అంశం పార్లమెంటులో చర్చకు వచ్చినపుడు అంతా ఏకమై బలపర్చాలనే కనీస ఇంగితాన్ని వైసీపీ ప్రజాప్రతినిధులు పార్లమెంటులో మరిచిపోయార'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తన స్వలాభం, అధికార కాంక్షతో వ్యవహరించిన మాదిరిగానే నేడు రాష్ట్ర రాజధాని విషయంలో కూడా జగన్ తన స్వార్థపూరిత ఆలోచనలని బయటపెట్టారని చెప్పారు. తెనాలిలో బుధవారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... "వైసీపీ అమరావతిపై మొదటి నుంచి విషం కక్కుతోంది. రాజధానిగా అమరావతిని గర్వించేలా రూపొందిస్తున్న తరుణంలో మరోసారి వైసీపీ తన నైజాన్ని బయటపెట్టుకుంది.

అమరావతి సింగపూర్ తరహాలో ఉండాలనే బలమైన కాంక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా డిజైన్లు, మాస్టర్ ప్లాన్ వంటివి అంతర్జాతీయ సంస్థలతో తయారు చేయిస్తున్నారు. ప్రజలు అద్భుతమైన అవకాశాన్ని జగన్ కు ఇచ్చినపుడు అయిదేళ్లలో పరిపాలన చేతకాక, అమరావతిని అంగుళం కూడా ముందుకు తీసుకెళ్లడం ఇష్టం లేక మూడు రాజధానులు అంటూ నాటకం ఆడారు. తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నారు.

**అయిదేళ్లూ విధ్వంసమే సృష్టించారు**

ప్రజా జీవితంలో రాష్ట్ర ప్రజలు వైసీపీ ఓ గొప్ప అవకాశాన్ని ఇచ్చారు. దాన్ని వారు విధ్వంసం కోసం వినియోగించుకున్నారు. పాలనను ప్రజా వేదిక కూల్చి మొదలుపెట్టారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా కొనసాగించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ స్ఫూర్తిని, తర్వాత వచ్చిన వైసీపీ నాయకులు ముందుకు తీసుకెళ్లలేకపోయారు. ప్రజలను, పెట్టుబడిదారులను బెదిరించేలా, సంస్థలను వెళ్లగొట్టేలా పాలించారు. అమరావతి రైతుల్ని, మహిళల్ని తీవ్రంగా అవమానించారు. దుర్మార్గం గా ముందుకు వెళ్లారు. అప్పటి వైసీపీ విధానాలు, ప్రవర్తనతోనే నేడు విభజన చట్టంలో రాజధానిపై మార్పు తీసుకువచ్చే అగత్యం పట్టింది.

**ప్రెస్ మీట్ అవ్వగానే బెంగళూరు వెళ్లేదెవరు?**

రాజధాని విషయం మాట్లాడేటపుడు వ్యక్తిగత దూషణలు, విమర్శలు చేయకూడదనే విషయాన్ని జగన్ మరిచిపోయారు. ప్రతిసారీ హైదరాబాద్ కు గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ ఉప ముఖ్యమంత్రి ఎందుకు వెళ్తున్నారని జగన్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ రాజధానిగా ఉండేది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా 10 సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంది. మా కుటుంబాలకు సంబంధించి వృత్తిగతంగా, వ్యక్తిగతంగానూ హైదరాబాద్ తో ఉన్న అనుబంధం దృష్ట్యా మేం హైదరాబాద్ వెళితే తప్పు ఏముంది..? ప్రెస్ మీట్ అయిపోగానే బెంగళూరులో వాలిపోయే జగన్ దీని గురించి మాట్లాడటం హాస్యస్పదంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన ఓ కీలకమైన బిల్లు తీసుకొచ్చినపుడు అంతా ఐక్యంగా గళం వినిపిస్తే ఎంతో బాగుండేది. కానీ వైసీపీ నాయకుడు ఓట్లు కోసం, విద్వేషాలను రెచ్చగొట్టాలనే కుట్రతో, పైశాచిక ఆనందం కోసం రాజధాని మీద మళ్లీ విషం చిమ్మడం మొదలుపెట్టారు.

**జనసేన పార్టీ అమరావతికి కట్టుబడి ఉంది**

జనసేన పార్టీ అమరావతి రాజధాని నిర్మాణానికి కట్టుబడి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు వచ్చారు. సుమారు రూ.50 వేల కోట్లతో పనులు వేగంగా జరుగుతున్నాయి. జగన్ తన దుర్మార్గమైన ఆలోచనలు మానుకోవాలి. మళ్లీ తాము వస్తే ఏదో చేస్తామనే బెదిరింపులు, నీచమైన మాటలు ఆపాలి. రాజధాని మీద చట్టంలో మార్పు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర ప్రభుత్వానికి జనసేన పార్టీ తరపున నుంచి ప్రత్యేకంగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపుతున్నాం. అమరావతి నిర్మాణానికి, అమరావతి రాష్ట్ర అభివృద్ధికి మూలకేంద్రంగా చేయడానికి జనసేన పార్టీ సంపూర్ణంగా సహకరిస్తుంది" అన్నారు.



### పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పల్నాడు, ఏప్రిల్ 1, (మనసులో మాట):** పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బెల్లంకొండ మండల టిడిపి నాయకులు వెన్నా సీతారామిరెడ్డి అన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం జరుగుతుందన్నారు. బెల్లంకొండ మండలం లోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో గ్రామ టీడీపీ నాయకులు తో కలిసి ఆయన పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ ఏ విధమైన లోటు లేకుండా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేల పింఛను రూ.4వేలకు దివ్యాంగుల పింఛను రూ.6000, మిగిలినవారికి సైతం రూ.10వేలు, రూ.15వేల వరకూ కూటమి ప్రభుత్వం పెన్షన్లను పెంచిందన్నారు.ఎన్నికల ముందు వాలంటీర్లు లేకుండా పింఛన్లను లబ్ధిదారులకు అందించడం అసాధ్యం అంటూ దుష్ప్రచారం చేశారని,అయితే వాలంటీర్లవ్యవస్థతో సంబంధం లేకుండా ఒకటవ తేదీ మధ్యాహ్నంలోపే లబ్ధిదారులందరికీ పెన్షన్లు విజయవంతంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా 33 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం అంటే పేదల సేవలో పాల్గొనడమే అని పేర్కొన్నారు. ప్రజల్ని కలుసుకొని పింఛన్లను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఎన్‌యూ సీడీఈ పీజీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

### దూరవిద్యా కేంద్ర డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు



**గుంటూరు, ఏప్రిల్ 1,( మనసులో మాట):** ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో ఆయా పీజీ కోర్సులలో ప్రవేశాలకు గడువు ప్రక్రియను ఈనెల 10వ,తేదీ వరకు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు.2026 క్యాలెండర్ సంవత్సరం ఆయా పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును యూజీసీ- డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అధికారికంగా పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. ఎంబీఏ,ఎంసీఏ కోర్సులుతో పాటు, అన్ని ఆర్ట్స్, సైన్స్ పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ, ఫీజు చెల్లింపుకు తుది గడువుగా ఈనెల 10వ,తేదీని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రవేశ దరఖాస్తు ఫారం లింక్ అందుబాటులో ఉండి, విద్యార్థులు అనుసిడిఈ. ఇన్ఫోవెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.సీ-2026 ప్రవేశాల కోసం ఇప్పటివరకు దరఖాస్తు చేయలేకపోయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

### కేతవరం లక్ష్మీ నరసింహ స్వామి వారి

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి లావణ్య



**పల్నాడు, ఏప్రిల్ 1,( మనసులో మాట):** బెల్లంకొండ మండలం లోని కేతవరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య పాల్గొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి కోటిరెడ్డి, ట్రస్టు చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో లావణ్య కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు ప్రసిద్ధ క్షేత్రాల్లో ఒకటైన కేతవరం లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రాన్ని మహా పర్వదినాన సందర్శించుకోవడం మహాభాగ్యంగా భావిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు భోగభాగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆమె స్వామిని వేడుకున్నారు. ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ జాలయ్య,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కల వెంకటరామిరెడ్డి, మండల ప్రముఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్సన్ లు అందించేది

## కూటమి ప్రభుత్వమే

**పల్నాడు,ఏప్రిల్ 1, (మనసులో మాట) :** అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ లు అందించేది కూటమి ప్రభుత్వమే నని టీడీపీ నాయకులు ఎన్.హనుమంతరావు నాయక్ అన్నారు.వృద్ధులకు దివ్యాంగులకు అర్హులైన లబ్ధిదారులకు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులుతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దఎత్తున ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని, ప్రజలకు అభివృద్ధి తో కూడిన సుపరి పాలన అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా లక్షలాది మంది నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### నీలేశ్వరపాలెంలో ప్రజల వద్దకు ప్రవీణ్

## 100 రోజులు 100 గ్రామాలు



**పల్నాడు, ఏప్రిల్ 1, (మనసులో మాట):** ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాల పర్యటన కార్యక్రమాన్ని అచ్చంపేట మండలం నీలేశ్వరపాలెంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నిర్వహించారు.53వ రోజు నీలేశ్వరపాలెం గ్రామ ప్రజలు తెలిపిన సమస్యలను స్వయంగా విని, వెంటనే పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసారు.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలు మంచి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం అమలు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి చర్యలను ప్రజలకు ఆయన వివరించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో

# కఠినంగా వ్యవహరించాలి

- రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ విధానం అమలు చేయాలి
- లీప్ యాప్ వినియోగం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలి
- సమగ్రశిక్ష అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



**ఉండవల్లి, (మనసులో మాట) ఏప్రిల్ 1 :** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్ లపై ప్రభావంపై ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. విద్యార్థి మిత్ర కిట్ నాణ్యత విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానం పట్ల తల్లిదండ్రుల్లో సానుకూలత ఉందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా మొదట తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత అభ్యసన విధానాన్ని అమలుచేయాలని ఆదేశించారు. తదనంతరం ఇతర తరగతుల్లో క్లిక్కర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. లీప్ యాప్ లో విద్యార్థులకు ఉపయోగపడే పాఠ్యాంశాల వీడియోలు ఎన్ని చేశారో మంత్రి ఆరా తీశారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలి..**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా టీచర్, పేరెంట్ ఫీడ్ బ్యాక్ ను సేకరిస్తున్నట్లు అధికారులు వివరించారు. మంగళవారం వరకు 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయ సేకరణ చేసినట్లు తెలిపారు. ఫీడ్ బ్యాక్ ప్రక్రియను ఆటోమేషన్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లీప్ యాప్ ను ఎంతమంది తల్లిదండ్రులు వినియోగిస్తున్నారని మంత్రి ఆరా తీశారు. లీప్ యాప్ వినియోగం పట్ల తల్లిదండ్రుల్లో అవగాహనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అభ్యసన ఫలితాల మెరుగుదలలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలు సమర్థవంతమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు. ఆర్టీఈ, ఆటిజం సపోర్ట్ సెంటర్స్ అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తైన ఆటిజం సపోర్ట్ సెంటర్స్ ప్రారంభానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఫేజ్-2 కింద 28 ఆటిజం సెంటర్స్ ఈ ఏడాది జూన్ నాటికి, 95 సెంటర్స్ ఈ ఏడాది నవంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఆటిజం సపోర్ట్ సెంటర్స్ నిర్వహణకు సంబంధించి నిష్ణాతులైన మానసిక వైద్యులు, కౌన్సిలర్ల శిక్షణకు నిమ్ హాన్స్ (చీ×వీనూచీూ) వంటి సంస్థల సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్స్ స్టేటస్, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియాకంపైనా సమావేశంలో చర్చించారు.

ప్రజాప్రభుత్వం అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీపైనా మంత్రి సమీక్షించారు. భవన తుది నమూనాను ఆమోదించారు. త్వరితగతిన పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, 2028 నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణ మోహన్ పాల్గొన్నారు.





KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
గురువారం 02 - 04 - 2026


## జిల్లా ప్రజలతో, అధికారులతో

# మరిచిపోలేని బంధం : కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

- మంచి మనసుకు.. విలువలకు చిరునామా కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- వీడ్కోలు సభలో ఆత్మీయతను కనబరిచిన జిల్లా అధికారులు
- ఎందరికో ఆదర్శంగా.. స్ఫూర్తిగా నిలిచారు
- జేసీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు



**విశాఖ సిటీ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** జిల్లా ప్రజలతో, అధికారులతో నాది మరిచిపోలేని బంధమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ గా దాదాపు 20 నెలల పాటు ఉత్తమ సేవలందించి బదిలీపై వెళ్ళిపోతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కు స్థానిక దసపల్లా హోటల్ లో మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్ను, ఆయన సతీమణి దివ్య ప్రసాద్ ను ఆత్మీయంగా సత్కరించుకున్నారు. జ్ఞాపికలు బహుకరించారు. ఆయనతో అధికారులకున్న అనుభవాలను పంచుకున్నారు. సింహాచలం దేవస్థానం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో 20 నెలల పాటు పని చేశానని, ఈ కాలంలో జిల్లాతో, జిల్లా ప్రజలతో విడదీయరాని బంధం ఏర్పడిందని పేర్కొన్నారు. "మీ అందరి మద్దతుతో ఇన్ని కార్యక్రమాలు విజయవంతంగా చేశాను. భయపెట్టి పని చేయించటం నా నైజం కాదు. సహకారంతో, మద్దతుతో చేయిం చటమేనాకు తెలుసు. నాతో చిన్న మాట కూడా అనిపిం చుకుండా అందరూ మంచి పనితీరు కనబరిచారు. స్ఫూర్తి కొనసాగించారు. ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు మంచి సహకారం అందించారు. యోగాంధ్రలో అధికారుల సహకారం మరువలేనిది. అందరి సహకారంతో ఎన్నో రకాల మంచి పనులు చేపట్టగలిగామని" చెప్పారు. పరిపాలనాపరమైన ఎన్నో అంశాల్లో అధికారులు, సిబ్బంది సహకరించారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఇతర కార్యక్రమాల నిర్వహణలో సమష్టి కృషితో ముందుకు సాగామని గుర్తు చేసుకున్నారు. మంచి మనస్సుతో ప్రయత్నిస్తే దేవుడు కూడా సహకరిస్తాడని నమ్ముతున్నా అని అన్నారు. వసతి గృహాల నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించారని కలెక్టర్ ప్రశంసించారు. రెవెన్యూపరమైన అంశాల్లో ఎలాంటి ప్రతికూలతలు రాకుండా పని చేశామన్నారు. చాలా కంపెనీలకు భూ కేటాయింపులు చేయగలిగామన్నారు. నా సీనియర్స్ నుంచి నేను చాలా నేర్చుకున్నా.. అవే ఇక్కడ అమలు చేశాను అని చెప్పారు. విశాఖ రూపురేఖలను మార్చేందుకు కేతన్ గార్గ్, తేజ్ భరత్ లాంటి యువ అధికారుల అవసరం ఎంతైనా ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు కూడా వేగంగా చేస్తున్న తేజ్ కు అభినందనలు, రానున్న ఐదు సంవత్సరాల్లో విశాఖకు మంచి భవిష్యత్తు ఉందని జోస్యం చెప్పారు. విశాఖపట్నం జిల్లా ప్రశాంతతకు మారుపేరు అని, ఇక్కడి ప్రజలు కూడా సౌమ్యులని అన్నారు. ఇప్పటి వరకు చాలా చోట్ల పని చేశానని అన్నిటి కంటే విశాఖ జిల్లా ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. తన పరిపాలనా కాలంలో అన్ని విధాలుగా సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పేషీ సిబ్బందికి పేరుపేరునా ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ కంటతడి పెట్టారు. జిల్లా అధికారులందరూ ఆయన సేవలను కొనిఅడుతూ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ తన మంచి మనస్సుతో, అద్భుతమైన పనితీరు తో, సేవా భావంతో జిల్లా ప్రజల అందరి మనసులు గెలుచుకున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విలువలకు, మంచి మనస్సుకు చిరునా మాగా నిలిచారని జిల్లా అధికారులు పేర్కొన్నారు. ఆయన జిల్లాకు అందించిన సేవలు అమోఘం, అద్వితీయం అని ప్రశంసించారు. మృదు స్వభావి, సహన శీలి అని కితాబిచ్చారు. పరిపాలనా విధానంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, జాతీ య, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను అత్యంత సమర్ధవంతంగా, విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన హయాంలో జిల్లా ప్రజలకు అందించిన అందించిన సేవలను, ఉత్తమ పరిపాలనా తీరును కొనియాడుతూ వారి అభినందనను చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఉన్నత అధికారులు, ఇతర అధికారు మాట్లాడారు. జిల్లా కలెక్టర్ గా తనదైన శైలిని కనబరిచి ప్రజలకు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. మంచి అధికారిగా.. మంచి మనసున్న వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారన్నారు. అటు అధికారులకు, ఇటు ప్రజలకు వైద్యపరమైన పరీక్షలు చేయించారని, జిల్లా వైద్య రంగంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. ఆసుపత్రులు, పాఠశాలలు, వసతి గృహాల్లో అనేక సదుపాయాలు కల్పించారన్నారు. 20 నెలల కాలంలో జిల్లాకు, జిల్లా ప్రజలకు అందించిన ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఉద్ఘాటించారు. యోగాంధ్ర, పార్టనర్ షిప్ సమ్మిట్, ఎఫ్ఐఆర్ నిర్వహణలో బృందస్ఫూర్తిని అందరిలో నింపారని పేర్కొన్నారు.

### మాలాంటి ఎందరికో ఆదర్శంగా స్ఫూర్తిగా నిలిచారు- ఐఏఎస్ అధికారులు

ఒక వైపు సేవా దృక్పథం కనబరుస్తూ.. మరో వైపు పరిపాలనా దక్షత చూపుతూ అందరి మన్ననలు అందుకున్న కలెక్టర్ గా హరేంధిర ప్రసాద్ నిలిచిపోతారని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు కేతన్ గార్గ్, తేజ్ భరత్ లు పేర్కొన్నారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని గుర్తు చేశారు. న్యూ డివిజన్స్, కోర్టు కేసుల గురించి స్పష్టంగా వివరించారని జేసీ చెప్పారు. మానవతా విలువలను పాటిస్తూ.. పరిపాలనా దక్షత ప్రదర్శించారని కొనియాడారు. భవిష్యత్తులో మరొక సారి తనతో కలిసి పని చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నానని జేసీ అన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ మాట్లాడుతూ "హరేంధిర ప్రసాద్ నాకు 2017 నుంచి బాగా తెలుసు. ఆయన ఎలాంటి విషయంలోనైనా చాలా సానుకూలంగా స్పందిస్తారు. ఎన్నికల సమయంలో అదనపు సీఈవోగా ఆయన పనితీరు మరింత అద్భుతం. నాకు ఎంతో సహకరించారు. అభిమానంతో, ప్రేమతో పని చేయించే నైపుణ్యం ఉన్న వ్యక్తి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా బాగా నమ్మి యోగాంధ్ర లాంటి కార్యక్రమాన్ని అప్పగించారు. విశాఖ నుంచి వెళ్ళిపోవటం కొంచెం బాధాకరమే అయినా.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు. ఎలాంటి ఛాలెంజ్ ని అయినా సులభంగా ఎదుర్కోవటం అనేది ఆయన్ని చూసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మాలాంటి ఎందరికో ఆయన ఆదర్శంగా నిలిచారని అన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ "ఆయన్ని నేను ఫస్ట్ టైమ్ కె.ఆర్.పురంలో కలిశాను. ఆయన ఆతిథ్యం ఎన్నటికీ మరువలేను. చాలా షాఫ్ట్ గోయింగ్ పర్సన్. క్రికెట్ చాలా బాగా ఆడతారు. అలాగే మంచి పరిపాలన కూడా చేస్తారు. నాయకుడు సరిగ్గా ఉంటే మిగతా వాళ్ళంతా బాగా ఉంటారు. మంచి ఆలోచన, మంచి విజన్ ఉన్న వ్యక్తి హరేంధిర ప్రసాద్" అని కొనియాడారు. ఎంత ఒత్తిడి ఉన్నా సహనం కోల్పోకుండా తనదైన పనితీరును ప్రదర్శించారని, చాలా గణాంకాలను గుక్క తిప్పుకోకుండా చెప్పేవారని, విశాఖపట్నంలో అణువణుపై ఆయన పట్టు సాధించారని ప్రశంసించారు. కలెక్టర్ అనే పోస్ట్ కు నిజమైన అర్హత కలిగిన వ్యక్తి అని కమిషనర్ కొనియాడారు. ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ "యోగాంధ్ర సమయంలో తనతో కలిసి పని చేశాను. అద్భుత నాయకత్వం, దక్షత నాకు స్ఫూర్తిని ఇచ్చాయి. ఏయూలో జరిగిన కొన్ని ప్రతికూల సంఘటనల సమయంలో ఆయన గైడెన్స్ నాకు బాగా ఉపయోగపడ్డాయి. ఆకస్మిక బదిలీ కొంచెం బాధ కలిగించింది అని" పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సతీమణి దివ్యప్రసాద్ మాట్లాడుతూ "ఎప్పుడూ చిరాకు ప్రదర్శించరు. కొప్పడరు. ఏం చెప్పినా ఓపిగ్గా వింటారు. మీరంతా ఇచ్చిన మద్దతు వల్లే ఆయన ఇంత మంచి పనితీరు ప్రదర్శించ గలిగారని నమ్ముతున్నాను'' అని అన్నారు. ప్రసంగాల అనంతరం వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు కలెక్టర్ దంపతులను దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.









# నన్ను సీఎం పంపించారు..మీ యోగక్షేమాలు తెలుసుకోమన్నారు

- రామన్నపేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి కొండపల్లి



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** " ఓ అవ్వా.. ఓ తాత ఎలా ఉన్నారు.. మీరు కులాసానా.. నన్ను మీ దగ్గరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపంపించారు.. మీకు పెన్షన్ ఇవ్వడంతో పాటు మీ యోగక్షేమాలు తెలుసుకోమన్నారు " అంటూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అవ్వా, తాతలు, వికలాంగ బాలురను ప్రేమగా పలకరిస్తూ.. వారి కుటుంబ సభ్యులను ఆప్యాయతతో పిలుస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గజపతినగరం మండలం లోని రామన్నపేటలో బుధవారం ఉదయం మంత్రి పర్యటించారు. గ్రామస్తులు మేళ తాళాలతో మంత్రికి ఎదురుగా వచ్చి తీసుకు వెళ్లగా... మహిళలు హారతులు పట్టి భారీ ఎత్తున స్వాగతం పలికారు. సీసీ రహదారుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి అనంతరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంత్రి స్వయంగా పెన్షన్లు అందించడంతో పాటు గ్రామంలో పలువురిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అవ్వాతాతల ఇళ్లతో పాటు వికలాంగ బాలుడి ఇంటికి వెళ్లి అతడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఓ అవ్వకు పెన్షన్ ఇవ్వడంతో పాటు ముఖ్యమంత్రి గారు నన్నే మీ దగ్గరకు వెళ్లి పెన్షన్ ఇవ్వడంతో పాటు మీరు ఎలా ఉన్నారో తెలుసుకోమని పంపారు అనడంతో ఆ అవ్వ కళ్లల్లో ఎక్కడా లేని ఆనందం వెల్లివిరిసింది. అవ్వా, తాతలకు, వికలాంగులకు స్వయంగా తానే పెన్షన్లు ఇవ్వడం.. వాళ్ల కళ్లల్లో ఆనందం చూడడం జీవితంలో మర్చిపోలేని క్షణం అని మంత్రి తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నన్ను గెలిపించాక తొలిసారి ఈ గ్రామానికి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావడం ఆనందంగా ఉందన్నారు.

### అరుణమ్మ లాంటి మహిళా నాయకత్వం రావాలి :

రాజకీయాల్లోకి మహిళా నాయకత్వం రావాలని... చంద్రబాబు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల స్ఫూర్తితో ఎంతో మంది మహిళలు రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ అయ్యారని మంత్రి తెలిపారు. గ్రామానికి చెందిన అరుణమ్మ వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఇబ్బందులు పడ్డా.. ఆడపిల్లలతల్లి అయినా.. రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నా పోరాట పటిమతో ఇక్కడ నిలదొక్కుకుని నాయకురాలిగా ఎదిగారని ప్రశంసించారు. సమాజం ఎదగాలంటే ఎలా మంచి చేయాలో ఆమెకు తెలుసుకాబట్టే ఈ రోజు ఓ మంచి నాయకురాలిగా గ్రామాన్ని ముందుకు నడిపిస్తున్నారని మంత్రి కొనియాడారు.

### రామన్నపేటకు మంత్రి వరాల జల్లు :

రామన్నపేట గ్రామానికి మంత్రి కొండపల్లి వరాల జల్లు కురిపించారు. గ్రామస్తుల కోరిక మేరకు త్వరలోనే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు హామీ ఇచ్చారు. అలాగే పంచాయతీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడంతో పాటు వెంటనే మంచినీటి కోసం రెండు బోర్లు వేయిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ స్మశాన వాటికతో పాటు ఎస్సీ కాలనీలో కొత్త కరెంటు పోల్స్ ఏర్పాటుకు ఎస్టిమేట్స్ వేయిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను రామన్నపేట గ్రామస్తులు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.

# వాణిజ్య సముదాయాలు శుభ్రంగా ఉండాలి : కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి




**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** వాణిజ్య సముదాయాల పరిసరాలను పరి శుభ్రంగా ఉంచడంతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని పార్వతీపురం మున్సిపల్ ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర్ రెడ్డి వ్యాపారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ముస్తాబు' కార్యక్రమంలో భాగంగా కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు భవనాల శిథిలావస్థ, అపరిశుభ్రత మరియు ఆక్రమణల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, షాపింగ్ కాంప్లెక్స్ లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపా దనలు సిద్ధం చేయాలని, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భద్రత కోసం దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ డి పావని, మునిసిపల్ అధికారులు సిబ్బంది, వ్యాపారవేత్తలు తదితరులు ఉన్నారు.

# గుచ్చిమిలో పింఛన్లను పంపిణీ : జేసి



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01:** సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పేదల సేవలో భాగంగా ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. గుచ్చిమి గ్రామంలో స్వయంగా ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు జాయింట్ కలెక్టర్ పింఛన్లు అందించారు. పింఛను పంపిణీ కేవలం సంక్షేమం మాత్రమే కాదని, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను వ్యక్తం చేస్తుందని తెలిపారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజల స్పందనను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదల ముఖంలో ఆనందం చూడడమే ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించి వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సంగతిని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, కళాకారులకు తదితర అన్ని రంగాలకు చెందిన వాటికి కనీస పింఛను నాలుగు వేల రూపాయలు కాగా గరిష్టంగా పదిహేను వేల రూపాయల వరకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ పంపిణీ కార్యక్రమలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 'శబల భోజనాల పండుగ"లో ఎమ్మెల్యే అధితి

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** సింహాచలం దేవస్థానం గోశాలలో "సేవ్ సంస్థ" ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 వ తేదీ నుండి 5వ తేదీ వరకు నిర్వహించే "శబల భోజనాల పండుగ" (గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులతో సాంప్రదాయ విధానంలో చేసిన వంటలు) కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం శాసనసభ్యురాలు పూస పాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు, తదుపరి సింహాచలం వేద పాఠశాల ను సందర్శించి వేద విద్యార్థులతో మాట్లాడారు.



## పాయకరావుపేట నియోజకవర్గంలో

# హోం మంత్రి అనిత పర్యటన

- ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి
- నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు అంటూ కరపత్రాలు పంపిణీ
- చేనేత కార్మికురాలితో కలిసి మగ్గంపై నేసి, ఆమె వద్ద నుంచి చీరను కొనుగోలు చేసిన హోం మంత్రి





**నక్కపల్లి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. నక్కపల్లి చేరుకున్న మంత్రికి స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనిత ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీని వల్ల చేనేత కార్మికులపై కరెంట్ బిల్లుల భారం తగ్గి ఆదాయం పెరుగుతుందని మంత్రి వివరించారు. నక్కపల్లిలో చేనేత కార్మికులతో మాట్లాడిన మంత్రి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఒక చేనేత కార్మికురాలితో కలిసి మగ్గంపై నేసి, ఆమె వద్ద నుంచి చీరను కొనుగోలు చేశారు. అప్పల పాయకరావుపేట గ్రామంలో కూడా మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం బోదుగలం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టర్ దొండ కుసుమ కు ఎమ్మెల్యే కొణతాల అభినందన



**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** స్థానిక రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయం లో బుధవారం ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ దొండా కుసుమను మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాలరామకృష్ణ అభినం దించి, సత్కరించారు. ఇటీవల మంగ ళూరు లో జరిగిన వెయిట్ లిఫ్టిక్ సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌ఛాంపియన్ పోటీలలో అనకాపల్లి కి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ దొండా కుసుమ మూడో స్థానం బ్రాంజ్ కైవసం చేసు కోవడం జరిగింది. సిల్వర్ మెడల్స్ సాధిం చిన కుసుమ కు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అభినందనలు తెలియజేశారు.

## రెండో విడతలో జర్నలిస్టులు 209 మందికి అక్రిడిటేషన్లు జారీ

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన మలి విడత సమావేశం





**విశాఖ సిటీ , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : జిల్లాలోని ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా రంగంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులు 209 మందికి రెండో విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం రెండో విడత సమావేశం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, కన్వీనర్, సమాచార శాఖ ఉప సంచాలకులు కె.సదారావుతో పాటు కమిటీ సభ్యులైన మీడియా ప్రతినిధులు, అధికారులు, ఎం.వి. కూర్మరాజు, కె. రాంబాబు, ఆర్. రామచంద్రరావు, డి. రాణి, ఆర్.వై. నాయుడు, కె. కిరణ్ కుమార్, ఈరోతు ఈశ్వరరావు, బి.సురేష్, వై. రామకృష్ణ, బి. శ్రీనివాసరావు, ఆర్టీఓ ఆర్ఎం అప్పలనాయుడు పాల్గొన్నారు. జీవో.ఎం.ఎస్. నెం. 84, అందులో పేర్కొన్న నిబంధనలు, అర్హులైన అర్హతల తదితర అంశాలపై, తొలి విడతలో చర్చించిన అంశాలు, ప్రస్తుత మీటింగ్ ఎజెండా అంశాలను కన్వీనర్ సదా రావు కమిటీకి వివరించారు. రెండో విడతలో భాగంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫ్రీలాన్స్ కేటగిరీ కింద మొత్తం 237 దరఖాస్తులు వచ్చాయని,వాటిని పూర్తిగా పరిశీలించామని చెప్పారు. ఇదిలా ఉండగా మంగళవారం జరిగిన సమావేశంలో 209 అక్రిడిటేషన్లకు కమిటీ ఆమోదం లభించింది. పెద్ద పత్రికల నుంచి 45 మందికి, చిన్న దినపత్రికలకు 96, మాసపత్రికలకు 18,వార పత్రికలకు 5, పక్ష పత్రికలకు 3, శాటిలైట్ చానల్స్ కు 17,ఎజెన్సీలకు 4, నేషనల్ మీడియాకు 8, ఫ్రీలాన్సర్లకు 9, డిఎంఎస్ సభ్యులకు 3, ఫైబర్ నెట్‌కు 1, దరఖాస్తులు అర్హత పొందాయి. వివిధ కారణాల వల్ల 28 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి.

## గిరిజనులకు 'లైసెన్స్' కష్టాలు

- ప్రత్యేక మేళాలు నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి
- జనసేన మండల ఉపాధ్యక్షుడు సిద్ధార్థ మార్క్



**అల్లూరి జిల్లా , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : ఏజెన్సీ ప్రాంతంలో గత కొంతకాలంగా పోలీసులు నిర్వహిస్తున్న ముమ్మర వాహన తనిఖీలు గిరిజన వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. రహదారి నిబంధనల అమలులో భాగంగా పోలీసులు తనిఖీలను కఠినతరం చేయడంతో ప్రతి వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అయింది. అయితే సరైన అవగాహన లేకపోవడం, రవాణా శాఖ కార్యాలయాలు మారుమూల గ్రామాల వారికి అందుబాటులో లేకపోవడంతో అమాయక గిరిజనులు ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అదునుగా తీసుకుంటున్న మధ్యవర్తులు, గిరిజనుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ నిర్ణీత ఫీజు కంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గిరిజన రైతులు, కూలీలు లైసెన్స్ కోసం అధిక మొత్తంలో వెచ్చించాల్సి రావడం వారిపై అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితులపై జికె వీధి జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ మార్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని జిల్లా పోలీస్, రవాణా శాఖ అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు. ఆయా ప్రాంతాల్లో మండలాల వారీగా ప్రత్యేకంగా 'లైసెన్స్ మేళాలు' నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే నేరుగా గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం ద్వారా గిరిజనులకు తక్కువ ఖర్చుతో పారదర్శకంగా లైసెన్సులు అందుతాయని, తద్వారా భారీ జరిమానాల నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

## ఆకివీడులో రఘురామ కృష్ణంరాజుపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- శ్రీరామనవమి రోజున క్రైస్తవుల దౌర్జన్యాలపై బిజెపి నాయకుల ఆగ్రహం
- దౌర్జన్యాలకు భయపడకుండా గుడి నిర్మాణానికి ముందుకు వచ్చిన ఆర్ఆర్ఆర్ కు అభినందనీయులు
- అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామ నవమి వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు పై దాడికి పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు డిమాండ్ చేశారు. బుధవారం అనకాపల్లి పట్టణం, చదువులవారి వీధిలో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. భారతీయులకు పర్వదినం సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం ఆకువీడు పెదపేట రామాలయానికి దర్శనానికి కూటమి నేతలతో కలిసి రఘురామ కృష్ణంరాజు వెళ్లారన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి పరిరక్షణలో సీఆర్పీఎఫ్, పోలీసు బలగాలు రఘురామ కృష్ణంరాజు కూటమి నేతలు, భక్తులకు రక్షణగా ఉన్నప్పటికీ మారణాయుధాలతో దాడులకు దిగారంటే ఘటన వెనుక పెద్ద కుట్ర కోణం ఉందన్నారు. దాడి వెనుక పెద్దల ప్రోద్బలం, హస్తం, రెచ్చగొట్టడం వంటివి ఉన్నాయని అటువంటివారు ఎంతటి వారినైనా అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా మాజీ ఎంపీ హర్ష కుమార్, జడ శ్రావణ్, పివి సునీల్ వంటి పెద్దల పేర్లు విచారణలో వినిపించడం చూస్తుంటే, బరి తెగించిన క్రైస్తవ నాయకులు ఇంకా ఎంతమంది ఉన్నా అందరిపైనా అత్యాయత్నం కేసు పెట్టి అరెస్టు చేయాలని లేకపోతే వారు మరింత హింసను ప్రోత్సహించే ప్రమాదం ఉందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం హిందూ పండుగలు, జాతరలు, భారీ ఎత్తున నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయంలో హిందూ భక్తులకు రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు తలెత్తకుండా ప్రభుత్వం కఠినంగావ్యవహరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, యువ మోర్చా యువ నాయకుడు గేదెల స్వరూప్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బొడ్డేడ బాస్కరరావు, జిల్లా ఐటి కన్వీనర్ కొణతాల సాయిరాం ప్రసాద్, గాలి శ్రీనివాసరావు, కె గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ముంగిటకే పెన్షన్ : ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



**శృంగవరపుకోట , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : శృంగవరపు కోటనియోజవర్గం కొత్తవలస మండలంలో ఇంటిం టికీ వెళ్లి పెన్షన్ల పంపిణీ కార్య క్రమం జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదల సేవలో మీ= భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నియోజక వర్గవ్యాప్తంగా పండుగలా సాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం కొత్తవలస మండలం మంగళపాలెం మరియు దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గారు స్వయంగా పాల్గొని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. గ్రామాల్లోని వీధి వీధిన తిరుగుతూ, వృద్ధులు, వితంతు వులు మరియు దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వారికి పెన్షన్ నగదును అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో పెన్షన్ కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ నేడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటో తేదీనే, వారి ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తూ భరోసా కల్పిస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో వృద్ధులకు వితంతువులకు 3000 రూపాయలు పెన్షన్ ఇస్తామని చెప్పి 2000 రూపాయలు ఇచ్చి సంవత్సరానికి 250 చొప్పున పెంచుతూ మూడు వేల రూపాయలు ఇవ్వడానికి ఐదు సంవత్సరాలు పట్టిందని కానీ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధులకు వితంతువులకు 4000 రూపాయలు అదేవిధంగా దివ్యాంగులకు 6000 రూపాయలు ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తమ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడే ప్రజా ప్రభుత్వమని వివరించారు.. అవ్వతాతలు ఎమ్మెల్యేకు తమ కృతజ్ఞతలు తెలుపుతూ ఆశీస్సులు అందజేశారు. లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, గ్రాజూ చైర్మన్ కొత్తవలస మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోరపల్లి రాము, పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి నక్కరాజు , తెలుగు యువత అధ్యక్షుడు కర్రి చంద్ర శేఖర్, ూవీజ డైరెక్టర్ గేదెల శ్రీనమ్మ, మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు, స్టేట్ అయ్యారక కన్వీనర్ బంగారు రమేష్, స్థానిక నాయకులు, జనసేన, బిజెపి కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కొత్తవలస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



**శృంగవరపుకోట , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : శృంగవరపుకోట నియోజకవర్గం లోని కొత్తవలస బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఓరుగంటి మురళీకృష్ణ బుధవారం ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్.కోట లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, మురళీకృష్ణ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణకు అభినందనలు తెలియజేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల పాత్ర కీలకమని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. అయితే ఈమధ్య శృంగవరపుకోటలో జరిగిన నూతన కోర్టు బిల్డింగ్ శంకుస్థాపన కార్యక్రమంలో హైకోర్టు జడ్జీలు మానవేంద్రనాథ్ రాయ్ మరియు తార్లడ రాజశేఖర్ రావు లు మాట్లాడుతూ ఎలాంటి కోర్టు కేసైనా ఐదు సంవత్సరాలలోపు పరిష్కారం అయ్యేలా చూస్తామని లేకపోతే న్యాయం కోసం కోర్టుకు వచ్చిన ప్రజలకు న్యాయం మీద న్యాయ వ్యవస్థ మీద సంవత్సరాల కొలది తిరగడం వలన నమ్మకం పోతుందని చెప్పారని స్థానిక ఎమ్మెల్యే వివరించారు... అయితే న్యాయవాదులు ధనంపై ఆపేక్ష లేకుండా పేద ప్రజలకు బాధితులకు అండగా ఉండాలని న్యాయవాద వృత్తి ఎంతో విలువలతో కూడిన వృత్తి అని న్యాయవాదులు అందరూ నీతిగా నిజాయితీగా ఉన్నప్పుడే సమాజంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్లో ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు.. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తో పాటు కొత్తవలస AGP MVS Guribabu, మాజీ AGP గొడుగుల మహేంద్ర, న్యాయవాదులు గవర కృష్ణ, బోజంకి సన్యాసిరావు మిగతా న్యాయవాదులు ఉన్నారు.

## చింతపల్లి ఐసీడీఎస్ పరిధిలో 47 ఆయా పోస్టుల భర్తీ

- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ..15వ తేదీ ఆఖరు




**చింతపల్లి , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి నగారా మోగింది. మినీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి మెయిన్ కేంద్రాలుగా పదోన్నతి పొందిన స్థానాల్లో పెరిగిన పనిభారానికి అనుగుణంగా ఆయాల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 47 ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సిడిపిఓ సిహెచ్. శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో పీఎం జన్మన్ పథకం కింద రెండు పోస్టులు ఉండగా, మిగిలిన 45 పోస్టులు రెగ్యులర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత గ్రామానికి చెందిన కోడలై ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్హతల విషయానికి వస్తే పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఒకవేళ పదో తరగతి చదివిన అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో, ఆ తర్వాతి గరిష్ట విద్యార్హత కలిగిన వారి దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలిస్తారు. పీఎం జన్మన్ కింద చాడీపేట, రాళ్లగడ్డ కొత్తూరు కేంద్రాల్లో నియామకాలు జరుగుతాయి. అలాగే లంబసింగి జంక్షన్, బాసింగి కొత్తూరు, వంతమామిడి, లబ్బంగి కొత్త వీధి, కొలపరి, బలపం జోహార్ వంటి మొత్తం 45 రెగ్యులర్ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు బుధవారం (ఏప్రిల్ 1) నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు తమ దరఖాస్తులను చింతపల్లిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా అందజేయవచ్చు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు తెలిపారు. ఈ నోటిఫికేషన్ గురించి గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన మహిళలకు తెలిసేలా ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించి విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. పారదర్శక పద్ధతిలో నియామక ప్రక్రియ కొనసాగుతుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ కోరారు.

## జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సేవలు అభినందనీయం

- దుశ్శాలువాలు కప్పి సత్కరించిన ఇన్చార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు



**విశాఖ సిటీ , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : జిల్లా కలెక్టర్ గా ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. గత 20 నెలల్లో ఎన్నో రకాలుగా ప్రజలకు ఉత్తమమైన సేవలందించారని గుర్తు చేశారు. పరిపాలనా పరమైన అంశాల్లో, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. అత్యంత సహనం పాటిస్తూ..శాంతియుత వాతావరణంలో అందరి మన్ననలు పొందుతూ విధులు నిర్వర్తించారని, తన హయాంలో ప్రపంచ స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలన్నా.. ప్రజలన్నా గౌరవంతో, బాధ్యతతో పని చేశారని, అందరి మన్ననలు పొందారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ



జిల్లా కలెక్టర్ సేవలను కొనియాడారు. నేమ్ బోర్డుపై ఎంతమంది కలెక్టర్లు పేర్లున్నా.. ప్రజల మనసుల్లో మాత్రం హరేంధిర ప్రసాద్ పేరే నిలిచిపోతుందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణలో తనదైన మార్కు వేసుకున్నారని, బృంద స్ఫూర్తిని కాపాడుతూ విజయవంతమైన పాలన సాగించారని కితాబిచ్చారు. కలెక్టర్ బదిలీపై ఓ 87 ఏళ్ల వృద్ధుడు స్పందించారని, మంచి వ్యక్తి జిల్లా నుంచి వెళ్లిపోతున్నారని బాధపడినట్లు ఈ సందర్భంగా డీఆర్వో గుర్తు చేశారు. చివరిగా కలెక్టర్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ప్రభుత్వ పెద్దలు, జిల్లా ఇన్చార్జి మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సంపూర్ణ సహకారం అందించారని పేర్కొంటూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## పంచాయతీ రాజ్ శాఖ కు జాతీయ స్థాయి అవార్డులు హర్షణీయం

- జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర




**నాతవరం , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు వరించడం హర్షించదగ్గ విషయమని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్య చంద్ర అన్నారు. బుధవారం నర్సీపట్నం నియోజక వర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కు ఐదు జాతీయ పురస్కారాలు రాగా అందులో 2 విభాగాల్లో ప్రథమ స్థానం, 1 విభాగంలో ద్వితీయ స్థానం, మరో 2 విభాగాల్లో తృతీయ స్థానాలు వచ్చాయని చెప్పారు. అందులో ముఖ్యంగా అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శృంగవరం పంచాయతీ గుడ్ గవర్నెన్స్ విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకుం దన్నారు. వివిధ విభాగాల్లో పంచాయతీరాజ్ శాఖ ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గానూ ఈ గౌరవం దక్కిందని చెప్పారు. గ్రామాల్లో నూతన రహదారులు మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామ స్వరాజ్యం స్థాపించారన్నారు. అడవి తల్లి బాట పేరిట గిరిజన గ్రామాల్లో పవన్ కళ్యాణ్ వెలుగులు నింపారని కొని యాడారు. గత వైసీపీ హయాంలో పంచాయతీరాజ్ శాఖ పడకేసిందని, నేడు పంచాయతీరాజ్ శాఖ కేంద్ర అవార్డులు గెలుచుకునే ఘన కీర్తిని సంపాదించిందని అన్నారు. గతంలో జాతీయ ర్యాంకింగ్స్ లో 24వ స్థానంలో ఉన్న పంచాయతీ రాజ్ శాఖ ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకోవడం ఒక గొప్ప మలుపుగా పరిగణించవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి, నిధుల వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపిన పారదర్శకత వల్లే ఈ స్థానం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ నియోజకవర్గ జనసైనికుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాద్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, చోద్యం విఎసిఎస్ డైరెక్టర్ రేగుపల్ల సాంబమూర్తి, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్ బాబు, దేవి, మాకవరపాలెం మండల ఉపాధ్యక్షులు నమ్మి కొండలరావు, గొలుగొండ యూత్ అధ క్షులు వాసం వెంకటేష్, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులకు శ్రీకారం..మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**కొయ్యూరు , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : కొయ్యూరు మండలం మూల పేట గ్రామపంచాయతీలో 2026 - 27 సంవత్సరానికి సంబంధించిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, ఏపీడీ సీతయ్య, కూటమి నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు .కార్యక్రమంలో భాగంగా ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్, చింతపల్లి ఏపీడీ ఆధ్వర్యంలో శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు అరుణ, చలపతిరావు, కిముడు శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ కళ్యాణం,మాజీ వైస్ సర్పంచ్ దుంపా రాజబాబు, దేవోజీ వరహాలరావు, పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ శ్రామికులు పాల్గొన్నారు.

## పైడిపనుకులలో పోలీసుల కాంబింగ్ ఆపరేషన్



**కొయ్యూరు , ఏప్రిల్ 01 (మనసులో మాట)** : జిల్లా ఎస్పీ ఆదేశాలు, చింతపల్లి ఏఎస్పీ మార్గదర్శకత్వంలో కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని పైడిపనుకుల గ్రామంలో మంప ఎస్ఐ శ్రీనివాస్ కాంబింగ్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇల్లు, వాహనాలను తనిఖీ చేశారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా బాహ్యుల సంచారం ఉందా అనే అంశంపై స్థానికులను ప్రశ్నిస్తూ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## అంగన్వాడి హెల్పర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల : సిడిపిఓ స్రవంతి

**పెదబయలు , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పెదబయలు మండలంలోని అంగన్వాడి శాఖ ఆధ్వర్యంలో ఆంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయిందని సిడిపిఓ స్రవంతి తెలిపారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం, స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అభ్యర్థులు కనీస విద్యార్హతలు 10వ తరగతి ఉత్తీర్ణత) కలిగి ఉండాలి. తేదీ 01.07. 2026 నియామక సంవత్సరం నాటికి 21 సంవత్స రములు నిండి 35 సంవత్సరాల లోపు ఎస్టిలకు కేటాయిం చిన అంగన్వాడీ కేంద్రాలలో 21 సంవత్సరములు నిండని అభ్యర్థులు లభ్యము కానప్పుడు మాత్రమే 18 సంవత్సరములు నిండిన అభ్యర్థులు దరఖా స్తులను పరిశీలించబడును ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీస్ సిడిపిఓ నేరుగా గాని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని 01.04. 2026. నుండి 15.04.2026 సాయంత్రం 5.00 లోపు దరఖాస్తులు సమర్పిం చాలి.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వివాహితులు అయ్యి మరియు ఆ గ్రామమునకు సంబంధిచిన కోడలు అయ్యి వుండాలి .ఖాళీలు, అర్హతలు మరియు దరఖాస్తు విధానం గురించి పూర్తి వివరాలకు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారిక ఆఫీసు యందు సంప్రదించాలి సిడిపిఓ స్రవంతి కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు

## హోమియోపతి వైద్యుల మారాథన్




**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ - విజయనగరం జిల్లా శాఖకు చెందిన నగరం లోని హోమియో వైద్యులు మరియూ మహారాజ హోమియో వైద్య కళాశాలకు (MIHS) చెందిన పూర్వ హోమియో వైద్య విద్యార్థులు, విద్యార్థినిలు బుధవారం పాల్గొని, ప్రజలకు హోమియోపతి వైద్యంపై అవగాహన కల్పించేందుకు మారథాన్ (నడక) నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించి 8 గంటలకు వరకు నగరంలోని కోట జంక్షన్ మొదలుకొని మూడు లాంతర్లు, వాటర్ ట్యాంక్ ల మీదుగా ఎం.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల వరకు కొనసాగిన మారథాన్ కు సుమారు 100 మంది హోమియో వైద్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారు. రానున్న ఏప్రిల్ 10న హోమియో సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంత్యుత్సవములలో భాగంగా ఈ మారథాన్ నిర్వహించారని, అలాగే రానున్న ఏప్రిల్ 12న ప్రజల కొరకు ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్.టంకాల.శశి కుమార్ కార్యనిర్వహణలో జరుప నిశ్చయించామని సంస్థ అధ్యక్షులు డాక్టర్ సంబంగి శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ సాయి ప్రవీణ ఎలిశెట్టి లు తెలిపారు. ఈ మారథాన్ నందు డాక్టర్ కె.కామరాజు, డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ కె.కృష్ణారావు, డాక్టర్.డి.అజయ్ కుమార్, డాక్టర్.పి.భాగ్య వినీష, డాక్టర్.టి.విష్ణుప్రియ డాక్టర్ బరాటం శ్రీహరి బాబు, డాక్టర్ అంబికా , డాక్టర్ అల్లు వైభవ , డాక్టర్ గీత కుమారి , డాక్టర్ ఎ. వసుంధర, డాక్టర్ పి.చేతన, డాక్టర్ ఎస్.వైష్ణవి మొదలగు హోమియో వైద్యులు, MIHS జూనియర్ డాక్టర్స్ పాల్గొన్నారని తెలిపారు.

## మాజీ సైనికుల సంక్షేమమే 'వీర్ పరివార్' లక్ష్యం



**శ్రీకాకుళం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'నల్సా వీర్ పరివార్ సహాయత యోజన-2025' పథకం పనిచేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరి బాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక సైనిక్ బోర్డును సందర్శించి అక్కడి పరిస్థితులపై చర్చిం చారు. దేశ సేవలో తరించిన మాజీ సైనికులు తమ న్యాయపరమైన చిక్కులను వదిలించు కునేం దుకు ఈ పథకం ఒక చక్కని వేదిక అని ఆయన పేర్కొ న్నారు. సైనిక సంక్షేమ కార్యాలయం ప్రాంగణం లో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు నిరంతరం అందు బాటులో ఉంటారని హరిబాబు వివరించారు. మాజీ సైనికులు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చుకోవడానికి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఏ. శైలజ, ప్యానెల్ అడ్వకేట్ వి. జ్యోతిర్మయి, ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు సూచించిన ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి
- నియోజవర్గానికో ఐఏఎస్ అధికారి ద్వారా అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచన




**విశాఖ సిటీ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** సమ్మిళిత అభివృద్ధి అంశాలకు, సంక్షేమ పథకాలకు సమన్యాయం చేస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ విశేషాలను, రంగాల వారీ కేటాయింపులను ప్రజలకు వివరించాలని, నియోజకవర్గా నికి ఒక్కో ఐఏఎస్ అధికారి ద్వారా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో బడ్జెట్ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేసిన బడ్జెట్ కేటాయింపులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు సూచించారు. ఏప్రిల్ తొలి వారంలో ఈ ప్రక్రియను నిర్వహించాలన్నారు. నియోజకవర్గాల వారీగా చేసిన కేటాయింపులపై ప్రత్యేక పీపీటీలు, బుక్ లెట్లు తయారు చేయాలని, ఐఏఎస్ అధికారుల సాయంతో అవగాహన శిబిరాలు నిర్వహిం చాలని, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకొని విజయవం తంగా జరిపించాలని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ అంశాలతో పాటు 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ పరిధిలో చేసిన బడ్జెట్ కేటాయిం పులు, చేపట్టిన ప్రాజెక్టుల గురించి ప్రజలకు విడమరిచి చెప్పాలని సూచించారు. బడ్జెట్ కేటాయింపులకు తగ్గట్టు పనులు చేపట్టాలని, నిధులను సమృద్ధిగా వినియోగిం చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుదని, దీనిలో భాగంగా ఇప్పటికే పలు కంపెనీల ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయని, తాజాగా ఆర్సెల్లార్ మిత్తల్ సంస్థకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. త్వరలోనే గూగుల్ సంస్థకు శంకుస్థాపన కూడా జరుగుతుందని మంత్రి వివరించారు.

**రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో జిల్లాకు విశిష్ట స్థానం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హారేంధిర ప్రసాద్ తెలిపారు.**

రాష్ట్ర స్థూల విలువ జోడింపులో జిల్లాకు ఉన్న కీలక పాత్రను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వివరిం చారు. 2026-27 బడ్జెట్ లో జిల్లాలోని అన్ని రంగాలకు కలిపి రూ.2,992 కోట్లు కేటాయించగా అందులో సంక్షేమ పథకాలకు కోసం రూ.1,534 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారని వెల్లడించారు. ఎన్టీఆర్ భరోసాకు రూ.835 కోట్లు, తల్లికివందనం -399 కోట్లు, స్త్రీ శక్తి - రూ.110 కోట్లు, దీపం-2 కోసం రూ.102 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ నిధుల సహకారంతో స్వర్ణాంధ్ర సాధన, వీఈఆర్ లో నిర్దేశించిన ప్రాజెక్టుల సాకారం వీలవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వీఈఆర్ లో 49 ప్రాజెక్టులు రూపొందించగా అందులో 17 ప్రాజెక్టులో విశాఖలోనే రాబోతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఆర్సెల్లార్ మిత్తల్, హయత్ హోటల్ నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు జరిగాయని, అతి త్వరలోనే గూగుల్ అంకురార్పణ కూడా జరుగుతుందని వివరించారు.

జాబ్ క్యాలెండర్ కు అనుగుణంగా అభ్యర్థులను తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇటీవల మెగా డీఎస్సీలో జిల్లాకు చెందిన చాలా మంది ఉద్యోగాలు సంపాదించారని గుర్తు చేశారు. సాస్కి నిధుల సహాయంతో జిల్లాలో మూడ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను మ్యాపింగ్ చేస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర మొత్తం జీవీఏలో జిల్లాకు సుమారు 9.14 శాతం వాటా ఉందని, గత సంవత్సరంతో పోలిస్తే 11.27 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. ట్రేడ్, హోటల్స్, రెస్టారెంట్స్, తయారీ, నిర్మాణం, రవాణా, నిల్వ వంటి ఉపరంగాలు జిల్లాలో ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్నా యని కలెక్టర్ చెప్పారు.సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ విలువైన సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు కేతన్ గార్గ్, తేజ్ భరత్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో సంగీత్ మాథుర్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 200 కోట్ల లైబ్రరీ సెస్సు బకాయిలు కేంద్ర గ్రంథాలయానికి జీవీఎంసీ చెల్లించాలి

- విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెం రెడ్డి సతీష్ కుమార్
- విశాఖపట్నం జిల్లా ఇన్చార్జ్ మంత్రి బాలవీరాంజనేయస్వామికి వినతి పత్రం
- మహారాణి పేటలో కేంద్ర గ్రంథాలయం స్థలంలో భవనం నిర్మించాలి
- భవన నిర్మాణం జరిగే వరకు ప్రభుత్వ ఖాళి భవనాలు కేటాయించాలి
- లైబ్రరీస్ సెస్ సొమ్మును జీవీఎంసీ చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధి కోసం సహకరించాలి



**విశాఖ సిటీ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న గ్రంథాలయాల స్థితిగతులు, లైబ్రరీస్ బకాయిలు, గ్రంథాలయ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలు తగు పరిష్కారం కోసం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి,విశాఖపట్నం జిల్లా ఇన్చార్జ్ మంత్రి డి. బాల వీరాంజనేయస్వామికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెం రెడ్డి సతీష్ కుమార్ మంగళవారం వినతిపత్రం సమర్పిం చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యాలయం బిల్డింగ్ పరిస్థితి చాలా కాలంగా విశాఖపట్నం నగరంలో మెలోడీ థియేటర్ దగ్గర ఉన్న ప్రైవేటు అద్దె భవనంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, గ్రంథాలయ సంస్థ కార్యాలయాలు కొనసాగు తున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దండు బజార్ ప్రాంతంలో గ్రంథాల య సంస్థకు సొంత స్థలంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భవన నిర్మాణం కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాశ్వత భవనాలు నిర్మాణం అందు బాటులోకి వచ్చేలోపు ముఖ్యంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం, కార్యాలయాలు నగర కేంద్రంలో నగర మధ్యలో ఉండేట్టుగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ విశాఖపట్నం మెట్రో రీజినల్ డెవలప్మెంట్ అథారిటీకి చెందిన భవనాలు ఖాళీ ఉన్నచో గ్రంథాలయ కార్యాలయాలు నిర్వహణ కోసం ప్రజల అవసరార్థం కేటాయించవలసిందిగా జిల్లా మంత్రి వీరాంజనేయ స్వామి ని కోరారు.గ్రేడ్ 1, 2, 3 స్థాయి గ్రంథాలయాలనిర్మాణం కోసం నగరంలో ము ఖ్య కేంద్రాల్లో ఏ విధమైన ఖాళీ స్థలం గాని ప్రభుత్వ స్థలంగాని ఉన్నచో గ్రంథా లయాలు కేటాయించవలసిందిగా కోరారు. లైబ్రరీ సెస్ విషయం మంత్రి దృష్టికి తీసుకువస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ యాక్ట్ 1960 సెక్షన్ 20(1)(2)(3) ప్రకారం స్థానిక సంస్థలచే వసూలు చేయబడిన ఆస్తి పన్ను పై 0.08 శాతం చొప్పున లైబ్రరీ సెస్సు లెక్కించి సంబంధిత జిల్లా గ్రంథాల సంస్థకు చెల్లించ వలసి ఉన్నదన్నారు. విశాఖ నగర పాలక సంస్థ వారు సుమారు 200 కోట్లకు పైగా జిల్లా కేంద్ర గ్రంథాల యానికి సంస్థకు బకాయిలు చెల్లించ వలసి ఉన్నట్లు తెలిపారు. బకా యిలు పడిన లైబ్రరీస్ సెస్ సొమ్మును జీవీఎంసీ వారు సత్వరమే చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధి కోసం సహకరించవలసిందిగా విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రికి విన్నవించారు.

## కొయ్యూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ



**కొయ్యూరు , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** కొయ్యూరు గ్రామపంచాయతీలో ఈరోజు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ జిడివి ప్రసాద్ ఆధ్వర్యంలోనిర్వహించారు. గ్రామంలోని అర్హులైన వృద్ధు లు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి అర్హుడికి సమయానికి పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా పింఛన్లు పొందేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం రామగిరి మరియు మడకపాలెం గ్రామాల్లో నిర్వహించిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజుతో కలిసి సాయి కృష్ణ స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్‌లనుఅందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ, పేదల సంక్షేమాన్ని ప్రధాన ధ్యేయంగా తీసుకుని రాష్ట్రంలో అత్యధిక స్థాయిలో పెన్షన్‌ల పంపిణీ మరి యు పెన్షన్ల పెంపుకార్యక్రమం చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేననిగుర్తుచేశారు. ప్రతి నెల ఒకటవ తేదీన ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ అందించడం ఒక మంచి పరిపాలనా విధాన మని, ఒకవేళ ఒకటవ తేదీ ఆదివారం అయితే ఒకరోజు ముందుగానే పంపిణీ చేయడం ప్రజల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చూపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్, టిడిపి మండల కార్యదర్శి ఎదురు రాము, మడకపాలెం గ్రామ శాఖ అధ్యక్షులు సన్యాసి రావు, సీనియర్ నాయకులు వేల్పుల రమణబాబు ,జాజుల శ్రీను, గవ్వ జగన్నాయకులు,పల్లా దేముడు, ధూళి అప్పారావు, ఉప్పిన సూరినారాయణ అలాగే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎండలు తీవ్రత వలన అంగన్వాడి సెంటర్లకు మే నెల నుండి వేసవి సెలవులు ఇవ్వాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ధర్నా



**పెదబయలు , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు ర్యాలీ అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా, అంగన్వాడి సెంటర్లకు మే నెల నుండి వేసవి సెలవులు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్లు ధర్నా, నిర్వహిం చడం జరిగింది. ఈ ధర్నా ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా నాయకులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ మే నెలలో ఎండలు చాలా తీవ్రత గా ఉంది ప్రీస్కూళ్లకు పిల్లల తల్లిదండ్రులు పిల్లల్ని పంపించడానికి ఇష్టపడటం లేదు ప్రీ స్కూల్ పిల్లలు ఎండ తీవ్రత వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, బాలింతలు కూడా సెంటర్ కి రాలేని పరిస్థితి ఉంది,ఆ సమయంలో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు ఇళ్లకు వెళ్లడానికి వడదెబ్బ గురై అనారోగ్యం పాలవుతున్నారు. అందువలన మే నెల అంతా ప్రీ స్కూల్ పిల్లలకు,గర్భిణీ బాలింతలకు టేక్ హోమ్ రేషన్ ఇచ్చి అంగన్వాడి వర్కర్లు అందరికీ మే నెలలో వేసవి సెలవు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వా నికి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే గతంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు హెల్పర్లకు ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26,000 ఇవ్వాలని మినీ వర్కర్లకు ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 5ను వెంటనే రద్దుచేసి గతంలో ఉన్నటువంటి జీవో ప్రకారమే యధావిధిగా ప్రమోషన్లు అమలు చేయాలని గ్యాస్ అంగన్వాడి సెంటర్లకు ఉచితంగానే అంగన్వాడీలకు సరపర చేయాలని శిధిలా వ్యవస్థలో ఉన్న అంగన్వాడి సెంటర్లన్నీ కొత్త భవనాలు నిర్మాణం చేపట్టాలని తదితర డిమాండ్ల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని అమలు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఓ గారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టీ రాజమ్మ, కొండమ్మ శాంతి, మంగమ్మ , శాంతి, కళావతి,సుశీల తదితరులు పాల్గొన్నారు

## రెండు గ్రామాలు..రెండు కళ్లుగా భావించి అభివృద్ధి

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు
- పదవి కన్నాప్రజా సేవే గొప్పదిగా భావించి ఐదేళ్లు పనిచేసాతోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు




**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఐదేళ్ల క్రితం అనూహ్యంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసా ప్రజలకు సేవ చేయాలని ఉందేమో భగవంతుడు ఆ అవకాశం కల్పించాడు.పుట్టినిల్లు,మెట్టినిల్లు(తోటాడ,గవర్ల అనకాపల్లి) ఈ రెండింటినీ రెండు కళ్ళుగా భావించి ఈ ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు.ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతోన్న నేపథ్యంలో తాను చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ విలేకరులతో పలు అంశాలను పంచుకున్నారు.గెలుపొందిన రోజుల్లో వైసీపీ అధికారంలో ఉండగా నాడు ఎమ్మెల్యే కన్నబాబు రాజు ప్రోత్సాహంతో ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు.గత 22 నెలల కాలంలో కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అందించిన సహకారం,ప్రోత్సాహంతో మరిన్ని పనులు చేపట్టగలిగాం,ముఖ్యంగా పంచాయతీ పరిధిలో సచివాలయ భవనం,రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ గోదాముల నిర్మాణం,జల్ జీవన్ మిషన్ ద్వారా రెండు గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగినీటి కలెక్షన్,వీధి రోడ్లు,కాలువలు, కల్వర్టులు, కొత్త మోటార్ల ఏర్పాటు,ఆయా గ్రామాల్లో ఉన్న స్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ నిధులతో పాటు ఎమ్మెల్యే విజయ్ కుమార్ మంజూరు చేసిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణం,ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా అభివృద్ధి పనులు,సామాజిక భవనాల నిర్మాణం,రింగు రోడ్డు,తోటాడ రెగ్యులేటర్ కు ఇనుప తలుపులు ఏర్పాటు,జగనన్న కోలనీలో మౌలిక సదుపాయాలు,గవర్ల అనకాపల్లిలో పాత బంగ్లా స్థానంలో నూతన నిర్మాణం ఇలా ఒకటీ రెండూ కాదు.. వేళ్ళతో లెక్కపెట్టలేనన్ని పనులు చేపట్టామని తెలిపారు.పాలక వర్గ సభ్యుల పూర్తి సహకారం,పంచాయతీ అధికారుల సహకారం వెరసీ రెండు గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించుకున్నట్లు తెలిపారు.ఈ మధ్య కాలంలో శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ పంచాయతీ అభివృద్ధి కోసం ఎంతగానో సహకరిస్తూ నిధులను విడుదల చేస్తూ గ్రామాల్లో వెలుగులు నింపారని ఆయనకు పాలకవర్గం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.ఐదేళ్ళలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాన లక్ష్యంగా తోటాడ కూడలిలో ఆఫీస్ ఏర్పాటు చేసామన్నారు.ఉదయం వేళల్లో సచివాల యం లో, సాయంత్రం వేళల్లో ఆఫీస్ వద్ద ఉండి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.సుమారు 10 కోట్ల రూపాయల పనులు పంచాయతీ పరిధిలో జరిగాయని ప్రతి పనిలోనూ నిబద్ధత,నిజాయితీగా ఉంటూ అభివృద్ధి చేశామని అన్నారు.కొన్ని సందర్భాల్లో అత్యవసర పరిస్థితుల్లో సొంత ఖర్చు చేసి పనులు జరిగేలా చూశామని గుర్తు చేశారు.పనికి ఆహార పథకం ద్వారా గ్రామాల్లో అనేక పనులు చేపట్టామని,పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి వారంవారం స్పెషల్ డ్రైవ్ పేరిట శుభ్రత కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.నా పదవీ కాలంలో ప్రజలతో మమేకం అవుతూ రెండు గ్రామాల ప్రజలను సమన్వయ పర్చడం,అభివృద్ధి పనులు చేపట్టడం వెనక నా కుటుంబ సభ్యులు వెన్నుశీటూ ఉన్నారని ఇది జీవితంలో మరచిపోలేని జ్ఞాపకాలని పేర్కొన్నారు.పదవులు వస్తుంటాయి,పోతుంటాయి చేసిన అభివృద్ధి,ప్రజలతో ఉన్న అనుబంధం, ఆప్యాయతలు ఇలానే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

## రామారావు ప్రజల కోసమే పాటుపడ్డారు

- జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాల మహానాడు నాయకులు రేబాక రామారావు నిరంతరం ప్రజల కోసమే పాటు పడ్డారని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన రామారావు కుటుంబ సభ్యులను బిజెపి నాయకులు బుధవారం పరామర్శించారు. రామారావు కలుసుకొని కన్నీరు మున్నీరైన రేబాక మధుబాబు,ఇతర కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈ సందర్భంగా పరమేశ్వర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ, మాల మహానాడు కుల సంఘానికి విశేష కృషి చేశారని అలాగే ఉమ్మడి జిల్లాలో మాజీ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారని పరమేశ్వరరావు గుర్తు చేశారు. నీటిపారుదల శాఖలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన ఎక్కడ ఏపని చేసినా తన సొంత డబ్బులు ఖర్చు పెట్టే వారిని, అందరి చేత శభాష్ అనిపించు కునేవారన్నారు. ఆయనతో గడిపిన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని బాగోద్వేగానికి గురయ్యారు. ఆయన వెంట బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వర రావు, పలక రవి, కర్రి రామకృష్ణ తదితరులు ఉన్నారు.


## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడుకు వినతి పత్రం అందజేసిన నోబెల్ టీచర్స్ అసోసియేషన్



**అనకాపల్లి రూరల్ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సహకరించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా విద్య శాఖ అధికారి గడ్డి అప్పారావు నాయుడుకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు గారిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి వివిధ అంశాలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది.పదవ తరగతి మూల్యాంకన విధులకు 60 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు, అనారోగ్య కారణాలచే అభ్యర్థించుకున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ వాల్యూషన్ కేంద్రాలలో ఉపాధ్యాయులకు అన్ని వసతులు కల్పించాలని, మూల్యాంకన రుసుమును ఏమాత్రం జాప్యం లేకుండా వెనువెంటనే విడుదల చేయాల ని,పెండింగ్ లో ఉన్న ఎన్ ఓ సి లను వెంటనే క్లియర్ చేయాలంటూ వినతి పత్రంలో నాయకులు కోరారు. ఈ విషయాలపై అప్పారావు నాయుడు స్పందిస్తూ పై సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి వెళ్లి పరిష్కరి స్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి బీవీవీ ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, జిల్లా మహిళా అధ్య క్షురాలు ఉమామహేశ్వరి, ఆర్థిక కార్యదర్శి వెంకట న్యాకేశ్వర రావు,మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరించి పింఛన్లు పంపిణీ : కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం , (మనసులో మాట) ఏప్రిల్ 01 :** వృద్ధాప్యంలో ఎటువంటి ఆధారం లేని వారికి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు కొండంత అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఈ భరోసా వల్ల వృద్ధులకు సమాజంలో, కుటుంబంలో గౌరవం పెరుగుతోందని గుర్తుచేశారు. పార్వతీపురం మునిసిపాలిటీ పరిధిలో గల అగ్రహారం వీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. అయన తో పాటు సబ్ కలెక్టర్ వైశ్యాలి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

### 29 కార్మిక చట్టాలను అమలు చేయాలి..కళ్ళకు గంతలు కట్టి నిరసన - ఎఐటియుసి

**పాడేరు (టౌన్ ) , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఏప్రిల్ 1 న బ్లాక్ డే పాటించాలని నల్లని రిబ్బన్లు కళ్ళకు కట్టుకొని పాడేరు ఐటిడిఎ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి అమర్,జల్లి రాజుబాబు లు పాల్గొని మాట్లాడుతూ నేటి నుండి 4 లేబర్ కోడ్ లను అమలు లోకి తేవటాన్ని నిరసిస్తూ ఈ రోజు బ్లాక్ డే గా పాటించాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు నివ్వడం జరిగిందని అన్నారు. 4 లేబర్ కోడ్లు అయిన వేతన కోడ్ 2019,పారిశ్రామిక సంబంధాల కోడ్2020, సామాజిక భద్రత కోడ్ 2020,వృత్తి భద్రత,ఆరోగ్య పరిస్థితి కోడ్ 2020 లను తీసుకురావటం లో పెద్దఎత్తున కార్మికులకు నష్టం వాటిల్లుతుందని, కార్మిక హక్కులు కాలరయ బడతాయని 8 గంటల పనిధినం పోయి 12 గంటలకు పెంచబోతున్నారని అలానే సమ్మె హక్కు కోల్పోతుందని అన్నారు. అలాగే యూనియన్ ఏర్పాటుకు నిబంధనలు పెద్దఎత్తున పెంచటం వంటి అనేక విధా నాలును ఉద్దేశించి కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె నిర్వహించినప్పటికీ నేటికి కేంద్ర ప్రభుత్వం కార్మిక



సంఘాలతో భేటీ కాకుండా నిరంకుశం గా వ్యవహరిస్తుందని అన్నారు. గతం లో ఉన్న 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎటువం టి స్పందన కేంద్రం నుండి లేదని మండిపడ్డారు. నరేంద్ర మోడీ, అమీత్ షా లు కేవలం కార్పొరేట్ వ్యక్తులకు దేశ లో ఉన్న శ్రమశక్తిని దారపోయటానికి చూస్తుందని దేశ సంపద సృష్టి కర్తల అయిన కార్మికులు పట్ల ఆలోచన చేయటం లేదని అన్నారు. 4 లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు 29 చట్టాలు అమలు కొరకు దేశం లో కార్మిక వర్గం బీజేపీ పై పెద్దఎత్తున పోరాటాలకు సంసిద్ధం అవు తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రాంబాబు ఉపాధ్యక్షులు కృష్ణ, శివశంకర్, లక్ష్మయ్య, సత్తిబాబు లు తో పాటుగా కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సుందర అగ్రహారంగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్ డాక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి

**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** పట్టణంలోని అగ్రహారం వీధిని అన్ని విధాలా సుందరంగా తీర్చిదిద్దాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా ఎం. ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన అగ్రహారం వీధిలో పర్యటించి, స్థానిక పారిశుధ్య పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. 20, 21 వార్డులను పరిశీలించిన అయన వార్డులో వున్న అగ్రహారం వీధిలో మున్సిపల్ బావిని, గెంబలివారి కోనేరును పరిశీలించారు. బావిని శుభ్రం చేసి, వార్డు ప్రజలకు నీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు ఆదేశించారు. అలాగే కోనేరును శుభ్రం చేసి, బాగు చేయాలని వార్డులో ప్రజల శ్రమదానాన్ని వినియోగించి, కోనేరు నీరు వాడుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు ఆదేశించారు. వార్డులో ఉన్న మహిళలను, యువతను చైతన్యం చేసి వారి శ్రమదానాన్ని కూడా వినియోగిం చుకుంటే వేగవంతంగా కోనేరు బాగుపడుతుందని సూచించారు. వీటిపై ప్రణాళిక తయారు చేసి తన వద్దకు తీసుకురావా



లని అయన ఆదేశించారు. వార్డుల్లో ప్రజలు కూడా వారి చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా బాధ్యత తీసు కుంటే వీధులు బాగుపడతా యని సూచించారు. ప్రతి ఇంటి ముందర అందమైన మొక్కలు నాటాలని, తద్వారా వీధిని పచ్చదనంతో నింపాలని సూచించారు. గృహాల నుంచి వచ్చే వాడుక నీరు కాలువ ల్లోకి వెళ్లే పైపులకు తప్పనిసరిగా నెట్ (జాలి) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనివల్ల వ్యర్థాలు కాలువల్లో పేరుకు పోకుండా, నీరు సాఫీగా వెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అగ్రహారం వీధిని ఒక మోడల్ వీధిగా మార్చేందుకు స్థానికులు సహకరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, మున్సిపల్ కమిషనర్ డి పావని, మెప్మా పీడీ నాగభూషణరావు, డిఆర్డిఏ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సంగంవలస లో పెన్షన్లు పంపిణీ : ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** చంద్రబాబు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేదలకు వరం అని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పేర్కొన్నారు. పార్వతీపురం మండలం సంగంవలస గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర లబ్దిదారులకు బుధవారం ఉదయం పంపిణీ చేసారు. అదికారులు, టీడీపీ నాయకులతో కలిసి లబ్దిదారుల ఇళ్లకు వెల్లిన అయన ,పెన్షన్ దార్లను కలిసి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ మొత్తాన్ని వారికి అందచేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విదంగా పెద్దమొత్తంలో పెన్షన్లు అందచేస్తోందని తెలిపారు. ప్రతీ నెలా ఒకటో తేదీన అధికారులు ఇంటివద్దకే వచ్చి పెన్షన్లు అందించడం దేశంలో మొదటిసారి అని పేర్కొన్నారు.



చంద్రబాబు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్దులు, వికలాంగులు, వితంతువులకు కొండంత భరోసానిస్తున్నాయని వెల్లడించారు. ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనని, సమాజంలో ప్రతీఒక్కరు ఎదగాలని నిరంతరం తపన పడుతుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు


## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ రిలే దీక్ష

**పాడేరు (టౌన్ ) , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో గల పాడేరు ఐటిడిఏ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యా యుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరి ంచాలని కోరుతూ రిలే దీక్ష చేపట్టారు. 12వ పిఆర్సి కమిటీ చైర్మన్ నియామకం ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో దసలవారీగా ఆందోళన చేపడు తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నేడు రేపు రిలే దీక్ష చేపడు తున్నామని ఏప్రిల్ 15 నుండి 19వ తేదీ వరకు ఐదు రోజులపాటు రాష్ట్రస్థాయిలో రిలే దీక్షలు చేపడుతామని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో



ఈ నెల 28న చలో సెక్రటేరియట్ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోమరిపోతులు పెరిగిపోతే దేశానికి ముప్పు




- ఉచిత పథకాలతో మరింత దివాలి తనం.
- సంక్షేమం పేరిట ప్రతి కుటుంబాని 50,000 వార్షిక లబ్ది.
- రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల హామీలు.
- ఎన్నికల ముందు హామీలు.. తర్వాత తంటాలు.
- తెలుగు రాష్ట్రాలలో ఎడతెరిపి పథకాలు.
- బట్టన్ నొక్కిన గత ప్రభుత్వాలను చూసి. ప్రస్తుత ప్రభుత్వాలు బుద్ధి తెచ్చుకోవాలి..
- ఎప్పుడు ఒకటో తారీకు వస్తుందా! అని ఎదురుచూపులు..
- ప్రజలను అడుక్కునే పరిస్థితి తీసుకు వస్తున్న రాజకీయ పార్టీలు
- అభివృద్ధి, సంక్షేమం సమతుల్యంగా ఉండాలి.
- సాధ్యం కాని హామీలతో అప్పుల్లో రాష్ట్రాలు.. స్కీములపై ఉన్న శ్రద్ధ... స్కాములపై పెట్టరు
- మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ 10,300 కోట్ల అప్పు సమకూర్చుకుంది..
- అంతిమంగా ప్రజలదే తప్పు..!

**మల్కాపురం ( కే ఉదయ్ కుమార్ ) , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో పాలిస్తున్న పాలకులు తమ రాజకీయ మనుగడ కోసం సంక్షేమ పథకాలు అంటూ ఎడ తెరిపి లేకుండా ఎన్నికల ముందు తమ తమ మేనిఫెస్టోలో పెడుతూ అమలు కానీ హామీలతో రాష్ట్ర ప్రజలకు హామీలు ఇస్తూ వాటిని అమలు చేయలేక రాష్ట్రాలను అప్పులు పాలు చేసే విధంగా ప్రస్తుతం పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు ఆర్థిక నిపుణులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో సంక్షేమ పథకాల కు కొన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ గత ప్రభుత్వాల లో చేసిన తప్పులను సమీక్షిం చకుండా మరల అదే తప్పులను ప్రస్తుతం ఉన్న పాలకులు అమలు చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు ఆర్థిక నిపుణులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో గత ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం సంక్షేమ పథకాలపై దృష్టి సారించి బటన్ నొక్కి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొని ప్రజల్లో విశ్వాసాన్ని పోగొట్టుకొని చివరకు ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోలేని పరిస్థితుల్లో జగన్ మోహన్ రెడ్డిని చూసైనా ప్రస్తుత పాలకులు వ్యవహరించాలి. ప్రస్తుతం పాలకులు ఒకవైపు గతహా ప్రభుత్వం చేసిన తప్పితాలపై వేలెత్తి చూపుతూ వీరు కూడా అదే పద్ధతిని కొనసాగించడంపై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### కొన్ని సంక్షేమ వథకాలు తప్పనిసరిగా ఇవ్వాల్సిందే.....

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో కొనసాగుతున్న వివిధ సంక్షేమ పథకాలలో కొన్ని అనవసరపు సంక్షేమం పథకాలు ఉన్నాయని గంటపదంగా చెప్పవచ్చు ముఖ్యంగా వికలాంగులకు, 60 సంవత్సరాల దాటిన వృద్ధులకు సామాజిక పింఛన్లు లతోపాటు వైద్య పరంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, ఆర్థిక సహాయం అందజేయడం తో పటు వితంతువులకు పింఛన్లు మంజూరు చేయడం సమంజసమే కానీ గత ప్రభుత్వంలో 45 సంవత్సరాల దాటిన ప్రతి మహిళలకు సంవత్సరానికి 18 వేల రూపాయలు తో పాటు వాహన మిత్ర, క్రైస్తవ మత పెద్దలకు ఆటో డ్రైవర్లకు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అనవసరపు పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సంగతి తెలిసి కూడా ప్రస్తుత పాలకులు అదే బాటలో నడవడం చాలా విడ్డూరకరం. ఇలా రాష్ట్ర ప్రజలకు ఉచిత పథకాలతో ప్రతి నెల పోషిస్తుంటే ఇక ఇదే పద్ధతి బాగుంది అంటూ చాలామంది పనులక...

### ఒకటో తారీకు ఎప్పుడు వస్తుందని ఎదురుచూవులు..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పై ఆధారపడి ఎప్పుడు ఒకటో తారీకు వస్తుందని ప్రజలు ఎదురుచూస్తుండటం చాలా అవమానీయంగా మారిం దని చెప్పవచ్చు, రాజకీయ పార్టీలు కేవలం తమ రాజకీయ లబ్ధి కోసం అలవి కాని హామీలను గుప్పిస్తూ ప్రజలను వెర్రి వెంగళప్పలను చేయడం ప్రస్తుత పాలకులకు రివాజ్ గా మారిపోయింది.

### స్కీములపై ఉన్న శ్రద్ధ...స్కాములపై లేదు..

ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర పాలకులు




అనేకమైన సంక్షేమ పథకాలను గుప్పిస్తూ ఢిల్లీ ప్రజలకు వాగ్దానాలు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. అందుకేనేమో ఢిల్లీ పీఠం భాజపా వశమైంది. ఇప్పటికే భారతదేశం అప్పుల పాలయితుంది అంటూ ఆర్థిక నిపుణులు గొంతే అరుస్తుంటే అవి ఏమి లెక్కచేయకుండా కేంద్ర పెద్దలు ప్రజలకు సంక్షేమ పథకాలు అంటూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అంటూ వాగ్దానాలను ఎడతెరిపి లేకుండా ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వాలు స్కీములపై ఉన్న శ్రద్ధ మన దేశంలో జరుగుతున్న స్కాములపై దృష్టి సారిస్తే భారతదేశం అన్ని దేశాల కంటే ధనిక దేశంగా ఉండటం ఖాయం. మార్చి నెలలో పదివేల కోట్ల అప్పు....ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ రుణాలపై తీవ్రంగా ఆధార పడుతోంది. మార్చి నెలలో కేవలం మూడు విడతల్లోనే సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.10,300 కోట్లు సమీకరించింది . ప్రభుత్వం తన రోజువారీ ఖర్చులు, సంక్షేమ పథకాల అమలు, పాత అప్పుల వడ్డీల చెల్లింపుల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే "ఈ-కుబేర్ "వేదిక ద్వారా ఈ నిధులను సేకరించడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో నిధుల సర్దుబాటు కోసం ఈ స్థాయిలో అప్పులు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గత 22 నెలల కాలాన్ని విశ్లేషిస్తే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెలా సగటున రూ.4,000 కోట్ల నుండి రూ.6,000 కోట్ల వరకు ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ ద్వారా అప్పులు చేస్తూ వస్తోంది. తాజా గణాంకాల ప్రకారం, ఈ 22 నెలల కాలంలో ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు సుమారు రూ.1.35 లక్షల కోట్లకు పైగానే ఉన్నట్లు అంచనా. ఇందులో బడ్జెట్ అప్పులతోపాటు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న గ్యారెంటీ రుణాలు కూడా ఉండటంతో రాష్ట్ర అప్పుల భారం మరింత పెరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం, 2026 నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు(అన్ని రకాల గ్యారెంటీలతో కలిపి) దాదాపు రూ.7.11 లక్షల కోట్లకు చేరువవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు ఆశించిన స్థాయిలోఅధిగమిం చకపోవడంతో, మరోవైపు ఉచిత వథకాలు, నిర్వహణ, ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో, భవిష్యత్తులో ఈ రుణాల వడ్డీల చెల్లింపులే ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి

## మందుల చీటిలు తెలుగులో అర్థమైయేలా వ్రాయాలని డాక్టర్లకు సూచన

### కలెక్టర్ డాక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** మందుల చీటి తెలుగులో అర్థమైయేలా వ్రాయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం అయన పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా బైపాస్ రోడ్డులో ఉన్న సౌజన్య ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల చీటి పూర్తిగా అర్థం అయేలా ఏ సమయంలో ఏ మందు వేసుకోవాలనే ది తెలుగులోవ్రాయాలని అయన సూచించారు. ఆసుపత్రిలో ప్రభుత్వ పథకాల అమలును తీరు ను అయన పరిశీలించారు. ముఖ్యంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు, ఈ.హెచ్.ఎస్ పథకాలు రోగులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని 'వైద్యమిత్ర' సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి, పథకాల కింద నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎన్టీఆర్ వైద్య సేవలు పొందు తున్నప్పుడు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి, సిబ్బంది ప్రవర్తన గురించి రోగుల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచిత వైద్య సేవలు అందజేయాలని, రోగుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి ఆయన స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ రావు, వైద్య ఆరోగ్య సిబ్బందో ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పెదబయలు వారం సంత ఆశీల వసూలుకు వేలం పాట

**పెదబయలు , (మనసులో మాట) ఏప్రిల్ 01 :** మండలంలోని సీతగుంట పంచాయతీ కార్యా లయంలో పంచాయతీ విస్తర ణాధికారి ఎం. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సంత ఆశీల వేలం పాట మండలంలో 9 మంది ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆశీల వసూలుకు ముసిడిపుట్టు గ్రామా నికి చెందిన పసు పుల నైకంబాబు రూ.5,80,500లకు దక్కించుకు న్నారు. సర్పంచ్ పలాసి మాధవరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, మోహన్రావు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

## జర్నలిస్టులు తమ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి

- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపు
- వైద్యారోగ్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** జిల్లాలోని పాత్రికేయులంతా తమ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు గత ఐదు రోజులుగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని, బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాత్రికేయులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు గురించి తెలుసుకున్నారు. తాను కూడా స్వయంగా బిపి, షుగర్ తదితర పరీక్షలను చేయించుకున్నారు. పాత్రికేయులకు రిపోర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పని ఒత్తిడిలో పడి జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని విస్మరించడం సరికాదని అన్నారు. తమతోపాటు, తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా మధ్యవయసు వచ్చిన వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి వైద్య పరిక్షల కారణంగా శరీరంలో దాగిఉన్న అనారోగ్య లక్షణాలను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా తమ శరీర ఆరోగ్యంపై ఒక అవగాహన కూడా ఏర్పడుతుందని అన్నారు. ఈ శిబిరాన్ని జర్నలిస్టులంతా ఉపయోగించుకొని, తమతోపాటు, కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు చేయించాలని కలెక్టర్ కోరారు. సమాచార శాఖ ఎడి పి.గోవిందరాజులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతోబాటు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జర్నలిస్టులతోపాటు, వారి కుటుంబ సభ్యులకు కూడా మార్చి 28 నుంచి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 141 మంది జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిపి 362 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, సుమారు 120 మందికి పరీక్షలు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రతీఒక్కరూ జర్నలిస్టు హెల్త్‌కార్డును పొందాలని సూచించారు. అలాగే అర్హులైన జర్నలిస్టులందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులను అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తిరుమల మెడికవర్ ఎండి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ, నిత్యం పనిఒత్తిడితో సతమతం అయ్యే జర్నలిస్టులు, తమ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని సూచించారు. పాత్రికే యులకు ఎల్లప్పుడూ తమవంతు సహకారాన్ని అంది స్తామని, మరిన్ని అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్షలను నిర్వహిం చేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు బూరాడ శ్రీనివాసరావు, పిఎస్.ఎస్.వి.ప్రసాదరావు మాట్లాడుతూ, జర్నలిస్టుల తోపాటు, వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలను నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు, సమాచార పౌర సంబంధాల శాఖకు, తిరుమల మెడి కవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారిణి డాక్టర్ ఎస్.జీవనరాణి, ఎన్‌టిఆర్ వైద్యసేవ కోఆర్డి నేటర్ సాయిరాం, తిరుమల మెడికవర్ సెంటర్ హెడ్ పవన్‌కుమార్, ఐసియు ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.జగదీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీకిరణ్, డివిజన్ పిఆర్‌ఓ ఎస్.జానకమ్మ, పిఆర్‌ఓ మజ్జివాసుదేవరావు, అక్రిడేష న్ కమిటీ సభ్యులు టి.రాధాకృష్ణ, బళ్లమూడి నాగేంద్ర ప్రసాద్, వై.శ్రీరాముల నాయుడు, మజ్జి శివ కుమార్, కె.రమేష్‌నాయుడు, బిజిఆర్ పాత్రో, పలువురు పాత్రికేయులు, మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీడీవో



**కోటవురట్ల , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక పింఛన్లను కోటవురట్ల మండలం ఎండపల్లి గ్రామంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకుని పింఛన్లను అందజేశారు. మండలంలో 25 పంచాయతీల పరిధిలో 9,245 మందికి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ప్రారంభించామన్నారు. సచివాలయం సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని పింఛన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం లోగా పింఛలను పంపిణీ చేయాలని ఆదేశించామన్నారు. మిగిలిపోయిన వారికి గురువారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అలాగే పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

## సర్పంచుల వీడ్కోలు సభలో వార్డు సభ్యులకు సన్మానం

- ఐదేళ్లు గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ వెంకట పూర్ణిమ



**హుకుంపేట , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలంలోని స్థానిక సచివాలయంలో సర్పంచ్, వైస్ సర్పంచ్, వార్డు సభ్యుల పదవి వీడ్కోలు సన్మాన సభను సర్పంచ్ సమీడే వెంకట పూర్ణిమ బుధవారం నిర్వహించారు. హుకుంపేట పంచాయతీకి చెందిన 12 వార్డుల సభ్యులందరికీ, గ్రామ ప్రజలకు మీడియ మిత్రులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముందుగా వార్డు సభ్యులు గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జరిగిన సమావేశం లో సర్పంచ్ వెంకట పూర్ణిమ మాట్లాడుతూ, 2021లో సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, వీధి లైట్లు వంటి పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. "నన్ను ఐదేళ్ల పాటు నమ్మి గెలిపించిన ప్రజలకు, సహకరించిన వార్డు సభ్యులకు నా కృతజ్ఞతలు. మీ అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైంది" అని ఆమె అన్నారు. తన పదవీకాలంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే క్షమించాలని కోరుతూ, పదవి ముగిసినప్పటికీ ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డీ రామ్‌నాయుడు, ఎంపీటీసీ కొమ్మ రమ్మ, వీఆర్వో, పేసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వీక్ బూత్ లు బలోపేతం చేద్దాం : కె.సురేష్ కుమార్



**పెదబయలు , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, పరిశీలకులు కోడా వెంకట సురేష్ కుమార్ అన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు గారి ఆదేశానుసారం బుధవారం పెదబయలు మండలం పర్రెడ 51, పెద్దపుట్టు 52 వీక్ బూత్ లలో క్షేత్రాస్థాయిలో ఆయన పర్యటిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తిసుకెళ్లాలని,బూత్ కమిటీ, యూనిట్ ఇంచార్జ్, (కెఎస్ఎస్) సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులను కలుపుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తామర మూర్తిబాబు, కొంతెలి వెంకట ప్రసాద్,చీపురు మల్లేశ్వరావు, పలసి రామచంద్రుడు, ముఖి కృష్ణారావు, జర్సింగి అప్పారావు, మాజీ సర్పంచ్ వెచ్చశీగి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవలస కాపీ ఎక్స్పీరియన్స్ సెంటర్, ఏకో కాటేజీల నిర్మాణ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి

- ఆదివాసి 5 షెడ్యూల్ భూభాగంలోని చట్టాలను కాలరాస్తూ ఐటిడిఏ టెండర్లు వేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే




**అరకులోయ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం చొంపి పంచాయితీ కొత్తవలస గ్రామంలో అత్యంత ఖరీదైన రెండు పాయింట్ ఐదు ఎకరాల గిరిజన భూమిని కాపీ ఎక్స్ ఫిడియన్స్ సెంటర్ మరియు ఏకో కాటేజీల నిర్మాణం పేరుతో ప్రైవేటు కంపెనీలకు పాడేరు ఐటిడిఏ దార దత్తం చేయడానికి దారి చేసిన టెండర్ (ఆర్ యఫ్ పి) నోటిఫి కేసన్ విడుదల చేయడాన్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తీవ్రంగా ఖండించారు. అరకులోయ గిరిజన సం ఘం భవనంలో విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో తీసుకునే ఇలాంటి చర్య వల్ల 5వ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసి స్వయంపాలన హక్కులను మరియు సుప్రీంకోర్టు తీర్పులను బేఖాతరు చేస్తూ కాలరాయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రకారము ఆదివాసి గిరిజన ప్రాంతంలో భూమిపై పూర్తిగా ఉంటాయని సుప్రీంకోర్టు ఇచ్చిన చారి త్రాత్మక సమత తీర్పు ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కూడా ప్రైవేటు వ్యక్తులకు లేదా కంపెనీలకు లీజుకుచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేవలం గిరిజనులకు లేదా గిరిజన సహకార సంఘాలకు మాత్రమే ఇటువంటి ప్రొద్దుటల నిర్వహణ బాధ్యత అప్పగించ లని అయితే ప్రైవేట్ ఏచించిన కోసం టెండర్లు పిలవడం ముమ్మాటికి చట్ట విరుద్ధం అన్నారు. పెసా చట్టం ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన భూముల కేటాయింపులు చేసిన స్థానిక గ్రామసమాల తీర్మానం తప్పనిసరి చేయవలసి ఉండగా అరకులోయ మండలం చంపి కొత్తవలస ఆదివాసి గిరిజనుల అభిప్రాయం తీసుకోకుండా గ్రామసభలు అనుమతి లేకుండా ఏకపక్షంగా టెండర్లు ఎలా నిర్వహిస్తారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంతేకాకుండా ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ సాగు ఆదివాసుల జీవనాధారం కాఫీ ఎక్స్పిరియన్స్ సెంటర్ పేరుతో ఆదివాసి ప్రాంత సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిం చడం వల్ల స్థానిక గిరిజనులు కేవలం కూలిగామిగిలిపోతున్నారన్నారు. 15 ఏళ్ల పాటు సుదిరిగా లీజుకు ఇవ్వడం అంటే అది గిరిజన భూములపై ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యాన్ని శాశ్వతం చేయడమేనని సురేంద్ర, బాలదేవ్ విమర్శించారు. ఏకో కాటేజీల పేరుతో 2.5 ఎకరాల్లో రిసార్ట్స్ లు నిర్మిం చడం వల్ల అరకులోయ ప్రాంత పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అందుకు పర్యావరణహితమైన నిర్మాణాలను అని చెబుతున్న పర్యాటకం పేరుతో ప్రవేటు కంపెనీలు ఆదివాసి సంస్కృతిని అడవిని ధ్వంసం చేసే ప్రమాదం లేకపోలేదని వారు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23 2026 నా జారీ చేసిన అరకు కాపీ ఎక్స్పిరియన్స్ సెంటర్ టెండర్ నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని అలాగే ఆదివాసి ప్రాంతంలోని పర్యాటక ప్రోజెక్టను ప్రైవేటు ఏజెంట్లకు కాకుండా స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో కూడిన సహకార సంఘాలకు లేదా గిరిజన కార్పొరేషన్లకు మాత్రమే అప్పగించాలని వారు కోరారు. ప్రభుత్వాలు చట్టాలను గౌరవించకుండా ప్రైవేటు కంపెనీలకు భూములు కట్ట పెట్టాలని చూస్తే ఆదివాసులకు ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఐటిడిఏ కేవలం గిరిజన సంక్షేమం కోసం పనిచేయాలే తప్ప కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరించకూడదని సురేంద్ర బాలదేవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అలాగే ఈ టెండర్ల ప్రకారం తక్షణమే నిలిపివేయకపోతే అల్లూరు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు. ఈ ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మన్న పడాల్ మండల అధ్యక్షులు జి చిన్నబాబు కార్యదర్శి జి బుజ్జిబాబు పాల్గొన్నారు.

## మునగపాక పిఏసిఎస్ ద్వారా బీమా సొమ్ము అందజేత

- ఆయా కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు విల్లూరు నర్సింగరావు



**మునగపాక,ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలోనూ, పాము కాటు తో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆయా కుటుంబ సభ్యులకు భీమా చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మునగపాక గ్రామానికి చెందిన మాడా కన్నారావు మృతి చెందారు. ఆయా కుటుంబానికి రెండు లక్షల రూపాయలు చెక్కును, పాము కాటుతో చనిపోయిన వేగి ఆదిలక్ష్మి కుటుంబానికి రెండు లక్షల రూపాయలు, పిఏసిఎస్ అధ్యక్షులు విల్లూరు నూకనరసింగరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పాలిపిని రాము, మొల్లి అప్పలరాజు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసలి నాయుడు, మునగపాక టిడిపి అధ్యక్షులు దాడి శివ, కార్యదర్శి పెంటకోట శ్రీరామ్మూర్తి, జనసేన నేత ఏవీ సత్యనారాయణ, పిఏసిఎస్ సీఈవో పెంటకోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

- వి.బి.జి రామ్ చట్టాన్ని రద్దు చేయాలి : సిపిఎం డిమాండ్



**జియ్యమ్మవలస , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** 2005వ సంవత్సరంలో వామ పక్ష పార్టీల మద్దతుతో ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఈరోజు బిజెపి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టం వి.బి.జి రామ్ చట్టాన్ని తెచ్చి ఉపాధి హామీ కూలీలుగాను పనులు లేకుండా చేసి వలసలు వెళ్లే విధంగా ప్రోత్సాహిస్తూన్నాయని పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆరోపించారు..బుధవారం రబ్బర్ డాం పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తూ అక్కడ కూలీల సమక్షంలో మాట్లాడారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తిరుపతిరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలుకు భద్రత లేదని పని లేకుండా చేసి వలసలు వెళ్లే విధంగా ఈరోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపాధి కూలీలకు సంబంధించి పేస్ యాప్ రద్దు చేయాలి,సంవత్సరానికి 200 రోజు పని కల్పించాలి ,రోజుకి 600 రూపాయలు కూలి గిట్టుబాటు ఇవ్వాలని పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని కోరారు.పనిముట్లు పార, గుణపాము ,టెంట్స్, అందులో మజ్జిగ,మంచినీరు ,ప్రదమచికిత్సకు మందులు వంటి సౌకర్యాలు కల్పించి ఆ విధంగా ఉపాధి పని చేసే కూలీలకి భరోసా కల్పించా లన్నారు.లేనియెడల జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి గిరిజన సంఘం నాయకులు హెచ్. రామారావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో ప్రవేశాలు : ఎంఈవో కే.నరేష్



**నక్కవల్లి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మరికొద్ది రోజులలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న శుభతరుణంలో ప్రాధమిక పాఠశాలల నుండి ఉన్నత పాఠశాలల్లో ప్రవేశించే అడ్మిషన్ల ప్రక్రియ ఉపాధ్యాయులు వేగవేంతం చేస్తున్నట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి కే.నరేష్ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఒక్కరోజే స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో ఆరవ తరగతిలో 14 మందికి ప్రవేశాలు కల్పించడం జరిగిందని హెచ్.ఎమ్. శ్రీలక్ష్మి తెలిపారు.ప్రభుత్వపాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అనేక సదుపాయాలను ఆమె తల్లిదండ్రులకు వివరించారు. గత మూడేళ్ళుగా పాఠశాలలో పదవతరగతిలో మంచిఫలితాలు సాధిస్తున్నామని త్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపికకావడవే దీనికి నిదర్శనమన్నారు .ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వపాఠశాలల్లో ఆధునిక విద్యావిధానం,డిజిటల్ తరగతులు, ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన,వారాంతపు పరీక్షలు,వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ,డొక్కాసీతమ్మ మద్యాహ్న భోజనపథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా పుస్తకాలు,బ్యాగులు, వంటి అనేక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు

## వారపు సంత శుభ్రత బాధ్యత వేలం దారుడిదే

- నిబంధనలు ఉల్లంఘిస్తే రద్దు హక్కు పంచాయతీకి: ఇన్చార్జ్ ఎంపీడీవో రామ్ నాయుడు



**హుకుంపేట , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలంలోని స్థానిక పంచాయతీలో శనివారం వారపు సంతకు సంబంధించిన ఆసీల వసూళ్ల వేలం పాట బుధవారం స్థానిక సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంత శుభ్రత బాధ్యత కూడా వేలం పాట గెలుచుకున్న వారిదేనని ఇన్చార్జ్ ఎంపీడీవో రామ్ నాయుడు స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి సత్య నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఆరుగురు పాల్గొనగా, ఒకరు మధ్యలో తప్పుకోవడంతో ఐదుగురు పోటీలో నిలిచారు. మామిడి భీమరాజు, మజ్జి రామకృష్ణ, కాసుల గోవింద్, కుర్తాడి ధర్మరాజు, బద్నాయిని వీర్రాజు పోటీ పడగా, చివరకు బద్నాయిని వీర్రాజు రూ. 1, 60,000కు వేలం సొంతం చేసుకున్నారు. ప్రారంభ ధర రూ. 1,25,000గా ఉండగా, పోటీతో ధర పెరిగింది. వేలం గెలుచుకున్న వీర్రాజుకు పంచాయతీ తరఫున సంబంధిత పత్రాలను ఇన్చార్జ్ ఎంపీడీవో రామ్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో రామ్ నాయుడు మాట్లాడుతూ, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ఆసీలు వసూలు చేయాలని సూచించారు. వసూళ్ల సమయంలో పంచాయతీ రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. అలాగే, సంతలో చెత్తను ఆదివారం రోజున శుభ్రం చేయించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వేలం రద్దు చేసే హక్కు పంచాయతీకి ఉంటుందని హెచ్చరించారు. వేలం కాలం 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమల్లో ఉండగా, రూ. 1.60 లక్షలను నాలుగు దఫాలుగా పంచాయతీకి చెల్లించాలని తెలిపారు. నూతనంగా ఆసిలవేళం పట్ట గెలుచుకున్న బద్నాయిని వీర్రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మరమ్మ, పేసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సేవల్లో అలసత్వం వద్దు

- తప్పులు లేని పాస్ పుస్తకాలే లక్ష్యం
- గడువులోగా సేవలు అందించాలి
- రెవిన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు



**డుంబ్రిగుడ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** రెవిన్యూ సేవలో అలసత్వం లేకుండా తప్పులు లేని పాస్ పుస్తకాలు గడువులోగా సేవలు అందించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, స్థానిక తాసిల్దార్ త్రివేణి, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి రెవెన్యూ సేవలు, పట్టాదారు పాస్ పుస్తకాల సవరణలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం పై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న రాజముద్రత కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల విషయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలను ఈ కేవైసీ ద్వారా సరిచూసి ఎలాంటి తప్పులు దొరలకుండా తాసిల్దార్ లాగిన్ లో సవరణలు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మ్యుటేషన్లు, కొత్త రైస్ కార్డులు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే దరఖాస్తులను నిర్ణిత గడువులోపు మాత్రమే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించకూడదని హెచ్చరించారు. ప్రధానంగా పి జి ఆర్ ఎస్ గ్రీవెన్స్ అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వస్తున్న ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు పొందే విధానం ఫోన్ కాల్స్ కు స్పందించే తీరుపై వివరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ యంత్రాంగం ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని, కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల విఆర్వోలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## నారాయణపురం చీరలకు విదేశాల్లో గిరాకీ వచ్చేటట్టు కృషి చేస్తా

**- నారాయణపురం చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు : ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర**



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలోని చేనేత కార్మికులు నేస్తున్న చీరలకు విదేశాల్లో మంచి గిరాకీ వచ్చేటట్టు తన వంతు కృషి చేస్తామని విజయ్ చంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు సరఫరా చేసే ధ్రువ పత్రాలను అందజేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలోని చేనేత కార్మికులు నేస్తున్న చీరలకు జియో టాకింగ్ ఏర్పాటుచేసి ప్రత్యేక బ్యానర్ తో దేశ విదేశాల్లో ఈ కార్మికులకు గుర్తింపు వచ్చేటట్టు తనవంతు కృషి చేస్తామన్నారు. నారాయణపురం చేనేత కార్మికులు నేర్చిన చీరలను జిల్లా ఉత్పత్తుల కింద చేర్చి జాతీయ స్థానంలో గుర్తింపు వచ్చేటట్టు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 77 మంది అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అర్హత పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముందుగా ఆయన నారాయణపురం చేనేత కార్మికులు చేనేత మగ్గాలపై తయారుచేసిన చీరలను తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి మండల స్థాయికి చెందిన నలుగురు మహిళ అధికారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి. వేణుగోపాల్ నాయుడు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు బూరాడ రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, మండల పెదపాపి నాయుడు,బోను చంద్రమౌళి, అధికారులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 2,53,336 మందికి 107.75 కోట్లు రూపాయలు విడుదల

**- ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ప్రతి లబ్ధిదారునికి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తిచేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం అనకాపల్లి 84 వ వార్డు పెరుగుబజారు ప్రాంతం లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పించన్లు అందించారు. పెన్షన్లు పంపిణీ విధానంపై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. జిల్లాలో మొత్తం 2,53,336 మంది లబ్ధిదారులకు 107,75, 70,500 రూపాయలు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి జోన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలు, 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శతశాతం పెన్షన్లు పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి, 84 వ వార్డు కార్పొరేటర్ నీలంశెట్టి చిన్న తల్లినీలబాబు తదితరులు పాల్గొన్నారు.

## వితంతువులకు కొత్త పెన్షన్లు పంపిణీ తో వారి జీవితంలో ఆనందం

**- పెన్షన్ పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు టెక్కలి పరశురాం**



**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** చాలా కాలంగా ఎదురుచూస్తున్న వితంతువులకు ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ సూచన మేరకు కొత్త పెన్షన్లు మంజూరయ్యాయి. వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు అవ్వడంతో వారి కళ్ళల్లో ఆనందం కనిపించిందని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం అన్నారు. ఆయన చేతుల మీదగా కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు జనసైనికులు పాల్గొన్నారు.

# ఆకలి సెగలు..అందని బకాయిలు

**నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికుల 'కన్నీటి' గాథ!**




**నెల్లిమర్ల , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** దశాబ్దాల కాలం పాటు ఆ మిల్లు యంత్రాల హోరులో తమ రక్తాన్ని చెమటగా మార్చి, సంస్థ ఎదుగుదలకు తోడ్పడ్డారు ఆ కార్మికులు. కానీ, విశ్రాంతి తీసుకోవాల్సిన వృద్ధాప్యంలో నేడు వారు 'ఆకలి'తో పోరాడుతున్నారు. తమ సొంత సొమ్ము కోసం, తాము కష్టపడి దాచుకున్న హక్కుల కోసం నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికులు రోడ్డున పడ్డ పరిస్థితి అత్యంత దారుణం.

**బౌన్స్ అయిన చెక్కులు.. ముక్కలైన ఆశలు..**

రిటైర్ అయిన తర్వాత ఆ వచ్చే కొద్దిపాటి గ్యాట్యూటీ డబ్బులతో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలని, అనారోగ్యానికి వైద్యం చేయించుకోవాలని కలలు గన్న కార్మికులకు యాజమాన్యం కోలుకోలేని దెబ్బ తీసింది. యాజమాన్యం ఇచ్చిన దాదాపు రూ. కోటి విలువైన గ్యాట్యూటీ చెక్కులు బౌన్స్ అవ్వడం వారి పట్ల యాజమాన్యానికి ఉన్న నిర్లక్ష్యానికి పరాకాష్ట. చెక్కులు చేతిలో ఉన్నా, ఖాతాలో సొమ్ము జమకాక కార్మికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

**పెన్షన్ లేదు.. వైద్యం అందదు**

కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేసిన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును ప్రభుత్వం వద్ద సకాలంలో జమ చేయక పోవడంతో కార్మికులు రెట్టింపు నష్టాన్ని చవిచూస్తున్నారు. పిఎఫ్ వాటా చెల్లించకపోవడంతో రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన నెలవారీ పింఛను నిలిచిపోయింది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా, ఈఎస్ఐ సేవలు అందక కార్మికులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక, మందులు కొనలేక ప్రాణాలు విడుస్తున్నారు.

**చనిపోతున్నా చలించని యాజమాన్యం!**

దురదృష్టవశాత్తూ, గ్యాట్యూటీ బకాయిలు అందకముందే కొంతమంది కార్మికులు అనారోగ్యం, మానసిక ఆందోళనతో కన్నుమూస్తున్నారు. చనిపోయిన కార్మికుల నామినీలకు కూడా చెక్కులు అందజేయడంలో యాజమాన్యం జాప్యం చేయడం అత్యంత అమానవీయం. 2016 నుంచి నేటి వరకు సుమారు 1200 మందికి పైగా కార్మికులు తమ హక్కుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

**ప్రజాప్రతినిధుల గళం.. అధికారుల మౌనం**

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అసెంబ్లీ వేదికగా ఈ సమస్యను లేవనెత్తినా, కార్మిక సంఘాలు నిత్యం పోరాటాలు చేస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. కార్మిక శాఖ అధికారులు మొక్కుబడిగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారే తప్ప, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తక్షణ పరిష్కారం కావాల్సిన ప్రధాన డిమాండ్లు**

1 రుణ బకాయిల చెల్లింపు 5 వేల మంది కార్మికుల వద్ద తీసుకున్న అప్పును (ఒక్కొక్కరికి రూ. 52,000 చొప్పున) వెంటనే చెల్లించాలి. 2 కొత్త చెక్కుల జారీ బౌన్స్ అయిన రూ.కోటి విలువైన చెక్కుల స్థానంలో కొత్త చెక్కులు ఇవ్వాలి. 3 వారసులకు న్యాయం: మరణించిన కార్మికుల నామినీల పేరిట వెంటనే చెక్కులు మంజూరు చేయాలి. 4 పిఎఫ్,ఈఎస్ఐ బకాయిలు పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ వాటాలను చెల్లించి, పెన్షన్, వైద్య సేవలు పునరుద్ధరించాలి. 5. గ్యాట్యూటీ క్లియరెన్స్ 2016 నుండి పెండింగ్‌లో ఉన్న 1200 మంది కార్మికుల గ్యాట్యూటీ చెక్కులు అందించాలి కార్మికుల శ్రమతో కోట్లు గడించిన యాజమాన్యం, నేడు వారిని నడిరోడ్డుపై వదిలేయడం సామాజిక నేరం. ఇప్పటికైనా ప్రభుత్వం, కార్మిక శాఖ జోక్యం చేసుకుని, మొండికేస్తున్న యాజ మాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. "ఆకలి మంటలతో అలమటిస్తున్న నెల్లిమర్ల కార్మికులకు న్యాయం చేయాలి.

# ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్న లేబర్ కోడ్స్

**- నాలుగు లేబర్ కోడ్స్ అమలను తక్షణమే నిలిపివేయాలి**
**- నగర పంచాయతీ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన**



**నెల్లిమర్ల , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఏప్రిల్ 1 నుంచి లేబర్ కోడ్స్ అమలు కానున్న నేపథ్యంలో బ్లాక్ డే గా నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నెల్లిమర్ల నగర పంచాయతీ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి బుధవారం ఉదయం ఆఫీస్ వద్ద తమ నిరసన తెలిపాశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ ( సిఐటియు ) జిల్లా కోశాధికారి బి. హరిబాబు మాట్లాడుతూ శాశ్వత స్వభావం కలిగి ఒకే తరహా పనిచేస్తున్న చోట కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ విధానం రద్దుచేసి పర్మినెంట్ చేయాలని, అంతవరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాడే కార్మిక వర్గం విరోచితంగా పోరాడి 44 చట్టాలను సాధించు కుందని, వాటిలో ముఖ్యమైన 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ ను ఈరోజు అమల్లోకి తీసుకురావడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నమన్నారు.

చట్టాలు ఉన్నప్పుడే ప్రభుత్వ రంగంలోనే కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ థర్డ్ పార్టీ పేరుతో శ్రమ దోపిడి చేస్తున్నారని, చట్టాలను రద్దుచేసి కోడ్స్ అమల్లోకి వస్తే కార్మిక వర్గం మరింత బానిసత్వం లోకి నెట్టివేయబడుతుందని, శాశ్విత స్వభావం కలిగిన ఉపాధికి బదులు ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ వల్ల సామాజిక న్యాయానికి, ఆర్థిక అసమానతల నిరోధానికి మరింత విఘాతం కలుగుతుందన్నారు.

కార్మికులకు సంఘం పెట్టుకొని హక్కు, బారసారాల హక్కు, సమ్మె హక్కు ను ఈ కోడ్స్ నిరాకరిస్తు న్నాయన్నారు. అందుకే ఈ లేబర్ కోడ్స్ ను రద్దు చేసి 29 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా నల్ల రిబ్బన్లతో ఈరోజు విధులకు హాజరు కానున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాము లక్ష్మి బాలరాజు శంకర్రావు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## చూసి మాట్లాడు...మిత్రమా!

**- వైకాపా అధ్యక్షులకు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున హితవు**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** ఇటీవల జరిగిన డిఆర్సి సమావేశం మొక్కుబడిగా జరిగిందని జిల్లా వైయస్సార్సిపి అధ్యక్షులు విమర్శించడం విడ్డూరగా ఉందని తెలుగుదేశం పార్లమెంటు పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున వ్యాఖ్యా నించారు.

బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఆర్ సమావేశం ముందు అనుకున్న విధంగా రాష్ట్ర బడ్జెట్, దానిలో జిల్లాకు కేటాయించిన నిధులు..తదుపరి జిల్లా అభివృద్ధిపై సమీక్షలు చేయాలని భావించామని అలాగే అది కొనసాగిందని తెలిపారు.

అందరు సభ్యులు అక్కడ మాట్లాడారని, జిల్లా హార్టీకల్చరల్‌పై మాట్లాడారు. ఇతర సమస్యలపై ఏవిధంగా ఆమొక్కెబడి అని ఎలా చెబుతారు? జిల్లాలో ఉన్న నీటి ప్రాజక్టుపై మాట్లాడారు. మామిడి పంట గురించి కళా వెంకటరావు, బేబి నాయన ,సురేష్ పూసపాటిరేగ మండలంలో ఉన్న ఆరోగ్య సమస్యలపై మాట్లాడారు. అంతలోతుగా అన్నింటిపైఎమ్మెల్యే లోకం మాధవి, బంగారురాజు భోగాపురం ఎయిర్‌పోర్ట్ గురించి మాట్లాడారు. బడ్జెట్‌పై నీటి ప్రాజెక్ట్ పై కూడా మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్సీపూసపాటిరేగలో ఆరోగ్య సమస్యలపై మాట్లాడారు. జిల్లా కలెక్టర్ హార్టికల్చర్ సమస్యలపై, వ్యవసాయ రంగం సమస్యలపై సుదీర్ఘంగా తెలిపారు. ప్రణాళిక కూడా వివరించారు. పెట్టుకున్న సమావేశాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు. అలాగే పార్టీ అధ్యక్షులుగా..లేదా ప్రతిపక్షంలో ప్రభుత్వం విధానాలపై మాట్లాడాలి. కానీ, వాటిలో నిజం ఎంతవుందో చూడాలి. రైతుల జీవితాల బాగు కోసం మీరున్నప్పుడు ఎలా చేశారు. యూరియా దొరకటం లేదని విమర్శించారు.కానీ కావలసినంత యూరియా ఉంది. ప్రభుత్వ అధికారులతో మాట్లాడండి. ఇక డిసిసిబి విషయానికి వస్తే... రుణం తీసుకున్న వ్యక్తుల బకాయిలు ఖచ్చితంగా వసూలు చేస్తాం. రెండుమూడు సొసైటీలలో అక్రమాలు, అవినీతి జరిగిందని తెలిసి వాటిపై దర్యాప్తు చేస్తున్నాం. అవి రుజువైతే చర్యలు తీసుకుంటాం. గట్టి కేసులే పెడతాం. సహకార సంఘాలు రైతులకు మంచి చేసేవిధంగా ఉండాలని అన్నారు.

# లేబర్ కోడ్ అమలకు నిరసనగా బ్లాక్ డే : ప్రజాసంఘాలు



**పార్వతీపురం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పార్వతిపురం నాలుగు రోడ్ల సెంటర్లో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని 36 కోట్ల మంది కార్మిక వర్గం ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె చేసినప్పటికీ నాలుగు లేబర్ కోర్టులను ఏప్రిల్ ఒకటో తేదీ నుండి అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది లేబర్ కోడ్ అమలకు నిరసనగా ఏప్రిల్ ఒకటి బ్లాక్ డే గా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయించాయి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్ గా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక వర్గానికి నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తున్నది దినికి నిరసనగా దేశవ్యాప్తంగా 2026 ఫిబ్రవరి 12న 30 కోట్ల మంది కార్మికుల సమ్మె చేశారు కనీసం కార్మిక సంఘాలతో సంప్రదింపులు చేయకుండా ప్రజాస్వామ్య పద్ధతులు పాటించకుండా కోట్లాదిమంది కార్మికులు నిరసనలు పట్టించుకోకుండా నియంత పోకడాలతో 2026 ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు లేబర్ కూడా అమలు పూనుకోవడం దుర్మార్గము అప్రజ స్వామికము చరిత్రలో కార్మికులకు నష్టం కలిగించే హక్కులకు హాని కలిగించే వారు ఎంతటి వారైనా చరిత్రహీనులుగా మిగిలిపోయారు ఆ ప్రభుత్వాలు అభాష్పాలై సంఘటన ఎన్నో ఉన్నాయి . కార్మిక వర్గ నికి పోరాటం తప్ప ఇంకొక మార్గం లేదు పోరాడితే పోయేది ఏమీ లేదు బానిససంకెళ్ళే తప్ప అని కార్ల మార్క్స్ సిద్ధాంతాన్ని కార్మిక వర్గం దృష్టిలో పెట్టుకొని రాబోయే రోజుల పెద్ద ఎత్తున లేబర్ కోడ్ ల కు నిరసనగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు,ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వి ఎస్ కుమార్, ఏఐసీసీ టీయూ నాయకులు సంఘం,, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ, నాయకులు బివి రమణ, రెడ్డి వేణు, ప్రజా సంఘాల నాయకులు పాకల సన్యాసి, పి రాజశేఖర్, రైస్ మిల్ యూనియన్ నాయకులు కృష్ణ, సిఐటియు పట్టణ నాయకులు బంకుర సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

# పాఠశాలకు ఎన్ఆర్ఐ క్రీడా పరికరాల వితరణ

**- పేదలకు నిత్యావసరాల పంపిణీ చేస్తున్న సుధీర్ రెడ్డి**



**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలంలోని తోటాడ మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలకు గాజువాకకు చెందిన ఎన్ఆర్ఐ గొందేశి సుధీర్ రెడ్డి 50 వేల విలువజేసే క్రీడా పరికరాలను,పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.ఓంకార పీఠం సౌజన్యశీతో చేపట్టిన కార్యక్రమాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు ప్రారంభించారు .ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి రామిరెడ్డి జ్ఞాపకార్ధంగా గత ఐదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కేవలం పట్టణ పరిధిలోనే ఇన్నాళ్లూ సేవలు అందించానని తన ఆత్మీయుల సూచన మేరకు పల్లె ప్రాంతాలకు సేవలను విస్తరించినట్లు చెప్పారు.పేదరికంతో సతమతమవుతున్న వారికి అండగా నిలవాలన్నదే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఇక్కడి పరిస్థితులు,వాతావరణం చూశాక గ్రామానికి ఏదైనా చేయాలన్న ఆలోచన కలిగిందన్నారు.తనలాగే భవిష్యత్ లో కూడా ఈ సేవలు ఇలానే కొనసాగాలన్నది తన లక్ష్యమని అందుకోసమే ప్రతి కార్యక్రమంలో తన కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేస్తున్నానని తెలిపారు.పేదరికం చదువుకు అడ్డంకిగా మారకూడదని పేద విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు .పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి రమేష్,ఆళ్ల సాంబశివరావు,ఆడారి ప్రసాద్,కుమార్, గంగాధర్, నూకలక్ష్మీ నారాయణ ,అర్జున్, నమశ్శివాయ, అప్పలరాజు, బాబూరావు, అప్పారావు, బాబు,రాము,ఉపాధ్యాయులు రెడ్డి నారాయణ రావు, వెంకటేశ్వరరావు, సుభాషిణి, వెంకటరావు, పద్మావతి ,రుషి, ఓంకార పీఠం సభ్యులు పాల్గొన్నారు.

# పేద ప్రజల కళ్ళల్లో ఆనందమే కూటమి ప్రభుత్వా లక్ష్యం

**- మునగపాక మండల టిడిపి మాజీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు**



**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేపట్టడం జరుగుతుందని మునగపాక మండల టిడిపి మాజీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొల్లల పాలెంగ్రామంలో ఎన్టీఆర్ భరోసా పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం లోనే ఎన్నికల హామీల్లో భాగంగా 3000 రూపాయలు నుండి 4వేల రూపాయలకు పెన్షన్ పెంచి రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలందరకు పంపిణీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. ఎలమంచిలి నియోజకవర్గ మునగపాక మండలం గొల్లలపాలెం గ్రామంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో పంపిణీ చేయడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొల్లి వెంకటలక్ష్మి వెంకయ్య నాయుడు . మునగపాక పిఎసిఎస్ డైరెక్టర్ మొల్లి అప్పల రాజు, చీర వెంకటలక్ష్మి ,ఆడారి గణేష్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు. పాల్గొన్నారు.

# పేదల సేవలో కూటమి ప్రభుత్వం


**- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ**




**పాడేరు రూరల్ ,ఏప్రిల్ 01 (మనసులో మాట) :** కూటమి ప్రభుత్వం పేదల సేవలో నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని, వారి అభివృద్ధే ధ్యేయమని పాడేరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్సీ, పాడేరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కావలి గ్రీష్మతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పెన్షన్ పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రతి నెలా ఒకటో తేదీననే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తోందని తెలిపారు.పండుగలు లేదా సెలవులు ఉన్నప్పుడు కూడా ఆలస్యం కాకుండా ముందుగానే పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పేదల పక్షపాత ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, వితంతువులు, వికలాంగులు, వృద్ధులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారికి ఈ పథకం ద్వారా గౌరవప్రదమైన జీవనం లభిస్తున్న ని చెప్పారు. దేశంలోనే అత్యధిక పెన్షన్ ఆంధ్రప్రదేశ్‌లోనే అందుతున్నదని పేర్కొన్నారు. అదే విధంగా 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా సామాజిక పెన్షన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నందుకు సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమం మరియు అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళున్న ప్రభుత్వం ఇది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో శ్రీపూజ, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్ర విజయరాణి, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, పాడేరు పీఏసీఎస్ చైర్మన్ దప్పోడి వెంకటరమణ, వైస్ ఎంపీపీ శివకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## జనహితమే యూజేఎఫ్ అభిమతం

### హ్యాండ్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూజే ఎఫ్ అధ్యక్షులు డా.ఎం.ఆర్.ఎన్ వర్మ



**మల్కాపురం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** జనహితమే లక్ష్యంగా నిర్వహించేహా శబల భోజనాల పండగలాంటి కార్యక్రమాలకు జర్నలిస్టుల సమూహంగా ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యుూజేఎఫ్) తమ వంతు సహకారాన్ని అందిస్తుందని, యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్. వర్మ అన్నారు. సింహాచలం గోశాల లో బుధవారం ఉదయం ప్రారంభమైన శబల భోజనాల పండుగ కార్యక్రమంలో యూజే ఎఫ్ హ్యాండ్ బుక్ 2026-27 ను విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు , నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, సింహాచలం దేవస్థానం ఈవో జె.వెంకటరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్ వర్మ మాట్లాడుతూ సమాజ హితం కోరి నిర్వహించే శబల భోజనాలు పండుగ లాంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించడంలో యూజేఎఫ్ తనవంతుగా కృషి చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జర్నలిస్టులుగా సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సంఘం యూజేఎఫ్ అని వివరించారు. కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ యూజేఎఫ్ సేవలను కొనియాడారు. యూజే ఎఫ్ హ్యాండ్ బుక్ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూజేఎఫ్ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు, ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే రాము,సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, మిల్లెట్స్ రాంబాబు, గ్రీన్ క్లైమేట్ జే. వి.రత్నం, యూజేఎఫ సమన్వయకర్త డి. ఎస్. ఎస్. ఎస్. కే.హరనాథ్, సీనియర్ జర్నలిస్టులు యూ.వి.బి. భాస్కర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు కోయిలాడ పరుశురాం, పి. సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## మంచాల గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం



**చీడికాడ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలంలో మంచాల గ్రామంలో సర్పంచ్ కశిరెడ్డి భాగ్యలక్ష్మి చీడికాడ మాజీ కో-ఆపరేటివ్ సంఘం అధ్యక్షులు కశిరెడ్డి శ్రీరామమూర్తి పైలవాని బంధ చెరువులో 60 లక్షల వ్యయంతో చేపట్టబడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించడం మాత్రమే కాకుండా, చెరువు పునరుద్ధరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, వ్యవసాయానికి అవసరమైన నీటి వనరులను బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహించబడు తోంది. అన్నారు చెరువు అభివృద్ధి పనులు పూర్త యిన తరువాత భూగర్భ జలాల స్థాయి మెరుగుపడటంతో పాటు, రైతులకు దీర్ఘకాలికంగా ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా పి ఎ సి ఎస్ మాజీ అధ్యక్షులు శ్రీరామ మూర్తి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమం తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ పనుల్లో భాగస్వామ్యం అవుతూ పథకాన్ని విజయవంతం చేయాలని, సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్పితో పాటు గ్రామ పెద్దలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు

## చట్టాలను పట్టిష్టంగా అమలు చేయాలి

**గాజువాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ 4 లేబర్ కోడ్స్ ను ఏప్రిల్ 1 నుండి అమలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా "బ్లాక్ డే" పాటించి "బ్లాక్ బ్యాడ్జి" ధరించి స్టీల్ కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలు చేయడానికి 4 లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చిందని వారు తీవ్రంగా విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12వ తారీఖున 36 కోట్ల మంది దేశవ్యాప్తంగా తమ నిరసనను తెలియజేశారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇవి అమల్లోకి రాకుండానే వీటి అమలుకు విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఒక ప్రయోగశాలగా మార్చారని వారు అన్నారు.

# అల్లూరి జిల్లాలో "మొబైల్ రికవరీ మేళా"

### - బాధితులకు రూ.7 లక్షల విలువైన 65 మొబైల్ ఫోన్లు అందజేత

**పాడేరు (టౌన్) , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అల్లూరి జిల్లా పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా బుధవారం పోలీస్ కార్యాలయంలో ఆవరణలో మొబైల్ రికవరీ మేళా''ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్, పాల్గొని, 29.10.2025, 05.01.2026 మధ్య కాలంలో పోగొట్టుకున్న 65 మొబైల్ ఫోన్లను (విలువ సుమారు రూ. 7 లక్షలు) రికవారి చేసి సంబంధిత బాధితులకు స్వయంగా అందజేశారు.



**సరిహద్దులు దాటిన గాలింపు:**

కేవలం మన జిల్లాలోనే కాకుండా, పొరుగు జిల్లాలైన తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ, ఖమ్మం ఇతర జిల్లాలతో పాటు.. ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ ప్రాంతాల నుండి జిల్లా యంత్రాంగం ఈ ఫోన్లను రికవరీ చేసిందని ఎస్పీ తెలిపారు.

**మొబైల్ ప్రాముఖ్యత - ఎస్పీ సందేశం:**

"ప్రస్తుత కాలంలో మొబైల్ అనేది కేవలం మాట్లాడటానికి ఉపయోగించే పరికరం మాత్రమే కాదు, అది మన 'పర్సనల్ ఐడెంటిటీ'గా మారిందని అన్నారు. మన ఫోటోలు, బ్యాంకింగ్ (యూపీ ఐ ), ముఖ్యమైన నోట్స్ అన్నీ అందులోనే ఉంటున్నాయని అన్నారు. బాధితుల కళ్ళలో ఆ ఆనందం చూడటమే మాకు నిజమైన సంతృ ప్తి," అని ఎస్పీ పేర్కొన్నారు.

**ఫిర్యాదు విధానం:**



మొబైల్ పోయినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

**సెయిర్ పోర్టల్:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన www .ceir. gov.in వెబ్సైట్లో " ఆప్షన్ ద్వారా ఐ ఎం ఐ నెంబర్, ఫోన్ మోడల్ వివరాలు నమోదు చేయవచ్చు, ప్రజలు ఈ విధానాల ను సద్వి నియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారి బాధితులకు వారి మొబైల్ ఫోన్లను స్వయం గా అందజేసి, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోయిన సందర్భంలో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసులు వేగంగా కేసులను పరిష్కరిస్తున్న ట్లు తెలిపారు.ఈ మొబైల్ ఫోన్ల రికవరీలో కృషి చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా పోలీస్ అధికారి అభినందించారు.

## సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా పోలీసు శాఖకు డ్రోన్ ను అందజేసిన "హీరా ఎలక్ట్రో స్మెల్టర్స్

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** జిల్లా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు, సామాజిక బాధ్యతలో భాగంగా "హీరా ఎలక్ట్రో స్మెల్టర్స్ లిమిటెడ" సంస్థ, (బొబ్బిలి) ముందుకు వచ్చి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎ.ఆర్.దామోదర్కి అందజేసారు. జిల్లా ఎస్పీ సమక్షంలో "హీరా ఎలక్ట్రో స్మెల్టర్స్ లిమిటెడ" సంస్థ, డ్రోన్ను అధికారికంగా జిల్లా పోలీసు శాఖకు అందజేశారు. జిల్లా ఎస్పీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ కుమార్ దాస్ని శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో అసాంఘిక కార్యక్రమాల కట్టడి, గుంపుల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, నేరాల నిరోధక చర్యలు, విపత్తుల సమయంలో శోధన రక్షణ చర్యలు మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున జరిగే సభలు, ఉత్సవాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా పోలీసు శాఖకు అందించిన ఈ సహకారం అభినందనీయం జిల్లా పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగాలని ఆశాభావం వ్యక్తం



చేశారు. జిల్లా ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. వితరణ చేసిన డ్రోన్ను జిల్లా ఎస్పీ బొబ్బిలి పోలీసు స్టేషన్ సిఐ కే.నారా యణరావుకి అందచేసి నేర నియంత్రణలో విస్తృతంగా వినియోగి ంచాలని ఆదేశాలు జారిచేశారు. దాతలు మాట్లాడుతూ విజయనగరం జిల్లా పోలీసులు చేపడు తున్న కార్యక్రమాలు చాలా అభినంద నియమని, సామాజిక బాధ్యతలో భాగంగా పోలీసు శాఖకు డ్రోన్ ను అందజేయడం గర్వం గా భావిస్తున్నామని, భవిష్యత్తు లో ఈ తరహాలో మరింత సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాము అని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, బొబ్బిలి పోలీసు స్టేషన్ సిఐ కే.నారాయణ రావు, ఎస్బీ సిఐ ఎ.వి. లీలారావు మరియు ఇతర పోలీసు అధికారులు, హీరా ఎలక్ట్రో స్మెల్టర్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈ నెల 27న అమ్మవారి దేవర ఉత్సవం

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01 :** ఉత్తరాంధ్రప్రజల ఆరాధ్యదైవం శ్రీపైడితల్లిఅమ్మవారి దేవరామహోత్సవం ఈనెల 27న జరుగుతుందని దేవస్థానం సహాయకమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి (ఎఫఏసి) కె.శిరీష తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పైడితల్లి ఆలయంలో ఆరోజు సాయంత్రం స్నపనం అనంతరం వనంగుడి నుండి బయలుదేరి గంటస్థంభం మీదుగా హుకుంపేటలో శ్రీఅమ్మవారి చదురు చేరుకుని 28న ఉదయానికి మూడులాంతర్లుదరి చదురుగుడికి అమ్మ వారు వేంచేస్తారని అప్పటినుండి ఉయ్యాల కంబాల



ఉత్సవం వరకు అమ్మవారుకొలువై ఉంటారని, భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ఆశీశ్శులు పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయప్రధాన పూజారి బంటుపల్లి వెంకట రావు, ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు కె.కామేశ్వరరావు. ఎల్.కుమారి, వి.వెంకటలక్ష్మి, పి.రామయ్యవంతులు, ,ఎల్.స్వాతి కుమారి,కె.తులసి, డి.పద్మావతి .కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.ఉ త్సవ ప్రతులను ఆవిష్కరించారు.

## సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహణ

### ప్రభుత్వ సేవలను సకాలంలో వినియోగించుకోవాలి: ఎంపీటీసీ కొమ్మరమ్మ

**హుకుంపేట , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలంలోని హుకుంపేట పంచాయతీలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హుకుంపేట మండల కేంద్రంలోని సచివాలయంలో పరిధిలో ఎంపీటీసీ కొమ్మరమ్మ ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ చెట్టి భారతి, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, వార్డు సభ్యులతో కలిసి పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొమ్మరమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సకాలంలో వినియోగించుకోవాలని సూచించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముందుగానే పింఛన్లు



అందజేస్తుండటంతో ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటి వెంకటరమణ,వార్డు సభ్యులు లక్ష్మణ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చింతపల్లి నియోజకవర్గ పునరుద్ధరణే మా నినాదం!

### పాలనా వికేంద్రీకరణతోనే గిరిజన ప్రగతి సాధ్యం : ఉపాధ్యాయ నేత గెమ్మెలి మోహన్ రావు

**చింతపల్లి, , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల, మన్యం పౌరుషానికి ప్రతీకగా నిలిచిన చింతపల్లి గడ్డ ఇప్పుడు తన రాజకీయ ఉనికి కోసం గళమెత్తుతోంది. గతంలో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పాడేరులో విలీనమై ఉనికి కోల్పోయిన చింతపల్లి నియోజకవర్గాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ మరియు ప్రముఖ ఉపాధ్యాయ నేత గెమ్మెలి మోహన్ రావు డిమాండ్ చేశారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా, అల్లూరి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయన, మన్యం ప్రాంతాభివృద్ధి కోసం చింతపల్లి, కొయ్యూరు మరియు గూడెం కొత్తవీధి మండలాలతో కూడిన ప్రత్యేక నియోజకవర్గమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన 'చింతపల్లి తాలూకా'గా ఈ ప్రాంతం చరిత్రాత్మక వెలుగులు విరజిమ్మిందని మోహన్ రావు గుర్తు చేశారు. నాడు పరిపాలనా కేంద్రంగా, గిరిజన సంస్కృతికి నిలయంగా ఉన్న ఈ ప్రాంతం, 1920వ దశకంలో బ్రిటీష్ వారు తమ దోపిడీ అవసరాల కోసం నిర్మించిన క్లిష్టమైన ఘాట్ రోడ్ల ద్వారా ప్రపంచానికి పరిచయమైంది. అయితే, అవే ఘాట్ రోడ్లే కాలక్రమేణా మన్యం వీరుల గెరిల్లా పోరాటాలకు వేదికలుగా మారాయి. 1922 ఆగస్టు 22న అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో చింతపల్లి పోలీస్ స్టేషన్పై జరిగిన దాడి భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక అలుపెరుగని పోరాటంగా నిలిచిపోయింది. నాడు తాలూకా హోదాలో వెలిగిన ఇంతటి ఘన చరిత్ర కలిగిన ప్రాంతం, నేడు కేవలం ఒక మండల కేంద్రంగా పరిమితమై, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పరితపించాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భౌగోళికంగా చింతపల్లి అత్యంత క్లిష్టమైన కొండకోనలతో కూడుకున్న ప్రాంతమని, సముద్ర మట్టానికి సుమారు వెయ్యి మీటర్ల ఎత్తులో ఉండే ఈ ప్రాంత ప్రజలకు ప్రస్తుత నియోజకవర్గ కేంద్రమైన పాడేరు ఏమాత్రం అందుబాటులో లేదని ఆయన విశ్లేషించారు. ముఖ్యంగా కొయ్యూరు మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల నుండి పాడేరుకు చేరుకోవాలంటే సుమారు 150 నుండి 200 కిలోమీటర్ల మేర అత్యంత కఠినమైన ఘాట్ రోడ్లపై ప్రయాణించాల్సి వస్తోందని, అత్యవసర వైద్యం లేదా చిన్నపాటి ప్రభుత్వ పనుల కోసం గిరిజనులు తమ నిలువ నీడను వదిలి రోజంతా వెచ్చించాల్సి వస్తోందని మోహన్ రావు వివరించారు. పాడేరు నియోజకవర్గం విస్తీర్ణం పరంగా రాష్ట్రంలోనే అతి పెద్దది కావడంతో అభివృద్ధి నిధుల కేటాయింపు లోనూ, ఎమ్మెల్యే పర్యవేక్షణలోనూ చింతపల్లి, కొయ్యూరు మరియు గూడెం కొత్తవీధి వంటి ప్రాంతాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆక్షేపించారు.



ఆంధ్రా కాశ్మీర్ లంబసింగి, రమణీయ మైన కొత్తపల్లి జలపాతాలు, అపాం మైన కాఫీ, మిరియాల పంటల సంపద ఉన్న ఈ భౌగోళిక ప్రాంతం ప్రత్యేక నియోజకవర్గం అయితేనే పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ లో చింతపల్లిని విడదీసి పాత నియో జకవర్గాన్ని పునరుద్ధరించడం ద్వారానే అడవి బిడ్డల ఆత్మగౌరవానికి, రాజకీయ హక్కులకు భరోసా లభిస్తుందని, తద్వారా పాలన ప్రజల చెంతకు చేరుతుందని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి రాబోయే పునర్విభజన లో చింతపల్లిని ప్రత్యేక నియోజ కవర్గంగా ప్రకటించి, మన్యం ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని ఈ సందర్భంగా మోహన్ రావు ప్రభుత్వా నికి, ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

## శారదానది వినాయక ఘాట్ వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలి

### - జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి కి పర్యావరణ పరిరక్షణ అవార్డు గ్రహీత ఆడారి కుమారస్వామి వినతి

**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** అనకాపల్లి శారదానది ఒడ్డున ఉన్న వినాయక ఘాట్ వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని పర్యావరణ, పరిరక్షణ అవార్డు గ్రహీత, వినాయక ఉత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఆడారి కుమార్ స్వామి అన్నారు. బుధవారం జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి కి వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ శారదానది వద్ద నిత్యం పూజలు చేసే భక్తులు వాడిన పాలిథిన్ బ్యాగ్స్, ప్లాస్టిక్ సామగ్రి పడవేయడం వల్ల పర్యావరణానికి ఎంతగానో ముప్పు వాటిల్లుతుందన్నారు. జీవీఎంసీ నిరంతరం కొన్ని ప్రాంతాల్లో ప్రచార కార్యక్ర మాలు చేస్తున్నప్పటికీ చెత్తాచెదారం వేయడం మానలే దన్నారు. అందుకే ఈ ప్రాంతంలో ఐరన్ డస్ట్ బిన్ ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని వారు సూచించారు. ఇప్ప టికే స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి



ఈ విషయం తీసుకురావడం జరిగిం దన్నారు .అనంతరం జోనల్ కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ గతంలో కూడా ఈ సమస్యలు తమ దృష్టికి తీసుకు రావడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్క రిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు పి. సోమశేఖర్ పట్నాయక్, కొణతాల హరినాథ్ బాబు, వేగి కార్తీక్, మల్ల భోగ లింగం, ఆళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముఖ్య కేంద్రాలు వద్ద చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ఎన్. రాయవరం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** వేసవి తీవ్రత పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎస్. రాయవరం మండలంలోని 28 గ్రామ పంచాయతీలలోని ప్రధాన సెంటర్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని డిప్యూటీ ఎంపిడిఓ సత్యనారాయణ సూచిం చారు. బుధవారం దార్లపూడి గ్రామంలో గ్రామసర్పంచ్ సుభా షిణితో పాటు సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు .త్రాగు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామీణ



నీటి సరఫరా అధికారులుతోసమన్వయం చేసుకోవాలని కోరారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి త్రాగు నీరు కి సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందిం చాలని ,చేతి పంపులు మరమ్మతులు కోసం మండల పరిషత్ సిబ్బందిని సంప్రదించాలని డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. దార్ల పూడి లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎం. సుభాషిణి, ఉప సర్పంచ్ పి. శ్రీను, పంచాయతీ కార్యదర్శి వి. గంగరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్.ఐ. షణ్ముఖరావు

**జియ్యమ్మవలస , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** వీరఘట్టాం గ్రోమోర్ సెంటర్ వద్ద బొడ్లపాడు గ్రామానికి చెందిన సంతోష్ అనే దివ్యాంగుడు ప్రమాదవశాత్తు కాలువ పై పడిపోయాడు. తలకు గాయమై తీవ్రంగా రక్తస్రా వం అయింది. అక్కడ ఉన్న చాలామంది ఈ విషయాన్ని గమనించారు అయితే ఎవరు పట్టించుకోలేదు. అటువైపుగా జీపు లో వెలుతున్న వీరఘట్టం ఎస్.ఐ షణ్ముఖరావు ఈ ప్రమాదాన్ని గమనించి తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుడు ను పరిశీలించారు. వెంటనే 108 వాహనం కు ఫోన్ చేసారు. 108 వాహనం లో క్షతగాత్రుడు ను ఎక్కించి ప్రదమ చికిత్స చేయించారు. అనంతరం క్షతగాత్రుడు ని వైద్య చికిత్సలు కోసం వీరఘట్టం PHC కి పంపించారు. ప్రమాదానికి గురైన వ్యక్తి వీరఘట్టం మండలం బొడ్లపాడు



గ్రామానికి చెందిన పొన్నాడ సంతోష్ గా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. ప్రమాదానికి గురైన దివ్యాంగుని విషయంలో సకాలంలో స్పందించి వైద్య చికిత్సలు అందజేసేలా చేసిన ఎస్ఐ షణ్ముఖరావు ను పలువురు అభినందించారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## ప్రజలు అబ్బురపడే అభివృద్ధితో మునగపాక మేజర్ పంచాయతీని అభివృద్ధి చేశా

- అన్ని రంగాలలో మౌలిక వసతులు కల్పించి ప్రజలు ఇచ్చిన తీర్పుకు రుణం తీర్చుకున్న
- ఐదేళ్లపాటు గ్రామ సర్పంచిగా కాకుండా శ్రామికుడిగా పని చేశా
- మేజర్ పంచాయతీ మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు



**మునగపాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** మండలం కేంద్రం మునగపాక మేజర్ పంచాయతీని అన్ని రంగాల్లోనూ మౌలిక వసతులు కల్పించి గత పంచాయితీ ఎన్నికల్లో అఖండ మెజార్టీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకోవడానికి తన శక్తివంతం లేకుండా ఒక సర్పంచ్ గా కాకుండా ఒక శ్రామికుడిగా ఐదేళ్లపాటు పారిశుధ్య కార్మికులతో పాటు సమానంగా పనిచేసే గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దానని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. ఐదేళు పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 8 కోట్ల రూపాయలతో గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, పంచాయతీ పాలకవర్గం, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాసాకారంతోనే ఇంత అభివృద్ధి చేయడానికి కారణమని అన్నారు. మునగపాక లోని ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ, మెయిన్ రోడ్, ఎన్టీఆర్ కాలనీలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ ఏర్పాటు చేసి ప్రజలందరికీ పూర్తిస్థాయిలో మంచి నీటిని అందించడం జరిగిందని అన్నారు. 14, 15 ఫైనాన్స్ నిధులతో సుమారుఐదు కోట్లతో గ్రామంలోని సిసి రోడ్లు, డ్రైన్లు వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇందిరమ్మ కాలనీలో అతి ప్రమాదంగా ఉండే రోడ్డును 26 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల నేడు సిసి రోడ్ ఏర్పాటు చేయడానికి సులభతరం అయిందని అన్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సహకారంతో కోటి ముప్పై లక్షల రూపాయలతో జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ, లింక్ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామంలో ఉన్న నాలుగు స్మశాన వాటికలను అభివృద్ధి చేయడంతో పాటు స్మశానం చుట్టూ రక్షణ గోడలు నిర్మించడం జరిగిందని తెలిపారు. లారెన్స్ కంపెనీ సహకారంతో సంతబైల మార్కెట్ యార్డ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే ఏసియన్ పెయింట్స్ వారి సహకారంతో 35 లక్షలతో సాగునీటి కాలువలకు నూతనంగా రెగ్యులేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి నిధులతో గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టడం జరిగిందని అన్నారు. నా జీవితంలో అట్టడుగు స్థాయిని ఉన్న నన్ను ఒక గ్రామ ప్రథమ పౌరుడు గా నిలబెట్టిన ఘనత అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్పిపి అధ్యక్షుడు బొడ్డేడు ప్రసాద్ కి దక్కుతుందని ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా తన అభిమానాన్ని చాటుకున్నారు. ఐదేళ్లపాటు గ్రామ అభివృద్ధి గురించి శ్రమించే అని తప్పించి ఎటువంటి తప్పుడు నిర్ణయాలు చేయడానికి అంగీకరించలేదని, చిన్న చిన్న పొరపాట్లు ఉంటే నన్ను క్షమించాలని సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా ఎన్టీఆర్ పింఛన్

- రాష్ట్ర వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి. సుబ్బారావు



**దుంబ్రిగుడ , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పేద ప్రజలకు కొండంత ఆర్థిక భరోసా ఎన్టీఆర్ భరోసా పింఛన్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు అన్నారు. మండలంలోని సొవ్వ పంచాయితీ సాగర్ వలస గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంత ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి, సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేసే ప్రసక్తి లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ విషయంలో కూడా రాజీ పడకుండా తనదైన శైలిలో భావితరాల యువత భవిష్యత్తు కోసం ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. మహిళలకు రక్షణ, యువతకు ఉపాధి, పేదలకు ఆర్థిక భరోసా, పిల్లలకు తల్లికి వందనంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కమ్మిడి భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె. రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ పండుగ

- ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

**రంపచోడవరం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పోలవరం జిల్లా రంపచోడవరం లో అత్యంత పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే , రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. గంగవరం మండలం జడేరు గ్రామంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకట రెడ్డి సౌజన్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు చాలా భరోసాగా ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితులు ఉన్నా పింఛన్లు సకాలంలో పారదర్శకంగా పంపిణీ చేస్తున్న ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని కొనియాడారు. త్వరలో అర్హులైన అందరికీ కొత్తగా పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 22 నెలల కాలంలో రూ; 60,437 కోట్ల రూపాయలు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో పలు సమస్యలపై గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె సంబధిత అధికారులకు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఆయా అధికారులు పనిచేయక పోతే మరలా తనకు చెప్పాలని సూచించారు. గ్రామస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా స్థానిక నాయకత్వం ద్వారా పరిష్కారం చేసుకోవాలని అప్పటికే కాకపోతే తన దృష్టిలో పెట్టాలని సూచించారు. అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలి ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని రంప చోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు ప్రజలు పలు విషయాలు ఆమె దృష్టిలో పెట్టారు. దీంతో స్పందించిన ఆమె ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యాలయాలకు వివిధ రకాల పనులు కోసం వచ్చే ప్రజలతో సౌమ్యంగా ఉండాలని ఆదేశించారు. సాధ్యమైనంత



వరకూ ఆయా సమస్యలు పరిష్కారంపై క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. ఎప్పటికి పరిష్కారం అవుతుందో తెలియ జేయాలని కాని పక్షంలో ఎందుకు పరిష్కారం కాదో ఎక్కడ పరిష్కారం దొరుకుతుందో వారికి తెలియజేయాలని ఆదేశించారు. అలా కాకుండా పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని ఆదేశించారు. చాలా మట్టుకు మండల స్థాయిలో అయ్యే పనులు కూడా చేయకుండా కాలయాపన చేసే అధికారులు తీరు మారాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, మొల్లేరు సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, రాష్ట్ర తెలుగు రైతు విభాగం నాయకులు కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ కోసు ముసలయ్య ,మండల పార్టీ ఉపాధ్యక్షులు గండేపల్లి శ్రీను , మాజీ ఎంపీటీసీ ఎలుబండి బుల్లమ్మ, మాజీ సర్పంచ్ మడకం వెంకటరమణ ,బూత్ కన్వీనర్ పల్లాల వీరభద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ మద్దీటి వెంకటరెడ్డి , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, మాజీ సర్పంచ్ మడకం సత్యవతి, కూటమి నాయకులు కారం సత్యనారాయణ, కోసు మధు, సీనియర్ నాయకులు మధు వీటి శివరామ భూపతి దేవ్, మాజీ సర్పంచ్ నర్సి సూరమ్మ , బూత్ కన్వీనర్లు గడుతూరి నాగేశ్వరరావు, యాట్ల రమేష్ , సారపు సత్యవేణి, పామర్తి వీరబాబు , మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, మాజీ సర్పంచ్ సారపు నారాయణరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు కుంజం సిద్దు , బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పుట్టపల్లి నీలాలమ్మ, బీజేపీ నాయకులు కుంజం వెంకటేశ్వర్లు, తహసిల్దార్ చిన్నం శ్రీనివాసరావు, ఎంపీడీఓ వై.లక్ష్మణ రావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

**కంచరపాలెం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జిల్లా ముఠా కార్మిక సంఘం ( ఏఐటీయూసీ) యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం మన్మధరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం జిల్లా ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పూర్ణ మార్కెట్ జంక్షన్ లో కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను యజమానులకు ఊడిగం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాటాలు ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చి నేటి నుంచి దేశంలో అమలు చేయడానికి





పూనుకుంటుందన్నారు. ఇది ముమ్మాటికి కార్మికులకు ద్రోహం చేయడమే అని విమర్శించారు. వీటికి వ్యతిరేకిస్తూ దేశంలోని కొట్లాదిమంది కార్మికులు బ్లాక్ డే నిర్వహిస్తున్నారన్నారు. 1926 లోనే బ్రిటిష్ వాడికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సంఘాలు పెట్టుకునే హక్కును సాధించుకున్నారని తెలిపారు. 140 సంవత్సరాల క్రితమే 8 గంటల పని దినాన్ని ప్రాణాలు అర్పించి కార్మికుల సాధించుకున్నారని, నేడు కేంద్ర ప్రభుత్వం సంఘాలు పెట్టుకునే,సమ్మె చేసే హక్కులని లేకుండా చేయడానికి యజమానులకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని తెలియజేశారు. వీటిని పోరాటాల ద్వారానే కార్మికులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నిరసనలో మేస్త్రిలు బి సాంబయ్య, ఆదినారాయణ, కృష్ణారావు, ఏ పైడ్రాజు, ఎం శ్రీనివాసరావు తదితరులతో పాటు కళాసిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు పెన్షన్ పంపిణీ చేసిన ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు

**నెల్లిమర్ల , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్‌లను,లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి స్వయంగా అందజేసిన ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ ఒ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ, చేనేత కార్మికులు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షకులని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్ గారు ‘కూడు’ ‘గూడు’ ‘గుడ్డ ‘అనే నినాదంతో చేనేతరంగానికి ఎంతో అండగా నిలిచారని, నాడు కూటమి ప్రభుత్వ హయంలో చేనేత రంగం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి లక్ష నాలుగు వేల చేనేత కుటుంబాలకు మేలు కలిగించే ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఈ



పథకం ద్వారా చేనేత కార్మికుల భారం తగ్గి, వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కుమిలి గ్రామంలో చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను పరిశీలించి,కార్మికుల అసాధారణ ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా వారు తెలిపిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం చూపుతాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏ ఎం సి చైర్మన్ దల్లి ముత్యాలరెడ్డి, మాజీ చేనేత సొసైటీ ప్రెసిడెంట్ లక్ష్మణరావు, యూనిట్ ఇంచార్జ్ మద్దిల మురళి , యువనాయకులు దల్లి గౌతంరెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్కిరెడ్డిపాలెంలో ఎల్ఐసి ఏజెంట్ పై యాసిడ్ దాడి

**గాజువాక, ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఇంటి బయట కూర్చుని మొబైల్ చూస్తుండగా వెంకట ప్రసాద్ ఆలియా సూర్య అనే ఎల్ఐసి ఏజెంట్ పై గుర్తు తెలియని వ్యక్తి యాసిడ్ తో దాడి చేయగా భుజం ఛాతిపై స్వల్ప గాయాలయ్యాయి. గతంలో మార్చ్ 20న ఇదే తరహాలో దాడి జరిగినట్టు సమాచారం తెలుస్తుంది. ఇప్పటికే గతంలో జరిగిన దాడి పై గాజువాక స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఇది రెండోసారి జర గడం భయాందోళనకు గురిచేస్తుందనికుటుంబసభ్యులు భయం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పోలీసులు ఈఫిర్యాదు పై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని పోలీసు వారికిప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.గాజువాక ప్రయివేట్



ఆసుపత్రి లో వెంకటప్రసాద్ చికిత్స పొందుతున్నాడు. గాజువాక పోలీసు లుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన హోం మంత్రి అనిత

- వంటశాలను సందర్శించి,ఆహార నాణ్యతను పరిశీలించిన మంత్రి
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన హోం మంత్రి

**నక్కపల్లి , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై స్వయంగా పరిశీలన చేపట్టారు. ముఖ్యంగా వంటశాలను సందర్శించిన మంత్రి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ, వారికి అందుతున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరో తరగతి చదువుతున్న ప్రవీణ్ అనే విద్యార్థికి స్వయంగా ప్లేట్లో భోజనం కలిపి,గుడ్డు కూడా వలిచి ఇచ్చారు. భోజనం చేస్తున్న సమయంలోనే పాఠశాలలో మౌలిక వసతులు ఎలా



ఉన్నాయో విద్యార్థులను ప్రశ్నించి వివరాలు సేకరి ంచారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కొంతమంది విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. పాఠశాలల్లో శుభ్రత, క్రమశిక్షణ, మరియు నాణ్యమైన ఆహారం అందించడం అత్యంత ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు.

## 87వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం

- ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్)

**గాజువాక , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధి వడ్లపూడిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మరియు రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జగన్ పాల్గొని లబ్దిదారులకు పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామ/ వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి నేరుగా అందిస్తున్నారు. పేదల సంక్షేమం కోసం



ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, మాజీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజన్ రాజు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, పావాడ రమణమూర్తి, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ , జాన్ రమేష్ భాగ్య లక్ష్మి,కళ్యాణ్ చెక్రవర్తి, గండేపల్లి రాము,సచివాలయం సిబ్బంది, పవన్ కుమార్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చింతాలమ్మ అమ్మవారి ఆలయ పందిరి నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు.. గాంధీ విగ్రహం వద్ద నిరసన

**కంచరపాలెం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** స్థానిక 56వ వార్డు, దయానందనగర్ లోని రాజీవ్ కాలనీలో వెలిసిన చింతాలమ్మ అమ్మవారి ఆలయ పందిరి నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదని బిజెపి రాష్ట్ర కో కన్వీనర్ విజయ శంకర్ ఫణిందర్, రాష్ట్ర నాయకులు మాధవి లత అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహ వద్ద జరిగిన ధర్నా సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త జోగి నాయుడు, అతని అనుచరులు శ్రీ చింతాలమ్మా అమ్మవారు ఆలయము వద్ద పందిరి వేయనివ్వకుండా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నడుపుతున్న ఆలయాన్ని ఇబ్బందులను గురి చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోని, ఆలయ అభివృద్ధి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మం కోసం ఒక వైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోరాడుతుంటే, కూటమిలో ఉన్నవారు ఈ విధంగా వ్యవహారించడం తగదని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా దేవాలయం నిర్మించుకొని పూజలు చేస్తున్న కుటుంబంపై స్థానిక మాజీ కార్పొరేటర్



రాజశేఖర్, అతని అనుచరులు కక్షగట్టి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో ఉన్న చింతాలమ్మ గుడి ఆక్రమించుకొని ప్రయోజన పొందాలని ఉద్దేశంతో కొందరు వ్యక్తులచే కార్పొరేటర్ ఇలా చేయిస్తున్నారని స్థానిక నేత మహాలక్ష్మి తెలిపారు. ఆలయ పందిరి నిర్మాణానికి అడ్డు చెప్పవద్దని ఎమ్మెల్యే గణబాబు చెప్పినప్పటికీ కార్పొరేటర్ అడ్డు తగలడంపై ఆమె మండిపడ్డారు. ధర్నాలో ఆలయం ధర్మ కర్త పెద్దాడ గంగమ్మ, స్థానిక నాయకులు విశ్వనాధం ఎన్ వి ఎస్ రామారావు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు సవరాలు రమేష్, నందికొల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తలపడేది వీరే

అభ్యర్థుల లిస్టును విడుదల చేసిన ఎన్నికల అధికారి

**కంచరపాలెం , ఏప్రిల్ 01 (మనసులో మాట) :** ఈ నెల 10న జరగనున్న విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నికలలో పోటీ చేస్తున్న వారి లిస్టును ఎన్నికల అధికారి విడుదల చేశారు. గత నెల మార్చి 28న ఫైనల్ లిస్టు రెడీ కాగా, 30వ తేదీ వరకు విత్డ్రావెల్ కు ఎన్నికల అధి కారి అవకాశం ఇచ్చారు. అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెం ట్ పోస్ట్ కి అభ్యర్థులుగా నమ్మి సన్యాసిరావు సన్నీ యాదవ్, శిష్ట శ్రీనివాసమూర్తి (వాసు), ఎమ్ సుబ్రహ్మణ్య మాధవ్, వైస్ ప్రెసిడెంట్ పోస్ట్ కి భాగ్యలక్ష్మి సిమ్మా, మీనాక్షి పీలా, శైలజ ప్రకృతి, జనరల్ సెక్రటరీ పోస్ట్ కి వివిఎస్ఎ గోవిందరావు, పీ రవీంద్రనాథ్, ఏ వెంకట సోమేశ్వరరావు, వి వెంకట సుధాకర్, జాయింట్ సెక్రెటరీ పోస్ట్ కు సింగంశెట్టి ఆర్ పి. దర్శక్, రామిరెడ్డి గాలి, ట్రెజరర్ పోస్టుకి బాలకృష్ణ సనపల, బోసు బాబు టి, సూరిబాబు నీరుయోగి, వి ఎల్ నారాయణరావు ఎడ్ల, ఉమా రాజ్యలక్ష్మి డి, లైబ్రరీ సెక్రెటరీ పోస్ట్ కు బాల రాణి చవిటిపల్లి, వి ఎన్ ఎల్ అరుణ్ కుమారి గండి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ పోస్ట్ కు కే ఏ హుస్సేన్ సయ్యద్, సురేష్ బాబు వేల్పుల, 30 సంవత్సరాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ కి గంగాధర్ చింత, గోవిందరెడ్డి గొరుసు, 20 సంవత్సరాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ కి వీ శివ ప్రసాద్, యు శ్రీనివాసరావు, జూనియర్ ఎగ్జిక్టివ్ పోస్టులకు బి అజయ్ కుమార్, భాను ప్రకాష్, కిరణ్ కుమార్, పావెల్ , రవి రాజు, సత్యనారాయణమూర్తి, సత్య వెంకట



రమణమూర్తి, శ్రీనివాసరావు సిహెచ్, సూర్య ప్రకాష్, త్రివేది నాయుడు పోటీ పడుతున్నారు. మేరకు బుధవారం ఎలక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్షన్ నిమిత్తం సమర్పించవలసిన పత్రాలు సరిగా లేనందువలన ఒక ప్రెసిడెంట్ అభ్యర్థిని, ఒక వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిని, 10 సంవత్సరాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ కేటగిరిలో ఒక అభ్యర్థిని, ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఇద్దరు అభ్యర్థుల్ని ఎలక్షన్ లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించామని తెలిపారు. ఎలక్షన్ ప్రశాంతంగా జరగడానికి విశాఖ బార్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని కోరారు. స్క్రూటినీ సందర్భంలో ఎలక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డిపై కొందరు ఒత్తిడి తీసుకువచ్చిన ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఫైనల్ లిస్టు ప్రకటించడం పట్ల బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణ
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు

గురువారం 2 ఏప్రిల్ 2026




# మండుతున్న ఎండలు

- ▶▶ ఉక్కపోత... దోమల మోత
- ▶▶ చిన్నారులు వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి
- ▶▶ 40 డిగ్రీలకు చేరువలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ▶▶ రాత్రి పూటా పెరుగుతున్న టెంపరేచర్
- ▶▶ వాతావరణ మార్పులతో వ్యాధులకు అవకాశం



**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 1..** ఏప్రిల్ నెల ఆరంభం లోనే ఎండలు మండుతున్నాయి. ఉక్కపోత తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రత లు ఎక్కువగా పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. వడగాలులు వీస్తాయి. ప్రజలు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉంటూ, ఎండ నుంచి తమను తాము కాపాడుకోవాలి. తూర్పు గోదావరి, డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి ప్రారంభం కాకముందే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీల మేర ఎకువగా రికార్డవుతున్నాయి. తేమ శాతం తగ్గడంతో జనం ఉకపోతతో ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈసారి అప్పుడే భానుడు విశ్వరూపం చూపుతున్నాడు. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు ఉకిరిబికిరి చేస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో భగభగ మండుతున్న ఎండని చూసి ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఏప్రిల్ లోనే ఎండలు ఇలా ఉంటే వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు లో 37 డిగ్రీలు, మండపేటలో 36.9, నిడదవోలు, రాజమహేంద్రవరంలో 36.6 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.8 డిగ్రీలకు చేరుకున్నాయి. మార్చి 1 నుంచి ఇప్పటి వరకు 30 రోజుల్లో 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. గతేడాది మార్చిలో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే రికార్డ్ అయ్యాయి. మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరిగిపోతున్నాయి. మండే ఎండలకు తోడు గాలిలో తేమ శాతం కూడా పడిపోతున్నది. ఈ రెండు జిల్లాలో కరెంట్‌కు డిమాండ్ పెరిగిపోయింది. ఎండలు విపరీతంగా కొడుతుండటంతో విరివిగా విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారు. గత నెలలో రోజుకు 8 మిలియన్ యూనిట్ల కరెంట్ వాడగా, ఇటీవల 9 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఎండలు, ఉకపోత ధాటికి తాళలేక ప్రజలు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఈ నెలాఖరులో 10 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండల వల్ల మండపేట లో దోమలు విపరీతంగా పెరిగి పోయాయి. దీంతోపాటు సీజనల్ వ్యాధులు కూడా దరి చేరే ప్రమాదం ఉంది. జ్వరం, జలుబు, అతిసారం, నీళ్ల వీరేచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో వచ్చే ఆటలమ్మ(చికెన్ పాక్స్), కామెర్లు వచ్చే ఆసారం ఉంది. గవద బిళ్లలు, టైఫాయిడ్ , పొంగు కూడా వ్యాపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఎండలు ఎకువగా ఉండటంతో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఆరు బయట పనిచేసే వారు సూర్యరశ్మి కాపాడుకునేలా జాగ్రత్త పడాలి. తరుచూ నీళ్లు తాగాలి. ఎకువగా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు లాంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. తెలుపు రంగు, లేత రంగులు పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలి. తలకు వేడి తగలకుండా టోపీ పెట్టుకోవాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగితే వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. చంటిపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వడగాల్పులకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి. కాఫీలు, టీలు అధిక వేడి సమయంలో తీసుకోకూడదు.కాలం మారుతుండటంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. నీరు ఎంత ఎకువ తీసుకుంటే అంత మంచిది. ఎండలో ఎకువగా తిరిగితే డయేరియా రావొచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. రానున్న రోజుల్లో వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి.



## ఇంటి వద్దే పెన్షన్ పంపిణీపై

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని 14వ స్వర్ణ వార్డు, ప్రకాష్ నగర్-01 ప్రాంతంలో లబ్ధిదారులను ప్రత్యక్షంగా కలుసుకుని, పెన్షన్ సొమ్ము సక్రమంగా ఇంటి వద్దనే అందుతోందా లేదా అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక దానవాయి పేటలో పాన్ షాప్ నిర్వహిస్తున్న కూరపాటి ధనలక్ష్మికి సంబంధించిన దివ్యాంగ పెన్షన్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి.. పెన్షనర్ ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితి, జీవనోపాధి గురించి వివరాలు తెలుసుకుని, స్వయం ఉపాధి ద్వారా ముందుకు సాగుతున్నందుకు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,69,753 మందికి రూ.118,56,75,000లను ఏప్రిల్ 1న పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 22 మండలాలు, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థతో పాటు 3 పురపాలక సంఘాల పరిధిలో లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ జరుగుతోందన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలో 2,37,032 మంది (88 శాతం) లబ్ధిదారులకు రూ.103,62,54,000లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి కూడా త్వరితగతిన పెన్షన్ అందించేందుకు క్షేత్రస్థాయిలో పీడీవోలు పని చేస్తున్నారని తెలిపారు.

**సీఎం కు కృతజ్ఞతలు తెలిపిన ధనలక్ష్మి..**

ఈ సందర్భంగా లబ్ధిదారురాలు కూరపాటి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం తన ఇంటి వద్దనే పెన్షన్ అందించడం ఎంతో సౌకర్యంగా ఉందని, ఈ నెల స్వయంగా కలెక్టర్, కమిషనర్ వచ్చి అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేలు తన జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డీఆర్‌డీఏ పీడీ బీ నగేష్, ఆర్ఎంసీ కార్యదర్శి శైలజ వల్లి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ గా భాధ్యతలు స్వీకరించిన...

# ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం ఉదయం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో ఫైలు పై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను కలెక్టర్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందించారు. నూతన కలెక్టర్ ప్రసాద్ కాకినాడ జిల్లా వివరాలను అధికారులు అడిగి తెలుసు కున్నారు.ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అములు తో పాటు కాకినాడ జిల్లా లో ఎక్కువ శాతం వ్యవసాయం పై రైతులు ఉన్నారు గాబట్టి వారికి ఏవిధం సహా సహకారం అందివ్వాలో అలోచించి వ్యవసాయం అభివృద్ధి కి తొర్పాటు చేస్తన్నారు. అలాగే విశాఖపట్నం జిల్లా లో 6 నెలలు తాను ఇంచార్జి కమిషనర్ గా కూడా ఉన్నానని దీనితో అర్బన్ డవలప్మెంట్ అవగాహనా ఉంది కాబట్టి పట్టణాల అభివృద్ధి పై కూడా దృష్టి పెట్టి వాటి అభివృద్ధి కి కృషి చేస్తానని ఇంకా అవసరం అయితే పాత కలెక్టర్ షణ్ముహన్ సగిలి సలహాలు సూచనలు తీసుకొనడటం తో పాటు జిల్లా లోని ప్రజా ప్రతినిధులు సూచనల తో జిల్లా ని అభివృద్ధి పదం లోకి నడిపిస్థానని నూతన కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ తెలిపారు.

# ఇసుకను అడ్డంగా బొక్కేస్తున్నారు..

- శృతిమించిపోతున్న ఈవీఎం ఎమ్మెల్యే ఇసుక అక్రమ వ్యాపారం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం.. కళ్ళు మూసుకున్న అధికార యంత్రాంగం
- కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈవీఎం ఎమ్మెల్యే
- కోటిలింగాల పేట ఇసుక ర్యాంపుల రహదారిపై ధర్నా
- 'సేవ్ మల్లయ్య పేట' నినాదంతో స్థానికులతో కలిసి వైసీపీ శ్రేణులతో మాజీ ఎంపీ భరత్ నిరసన
- చర్యలు తీసుకుంటారా..ఉద్యమాన్ని ఉధృతం చేయమంటారా?




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** గోదావరి నది గర్భాన్ని తొలిచేస్తూ, గామన్ బ్రిడ్జి, ధవళేశ్వరం బ్యారేజ్ లకు ప్రమాదం కలిగే విధంగా నగర ఈవీఎం ఎమ్మెల్యే ఇసుక దోపిడీ చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి , మాజీ ఎంపీ భరత్ రామ్ తీవ్రంగా విమర్శించారు. కోటిలింగాల ఇసుక రాంపులకు సంబంధించి ఇసుక లారీలు రాకపోకలు సాగించే మల్లయ్య పేట పేపర్ మిల్లు టింబర్ డిపో వద్ద రహదారిపై స్థానికులు, వైసీపీ శ్రేణులతో కలిసి మాజీ ఎంపీ భరత్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా "ఇదేమి రాజ్యం దోపిడీ రాజ్యం, ఆదిరెడ్డి ఆరాచకాలు సిగ్గు, సిగ్గు, నగరంలో ఇసుక లోడు లారీలు నిషేధించాలి, సేవ్ మల్లయ్య పేట" నినాదాలతో హోరెత్తించారు. కాతేరు, రాజమండ్రి ప్రధాన రహదారిపై ధర్నా వల్ల సుమారు గంట పాటు ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ గోదావరి నదిలో బోటు మెన్లు సొసైటీల ముసుగులో డ్రెడ్జింగ్ బోట్లతో ఇష్టానుసారం తవ్వి వందల లారీలతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ ఈవీఎం ఎమ్మెల్యే అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈవీఎం ఎమ్మెల్యేకు అన్నిట్లోనూ ధన దాహం ఎక్కువైందని, నిత్యం కాసుల వర్షం కురుస్తోందని మండిపడ్డారు. గత రెండేళ్ల కాలంలోనూ మల్లయ్య పేట వాసులు దుమ్ము దూళితో ఊపిరితిత్తుల, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని, ఇసుక లోడు లారీల వల్ల ప్రమాదాల జరుగుతున్నాయని, అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల సమస్యలను, ఇబ్బందులను పట్టించుకోకపోవడంతో స్థానికులు ఈ రోజు రోడ్డు మీదకు వచ్చారని ఆయన అన్నారు. నిత్యం ఐదారువందల ఇసుక లోడు లారీలు తిరుగుతున్నాయని, లక్షల రూపాయలు సీనరేజీ రూపంలో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఆరోపించారు. కోటిలింగాల పేట ప్రాంతంలో నేడు 15 ఇసుక ర్యాంపులు ఉన్నాయని, వాటిలో రెండింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయని మిగతా అన్ని కూడా అక్రమంగా నడుస్తున్నాయని ఆరోపించారు. రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులు కళ్ళు మూసుకున్నారని దుయ్యబట్టారు. పేరుకు ఉచిత ఇసుక అంటున్నారని అయితే వేల రూపాయలకు అక్రమంగా అమ్ముకుంటున్నారని, ప్రజలను దో చు కుం టు న్నా ర ని విమర్శించారు. రాత్రులు, పగలు తేడా లేకుండా డ్రెడ్జింగ్ చేస్తున్నారని, సమీప గామన్ బ్రిడ్జికి ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గామన్ బ్రిడ్జికి అటు ఇటుగా రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు విభజించుకుని వీరిద్దరి అనుచరులు, మాజీ కార్పొరేటర్లు ఇసుకను అక్రమంగా దోచుకుంటున్నారని విమర్శించారు. నదీ గర్భం తొలిచేస్తూ పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఇసుక అక్రమ తవ్వకాలు, దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు, సంబంధిత మైన్స్ అధికారులకు మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు. వారం రోజుల వ్యవధిలో ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాలను నియంత్రించాలని..లేదంటే తాను ప్రజల పక్షాన ఆందోళనను ఉధృతం చేస్తామని, అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరంలో ఇసుక లారీలు రాకుండా అడ్డుకోవాలని పలువురు స్థానిక మహిళలు కోరారు.

# జిల్లాలో 2,56,935 మందికి రూ.112.89 కోట్ల రూపాయల పెన్షన్ల పంపిణీ

- ఏలూరు 35వ డివిజన్ లో సామజిక పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, ఏప్రిల్, 1(మనసులో మాట)..** ఏలూరు జిల్లాలో ఏప్రిల్ నెలకు గాను 2 లక్షల 56 వేల 935 మందికి 112. 89 కోట్ల రూపాయలను సామజిక పెన్షన్లుగా పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక 35వ డివిజన్ లోని కంకణాల వీధిలోని పేదలకు బుధవారం సామజిక పెన్షన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద జిల్లాలోని 2,56,935 మందికి రూ 112.89 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నామని,ఇందుకు జిల్లాలో 5016 మంది వార్డు, గ్రామ సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లు పంపిణీ పక్కా ఏర్పాట్లు చెయ్యడం జరిగిందన్నారు. 1వ తేదీనే నూరుశాతం పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులు వారి ఇండ్లలో అందుబాటులో ఉండేలా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ముందస్తు సమాచారం అందించామని తెలిపారు.కదలలేని వృద్దులు, దివ్యంగులకు వారి ఇంటివద్దనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు.

# పన్ను వసూళ్లలో ఆర్ఎంసీ రికార్డు

- ఒక్క రోజే రూ. 5.12 కోట్లు వసూలు
- కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఆస్తి పన్ను వసూళ్లలో ఆర్ఎంసీ రికార్డు స్థాయి వసూళ్లు సాధించినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నగర వ్యాప్తంగా 82.41 శాతం పన్నులు వసూలైనట్లు వెల్లడించారు. చివరి రోజున మంగళవారం ఒక్కరోజే రూ. 5.12 కోట్ల వరకు వసూలైనట్లు తెలిపారు. గతేడాది రూ.75.24 కోట్లు వసూళ్లు కాగా.. ప్రస్తుత ఏడాది ఇప్పటి వరకు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు రూ.78.72 కోట్లు., నీటి ఛార్జీల కింద రూ.10.78 కోట్లు వసూలు అయిందన్నారు. ప్రైవేట్ ఆస్తి(నివాస, వాణిజ్య) పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక, రోజువారీ సమీక్షలు, లక్ష్యాలకు అనుగుణంగా శ్రమించడం వల్లనే రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చిందన్నారు. అలాగే బకాయిల వసూళ్లలోనూ పురోగతి కనిపించిందన్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలపై 50 శాతం మేర వడ్డీ రాయితీ కల్పించడం కలిసివచ్చిందని కమిషనర్ అన్నారు. సకాలంలో పన్నులు చెల్లించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పన్ను వసూళ్లలో కృషి చేసిన వార్డు సచివాలయాల కార్యదర్శులు, అధికారులకు ప్రత్యేకంగా కమిషనర్ అభినందనలు తెలియజేశారు.

# ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- వల్నరబుల్ ఏరియాల్లో ప్రతిపాదించిన పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి.. సమన్వయంతో పనిచేయాలి -ఎస్పీ డీ నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** జిల్లాలో రహదారులపై ప్రమాదాలు నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, వల్నరబుల్ ఏరియాల్లో ప్రతిపాదించిన చర్యలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న ప్రమాదాలపై సమీక్ష నిర్వహించారు. రహదారి ప్రమాదాలు, పోలీసు స్టేషన్ వారీ వివరాలు, రహదారి భద్రత అమలు, ఐరాడ్ అప్లికేషన్‌లో ప్రమాదాల డేటా నమోదు, హిట్ అండ్ రన్ కేసులు, బ్లాక్ స్పాట్లు తదితర అంశాలపై జిల్లా పోలీస్, రవాణా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నిర్వహణకు అవసరమైన బ్రీత్ అనలైజర్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 31 బ్లాక్ స్పాట్లు, 12 అధిక ప్రమాద ప్రాంతాలు గుర్తించామని, ఈ ప్రాంతాల్లో ప్రమాదాల కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ రహదారులను అనుసంధానం చేసే అప్రోచ్ రోడ్లలో ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, బ్లింకర్లు, లైటింగ్ వంటి సదుపాయాలు పంచాయితీలు, రుడా నిధుల ద్వారా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గెయిట్ కాలేజీ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న మీడియన్ ఓపెనింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, దానిని మూసివేసి సురక్షిత ప్రదేశంలో మార్పు చేయాలని సూచించారు. జాతీయ రహదారి 16 నుంచి ఎడిబి రహదారిని అనుసంధానించే మార్గంలో ఒక కిలోమీటరు మేర లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గామన్ బ్రిడ్జి మరమ్మత్తుల సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కొవ్వూరు వైపు రోడ్ కం రైల్వే బ్రిడ్జి ఎక్కే ప్రదేశంలో సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులపై బొమ్మూరు, రాజానగరం, దేవరపల్లి, కడియం, నల్లజర్ల, రంగంపేట మండలాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. మే నుంచి జూన్ వరకు, సెప్టెంబరు నుంచి నవంబరు వరకు ప్రమాదాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని చెప్పారు. లైటింగ్ లోపం, సైన్ బోర్డుల కొరత, అప్రోచ్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, హెల్మెట్ వినియోగం లేకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు తరచుగా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రహదారి ప్రమాదాలు స్వల్పంగా తగ్గాయన్నారు. రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లలో లైటింగ్ మెరుగుదల వంటి చర్యల వల్ల ఈ మార్పు సాధ్యమైందన్నారు. ఐరాడ్ యాప్‌లో పోలీసులు ప్రమాదాల వివరాలు నమోదు చేస్తున్నారని, ట్రాన్స్‌పోర్ట్, మున్సిపల్ అధికారులు కూడా సంబంధిత వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, పోలీసు, రవాణా , ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు , వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుడి సైకిల్ యాత్రను చూసి ఆగిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

## భావోద్వేగానికి గురైన సైకిల్ యాత్రికుడు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ లో సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఎస్పీజి. బిందు మాధవ్ తిరిగి వెళుతుండగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు మూడు చక్రాల సైకిల్ పై యాత్ర చేస్తున్న వికలాంగుడిని చూసి, ఎస్పీ తన వాహనాన్ని దిగి అతన్ని పలకరించి బాగోగులు అడిగారు. ఏదైనా సహకారం కావలిస్తే అడగమని, అతనికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించాల్సిందిగా సర్పవరం ఇన్స్పెక్టర్ బి. పెద్దిరాజు కి ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. సదరు వికలాంగుడు ఎస్పీ ఆగి పలకరించడంతో ఎంతో హర్షం వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న స్థానికులు ఇదంతా గమనించి, అతనితో మాట్లాడారు. అతడు కొన్ని క్షణాల పాటు భావోద్వేగానికి గురయ్యాడు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఓటు వేసేదెవరు?!

# ఓటరా.. ఈవీఎమ్మా

- ఓటు భద్రత లేని ప్రజాస్వామ్యం ఆటవిక దోపిడీ రాజ్యం గానే ఉంటుంది ..
- ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఓటు వేసేదెవరు..ఈ ప్రశ్న వినగానే ఏమిటీ చచ్చు ప్రశ్న అనిపించవచ్చు. మరోసారి చదివాక..కాస్త అనుమానం వస్తుంది.. అవును కదా ఈ రోజు ఏప్రిల్ ఫస్ట్. ఫూల్ చేయడానికి వేసిన తికమక ప్రశ్నలా అనిపించింది కదా. తికమక ప్రశ్నా కాదు. ఏప్రిల్ ఫూల్ చేయడానికి వేసిన ప్రశ్న అసలే కాదు. అవును నిజం. మీరు చదివినది ముమ్మాటికీ..నూరు శాతం..ప్రతీ ఒక్కరికీ ఎప్పుడో ఒకప్పుడు కలిగే సందేహం. మొదట్లో చిన్న అనుమానం. వదిలేస్తే ఏమీలేదు. అదే ప్రశ్న..మనల్ని నిలువునా దొలిచేస్తుంటే..ఎక్కడో ఏదో జరగరాని మహాపరాథం..భవిష్యత్తు తరాలు క్షమించరాని నేరం జరుగుతోందని అనిపించక తప్పదు. యస్. ఇప్పుడు చెప్పండి. మీ అమూల్యమైన ఓటు మీరే వేస్తున్నారా?, మనకు తెలియకుండానే మన ఓటు ఈవీఎం వేసేస్తోందా. మరి స్వయంగా వెళ్ళి వేశాను కదా అనుకుంటే..అదంతా భ్రమ. మాయ. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం.. మనల్ని మనమే మోసం చేసేస్తోందా..

**రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్..మాటల్లో వినండి.**

"మోదీ పాలనలో నేతలను ఎన్నుకుంటున్నారా ! కొనుక్కుంటున్నారా !

2029 – ఎన్నికలకు ఇదే తరహా ఎన్నికలు నిర్వహిస్తే మళ్ళి మీరే గెలిచేది. అందు కోసం ఎన్నికలు నిర్వహించటం ఎందుకు?"

భారత దేశంలో ప్రజాస్వామ్యం సమాధిగా మారుతుంది. అప్రజాస్వామ్యమే పాలిస్తుంది. అపార సంపద గల భారత దేశంలో పేదలు అత్యధిక శాతం ఉండటానికి కారణం ఏమిటో తెలుసుకో గలమా?"

ఆంధ్రప్రదేశ్ – తెలంగాణాలో కుల సంఘాలు శాపం అయితే ఇతర రాష్ట్రాల్లో మతోన్మాద ఉన్మాదం శాపంగా మారింది..

ఆంధ్రప్రదేశ్ – తెలంగాణా రాష్ట్రాల్లో ఒకప్పటి ఉద్యమ త్యాగాలు, నేతల స్ఫూర్తి నేడు ఎందుకు కనుమరుగు అవుతున్నాయి"..మేడా సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో మేధావులు అసలు ఉన్నారా ! ఉంటే ఎందుకు మౌనంగా వుంటున్నారు. భయపడుతున్న ఆంధ్రులకు భరోసా ఇచ్చే మహానేత నేడు కావాలి..స్వేచ్ఛగా మీడియా పాత్ర పోషించ లేకపోతున్న నేటి స్థితుల నుండి మీడియా వుంది అని నిరూపించే మహోన్నతమైన బంగారు రోజులు మన బిడ్డలకు , మెరుగైన సమాజానికి కానుకగా ఇద్దాం". రోజులు మారుతున్నాయి. నెల ఇట్టే తిరుగుతుంది.. జీవితాలు మాత్రం మారటం లేదు. ఏడాది కొకసారి ఎన్నికలు జరిగితే బాగుండును అనే ఆశ, దురాశ కు ప్రజలను దిక్కులేని బానిసత్వానికి అలవాటు పడేలా చేస్తున్నారు ..చట్ట భద్రత లేదు. పౌర సేవలు లేవు. పౌష్టిక ఆహారం లేదు. కనీస వసతులు, మౌలిక సదుపాయాలు లేవు . పర్యావరణ రక్షణ లేక పోయింది . విద్యా – వైద్యం ఖరీదైన దోపిడీ వ్యవస్థలుగా మారిపోయాయి. మనది ప్రజాస్వామ్యం అని బ్రతికేస్తు కుమిలి పోతున్నాము.. ప్రస్తుత పాలన ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది?". భారత దేశ రాజ్యాంగం సాక్షిగా చట్ట పరమైన హక్కును దేహీ అని ఆడుకున్నా దక్కటం లేదు. న్యాయం ఖరీదైనదిగా మారి పోయి సామన్యుల జీవితాలను నిత్యం వెక్కిరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ – తెలంగాణా రాష్ట్రాల్లో మెజారిటీ ప్రజలు ప్రస్తుత పాలక నేతలకు ఎందుకు జై జై లు కొడుతున్నారో ఆత్మ విమర్శ చేసుకునే మనస్సాక్షిని చాటుకునే దైవ సాక్షాన్ని చెప్పుకోగలరా?..

ఒకప్పుడు రాజకీయ పార్టీ లకు ఒక సిద్ధాంతం ఉండేది. నేడు పుట్టుకొస్తున్న రాజకీయ పార్టీలు పాలక వ్యాపార రాజకీయ పార్టీలకు బానిస తొత్తులుగా ఉంటాం. ప్రజలను వ్యవస్థలను, సమాజాన్ని మోసం చేస్తు మీకు విధేయులుగా బ్రతికేస్తాం అని నెల పారితోషకాలతో పెద్ద పెద్ద ఉపన్యాసాలు గుప్పిస్తు పూర్వ సినిమా వారిని మించిన నటనతో ప్రజలను సమాజాన్ని మోసం చేస్తున్నారు. గత 28 ఏళ్లగా నమ్మిన సిద్ధాంతం కోసం , సంపద అందరి దరికి చేరాలని, సమ సమాన పాలనతో మనుషులు రాజ్యాంగ బద్ధమైన స్వేచ్ఛతో జీవించాలని , కులం – మతం రహితంగా అద్భుతమైన సామాజిక భద్రత, భవిష్యత్తే లక్ష్యంగా నిరంతరం పోరాడుతున్న " రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ " కు ప్రజలు వెన్నుదన్నుగా నిలబడి ప్రోత్సహించాలని కోరుతున్నాము"..అని ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అర్థిస్తున్నారు. మేడా ఆవేదన వెనుక ఒక ఆర్తి, ఒక కసి ఉంది. అర్థం చేసుకుని అడుగులో అడుగు వేసే అసలు సిసలైన మనుషుల కోసం మేడా నిరంతరం అన్వేషిస్తున్నారు.

### కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటికి

# అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు...

- గ్రామాల్లో ప్రజలంతా కలిసికట్టుగా ఉంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతాయి
- ఆగిరిపల్లి మండలంలో రూ 5.71 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/ఆగిరిపల్లి, ఏప్రిల్ 01 (మనసులో మాట)..** ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి మరియు తోటపల్లి గ్రామంలో బుధవారం రూ 5.71 కోట్లతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు అభివాదాలు చేసుకుంటూ, గ్రామాలు సమస్యలను ప్రజలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుచున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్ననప్పటికీ అనుభవజ్ఞులైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పడకేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎన్డీఏ ప్రభుత్వంలో పట్టాలెక్కించి వేగవంతం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజలు మనోభావాలు అనుగుణంగా ప్రజాపాలన చేస్తున్నామని అన్నారు. ఒకటవ తేదీన ఉదయాన్నే ప్రతి ఇంటికి వెళ్ళి పింఛన్లను అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండు టైటిలింగు రద్దు చేసి ప్రజలకు ఆస్తికి భద్రత కల్పించామని, అన్నా క్యాంటీన్లు ద్వారా నిరుపేదలకు కేవలం రూ 15 రూపాయలకే మూడు పూటలూ భోజనం పెడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఒక హెక్టరుకు ఇన్పుట్ సబ్సిడీ రూ 25 వేల రూపాయలకు పెంచామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం ద్వారా 16,434 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహాయ సహకారాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి ముందుకు సాగుతుందని అన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిరంకుశ ధోరణి విడనాడాలి

- జిల్లా కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ ఉపాధ్యాయులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల పట్ల ప్రభుత్వం నిరంకుశ విధానాలను విడనాడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పీ జయకర్ ఉద్ఘాటించారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తూర్పు గోదావరి జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ఒక రోజు నిరహార దీక్షా కార్యక్రమం చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈవీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ షరీఫ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు దాదాపు 32 వేల కోట్ల రూపాయలు బకాయిలు పడి ఉందన్నారు. ఈ బకాయిలు ఎప్పటి లోగా చెల్లిస్తారో రూట్ మ్యాప్ వెల్లడించాలని ఆయన డిమాండు చేశారు. అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ 2023 జూన్ నుంచి 12వ పీఆర్సీ ఇవ్వాలని, ఇప్పటి వరకు కమిటీ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్దేశ పూర్వకంగా తాత్సారం చేస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిటీ వేయాలని, తక్షణం 29 శాతం ఐర్ ప్రకటించాలని, బకాయిలు ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న మెడికల్ బిల్లులు, పీఎఫ్ లోన్లు, సరెండర్లు, పదవి విరమణ చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల బెనిఫిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఉపాధ్యక్షులు రూపస్ రావు, విజయ గౌరీ మాట్లాడుతూ ప్రభుత్వం తమ బకాయిల చెల్లించకపోతే, పీఆర్సీ ఇవ్వకపోతే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి విజయవాడలో సామూహిక దీక్షలు చేపడతామని, 28న చలో సెక్రటేరియట్ కార్యక్రమం చేసి ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమ గీతాలు ఆలపించారు. సాధిస్తాం సాధిస్తా పీఆర్సీ సాధిస్తాం అనే నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ శ్రీరామమూర్తికి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గౌరవ అధ్యక్షుడు వీవీ రమణ, జిల్లా కోశాధికారి శ్రీనివాసమూర్తి, జిల్లా కార్యదర్శులు ఈ శ్రీమణి, సురేంద్ర, కే రమేష్ బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, నరేష్, సీతాదేవి, నాగభూషణం, దయానిది, మనోహర్ కుమార్, శ్రీనివాసుని మనోజ్ కుమార్, రాష్ట్ర యూటీఎఫ్ కౌన్సిల్ ఎస్ అనిత, శివ బాబు, కార్యవర్గ సభ్యురాలు ఐడీ కేడీ రాజేశ్వరి, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి గోదావరి ఆరాట్టు

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 1..** ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో అయ్యప్ప స్వామి గోదావరి ఆరాట్టు మహోత్సవం, 6వ ఉత్తర నక్షత్ర జన్మదిన వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శబరిమల పంపా ఆరాట్టు తరహాలో గోదావరి తీరంలో ఈ వేడుకలు జరిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామి ని దర్శించుకుని పాల్గొని, అయ్యప్ప స్వామిని శిరస్సుపై అలంకరించుకుని అయ్యప్ప స్వామి గోదావరి ఆరాట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు. గోదావరి చెంతన జరిగే కార్యక్రమం నికి స్థానిక ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# అర్హులందరికీ సంక్షేమాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** అర్హులందరికీ సంక్షేమాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం ఉదయం కడియం మండలం వీరవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. పూర్తిగా మంచాన పడిన అర్హురాలికి రూ.15 వేలు పెన్షన్ ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పెన్షన్ పంపిణీ చేసేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అని, రూ.4 వేల నుండి 15వేల రూపాయల వరకు 24 రకాల పెన్షన్లను అందిస్తున్నామని తెలిపారు. పెన్షన్ దారుని తల్లితో కాసేపు ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలానే పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి హౌసింగ్ లోన్ ఏర్పాటుచేసి పక్కా ఇల్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, బత్తుల రాము, అన్నందేవుల కోదండ రాముడు, ఆదిమూలం సాయిబాబు, గోరు నాగేశ్వరరావు, దంతంశెట్టి శ్రీను, బత్తుల వాసు, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గండేపల్లి లో ఘనంగా అయ్యప్ప స్వామి పుట్టినరోజు



**గండేపల్లి (మనసులో మాట) ఏప్రిల్ 1 ..** అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రమైన గండేపల్లిలో అయ్యప్ప స్వామి దేవాలయంలో మాల ధారణ వేసుకునేవారు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. రిత్వికులు దుర్గావతుల సత్యనారాయణ టీం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన గురుస్వాములు రెడ్డి గురుస్వామి, రామకృష్ణ గురుస్వామి, కన్నబాబు గురుస్వాములు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు సానిపల్లి తారకం , చిట్టి శ్రీను స్వామి, రాజేష్ గ్రామానికి చెందిన స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




### హౌసింగ్ బోర్డు జెడ్పీ పాఠశాల కు

# జోస్ అలుక్కాస్ వితరణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** రాజమండ్రి జోస్ ఆలూక్కాస్ లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ లోని జడ్పీ ఉన్నత పాఠశాలకు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.2 లక్షల విలువైన సామాగ్రిని బుధవారం అందజేశారు. రాజమండ్రి జోస్ ఆలూక్కస్ మేనేజర్ షానోజ్ ఫిలిప్ చేతుల మీదుగా పాఠశాలకు స్టీల్ బీరువాలు, ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మొదలైనవి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ ఎల్ వీ రమేష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ మేనేజర్ నితిన్, ఫ్లోర్ మేనేజర్ ఎస్ ప్రదీప్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- 42 డివిజన్లో పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక 42 డివిజన్లో బుధవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో గన్ని కృష్ణ హాజరై పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. ప్రతి నెల పింఛన్లు క్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కష్టాలైనా.. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా.. పేదల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధికి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ నగర్ లో మురుగునీటి పారుదల వ్యవస్థపై పలువురు గన్ని కృష్ణ దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే నగర పాలక సంస్థ అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ మళ్ళ వెంకటరాజు, కేవీ శ్రీనివాస్, వానపల్లి శ్రీనివాస్, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, జీ కొండబాబు, పేరూరి అంజి, సింహాద్రి సతీష్, బీజేపీ ఆచారి, బాల తదితరులు పాల్గొన్నారు.

# "మాట్రిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్" బ్రిడ్జ కోర్సు ప్రారంభం

- వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో "మాట్రిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్" బ్రిడ్జ్ కోర్సు నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. విశ్వ విద్యాలయంలో రెండవ సంవత్సరం విద్యార్థులందరికీ "మాట్రిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్" అనే శీర్షికతో గణితంలో ఒక బ్రిడ్జ్ కోర్సును నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ నెల 1 నుండి 15వ తేదీ వరకు సాయంత్రం 4.30 నుండి 6.30 వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇది పీజీ ప్రోగ్రామ్లను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. దీనిని పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీ హైమావతి, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# చెల్లింపులు లేక కష్టాల్లో ఆసుపత్రులు

- ఏప్రిల్ 1 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలకు బ్రేక్ హెచ్చరిక

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ జిల్లాలోని ఎన్టీఆర్ వైద్యసేవ (ఎన్టీఆర్ వి ఎస్ ) పథకం కింద పనిచేస్తున్న అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు అత్యవసర జోక్యం కోరుతూ సంయుక్తంగా ప్రతినిధి లేఖ సమర్పించాయి.పథకం కింద ఆసుపత్రులకు రావాల్సిన చెల్లింపులు నెలల తరబడి పెండింగ్లో ఉండటం తో,అలాగే ప్యాకేజ్ రేట్లలో ఎలాంటి సవరణలు లేకపోవడం వల్ల ఆసుపత్రుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. దీనివల్ల రోగులకు నిరంతర సేవలు అందించడం కష్టసాధ్యంగా మారుతోంది. ఇప్పటికే పలు మార్లు సంబంధిత అధికారులతో చర్చలు జరిపినా, సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి కనిపించలేదు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్, ప్యాకేజ్ రేట్ల సవరణ, భవిష్యత్తులో సమయానికి చెల్లింపులు జరిగేలా హామీ ఇవ్వాలని ఆసుపత్రులు డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఏప్రిల్ 1 నుండి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద సేవలను నిలిపివేయాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల ప్రతినిధులు తెలిపారు. అయితే అత్యవసర, కొనసాగుతున్న చికిత్సలు ప్రభావితం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ, సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## అంతర్జాతీయ సదస్సుకు రాజమండ్రి ఉపాధ్యాయురాలు

**- ఉజ్జయినీ సదస్సుకు ఆహ్వానం అందుకున్న సుసత్య రేఖ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మేకా సుసత్య రేఖకు అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం లభించింది. “కాల మహిమ ఖగోళ శాస్త్రం, ఆస్ట్రోఫిజిక్స్ మరియు కోస్మాలజీ శాశ్వత సంప్రదాయాలు” అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ఉజ్జయినిలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరుగుతుంది. ఈ అంతర్జాతీయ సదస్సును భారత ప్రభుత్వ విద్యా శాఖ (మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్), మధ్యప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్, విజ్ఞాన భారతి సమైక్యం గా నిర్వహిస్తున్నాయి. ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని సుసత్య రేఖ కు ఆహ్వానం అందింది. భారత దేశంలో ఖగోళ శాస్త్రం, కాల గణనలో ఉన్న విశిష్ట సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి “మహాకళ..ద మాస్టర్ అఫ్ టైమ్ ” పేరుతో ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు 2026 ఏప్రిల్ 3 నుండి 5 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నగరంలో జరుగుతుంది. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం భారతీయ కాలగణన పద్ధతులు, ఖగోళ పరిశోధనలు, ఉజ్జయిని నగరానికి ఉన్న ప్రాచీన ప్రాముఖ్యతను వెలుగులోనికి తేవడం. ఒకప్పుడు ప్రపంచ కాల గణనకు ఉజ్జయిని కేంద్రంగా ఉండేదని ఈ సదస్సులో ప్రాముఖ్యంగా చర్చించనున్నారు. సదస్సులో ఖగోళ శాస్త్రం, ఆస్ట్రోఫిజిక్స్, కోస్మాలజీ వంటి ఆధునిక అంశాలతో పాటు వేదాంగ జ్యోతిష్యం, పంచాంగ గణన, పరిశీలనాత్మక ఖగోళ విజ్ఞానం వంటి సంప్రదాయ అంశాలు కూడా చర్చకు వస్తాయి. ఈ సదస్సులో భారత దేశం, విదేశాల నుండి ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని ఖగోళ శాస్త్రంలో తాజా అభివృద్ధులను పంచుకోనున్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలు, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని కలిపి, భవిష్యత్తు శాస్త్ర అభివృద్ధికి దారితీసే ముఖ్యమైన వేదికగా ఈ సదస్సు నిలుస్తుంది. గత 5 సంవత్సరాలుగా ఇంటర్నేషనల్ ఆస్టెరాయిడ్ సెర్చ్ కాంపెయిన్, ఐఏఎస్సీ, నాసా భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఆస్ట్రాయిడ్స్ పరిశోధనలో ఎంతోమంది ఉపాధ్యాయులు విద్యార్థులను తర్ఫీదునిచ్చినందుకు గాను మరిన్ని ఖగోళ పరిశోధనలు చేపడుతున్నందుకు ఆహ్వానా న్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్నా ఏకైక ఉపాధ్యాయని సుసత్య రేఖ.

## భీమ్ దీక్షతో అంబేడ్కర్ ఆశయాలకు సంకల్పం

**బొమ్మూరు అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు రాము**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ లక్ష్యంగా భీమ్ దీక్ష కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బొమ్మూరు గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు వడ్లమూరి రాము రాజవోలు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి భీమ్ దీక్ష చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ ఆశయాలను కాపాడుతూ సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గం సమాజ అభివృద్ధికి దారి చూపుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి, హక్కుల కోసం చట్టబద్ధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఇంకా ఉన్న అసమానతలను తొలగించడానికి యువత ముందుకు రావాలని సూచించారు. భీమ్ దీక్ష కార్యక్రమం ద్వారా రాజ్యాంగంపై అవగాహన పెంచడం, సామాజిక న్యాయం కోసం కట్టుబడి పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ ప్రెసిడెంట్ దండాబత్తిన విజయ కుమార్, జనరల్ సెక్రెటరీ రాబర్ట్ విష్ణు, బందిల మని, కోడూరి సురేష్, సకల సతీష్, సకల మారి, కుద్రపు రవి కుమార్, స్థానిక నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల పాలిట పెన్నిధి నిరుపేదలకు అండ కూటమి ప్రభుత్వం

**- పేదల అవసరాలు, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని పింఛన్లు పంపిణీ**

**- భీమవరం 3,1,2వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు అందించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం, మనసులో మాట ఏప్రిల్ 1:** పేదల పాలిట పెన్నిధిగా నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 3,1,2వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అంజిబాబు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి వారి యోగా క్షేమాలను తెలుసుకుని ప్రతి నెల సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా లేదా అంటూ ఆరా తీశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన పేదల అవసరాలు, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమ పనులు జరుగుతున్నాయని, ప్రజల పక్షంగా వారికి ఏ సమస్య కూడా తలత్తకుండా ముందుగానే స్థానిక నేతలు గ్రహించి అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో ఉండాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని పేద, బలహీన వర్గాలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల కష్టాలను తగ్గించి వారికి గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించడానికి పింఛన్లు పెంచడం ఒక ప్రధాన సంక్షేమ చర్య అని అన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్ ఛార్జ్ లు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**తణుకులో శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ కార్మికుల నిరసన - ఏఐటీయూసీ డిమాండ్**




**తణుకు (మనసులో మాట) ఏప్రిల్ 1..** కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా ఉన్నాయని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తణుకులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ నిరసనను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నాలుగు లేబర్ కోడ్‌లు పూర్తిగా యజమానులకు లాభం చేకూర్చేలా, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు.

ఈ కోడ్‌లు అమలైతే కార్మికుల కనీస జీవించే హక్కు కూడా హరించివేస్తుందని, పారిశ్రామిక రంగంలో కార్మికులు కట్టుబానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాయడం దురదృష్టకరమని, వీటిని రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. “కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో, ఈ నల్ల చట్టాల రద్దు కోసం కార్మికులు ప్రాణత్యాగాలకైనా సిద్ధమవుతారు“ అని భీమారావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి దాకే ముసలయ్య,కోశాధికారి కె.రాధాకృష్ణ, చిలుకూరి వెంకటేశ్వరరావు,పెనుమర్తి సాయికృష్ణ, సరిదే శ్రీను,దాసరి మణికంత, శ్రీను,కరుటూరి శ్రీను,రెడ్డి ప్రసాద్ తదితరులు నాయకత్వం వహించారు.

## ప్రభుత్వ ఆస్తులను కాపాడండి

**- టిడిపి వర్మకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయండి - సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు**

**- నూతన జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన సిపిఐ జిల్లా బృందం**




**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కోట్లాది రూపాయల విలువైన ప్రజల ఆస్తి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఇటీవల టూరిజం శాఖ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కేటాయించిన స్థలాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపు నిచ్చారు బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లో నూతన కాకినాడ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన ఎంఎస్ హరేంద్ర ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం మొట్టమొదటి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ టూరిజం శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ ఎం ఎస్ నెంబర్ 17 ను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు వాస్తవంగా జీవో నెంబర్ 17 లో ఎస్ వి ఎస్ ఎన్ వర్మ కు మూడు ఎకరాల నాలుగు సెంట్లు స్థలం ఇక్కడే ఉందని ప్రాంతం చూపించలేదని కానీ అనాధికారికంగా ఆర్ అండ్ బి ఇరిగేషన్ తదితర శాఖలు ఎస్ వి ఎస్ ఎన్ వర్మ స్థలం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని మధు ఆరోపించారు.

రాష్ట్రంలోనే పేరుగాంచిన గర్ల్స్ పాలిటెక్నిక్ హాస్టల్ పక్కనే ఫైవ్ స్టార్ హోటల్స్ నిర్మిస్తారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు ఒకపక్క ఆయుర్వేద 30 పడకల ఆసుపత్రి పూర్తయిన దానిని ప్రారంభించకుండా ఎందుకు నాటకాలు ఆడుతున్నారని ఆయన అధికారులను కోరారు ఆసుపత్రి పక్కనే మెడికల్ కాలేజ్ నిర్మించకుండా పిఠాపురంకు తరలిస్తారా ఇది ఎంతవరకు న్యాయమని ఆయన అధికారులను కోరారు

అధికారులను మంత్రులను కలిసి శాంతియుతంగా వినతి పత్రాలు అందజేస్తున్నామని అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఇక పోరాటాల మార్గం చేపడుతామని మధు పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో కాకినాడ జిల్లా సిపిఐ కార్యదర్శి కే బోడకొండ సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు బొబ్బిలి శ్రీనివాస్ ఏ ఐ టి యు సి నాయకులు రాజేష్ మహిళా సమాఖ్య నాయకురాలు పద్మ భవాని అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పేదల జీవితాల్లో వెలుగులు

**- లబ్ధిదారులకు అండగా కూటమి ప్రభుత్వం**



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పండుగ వాతావరణం లో జరిగింది. బుధవారం ఉదయం ఒకటో తేదీ కావడంతో కరప, కాకినాడ రూరల్ మండలాల పరిధిలోని కరప, స్వామి నగర్, చీడిగ, కొవ్వాడ, ఇంద్రపాలెం వంటి ప్రాంతాల్లో వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావులు పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, సమాజంలో నిస్సహాయులకు దక్కుతున్న గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక పెన్షన్ దారులకు ఆదరణ పెరిగిందని, పెన్షన్లు అందుకునే ప్రతి కుటుంబానికి ఆయన ఒక పెద్దన్నగా నిలిచారని వారు కొనియాడారు. లబ్ధిదారుల పట్ల ప్రేమ, అభిమానం పెరిగేలా ఈ పథకాన్ని రూపొందించడం వల్ల పేద ప్రజల్లో ధీమా పెరిగిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి దేవు వెంకటేశ్వరరావు (వెంకన్న), కొండా వినాయక్, కుడుపూడి వీరబాబు, దమ్ము నూకరాజు, వనం గణేష్, ఇంరవ రాంబాబు, కరెడ్ల చక్రరావు, పేపకాయలు నాగేశ్వరరావు, అనిశెట్టి గంగాధర్, కోన వెంకటలక్ష్మి, పేపకాయలు సూరిబాబు, దంగేటి రమణతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని...

## ఏలేశ్వరం లో సిఐటీయు నాయకుడు పాకాలపాటి సోమరాజు ఆధ్వర్యంలో ర్యాలీ...




**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 1..** ఏలేశ్వరంలో సిఐటియు నాయకులు పాకలపాటి సోమరాజు పిల్ల రాంబాబు ఆధ్వర్యంలో ఏలేశ్వరం మరిడమ్మ అమ్మవారి గుడి వద్ద నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల ధర్నా ఆరు సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా సంక్షేమ పథకాలు సాధించుకున్న భవన నిర్మాణ కార్మికులకు సిఐటియు ఇదే ఉత్సాహంతో పెండింగ్లో ఉన్న ఐదు కోట్ల పరిహారం కార్మికులకు చెల్లించాలని 2020 నుండి పథకాలను దరఖాస్తుల చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ఏప్రిల్ ఒకటి రెండు మూడు తేదీలలో మండల తాసిల్దార్ కుశరాజు కి బుధవారం ఇచ్చారు. అనంతరం పాకాలపాటి సోమరాజు మాట్లాడుతూ తాము దరఖాస్తులు పెట్టించి వచ్చే మే 6 వ తేది న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని,ధర్నాని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఏలేశ్వరం తాసిల్దార్ కుశరాజు స్పందించి తనకి ఇచ్చిన వినతి పత్రం వివరాలు ప్రభుత్వం ఉన్నంతదికార్ల కు పంపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్సా దుర్గ బాబ అడపా శివ ముప్పిడి సుశీలమ్మ కాళ్ల అజ్జమ్మ అచ్చియమ్మ తదితరులు పాల్గొన్నారు.




## కే.జి.ఆర్.ఎల్ కళాశాలలో “వాల్ ఆఫ్ కైండ్నెస్” కార్యక్రమం విజయవంతం

**భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 1 :** భీమవరం కే.జి.ఆర్.ఎల్ కళాశాలలో ఈనెల ఒకటో తారీఖున “వాల్ ఆఫ్ కైండ్నెస్” కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ రోజు నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో మండవల్లి ఈశ్వర్ దాతగా ముందుకు వచ్చి అవసరమైన వారికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కళాశాల ప్రతినిధులు, సమాజంలో పేద మరియు అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాల్ ఆఫ్ కైండ్నెస్ కార్యక్రమం ద్వారా ఉపయోగంలో లేని కానీ ఉపయోగకరమైన దుస్తులను సేకరించి అవసరమైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. మండవల్లి ఈశ్వర్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తనకు ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తానని తెలిపారు. డిగ్రీ ప్రిన్సిపాల్ ఇంటి రామచంద్ర మూర్తి, పీజీ కోర్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తోట రామమూర్తి , పీజీ కంట్రోలర్ చాముండేశ్వరి దేవి, డిగ్రీ అధ్యాపకులు స్వామి, అప్పారావు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మురళి మోహన్ , రాంబాబు, సునీత , కే. ఐజక్ బాబు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## గ్రామాలలో త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**గొల్లవానితిప్ప గ్రామంలో రూ 19.50 లక్షలతో మైక్రో ఫిల్టర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి**



**భీమవరం, మనసులో మాట ఏప్రిల్ 1:** మైక్రో వాటర్ ఫిల్టర్ల ద్వారా గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో రూ 19.50 లక్షలతో మైక్రో ఫిల్టర్ ను ఎమ్మెల్యే అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ నియోజక వర్గంలోని శివారు గ్రామాలకు కూడా స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే లక్ష్యమన్నారు. తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, అన్ని గ్రామాల్లోనూ స్వచ్ఛమైన మంచినీటిని అందించేలా మైక్రో వాటర్ ఫిల్టర్ లను ఏర్పాటు చేయడం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబెర్స్, ఎంపీటీసీలు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, వివిధ కార్పోరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

**కాకినాడజిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన**

## కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గం



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన హరేశీధిర ప్రసాద్ ని ఆయన ఛాంబరులో కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్,కోశాధికారి చైతన్య, సభ్యులు చిప్పి,ఆకెళ్ళ శ్రీనివాస్, నందిని తదితరులు కలెక్టర్ కు శాలువా కప్పి మెమెంటో అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను తెలియపరచగా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ తిమ్మప్ప,ఏపీఆర్వో రవి, బాబురావు,క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసన్నిస్తాయి



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 1..** క్రీడలు మానసిక ఉల్లసన్నిస్తాయని ఆత్రేయపురం మహాత్మా గాంధీ కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ పిఎస్ రాజు అన్నారు. 2025, 26 సంవత్సరంలో స్కూలు,మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు జరిగిన క్రీడలలో ప్రతిభ చూపిన మహాత్మా గాంధీ విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోని ఉత్సాహం చూపించాలని అన్నారు. విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు ఎన్ సత్యనారాయణ రాజు ( పెద్ద మురళి మాస్టర్) అందజేసిన రూ,23, వేలు విలువైన బహుమతులను విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ ఆర్, మురళీకృష్ణ, ప్రిన్సిపాల్బి వెంకటేశ్వరరావు, పి ఈ టి, ఎన్, రవిరాజు ఉపాధ్యాయులు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## కలెక్టర్ ను కలిసిన ఆర్పీఐ పార్టీ అధ్యక్షుడు డా. పిట్టా వర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వర ప్రసాద్, రాష్ట్ర ఐటీ ఇంచార్జ్ డి. మణికంత మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో దళిత బహుజన సమస్యలు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం త్వరితగతిన అందించడం, ఎస్సీ సంక్షేమ పథకాల సమర్థ అమలు, భూమి సమస్యలు, పేదలకు గృహాలు, సామాజిక న్యాయం సంబంధిత అంశాలపై చర్చించారు. జిల్లా పరిపాలన ప్రజలకు చేరువగా ఉండాలని, ముఖ్యంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో కలెక్టర్ చొరవ అవసరమని డాక్టర్ పిట్టా వర ప్రసాద్ వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

## ఖతార్ దేశంలో ఇబ్బందులకు గురవుతున్న మహిళను స్వదేశానికి రప్పించిన మైగ్రేషన్ అధికారులు



**అమలాపురం (మనసులోమాట) ఏప్రిల్ 1:** ఖతార్ దేశంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉప్పలగుప్తం మండలం వాసాల తిప్ప గ్రామానికి చెందిన మల్లాడి జయలక్ష్మి (48)ని జిల్లా కలెక్టర్ డా. మహేష్ కుమార్ రావిరాల చొరవతో సురక్షితంగా భారతదేశానికి చేరవేయడం జరిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉండటం, అప్పులు ,కుమార్తె వివాహం చేయాలనే ఉద్దేశంతో జయలక్ష్మి 2025 డిసెంబర్ 15న కుందుర్తి నాగరాజు అనే నకిలీ ఏజెంట్ ద్వారా ఖతార్ దేశానికి వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత పరిస్థితులు పూర్తిగా ఇబ్బంది గా మారి, రోజుకు సుమారు 18 గంటల పాటు పని చేయించుకోవడం, చిన్న విషయానికే అవమానించడం, ఇంటి బయటకు లాగడం, తీవ్రంగా దూషించడం పరిశుభ్రత విషయంలో అనవసర ఆరోపణలు చేయడం వంటి వేధింపులు ఎదుర్కొన్నారు. కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సహనం వహించినప్పటికీ, చివరకు పరిస్థితులు భరించలేని స్థితికి చేరుకోవడంతో తనను పంపిన ఏజెంట్‌ను సంప్రదించమని తన పిల్లలకు జయలక్ష్మి తెలియజేంది. అయితే ఏజెంట్ కొంత డబ్బు తీసుకున్న తర్వాత తనకు సంబంధం లేదని చెప్పి తప్పించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలిసిన వారి సూచనతో కోనసీమ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వలసదారుల కోసం ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ గురించి తెలుసుకున్న జయలక్ష్మి పిల్లలు వెంటనే కేంద్రాన్ని సంప్రదించారు. “మా అమ్మగారు అక్కడ ఏడుస్తూ ఉండటం చూసి మాకు భయం వేస్తోంది. ఆమెను ఎలా తీసుకురావాలో తెలియడం లేదు. దయచేసి ఏజెంట్‌తో మాట్లాడి మా అమ్మగారిని స్వదేశానికి తీసుకురావాలి” అని వారు వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం స్పందించి సంబంధిత ఏజెంట్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించి జయలక్ష్మిని సురక్షితంగా భారతదేశానికి తీసుకురావడంలో విజయవంతమైంది.

ఈ సందర్భంగా కేంద్ర సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ మాట్లాడుతూ, నకిలీ ఏజెంట్ల మోసాలకు గురికాకుండా విదేశాలకు వెళ్లే ముందు సరైన సమాచారం తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రారంభించిన ఈ కేంద్రం ఇప్పటికే అనేక మందికి సహాయం అందిస్తున్నదని, విదేశాలకు వెళ్లాలని భావించే ప్రతి ఒక్కరూ కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించి తగు జాగ్రత్తలతో వలస వెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కడియాల సత్తిబాబు, షేక్ బీబి సఫియా తదితరులు పాల్గొన్నారు.

# బిసిలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

- చేనేత కార్మికులకు 6 లక్షల 40 వేల మందికి ఆర్థిక సాయం అందిస్తున్న కూటమి ప్రభుత్వం
- దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/నూజివీడు ఏప్రిల్ 01 (మనసులో మాట)..** నూజివీడు పట్టణ గొడుగువారి గూడెంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గమైన చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడానికి ఆర్థికంగా బలోపేతం చేయడానికి అందించే చేనేత పెన్షన్లు ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. యోగక్షేమాలు, గ్రామ సమస్యలు అడిగి తెలుసుకన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ చేనేత వృత్తులను అభివృద్ధి పరచడానికి చేనేత కార్మికులను ఆర్థికంగా బలపరిచి కుటుంబాలను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం మగ్గం వర్కు చేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలు మీద చేసేవారికి 500 యూనిట్లు విద్యుత్తు రాయితీ కల్పించి చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు రూ 150 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తద్వారా 6,40,000 మంది కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. త్వరలో చేనేత కార్మికులకు కమ్యూనిటీ హాలు కట్టిస్తామన్నారు. చేనేత సహకార సంఘాలకు రూ 78 కోట్ల రూపాయలు అందించిన కూటమి ప్రభుత్వం అన్నారు. అంతేగాక వడ్డెరలకు మైనింగు పర్మిషన్లు 15 శాతం రాయితీ, గౌడ సోదరులకు బార్ షాపులలో 10 శాతం రాయితీ, నాయీ బ్రాహ్మణ జీతభత్యాలు రూ 15 వేలు నుండి రూ 20 వేలకు పెంచి ఆర్థికంగా ఆదుకున్నామని అన్నారు. మత్స్యకారులు వేట నిషేధ సమయంలో ఇచ్చే రూ 15 వేలు ఆర్థిక సాయం రూ 20 వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సామాజిక పింఛన్లు రూ 4 వేలు, రూ 6 వేలు, రూ 10 వేలు, రూ 15 వేలు పింఛన్లు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. నేత కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడానికి రూ 25 వేల రూపాయలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అన్నారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఐదు కోట్లు ఖర్చు చేస్తే నూజివీడు పట్టణానికి కూటమి ప్రభుత్వం కేవలం 20 మాసాల్లో రూ 15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఎన్ ఆర్ జి ఎస్ కింద రూ 55 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు త్రాగునీరు సమస్య తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా ట్యాంకర్లు పైపు లైను మరమ్మతులు ఇంకా కావలసిన కొత్త కులాయి కలెక్షన్లు త్వరలో అందిస్తామన్నారు. సంక్షేమము, అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజానీకాన్ని ఆర్థికంగా బలపరచడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాగ భావించి ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రూ 14 లక్షలు కోట్లు అప్పుచేసి అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని దించిందన్నారు. దాన్ని అధిగమించి అనుభవజ్ఞులైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఆలోచన శక్తితో అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాలనలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో 20 లక్షల ఉద్యోగ కల్పన ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఇప్పటికే బహుళ జాతి సంస్థలు రూ 10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టాయని తద్వారా సుమారు 6 లక్షలు మందికి ఉద్యోగ కల్పన జరిగిందన్నారు.నూజివీడు పట్టణానికి త్రాగునీటి సమస్య తీర్చడానికి ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. త్వరలో పోలవరం నుండి త్రాగునీరు అందించడానికి త్వరలో ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాష్ట్రంలేనే జిల్లా ముందజ - కలెక్టర్



**అమలాపురం( మనసులోమాట) ఏప్రిల్ 1 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీ మ జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలవడం మనందరికీ గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమా ర్ బుధవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఈ ఘనత సాధించడంలో జిల్లా యంత్రాంగం, ముఖ్యంగా జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. అర్జీల పట్ల మీరు చూపిన అంకితభావం, పారదర్శకత,శ్రద్ధ వల్లే ఈ విజయం సాధ్యమైంద న్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, కోనసీమ జిల్లా పేరును మరిన్ని శిఖరాలకు తీసుకెళ్తారని ఆశిస్తున్నానన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కారంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం జిల్లా అధికారులు సిబ్బంది పనితీరుకు గీటురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రం లో కోనసీమ జిల్లా 88.74 శాతంతో అర్జీల పట్ల పరిష్కారం చూపు తూ ముందంజలో నిలిచిందన్నారు. అదేవిధంగా ప్రజా సంతృప్తి స్థాయిలను పరిశీలించ గా 5 మార్కులకు గాను 3. 54 మార్కులను సాధించి ముందు వరుసలో నిలిచిందన్నారు. అర్జీదారులతో నేరుగా ముచ్చ టిస్తూ కోనసీమ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మీరు అందించిన వినతులను వేగంగా మరియు నాణ్యతతో పరిష్కరించడం వల్ల నేడు కోనసీమ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ విజయం మాపై మరింత బాధ్యతను పెంచిందని అర్జీదారులను ఉద్దేశించి కలెక్టర్ అన్నారు. మీ సమస్య ఏదైనా సరే, అది మా దృష్టికి వచ్చినప్పుడు దానికి సరైన పరిష్కారం లభించేలా మేము ఎల్ల ప్పుడూ కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సేవలను మీకు మరింత చేరువ చేయడమే మా లక్ష్యమని మాపై నమ్మకం ఉంచినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలవడం ఎంతో సంతోషా న్ని ఇచ్చిందన్నారు. ఈ విజయానికి జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ నాయకత్వం, అధికారుల కృషి ప్రజలతో నేరుగా ముచ్చటిస్తూ సమ స్యలను త్వరితగతిన పరిష్కరించాలనే తపన ప్రధాన కారణమన్నారు.జిల్లా స్థాయి అధికారులందరూ సమన్వ యంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి చూపిన అంకితభావం ప్రశంసనీయమైనదన్నారు. ప్రజా సమస్య లను వేగంగా పరిష్కరించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు జిల్లా స్థాయి అధికారులందరికీ హృద యపూర్వక అభినంద నలు తెలియజేస్తున్నాన న్నారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు లో కూడా ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందిస్తూ జిల్లాను మరిన్ని విజయాల దిశగా నడిపిం చాలని ఆకాంక్షించారు. ముందంజలో నిలవడానికి అధికారులు చేసిన అసాధారణ కృషి జిల్లా ప్రజలకు గొప్ప ఆశీర్వాద మన్నారు.మీ అందరి సహకారం కొనసాగాలని, ఇలాంటి చర్యలతో జిల్లా అభి వృద్ధికి మరింత దోహదపడాలని కోరుకుంటున్నాని కలెక్టర్ తెలిపారు.

# వేట్లపాలెం బాణాసంచా పరిశ్రమ ఘటనపై సిట్ విచారణ



సామర్లకోట (మనసులో మాట) ఏప్రిల్ 1; సామర్లకోట మండలం వేట్లపాలెం లో ఫిబ్రవరి 28 జరిగిన బాణాసంచా పరిశ్రమ ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ బృందం బుధవారం విచారణ నిర్వహించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, ఈగల్ ఐ జి.ఆకే రవికృష్ణ వేట్లపాలెం లో ప్రమాదానికి గురైన బాణాసంచా పరిశ్రమ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక షుగర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్ లో అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో విచారణ నిర్వహించారు. బాధిత కుటుంబాలతోను, ఆయా శాఖల అధికారులతోనూ మాట్లాడినట్లు అధికారి సురేష్ కుమార్ విలేకరులకు తెలిపారు. పరిశ్రమ యజమాని స్వార్థం, పరిమితికి మించి బాణాసంచా తయారీ కారణంగానే ప్రమాదం సంభవించిందని, ప్రమాదంలో 28 మంది మృతిచెందగా, ముగ్గురు బాధితులు కోలుకున్నట్లు సురేష్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి పరిశ్రమ వద్ద భద్రత ఏర్పాట్లు లేకపోవనీ,అధికారుల వైఫల్యం కూడా కారణమని సురేష్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన అన్ని విషయాలను పరిశీలిస్తున్నామని, ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి వివిధ అంశాలపై నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకోవడం జరిగిందన్నారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని సురేష్ కుమార్ తెలిపారు. ఈగల్ ఐజి ఆకే రవికిష్ణ, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. పెద్దాపురం డిఎస్పి పనిచేసి ఈ ఘటనలో సస్పెన్షన్కు గురైన శ్రీహరి రాజు, ఆర్డీవో శ్రీరమణి కూడా విచారణకు హాజరయ్యారు. సామర్లకోట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్, వివిధ శాఖల అధికారులు పోలీసులు కూడా పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హయాంలో ప్రతీ నెల ఒకటవ తేదికే ఎన్‌టీఆర్ భరోసా

### లబ్ధిదారులకు పండగ వాతావరణం - కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సమయానికి పంపిణీ చేస్తుండటంతో వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారుల జీవితాల్లో పండగ వాతావరణం నెలకొంటోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు.కాకినాడ నగరంలోని 29వ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన పింఛన్లు పంపిణి కార్యక్రమంలో భాగంగా శాసన మండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్సిటీ ఎమ్మెల్యే కొండబాబు తో పాటు కాకినాడ మహా నగరం ఇన్చార్జి కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణతో కలిసి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పింఛన్ లబ్ధిదారులు ఇప్పుడు నెల మొదటి రోజునే పింఛన్ అందుకోవడం వల్ల ఆర్థిక భద్రతతో పాటు మానసిక ప్రశాంతతను కూడా పొందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధిని సమన్వయం తో ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఖాయం చేసి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రతి వర్గానికీ న్యాయం చేసే విధంగా పథకాలు అమలు అవుతున్నాయని, ముఖ్యంగా పింఛన్ పథకం వృద్ధులు, వికలాంగులకు జీవనాధారంగా మారిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, బాలా త్రిపుర సుందరి ఆలయ చైర్మన్ గ్రంధి బాబ్జి, టీ పి ఆర్ ఓ శైలజ, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, 29వ డివిజన్ ఇంచార్జ్ అమలకంటి బలరామ్, నాయకులు గదుల సాయిబాబా, బీజేపీ నాయకులు చెక్క రమేష్, వెలుగుబంటి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపేట నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.18.26కోట్ల పంపిణీ

### - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 1..** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే అంతకు ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు చెందిన 42వేల మందికి రూ.18.26కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. రూ.4వేలు పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు అందిస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని, స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు కృత్ఞతలు తెలియజేశారు.

# దేవీపట్నం రామదుర్గం కొండల్లో పులి సంచారం


### సందర్శకులను సురక్షితంగా తరలించిన అటవీ శాఖ



**రంపచోడవరం (మనసులో మాట) ఏప్రిల్ 1..** దేవీపట్నం మండలం రామదుర్గం కొండ ప్రాంతంలో పెద్ద పులి సంచారం ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజానగరం మండలానికి చెందిన సుమారు 50 మంది సందర్శకులు యాత్ర కోసం రామదుర్గం కొండకు వెళ్లి, పులి సంచారం కారణంగా అక్కడే చిక్కుకుపోయి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించారు. ఎం.పీ పురందేశ్వరి కార్యాలయం ద్వారా డిప్యూటీ సీఎం కార్యాలయానికి, పోలవరం జిల్లా కలెక్టర్‌కు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డి ఎఫ్ ఓ ) కు సమాచారం అందజేయబడింది. అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, ట్రాక్టర్ల సహాయంతో ప్రత్యేక బృందాలను పంపించి అక్కడ ఉన్న సందర్శకులను సురక్షితంగా తరలించే చర్యలు ప్రారంభించారు. పరిస్థితిని సమీక్షిస్తూ, ప్రతి దశలో సమాచారాన్ని అందిస్తూ అటవీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.గత ఐదు రోజులుగా దేవీపట్నం మండలం గోదావరి తీర ప్రాంతంలో పులి సంచారం ఉన్నట్లు గుర్తించిన అధికారులు, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి సంచారం గురించి పూర్తి సమాచారం లేకుండానే రామదుర్గం కొండకు వెళ్లిన సందర్శకులు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నట్లు అధికారులు తెలిపారు.అటవీ శాఖ అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, అటవీ ప్రాంతాలకు వెళ్లే ముందు సంబంధిత అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలని, ఒంటరిగా లేదా గుంపులుగా అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


## కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం దిగి వచ్చేవరకు ఆందోళన...

- 8వ రోజు రిలే నిరాహారదీక్ష ప్రారంభించిన...
- మెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏసూరి శంకర్



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి మరియు రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని తదితర డిమాండ్ లతో గత వారం రోజులు గా నిరాహార దీక్షలు చేస్తూ సంగతి పాఠకులకు విధేతమే. తమ న్యాయ మైన డిమాండ్స్ అంగీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జి.జి.హెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద గత నెల మార్చి 25వ తేది న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు బుధవారం కి 8వ రోజుకి చేరింది. జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏసూరి శంకర్ దీక్షలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ కి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. యాజమాన్యం దిగి వచ్చేవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించాలన్నారు. అవసరమైతే జిజిహెచ్ మెస్ వర్కర్స్ సభ్యులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. 8 వ రోజు దీక్షల్లో సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె. భాగ్యలక్ష్మి, శేరి దుర్గ, పోతుల దేవి, లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్స్ మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు లతో పాటు చెక్కా ధర్మారావు, అప్పన్న, బాలరాజు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, సోమరాజు, ఆదినారాయణ, భాస్కరరావు, షఫీ ఖాన్, వివిఎన్ కుమార్, మూర్తి,రోజా, కుమారి , ఏసూరి శ్రీనివాస్, రాజశేఖర్, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## లోకసభ లో ఏ. పి. రాజధాని అమరావతి కి ఆమోదం...

కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1.. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో బుధవారం ఆమోదం పొందింది. ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా అమరావతి పేరును అధికారికంగా చేర్చనున్నారు.కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. వైసీపీ పార్టీ వాకౌట్ చేసింది.ఈ బిల్లు ఆమోదంతో అమరావతి రాజధాని అంశానికి చట్టపరమైన ముద్ర పడటమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి దిశలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.

## వేకువజామునే పెన్షన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది



రంపచోడవరం మనసులో మాట ఏప్రిల్ 1 వేకువ జామునే రైతు పొలం పనులకు వెళ్తాడో వెళ్ళడో తెలియదు కానీ అడ్డతీగల ఎంపీడీవో ఆధ్వర్యంలో పనిచేసే సచివాలయ సిబ్బంది మాత్రము పెన్షన్లను వేకువ జాము నుండే అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ ఆధ్వర్యంలో తను కూడా స్వయంగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటూ సిబ్బందిని హుషారు పరుచుతూ సిబ్బందితోపాటు ఎండిఓ కూడా తిరుగుతూ పెన్షన్లను పంపిణీ చేయడం ఈ ప్రాంత పెన్షన్ దారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు మండల స్థాయి అధికారి మా ఎల్ల మధ్యకు వచ్చి మమ్మల్ని పలకరించుదు మాకు పెన్షన్లు ఇచ్చుదు మా యోగక్షేమాలు అడిగి మాకు మంచి సలహాలు ఇచ్చుతూ పెన్షన్లన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడం ఈ ప్రాంత ప్రజలు ఎండివోను అభినందిస్తున్నారు.

## పల్లవారి పాలెం లో మెగా ఉచిత వైద్య శిబిరం



ముమ్మిడివరం (మనసులో మాట) ఏప్రిల్ 1. ముమ్మిడివరం మండలం పళ్ళవారిపాలెం లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ చిక్కం వెంకట పద్మజా శ్రీనివాస్ ప్రారంభించారు. బుధవారం ఆకాశం హాస్పిటల్, పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. శిబిరం చికిత్స కోసం లో 100 మంది కి పైగా ప్రజలు హాజరయ్యారు. డాక్టర్స్ క్రాంతి ప్రియ, మురళీ ఆనంద్, శ్రీహరి వీరికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సభ్యులు జక్కంపూడి కిరణ్,సి. హెచ్.ప్రకాష్, వల్లభరెడ్డి లక్ష్మి నారాయణ సెక్రటరీ రాజకుమార్,ఆకాశం హాస్పిటల్ ప్రతినిధులు చిక్కం పెదబాబు, కుమార్, శివ, అరుణ్ లతో పాటు సచివాలయం సిబ్బంది,ఆకాశం హాస్పిటల్ సిబ్బంది తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు స్వాగతం



కాకినాడ (మనసులో మాట )ఏప్రిల్ 1.. ప్రజలు ప్రజా ప్రతినిధులు అందరి సహకారం తో సమిష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం కాకినాడ జిల్లా నూతన కలెక్టరుగా ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తమ కార్యాలయ ఛాంబరులో పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన విశాఖపట్నం నుండి అన్నవరం చేరుకుని శ్రీ రమా సత్యన్నారాయణ స్వామి వారిని దర్శించి, అర్చన, ఆశీర్వాద కార్యక్రమాలలో పాల్గొన్నారు. తదుపరి ఉదయం 9-30 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టరు కార్యాలయాని చేరుకోగా ఆయనకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆర్ఓ డి.తిప్పేనాయక్, జిల్లా అధికారులు, వేదపండితుల పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబరులో ఆయన పదవీ బాధ్యలు చేపడుతూ సంతకం చేసి, పండితుల వేదస్వస్తి, ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఘన చరిత్ర, ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పనిచేయడం తనకు లభించిన అపూర్వ అవకాశమని పేర్కొంటూ ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేశారు. విశాఖపట్నంలో కలెక్టర్ గాను, జివిఎంసి కమీషనర్ గాను పనిచేసిన అనుభవంతో కాకినాడ జిల్లాలో గ్రామీణ, పట్టన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అందరికీ అందించేందుకు, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాల కనుగుణంగా పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన ప్రాధాన్యతలుగా పనిచేస్తామని, ముందు పనిచేసిన కలెక్టర్లు చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కాకినాడ వ్యవసాయ ప్రధాన జిల్లా అయినందున, రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదనలు, ఆదాయం పొందేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా భౌగోళిక విశిష్టతలను గరిష్ట స్థాయిలో సద్వినియోగంలోకి తేవడం ద్వారా జిల్లా ఆర్థిక ప్రగతికి కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి రమేష్ బాబు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, ఎన్.శ్రీధర్, సిపిఓ పి.త్రినాథ్, డ్వామా పిడి పి.వెంకట లక్ష్మి, సమాచారశాఖ డి.డి పి.తిమ్మప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సహజ వ్యవసాయ శిక్షణ - రెండవ రోజు విజయవంతం




రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1: ఆర్వైఎస్ఎస్, ఏపీసీఎన్ఎఫ్, వ్యవసాయ, ఉద్యాన శాఖలు, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు సహజ వ్యవసాయ పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించారు.
ముఖ్యంగా ప్రి మాన్ సూన్ డ్రై షోయింగ్ (పీఎండీఎస్) విధానం అమలు, దాని ప్రయోజనాలు, రైతులు అనుసరించాల్సిన పద్ధతులపై ప్రాయోగికంగా వివరించారు. పీఎండీఎస్ కిట్ల తయారీ విధానం, వాటిలో ఉపయోగించే పదార్థాలు, గ్రామ స్థాయిలో వాటి పంపిణీపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అదే విధంగా దేశీయ విత్తనాల సంరక్షణ, విత్తనాల సేకరణ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.
ఆర్ఎస్కే స్థాయిలో పీఎండీఎస్ కిట్లను సిద్ధం చేసి, వీఏఏ, వీహెచ్ఏల ద్వారా రైతులకు సమయానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ శిక్షణలో డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ అధికారులు, ఏపీసీఎన్ఎఫ్ సహజ వ్యవసాయ సిబ్బంది, ప్రగతిశీల రైతులు చురుకుగా పాల్గొన్నారు.
రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా సహజ వ్యవసాయంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జీవామృతం, ఘన జీవామృతం వినియోగంపై ప్రాక్టికల్ డెమోలు ఇచ్చారు. నేల ఆరోగ్యాన్ని కాపాడే సహజ పద్ధతులపై వివరించారు. పంటలలో రోగ నిరోధక శక్తి పెంచే విధానాలను తెలియజేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం సాధించే సహజ వ్యవసాయం ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఏపీ ఎంఐపీ పీడీ ఏ దుర్గేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్ మల్లిఖార్జున రావు, నాచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నీతు గ్రేస్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

# ఆస్తి పన్నులు వసూళ్ల లో రాష్ట్రంలో ఎనిమిది స్థానం లో మండపేట

### ఉమ్మడి తూర్పు గోదావరి లో రెండవ స్థానంలో - డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రథమ స్థానం



మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 1.. మండపేట పురపాలక సంఘం ఆస్తి పన్ను వసూళ్లు లో రాష్ట్రంలో ఎనిమిదవ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 న ముగిసింది. అర్ధరాత్రి రిపోర్ట్ లు ఆధారంగా మండపేట శాతం తో ఎనిమిది స్థానంలో ఉంది. రాష్ట్రం లో ప్రథమ స్థానం లో పల్నాడు జిల్లా వినుకొండ 85 శాతం తో ఉంది. రెండవ స్థానంలో విజయనగరం జిల్లా రాజం 81.47 శాతం తో సాధించింది. బాపట్ల జిల్లా అద్దంకి మున్సిపాల్టీ 80.5శాతం తో మూడవ స్థానం లో ఉంది. నాల్గవ స్థానం మంగళగిరి తాడేపల్లి, అయిదవ స్థానం లో కొవ్వూరు, ఆరవ స్థానం లో రేపల్లె మున్సిపాల్టీ లు వుండగా ఏడవ స్థానంలో గొల్లప్రోలు ఉంది. ఎనిమిది స్థానం లో మండపేట ఉంది. తొమ్మిది స్థానం లో చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాల్టీ లు ఉన్నాయి.
ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రథమ స్థానం గొల్లప్రోలు , రెండవ స్థానం లో మండపేట,తుని మూడవ స్థానం లోవుంది. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో మండపేట ప్రథమ స్థానం, రెండవ స్థానం ముమ్మిడివరం లో ఉన్నాయి. ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా లో ప్రథమ స్థానంలో కొవ్వూరు, ద్వితీయ స్థానం లో మండపేట ఉన్నాయి. నియోజకవర్గం పునర్విభజన అయినప్పటికీ మున్సిపాల్టీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లోనే డేటా చూపిస్తుంది. దీంతో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో ప్రథమ స్థానంలో మండపేట ఉంది. సర్వర్ డౌన్ లో ఉండటం వల్ల చాలా మంది మండపేట లో అర్ధరాత్రి పన్నులు చెల్లించకుండానే వెనుదిరిగారు. స్వల్ప పర్సంటేజీ లో మొదటి స్థానం చేజారింది.

# కూటమి ప్రభుత్వంపై తోట నరసింహం తీవ్ర విమర్శలు

**- తిరుపతి లడ్డుపై రాజకీయం చేయడం తప్ప కూటమి పాలనలో ప్రజలకు చేసిందేమిలేదు**

**- మాజీ మంత్రి,జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం**



కిర్లంపూడి (మనసులో మాట) ఏప్రిల్ 1.. తిరుపతి లడ్డుపై రాజకీయం చేయడం తప్ప కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిందేమిలేదని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి దాడి రాజగోపాల్ (రాజా)కార్యాలయంలో రాజా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోట నరసింహం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.గత వైసీపీ ప్రభుత్వ పాలనలో లక్షలాది మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించడమే కాకుండా హౌసింగ్ రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.కానీ గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లను తమవిగా చూపిస్తూ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు.ప్రజల సంక్షేమం కోసం నిజంగా ఏం చేశారో చెప్పలేని స్థితిలో ఉన్న ప్రభుత్వం,గత పనులను తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటని తోట నరసింహం వ్యాఖ్యానించారు.తిరుపతి లడ్డు అంశాన్ని ప్రస్తావిస్తూ,దానిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించు కుంటున్నారని విమర్శించారు.సంబంధిత నివేదికల్లో కల్తీ జరగలేదని విచారంలో స్పష్టంగా తేలినప్పటికీ ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారానికి బాధ్యులైన చైర్మన్ బి.ఆర్. నాయుడుపై కూడా తీవ్ర విమర్శలు చేశారు.సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన వీడియో లు వైరల్ అవుతున్న నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వానికి,టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు కళ్ళు తెరవాలని శనివారం జగ్గంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పవిత్ర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తోట నరసింహం వెల్లడించారు. వైసిపి నాయకు లు పెనగంటి రాజేష్,వేగి రామకృష్ణ, పాముల చంటి,వేగి సాంబశివ,తుమ్మల రాజా,దాడి పెదబుజ్జి,యల్లపు నానాజీ,శరకణం సంతోష్, పిట్టా లోవ, టాటా శ్రీను, దాడి చిన్న రాజ్ గోపాల్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.



## అన్నవరం రత్నగిరిపై నూతన కలెక్టర్ కు పూర్ణకుంభ స్వాగతం

కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1.. కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ గా ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ భాద్యతలు స్వకరించిన తదుపరి బుధవారం కుటుంబ సమేతంగా అన్నవరం శ్రీ రామా వీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ. ఓ వేంద్ర త్రినాథరావు కలెక్టర్ దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం వేదపండితులుచే వేదఆశీర్వచన చేయగా స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆయనకు ఈ. ఓ అందజేశారు.

### పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్

**- పింఛన్ అంటే నమ్మకం కూటమి ప్రభుత్వం అంటే భరోసా**

**- ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్**



కాజులూరు (మనసులో మాట) మార్చి 1.. కాజులూరు మండలంలోని 26 గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ గ్రామాల లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను కూడా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఒకరోజు ముందుగానే అందజేస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు దివ్యాంగులకు ఆర్థిక సహాయం అవుతుందని, ఈ పింఛన్ వల్ల అనేక కుటుంబాలు గౌరవంగా జీవిస్తున్నాయని అన్నారు. పింఛన్ కేవలం డబ్బు మాత్రమే కాదని, అది ప్రభుత్వం పేదల పట్ల చూపిస్తున్న బాధ్యత, భరోసా అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి అర్హుడికి పింఛన్ అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, మేడిశెట్టి పెద్ద, చుండ్రు వీర్రాజు చౌదరి , రైతు అధ్యక్షుడు బలుసు శివప్రసాద్ ,సొసైటీ ప్రెసిడెంట్ కోట తాతబ్బాయి, అంగర కృష్ణ, అమలాపురం పార్లమెంటరీ అది కార ప్రతినిది వనుం వీరబ్రహ్మం నల్ల వసంత హరిణి, దాట్ల బుచ్చిబాబు దంతులూరి వంశీ నందికోళ్ల రామం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రెడ్డి శేషగిరిరావు,

# పురమిత్ర యాప్ ను ప్రజలు సద్వినియోగించు కోవాలి

**- కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ పిలుపు**




కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1.. కాకినాడ నగర ప్రజలు పురమిత్ర యాప్ ద్వారా అందుబాటులో ఉన్న పౌర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సూచించారు. బుధవారం ఉదయం నగరం లోని 27వ డివిజన్ పరిధిలోని తిలక్ వీధి, దూదిమిల్లు ప్రాంతాశీ లో విస్తృతంగా పర్యటించిన ఆయన, అక్కడి శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత పోర్టుకు వెళ్లే రహదారి సమీపంలో ఉన్న ప్రధాన కాలువకు సంబంధించిన కల్వర్టును కమిషనర్ పరిశీలించారు. పరిశీలనలో భాగంగా ఒక ఇంటి వద్ద కాలువలో చెక్కలు, పాత సామాన్లు వేయడం గమనించిన ఆయన, వెంటనే వాటిని తొలగించాలని సంబంధిత ఇంటి యాజమానిని ఆదేశించారు. అదే విధంగా మార్గం మధ్యం లో ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వహకులు రోడ్డు మీదనే వాటర్ టిన్లను ఉంచిన విషయాన్ని గుర్తించిన కమిషనర్ వారిని మందలించి వెంటనే వాటిని తొలగించాలంటూ అధికారులను ఆదేశించారు.ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్లలో వేయాలని, పారిశుద్ధ్య కార్మికులకు అందించి నగర పరిశు భ్రతకు సహకరించాలని ప్రజలను కమిషనర్ కోరారు. అలాగే వీధిలైట్లు, త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు వంటి ఏవైనా సమస్యలు ఉంటే పురమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. యాప్‌లో అందిన ఫిర్యాదులను 24 గంటలలోపు పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.అందువల్ల నగర ప్రజలందరూ పురమిత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని కమిషనర్ పిలుపు నిచ్చారు. ఈ పర్యటనలో శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, ఎలక్ట్రికల్ ఈఈ అర్జున్, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక




అమరావతి బిల్లుకు ఆమోదం

# రాష్ట్ర భవిష్యత్తుకు శుభపరిణామం

**- అముడ చైర్మన్**

**అమలాపురం (మనసులోమాట) ఏప్రిల్1:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో అమలాపురం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు ఇది శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. అమరావతిని రాష్ట్రానికి ఏకైక, శాశ్వత రాజధానిగా గుర్తించే ప్రక్రియ మరింత బలపడిందని, ఈ నిర్ణయం ద్వారా పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు.
అమరావతి రాజధాని అంశంపై ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితికి ఈ బిల్లు ముగింపు పలికిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక అడుగు అని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు, పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుందని, దీర్ఘకాలిక ప్రయోజనాలు రాష్ట్రానికి చేకూరుతాయని అభిప్రాయపడ్డారు.
2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీసిందని, పెట్టుబడులు వెనక్కి వెళ్లే పరిస్థితి తీసుకొచ్చిందని స్వామి నాయుడు విమర్శించారు.

# అమరావతికి చట్టబద్ధత ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష నెరవేరిన శుభదినం

**కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**



**న్యూఢిల్లీ/భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 1 :** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026 ఆమోదం పొందడంపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోకసభలో సుదీర్ఘ చర్చ అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందడం రాష్ట్ర భవిష్యత్తుకు శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఈ చట్ట సవరణతో అమరావతికి ఏకైక రాజధానిగా పటిష్టమైన చట్టపరమైన భద్రత లభించిందని, ఇకపై అమరావతి శాశ్వత రాజధానిగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.
రాజధాని విషయంలో గత కొన్నేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి, సందిగ్ధతకు ఈ చారిత్రాత్మక పరిణామంతో శాశ్వతంగా తెరపడిందని శ్రీనివాస వర్మ వివరించారు. అమరావతి కోసం భూములిచ్చిన వేలాది మంది రైతుల త్యాగానికి, ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని ఆయన అభివర్ణించారు. ధర్మం కోసం పోరాడిన అమరావతి ఉద్యమకారుల సంకల్పం నేడు చట్టరూపం దాల్చడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి బిల్లు ఆమోదానికి పూర్తి సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ చట్టపరమైన రక్షణతో అమరావతి అంతర్జాతీయ స్థాయి నగరంగా రూపుదిద్దుకుంటుందని శ్రీనివాస వర్మ ధీమా వ్యక్తం చేశారు.

# గొల్లపల్లికి జననీరాజనం

**- ప్రజా చైతన్య యాత్రకు విశేష స్పందన - జనసంద్రంగా మారిన యానాం పురవీధులు**
**- ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు**
**- పాదయాత్రతో గొల్లపల్లి విజయం ఖరారు అయిందంటున్న ప్రజలు**



**యానాం (మనసులో మాట) ఏప్రియల్ 1:** యానాం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కు జనం నీరాజనం పలికారు. యానాం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ప్రచారశీలో భాగంగా బుధవారం ప్రజా చైతన్య యాత్ర పేరిట నిర్వహించిన పాదయాత్రకు విశేష స్పందన వచ్చింది. స్థానిక బెజవాడ గార్డెన్స్ లో తన కార్యాలయంలో గొల్లపల్లి ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడ నుంచి యర్రా గార్డెన్స్, చింతా వారి వీధి, ఓల్డ్ ఏజ్ హోమ్, పైడికొండల వారి వీధి శివాలయం, త్యాగరాయ వీధి, విష్ణాలయం వీధి, అంబేద్కర్ నగర్, న్యూ బస్టాండ్, వెంకట్ నగర్, పిల్లారాయ వీధి తదితర ప్రాంతాల్లో అశేష జన సందోహంతో పాదయాత్ర చేసారు. అడుగడుగున గొల్లపల్లి కి ప్రజలు పూలు జల్లుతూ, హారతులు ఇస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలకు గొల్లపల్లి అభివాదం చేస్తూ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఏప్రియల్ 9న జరిగే పోలింగ్ లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజా చైతన్య యాత్ర పాదయాత్రకు ప్రజలు పోటెత్తడంతో యానం పురవీధులు జన సముద్రాన్ని తలపించాయి. ఈ పాదయాత్రతో గొల్లపల్లి విజయం ఖాయమైనట్టేనని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్, జై గొల్లపల్లి జై జై గొల్లపల్లి అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హస్తం గుర్తును చూపుతూ ఓటు వేయాలని అభిమానులు నినాదాలు చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి గొల్లపల్లి, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమర్ జహాన్ బేగ్, యానాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, గొల్లపల్లి అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు జేఎన్టీయూకే స్నాతకోత్సవం...

**- రాష్ట్ర గవర్నర్ చేత 36 వేల మందికి పైగా డిగ్రీలు ప్రదానం...**
**- జెఎన్‌టియుకె వీసీ సి.ఎస్. ఆర్. కె ప్రసాద్ వెల్లడి**



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1 ..** కాకినాడ లోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూకే) 12వ స్నాతకోత్సవం గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ స్నాతకోత్సవం లో సుమారు 36వేల 309 మంది 2024- 25లో ఉత్తీర్ణులైన వారికి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేత పట్టాలను అందిస్తున్నట్లు జెఎన్టీయుకె విసి సి ఎస్ ఆర్ కే ప్రసాద్ తెలిపారు. బుధవారం విసి ప్రసాద్ తన చాంబర్లో విలేకరులతో సమావేశం నిర్వహించి స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జేఎన్టీయూ 1946లో ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమైందని 2008లో విశ్వవిద్యాలయం హోదా స్థాయికి చేరిందన్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై డిగ్రీలు ప్రధానం చేస్తున్నారని చెప్పారు అలాగే జేఎన్టీయూ అందించే గౌరవ డాక్టరేట్ శాంతాబయోటిక్ అధినేత కెఐ వర ప్రసాద్ రెడ్డికి అందించనున్నట్లు తెలిపారు. 1965 - 70 లలో జెఎన్టియులో చదివారని హెపటైటిస్-బికి వ్యాక్సిన్ కనుగొన్నట్లు తెలిపారు. 2005లో భారత ప్రభుత్వం వరప్రసాద్ రెడ్డికి పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించిందని పేర్కొన్నారు. నకిలీ ధ్రువపత్రాల నిర్మూలన కోసం ఎన్ఏడి పద్ధతిలో తయారు చేస్తున్నామని 4వేల మంది విద్యార్థులకు గవర్నర్ బటన్ నొక్కడంతో ఆన్లైన్లో చేరతాయని చెప్పారు. ఇంకా కళాశాలలో నూతన కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవం విద్యార్థులకు ఒక పండుగ లాంటిదని దీనికి అందరూ హాజరు కావాలని వీసీ ప్రసాద్ కోరారు. ఉత్తీర్ణులైన 93 శాతంలో కేవలం 7 శాతం మంది మాత్రమే పీజీలు చేస్తున్నారని ఇది చాలా తక్కువ అని వీ.సీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెక్టార్ పి సుబ్బారావు, రిజిస్టర్ ఆర్ శ్రీనివాసరావు, వి. సి ఓ.ఎస్.డి డి. కోటేశ్వరరావు, డైరెక్టర్ ఎం.హెచ్. ఎం. కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా ప్రాజెక్టు పనులను పరిశీలించిన రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ



**పెద్దాపురం (మనసులో మాట) ఏప్రిల్ 1;** రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ పెద్దాపురం మండలం ఆనూరు వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన 15 వాట్స్ మెగా విద్యుత్ ప్లాంట్ పనులను రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పి సురేష్ కుమార్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, జిందాల్ పవర్ ప్లాంట్ ప్రతినిధులు ప్లాంట్ ఏర్పాటు, నిర్వహణ వివరాలను ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్కు వివరించారు. ముందుగా సామర్లకోట పెద్దాపురం పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను కూడా సురేష్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. స్వచ్ఛ సంకల్పాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, తడి చెత్త పొడి చెత్త పద్ధతి కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డినీ ఆదేశించారు. జిల్లా స్థాయిలో జిందాల్ సహకారంతో నిర్మిస్తున్న ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు


# పిఆర్సి కమిషన్ ను నియమించి, 29 శాతం ఐఆర్ ప్రకటించాల్సిందే...

**- కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద యుటిఎఫ్ రణభేరి 3.0 నిరాహార దీక్షలు**




**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** ఆంధ్రప్రదేశ్ ఐక్య పరిచే ప్రదేశం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని ఉదయం తొమ్మిది గంటలకు ఎస్. టి. ఎఫ్. ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు కుమారి అరుణ కుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమల్లోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా పిఆర్సి కమిషనర్ను నియమించలేదని అలాగే ఐ ఆర్ కూడా ప్రకటించలేదని పెండింగ్లో ఉన్న డీ.ఎ లను విడుదల చేయలేదని విమర్శించారు. అంతే కాకుండా సిపిఎస్ రద్దు చేస్తానని మరోసారి ఈ ప్రభుత్వం కూడా కాశీ యాత్రను దిశగా ప్రేమిస్తుందని ఎద్దేవా చేశారు. యు.టి.ఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. సూరిబాబు కే.వీ.పీ నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తక్షణమే తమకు రావలసిన డిఏ బకాయిలను పెంచాలని, ఐ.ఆర్ ప్రకటించాలని, హైస్కూల్ లో నాన్‌టీచింగ్ పోస్టులను నియమించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను చాలా చులకనగా మాట్లాడుతున్నారని రేషనైజేషన్ పేరుతో వేలాది పోస్టులను తొలగిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ హామీలను నెరవేర్చే వరకు ఈ పోరాటం ఆపేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గోవిందరాజులు అసోసియేట్ అధ్యక్షురాలు నాగమణి, జిల్లా కార్యదర్శులు పీవీ సత్యనారాయణ, వి.వి. రమణ, జి. నాగరాజు, కే.పెద్దిరాజు, ఎస్.ఎస్.ఆర్. కే. ప్రసాద్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# సర్పంచ్ గా నకిరెడ్డి సేవలు వెలకట్టలేనివి



**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 1..** రాష్ట్రంలో గ్రామ సర్పంచుల పదవీకాలం ముగించడంతో జగ్గంపేట మండలం, జె.కొత్తూరు పంచాయితీ గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు పదవి విరమణ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే వైసీపీ సీఈసీ నెంబర్ జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె.కొత్తూరు గ్రామానికి నకిరెడ్డి నాగేశ్వరరావు గ్రామ సర్పంచిగా చేసిన అభివృద్ధిని కొనియాడారు. గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గుడి దగ్గర డ్రెయిన్, ఆయన సొంత నిధులతో మంచినీళ్లచెరువుగట్టు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటడం, నీటి సదుపాయం కొరకు పైపులైన్ విస్తరణ పనులు, కాలనీ పుంత లో బోర్వెల్ నిర్మాణం, గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్ , రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణం , నిధులు లభ్యతను బట్టి సీసీ డ్రైన్ నిర్మాణం వంటి పనులు గ్రామంలో జగనన్న కాలనీకి సంబంధించిన స్థలాన్ని కేటాయించి అప్పటి స్థానిక శాసనసభ్యుడు జ్యోతులచంటిబాబు చేతుల మీదుగా 275 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి పరిచారన్నారు. ప్రతి సామాన్యునికి అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్య తన సమస్యగా భావించి, తగు మార్గంలో పరిష్కారం చూపుతూ సర్పంచ్ పదవికి వన్నె తెచ్చిన నేత నకిరెడ్డి నాగేశ్వరరావు అని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి సభ్యులు మడగల పెద్దకాపు, మరియు చల్లా కృష్ణ, నర్సీ కృష్ణార్జున, నకిరెడ్డి పెద్దకాపు, నకిరెడ్డి శివ, అబ్బిరెడ్డి భగవాన్, అడప గంగాధర్ రావు, నగిరెడ్డి నాగరాజు, బుల్లి వెంకట్రావు మాస్టారు , నకిరెడ్డి చక్రరావు మరియు గౌరవ వార్డు సభ్యులు మందపల్లి రాఘవ, అడపా పెంటయ్య, అడపా అర్జునరావు,నకిరెడ్డి అచ్చిబాబు, నకిరెడ్డి మంగ, వెంకటలక్ష్మి, దుంగా వెంకన్న అంగన్వాడీ టీచర్లు సిబ్బంది ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సత్కరించారు.




# సోషల్‌మీడియాపై కేంద్రం కత్తి!..

**- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఇక అంతే!**

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** సోషల్ మీడియా లో పోస్టు చేసే వారికి డైరెక్టుగా కేంద్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వనున్నది.ఆ పోస్టును షేర్ చేసిన వారికి కూడా తలనొప్పులు తప్పవు.దేశ భద్రత పేరిట కొత్త ప్రతిపాదనలుకేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నది .ఐటీ రూల్స్ సవరణకు సిద్ధంఅయ్యాయి. కేంద్రం లోని మోదీ ప్రభుత్వం పై మీ సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడుతున్నారా? లేదా మీ మిత్రుడు పంపించిన పోస్టును మరెవరికైనా షేర్ చేస్తున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల మీద ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మినిస్ట్రీ నుంచి మీకు నోటీసులు రావొచ్చు. ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే యూజర్లను, కంటెంట్ క్రియేటర్లను, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కూడా న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నది.అభ్యంతరకరమైన పోస్టులు పెడితే, డైరెక్టుగా యూజర్లకే నోటీసులు పంపించనున్నది. ఈ మేరకు ఐటీ నిబంధనలు, 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14 నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా కోరింది.

# పేదల ముంగిట సంక్షేమం - కొత్త పింఛన్లు పంపిణీ



**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 1..** పేదల ముంగిట సంక్షేమం అభివృద్ధి తెచ్చింది కూటమి ప్రభుత్వం అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట పట్టణ పరిధిలో 10 వ వార్డుకు చెందిన ఉయ్యూరి వరలక్ష్మి, 14వ వార్డుకు సంబంధించి బొడ్డు పుష్పావతి కి ఈ నెలలో క్రొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పింఛన్లు పంపిణీ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్ టీవీ రంగారావు కూటమి నాయకులు చంద్రు సోమరాజు, శెట్టి రవి కుమార్, పిట్టా రాజబాబు,సాధనల చక్రపాణి, శిరంగు ఈశ్వరరావు,బడుగు రత్నరాజు, సచివాలయం సిబ్బంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కారు ను డీ కొట్టిన మోటార్ సైకిల్



**రంపచోడవరం (మనసులో మాట) ఏప్రిల్ 1..** అడ్డతీగల పెట్రోల్ బంక్ లో పెట్రోల్ కొట్టించుకుని బయటకు వస్తున్న పల్సర్ బైక్ బంకు నుండి వేగంగా హైవే మీదకు రావడంతో అదే సమయంలో ఏలేశ్వరం వైపు నుండి అడ్డతీగల వైపు వస్తున్న కారును వేగంగా ఢీకొట్టడంతో కారు తునాతునకులు అయ్యింది. బైకు గల వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి.

# పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాలలో 'పాలిసెట్' ఉచిత శిక్షణ..




**పిఠాపురం, (మనసులో మాట)ఏప్రిల్ 1:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2026 ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె. మారీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుండి 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ ప్రత్యేక తరగతులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో శిక్షణ ఉంటుందని, పదవ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీ లోపు పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకుని ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు ఇతర వివరాల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
KANCHARLA



## మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను

# నిర్వీర్యానికి కుట్రలు

### - అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ఆరోపణ

**అమలాపురం (మనసులోమాట) ఏప్రిల్1:** గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే దిశగా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అమలాపురం మాజీ ఎంపి చింతా అనురాధ తీవ్ర ఆరోపణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే వాలంటీర్స్ వ్యవస్థను పక్కన పెట్టిన ఈ ప్రభుత్వం, ఇప్పుడు సచివాలయ వ్యవస్థను కూడా బలహీనపరుస్తూ, ప్రజలను మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితికి నెట్టివేస్తోందని అన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్ పేరుతో కలెక్టర్ కార్యాలయాలు, జిల్లా స్థాయి ఇతర కార్యాలయాలకు తరలిస్తూ, గ్రామాల్లో ప్రజలకు అందాల్సిన సేవలను ఉద్దేశపూర్వకంగా దూరం చేస్తున్నారని ఆమె ఘాటుగా విమర్శించారు. ఒక్క అల్లవరం మండలంలోనే 393 మంది సచివాలయ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 150 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని పేర్కొంటూ, ఒక్క మండలంలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయిలో ప్రజలు ఎంతటి ఇబ్బందులు పడుతున్నారో అర్థం మవుతోందన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, అలాగే డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సమానత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన మహోన్నత నిర్ణయం సచివాలయ వ్యవస్థేనని చింతా అనురాధ పేర్కొన్నారు.

అలాంటి ప్రజా కేంద్రిత పరిపాలనను మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో అమలు చేశారని, కానీ ఇప్పుడు అదే వ్యవస్థను కనుమరుగుచేయాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు.

సచివాలయ వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పుడు, ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఎక్కడికీ తిరగాల్సిన అవసరం ఉండేది కాదని ఆమె గుర్తుచేశారు. బర్త్ సర్టిఫికేట్ డెత్ సర్టిఫికేట్ వరకు, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, పౌర సేవలు అన్నీ గ్రామంలోనే, ప్రజల ముంగిట్లోనే అందుబాటులో ఉండేవని గుర్తు చేసారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజలు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, సేవలు ఆలస్యమవుతున్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల ముందు "సూపర్ 6" అంటూ పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి ప్రజలను నమ్మబలికిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత మాటల్లో ఒకటి, చేతల్లో మరొకటి అనే విధంగా వ్యవహరిస్తోందని అనురాధ విమర్శించారు.

ఈరోజు కూటమి ప్రభుత్వ పథకాలు 100 మందిలో 10 నుంచి 20 మందికి మాత్రమే అందుతున్నాయనే పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా అర్హులైన కుటుంబాలకు నిరాశ, అవస్థలు, కన్నీళ్లు మాత్రమే మిగులుతున్నాయని పేర్కొన్నారు.

నాడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేవని గుర్తుచేస్తూ, అనేక సంక్షేమ పథకాల ద్వారా కోట్ల రూపాయలను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసి, మధ్యవర్తులు లేకుండా, అవినీతి లేకుండా ప్రజా పాలన ఎలా ఉండాలో చూపించిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిదేనని ఆమె కొనియాడారు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మాత్రం ప్రజలకు సేవలు దూరమయ్యాయని, గ్రామస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం బలహీనపడిందని, ప్రజల నమ్మకం దెబ్బతింటోందని ఆమె పేర్కొన్నారు. వెంటనే సచివాలయ ఉద్యోగులను తిరిగి వారి స్థానాల్లోనే నియమించి, గ్రామస్థాయిలో సేవలను పునరుద్ధరించాలని అనురాధ డిమాండ్ చేశారు.

## జిల్లాలో ఎవ్వరూ ఎండ తీవ్రతకు గురికాకుండా

# అప్రమత్తం చేయాలి

- ఎల్నినో ప్రభావంతో ఎండా తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం
- చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి - చలివేంద్రాలు ఏర్పాటుచేయాలి
- ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలి
- ఎండ తీవ్రతపై ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష



**ఏలూరు, ఏప్రిల్, 1(మనసులో మాట) ..** ప్రస్తుత వేసవిలో ఎల్నినో ప్రభావం కారణంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం ఎల్నినో ప్రభావం కారణంగా ఎండ తీవ్రతపై తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో అధిక వేసవిలో అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప ఎండలో ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు బయట తిరగడం నివారించాలన్నారు. ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, చలివేంద్రాలు ఎక్కువగా ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణమే చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులు అన్నింటిలోనూ అవసరమైన మేర ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు సిద్ధం చేయాలన్నారు. వేడి గాలులు వీసే సమయంలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు నుండి వెళ్లే సమయంలో బయట తిరగకుండా పిల్లలు నేరుగా ఇంటికి వెళ్లేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు త్రాగునీరు, నీడలాగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సు స్టాండ్లు, బస్సు షెల్టర్లలో త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక శాఖ, రెవిన్యూ, తదితర శాఖల వారు ఫైర్ క్రాకర్స్ వంటి వాటికి జారీ చేసే లైసెన్స్ లు షాపులను పరిశీలించాలన్నారు. ఎండా తీవ్రత కారణంగా దెబ్బతినే పంటలు గురించి, వాటిని పరిరక్షించుకునే విధానాలు గురించి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేసే పోలీసు సిబ్బందికి ఎండ తీవ్రతకు గురికాకుండా అవసరమైన కూల్ జాకెట్స్ అందించాలన్నారు.ఎండా తీవ్రతపై ప్రజలను ఆందోళన కలిగించే రీతిలో సామజిక మాధ్యమాలలో సమాచారాన్ని వ్యాప్తి జరగకుండా చూడాలన్నారు. పాఠశాలలోని వాటర్ ట్యాంకులు,, ఓ హెచ్ ఆర్ ఎస్ లలో త్రాగునీటి నాణ్యతను పరిశీలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో త్రాగునీటి ఎటువంటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.వేసవిలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# జిల్లాలో పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 1 :** పశ్చిమ గోదావరి జిల్లాలో పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్ల విస్తరణను వేగవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టరేట్ ఛాంబర్ అఎంఎ గోదావరి గ్యాస్, సివిల్ సప్లైస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ & బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గృహ వినియోగదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు నిరంతర గ్యాస్ సరఫరా అందించేందుకు పీఎన్‌జీ గ్యాస్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించి, పీఎన్‌జీ కనెక్షన్లు పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాడేపల్లిగూడెం ప్రాంతంలో మొత్తం 9,902 గ్యాస్ కనెక్షన్లకు పైప్‌లైన్ సదుపాయం సిద్ధంగా ఉన్నప్పటికీ, కేవలం 63 మంది మాత్రమే వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఎల్పీజీ సిలిండర్లతో పోలిస్తే పీఎన్‌జీ గ్యాస్ వినియోగం ద్వారా వినియోగదారులకు నెలకు సుమారు రూ.100 నుండి రూ.150 వరకు ఆదా అవుతుందని చెప్పారు. ప్రజలు ముందుకు వచ్చి సంబంధిత శాఖల అధికారులతో సంప్రదించి పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లు పొందాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్ల కోసం గోదావరి గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్‌ను ఫోన్ నెంబర్ 9491424143 ద్వారా సంప్రదించాలని తెలిపారు. అలాగే భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు పట్టణాల్లో పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ఎన్.సరోజ, గోదావరి గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సత్య రాకేష్, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమరావతికి లోక్‌సభ ఆమోదం హర్షణీయం..



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 1:** అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా లోక్‌సభ ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం పిఠాపురం టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల జగన్ పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అగ్నిగుండంలా మార్చారని, పెట్టుబడిదారులు పారిపోయేలా చేశారని విమర్శించారు. రాజధాని రైతులను లాఠీచార్జీలు, అక్రమ కేసులతో వేధించారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతో రైతులు ఇచ్చిన 35 వేల ఎకరాలే నేడు రాష్ట్రానికి అతిపెద్ద ఆస్తి అని వర్మ పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఉన్న 8 వేల ఎకరాల భూమి విలువ సుమారు 25 వేల కోట్లు ఉంటుందని, ఆ నిధులతోనే రాజధానిని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. అమరావతిలో ఆర్‌బీఐ వంటి దిగ్గజ సంస్థలు, బ్యాంకులు కొలువుదీరి వేలమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. లోక్‌సభలో అమరావతికి శాశ్వత గుర్తింపునిచ్చిన ప్రధాని మోడీకి, కూటమి నేతలు పవన్ కళ్యాణ్, లోకేష్‌లకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. అమరావతిని ప్రపంచం గర్వించదగ్గ రాజధానిగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోము సత్యనారాయణ, స్టేట్ బీసీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు, పిఠాపురం పట్టణ ప్రధాన కార్యదర్శి కోరుప్రోలు శ్రీను, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పిల్లి చిన్న, పిఠాపురం పట్టణ మహిళా అధ్యక్షురాలు పొన్నాడ గంగాభవాని, మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ గాది రాజబాబు,నాయకులు నెక్కల సత్యనారాయణ, డిసి వైస్ చైర్మన్ ఎలుగుబండి బాబులు, అల్లవరపు నగేష్, ఆలం దొరబాబు, మట్ట గణేష్, షేక్ యాషన్, రావుల రమేష్, బుజ్జి, తదితరులు పాల్గున్నారు.

# పిఠాపురం మున్సిపాలిటీలో పన్నుల 'లక్కీ డ్రా'..

### - విజేతలకు బహుమతుల ప్రదానం





**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 01:** పట్టణ పురపాలక సంఘం పరిధిలో సకాలంలో ఇంటి పన్నులు చెల్లించిన వారిని ప్రోత్సహించేందుకు మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'లక్కీ డ్రా' ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో మొత్తం 14,258 అసెస్‌మెంట్‌లకు గాను 11.80 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, మార్చి 31 నాటికి 90 శాతం పన్నులు వసూలు చేశామన్నారు. దీనివల్ల పన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో 20వ స్థానంలో, జిల్లాలో 3వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ముఖ్యంగా మార్చి 28 నుండి 31 వరకు పన్ను చెల్లించిన 651 మందిని ఈ లక్కీ డ్రాకు అర్హులుగా ఎంపిక చేశామని వివరించారు. ఈ లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా ఫ్రిజ్‌ను రూ. 4,792 పన్ను చెల్లించిన పసుపులేటి రామ్మోహన్ గెలుచుకున్నారు. రెండో బహుమతి కింద వెట్ గ్రైండర్లను బొబ్బిలి సుబ్బలక్ష్మి (రూ. 3,297 చెల్లింపు), భవిరిశెట్టి శ్రీనివాస్ (రూ. 2,098 చెల్లింపు) దక్కించుకున్నారు. అలాగే మూడో బహుమతిని వీరా సునీత (రూ. 2,000), మున్నూరు వీర్రాజు (రూ. 1,657), కాదా నాగరాజు (రూ. 1,129) గెలుచుకున్నారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన పౌరులకు కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వెంకటరంగా, సచివాలయ అడ్మిన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## రాజధాని అమరావతిపై

# జగన్ రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్రానికి చేటు

### - కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 1..** రాష్ట్ర రాజధాని విషయంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రానికి చేటు చేసే విధంగా ఉన్నాయని కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు అన్నారు. బుధవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీఎం చంద్రబాబు ఉన్నప్పుడు అమరావతి రాజధాని గా చేయాలని నిర్ణయించారని గుర్తు చేసారు. తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రానికి మూడు రాజధానులు గా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉండాలని చెప్పారని అన్నారు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత రాజధానిగా అమరావతి కొనసాగించాలని అసెంబ్లీ లో తీర్మానం చేశారని తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీలు అభిప్రాయం చంద్రబాబు తీసుకున్నారని చెప్పారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్లో ఉన్నప్పుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడు తున్నారని విమర్శించారు. ఆయనకు సొంత రాష్ట్రం అభివృద్ధి చెందటం ఇష్టం లేనట్లుగా ఉందని ఎమ్మెల్యే కొండబాబు వ్యాఖ్యానించారు. ఓ పక్క ఆయన ఆస్తులు ఉన్న కర్ణాటక ఎంతో అభివృద్ధి చెందుతుంటే లేనిపోని విమర్శలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఆటంకంగా మారారని అన్నారు. కూటమి ప్రభుత్వం హయంలో రాష్ట్రానికి గూగుల్, స్టీల్ ప్లాంట్ వంటి పెద్ద ప్రాజెక్టులతో పాటు మరో 1000 పరిశ్రమలు ఏర్పాటుకు సంబంధించి పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. జగన్ కి పార్టీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయం తీసుకునే అలవాటు లేదని కొండబాబు విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు మధ్యలో పోర్ట్ సిటీ ఏర్పాటు చేసి, దానిని రాజధాని చేయాలని కొత్త పల్లవి అందుకున్నారని అన్నారు. రాష్ట్రం పై అంత మమకారం ఉంటే అసెంబ్లీలో రాజధానిపై చర్చ జరుగుతున్నప్పుడు,ఆ సమావేశాలకు ఎందుకు హాజరు కాలేదనిఆయన ప్రశ్నించారు. మన రాష్ట్రం 2047 నాటికి దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చి దిద్దాలని ఓ వైపుముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే , జగన్ లేని పోనీ విమర్శలు చేస్తున్నారని చెప్పారు. అటువంటి విధానాలను జగన్ మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కాకినాడ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

### - సీఐటీయూ డిమాండ్




**పిఠాపురం, (మనసులో మాట ) ఏప్రిల్ 1 :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషు బాబ్జి మాట్లాడుతూ.. గతంలో అమలులో ఉన్న సహజ మరణం, ప్రమాద బీమా, పిల్లల స్కాలర్‌షిప్‌లు వంటి ప్రయోజనాలను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించకపోవడం అన్యాయమన్నారు. నిర్మాణ రంగం నుంచి వచ్చే 'సెస్' నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు కాకుండా, కార్మికుల సంక్షేమానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని నాయకులు కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె. చిన్న, వివిధ వృత్తి సంఘాల నాయకులు పప్పుల వీరబాబు, ఎం. సూరిబాబు, కార్పెంటర్, పెయింటర్, ఎలక్ట్రికల్ యూనియన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాపనమ్మ తల్లి జాతర మహోత్సవానికి పోటెత్తిన భక్తులు



**అనపర్తి (మనసులో మాట) ఏప్రియల్ 1:** అనపర్తి పాత ఊర్లో కొలువై ఉన్న బాపనమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా, ప్రజలను సుఖసంతోషాలతో చూసే ఆరోగ్య ప్రధాయనిగా పూజలు అందుకుంటున్న అమ్మవారిని, పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, 25 రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గరగ నృత్యాలు. తీన్మార్, కాలిక డాన్స్. బ్యాండ్ మేళాలు రన్నింగ్ డిజె తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద జెయింట్ వీల్ తదితర వాటితో ఎగ్జిబిషన్ లో జాయింట్ కొలంబస్ చిన్నపిల్లల కార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## రాష్ట్ర గవర్నర్ పర్యటనపై ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు

### - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, ఏప్రిల్, 1(మనసులో మాట)..** ఈనెల 2వ తేదీన పోలవరంలో రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన రాష్ట్ర గవర్నర్ పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించేందుకు పోలవరం ప్రాజెక్ట్ కు విచ్చేస్తున్నారని, సదరు పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలన్నారు. హెలిపాడ్ ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా తెలియజేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి పొరపాటు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు.

## ప్రభుత్వ చౌక డిపో సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

### టిడిపి మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు



**ఉండి, (మనసులో మాట) ఏప్రిల్. 1:** ఉండి మండలంలో ఒకటో తారీఖున ప్రారంభించిన ప్రభుత్వ డిపో రేషన్ షాపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అన్నారు బుధవారం స్థానిక నిమ్మలపేటలో ఉన్న 7వ నెంబర్ గల చౌక డిపో నందు ప్రభుత్వం ద్వారా వచ్చిన ఉచిత బియ్యం పంపిణీ లో పాల్గొని కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని త్వరలోనే మరిన్ని సేవలు సౌక డిప ద్వారా అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానికులు మరియు గొండి చిన్న. బెహరా శంకరరావు. వినోద్. బండారు సత్యనారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## ఆటో చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష

**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 1..** ఆటో చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిందని రూరల్ సి ఐ దొరరాజు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.... మండపేట మండలం జెడ్. మేడపాడు గ్రామానికి చెందిన బీమన వెంకటరమణ ప్యాసింజర్ ఆటో ను గత ఏడాది మార్చి 3 ఇంటి ముందు పార్క్ చేశారు. ఉదయం ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టారు. తాడేపల్లిగూడెం మామిడి తోట కు చెందిన మొలగల వెంకటేశ్వరరావు ను నిందితుడిగా గుర్తించారు. ఈ కేసును విచారించిన ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ఐ ప్రవీణ్ కుమార్ నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించనట్లయితే అదనంగా 3 నెలల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో ఏపీపీ విల్లా శ్రీరాములు వాదనలు వినిపించగా, కోర్ట్ కానిస్టేబుల్ డి.వి. రమణ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం..

# చారిత్రాత్మక విజయం

- మొదటి నుంచీ అమరావతిపై విషం కక్కుతున్న జగన్
- మూడు రాజధానుల పేరిట రాష్ట్రాన్ని నాశనం చేసేశారు
- రాజధాని రైతులపై రాక్షసత్వంగా దాడులు చేయించారు...
- అయినా మొక్కవోని దీక్షతో పోరాటం చేసిన రైతులు...
- మహిళలు రోడ్డెక్కి చేసిన సుదీర్ఘ పోరాటానికి ప్రజల మద్దతు...
- న్యాయ స్థానాల జోక్యంతో నిలబడ్డ రాజధాని అమరావతి...
- అయినా ఇంకా కుట్రలు చేస్తూనే ఉన్న జగన్...
- చట్టబద్ధతతో మరింత వేగంగా అమరావతి పనులు...
- లోక్ సభలో ఆమోదం పట్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల హర్షం...



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం పట్ల టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, మద్దతు ఇచ్చిన పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ కేబినెట్ ఆ తర్వాత ప్రత్యేక అసెంబ్లీ సమావేశం చేసిన తీర్మానం పంపిన వెంటనే కేంద్ర కేబినెట్ లో ఆమోదించి, లోక్‌సభలో ప్రవేశ పెట్టి ఆమోదించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఏ శక్తీ దీన్ని అడ్డుకోలేదని ఎమ్మెల్యే గోరంట్ల వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతి కేవలం ఒక రాజధాని కాదని, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల కల, ఆకాంక్ష అని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి ధ్యేయమని తెలిపారు. 5 కోట్ల ఆంధ్రులు కలలుకన్న రాజధాని అమరావతిని శాశ్వత రాజధానిగా పార్లమెంట్ రాజముద్ర వేయడంతో పొరుగు రాష్ట్రాలకు ధీటైన రాజధాని అమరావతి కాగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 13 జిల్లాల అభివృద్ధికి ఆదాయ వనరు మన అమరావతి అని, 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాల కల్పవల్లి అమరావతి, ప్రతి పంచాయతీ సంక్షేమానికి నిక్షేపం మన ప్రజా రాజధాని అమరావతి అని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఆంధ్రుడు గర్వించే ప్రపంచ స్థాయి నగరం అమరావతి అని, గతంలో తెలుగుదేశం హయాంలో రైతులు స్వచ్ఛంచంగా ఇచ్చిన 34 వేల ఎకరాల భూమిని వైసీపీ ఐదు సంవత్సారాల్లో పాలనలో సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఎమ్మెల్యే గోరంట్ల విమర్శించారు. మళ్ళీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అమరావతిని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయని, త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం కేంద్రీయ విద్యాలయాలు అమరావతిలో ఏర్పాటు కానున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల వివరించారు. అసలు భూ సమీకరణ, ఒక చారిత్రాత్మక ప్రజా ఉద్యమం అని ఎమ్మెల్యే గోరంట్ల అభివర్ణించారు. 2015 జనవరి 1, న విశిష్టమైన భూ సమీకరణ పథకానికి సీఆర్డీఏ రూపకల్పన చేసిందని, కేవలం 60-90 రోజుల్లోనే 28,538 మంది రైతుల నుంచి 34,395.50 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. రైతుకు భూమి ఆస్తి కాదని, అది భావోద్వేగం, గుర్తింపు, జీవనాధారం అయినప్పటికీ, వారు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం దానిని త్యాగం చేశారని, ఇందులో ఎక్కడ బలవంతం లేదని, స్వాధీనం లేదని, కేవలం నమ్మకం మాత్రమేనని ఎమ్మెల్యే గోరంట్ల స్పష్టం చేశారు. దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో ఏ ప్రజాస్వామ్య దేశంలో కూడా ఇంత భూమిని ఈ విధంగా సమీకరించలేదని ఎమ్మెల్యే గోరంట్ల ప్రస్తావించారు. ఒక ప్రపంచ స్థాయి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అంతర్జాతీయ సలహాదారులతో సుస్థిరమైన, భవిష్యత్తు డిజైన్ తో అమరావతి రూపొందించబడిందని ఆయన తెలిపారు. 2019 నాటికి అమరావతి నిర్మాణాలలో ప్రజా ప్రతినిధుల భవనాలు, ఐఎఎస్ క్వార్టర్లు, ప్రిన్సిపుల్ సెక్రటరీల క్వార్టర్లు, జ్యుడిషియల్ బంగ్లాలు, మంత్రులు బంగ్లాలు దాదాపు పూర్తి చేశారని ఆయన గుర్తుచేశారు. 60కి పైగా అత్యాధునిక సదుపాయాలున్న టవర్లు. 320 కి.మీ. మేర రోడ్లు, 45 వంతెనలు. 380 కి.మీ మేర స్మార్ట్ వాటర్ డ్రెయిన్లు. 77 కి.మీ. మేర పవర్ డక్ట్ లు. 97 కి.మీ. పొడవున పారిశుధ్య పైపులైన్లు ఏర్పాటు చేశారని, సుమారు రూ.10 వేల కోట్ల మేర ఖర్చైందని ఆయన వివరించారు. అయితే 2019 ముందు నుండి ప్రజలను జగన్ రెడ్డి మోసం చేశాడని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి అమరావతికి మద్దతు తెలిపి ' నేను అమరావతిలోనే ఇల్లు కట్టుకుంటాను - నేను రాజధానికి మార్చను' అని ప్రజలను నమ్మించారని, తీరా అధికారంలోకి వచ్చాక ఆయన ప్రజలను మోసం చేశారన్నారు. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రవేశపెట్టి గందరగోళం సృష్టించారని, ఐదు సంవత్సరాల్లో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వేయలేదని ఆయన గుర్తుచేశారు. అయితే రూ.700 కోట్ల ప్రజాధనాన్ని ఉపయోగించి రాజభవనం లాంటి ఇళ్లను ఏర్పాటు చేసుకున్నారని ఆయన విమర్శించారు. మూడు రాజధానుల ప్రతిపాదనతో రాజధానికి భూమి ఇచ్చిన రైతులు రోడ్డెక్కి పోరాటం మొదలు పెట్టారని, ఇందులో మహిళలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని పగలూ రాత్రీ రోడ్లపై నిలబడ్డారని, వృద్ధులు పాదయాత్రలు చేశారని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. చివరకు దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించి హింసించిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందని ఆయన ఎద్దేవా చేశారు. పోలీసు కేసులు, లాఠీ ఛార్జీలు, మహిళలపై దారుణమైన దాడులు, అవమానాలు, వేధింపులు అన్నింటినీ తట్టుకుని 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారని, ప్రజలు అమరావతికి మద్దతు తెలిపారని ఆయన వివరించారు. అయితే ఈ సుదీర్ఘ పోరాటంలో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారని ఎమ్మెల్యే గోరంట్ల గుర్తు చేశారు. ఇది కేవలం నిరసన మాత్రమే కాదని, ఇది ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటంగా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల ప్రాణ త్యాగాలు ఓ వైపు, పోరాటాలు మరో వైపు, చివరకు న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా నిలబడిందని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. ఇక జగన్ రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతి పాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయని . రాష్ట్ర వ్యాప్తంగా భూముల విలువ పడిపోయిందని ఆయన పేర్కొన్నారు. అయినా సరే అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతికి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని అబద్ధపు ప్రచారం చేస్తూ జగన్ విషం కక్కుతూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతిలో రూ.58 కోట్లతో సుమారు 90 ప్రాజెక్టులకు సంబంధించి పనులు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ లో మూడు ఎకనమిక్ రీజియన్లు అభివృద్ధిలో భాగంగా విశాఖ, తిరుపతితో పాటు అమరావతికి చోటు కల్పించామని ఎమ్మెల్యే గోరంట్ల గుర్తుచేసారు. 2026-27 కేంద్ర బడ్జెట్ లో అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1561 కోట్లు కేటాయింపులు చేసారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ.900 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మొత్తం 74 ప్రాజెక్టులకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారని, రూ.2వేల 245 కోట్ల రూపాయలతో 57 కి.మీ అమరావతి రాజధానికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుందని, దీని వలన దేశంలోని ముఖ్య నగరాలతో కనెక్ట్ విటీ పెరగనుందని ఎమ్మెల్యే గోరంట్ల వివరించారు. కేంద్ర బడ్జెట్ 2026 -27లో అమరావతి అభివృద్ధి కోసం రూ.1561 కోట్లు కేటాయింపులు జరిగాయని, అలానే అమరావతి గుంటూరు కృష్ణా మీదుగా హై స్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు కానుందని ఆయన గుర్తు చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో 4,400 కోట్లు నిధులు మంజూరు చేశామని తెలిపారు. అధికారులకు 720 ఇళ్లు నిర్మిస్తున్నామని, రూ.250 కోట్లతో సీఆర్డీఏ భవనం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అలాగే రూ.212 కోట్లతో అమరావతిలో రాజ్ భవన్ కట్టించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. అమరావతి అసైన్డ్ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలుపుతూ, ల్యాండ్ ఓనర్ షిప్ లో అసైన్డ్ పదం తొలగించి, ఇకపై పట్టా భూములుగా గుర్తింపు ఇచ్చిందని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. అమరావతిలో నాలుగు స్టార్ హోటల్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. అమరావతిలో నేషనల్ ఫోరెనిక్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించ బడిందని ఆయన తెలిపారు. ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారం.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో సుమారు రూ.58వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత కూడా లభించిందని ఎమ్మెల్యే గోరంట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## చేనేత కార్మికులకు ఇకనుండి ఉచిత విద్యుత్తు

### - రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 1:** చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల హామీలో భాగంగా ఇక నుండి నేతన్నలకు ఉచిత విద్యుత్తు అమలు చేయడం జరుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వీరవరం గ్రామంలో ఎమ్మెల్యే గోరంట్ల ఈ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. 200 యూనిట్ల వరకు చేనేత కార్మికులకు ఎటువంటి విద్యుత్తు రుసుము ఉండదని గోరంట్ల తెలిపారు. అలానే చేనేత కార్మికులకు అధునాతన యంత్ర పరికరాల వినియోగం పట్ల శిక్షణ ఇవ్వటం ద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని తెలిపారు. అన్న ఎన్టీఆర్ పాలన నుండి చేనేత కార్మికులకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీతో చేనేత కార్మికులకు అనుబంధం ముడిపడి ఉందన్నారు. అందుకే ఇన్ని దశాబ్దాలుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, కలిదిండి గోవిందు, బత్తుల రాము, అన్నందేవుల కోదండ రాముడు, ఆదిమూలం సాయిబాబు, గోరు నాగేశ్వరరావు, దంతంశెట్టి శ్రీను, బత్తుల వాసు, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో రమేష్, గుర్రపు సత్యనారాయణ, ముమ్మిడి నాగేశ్వరరావు, కర్ర వీరభద్రరావు, తమ్మ నాగేంద్ర, కొత్తపల్లి శ్రీరామ్, వాసా శ్రీను, గుత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది క్రీడాకారుల ఎంపిక

**పిఠాపురం,( మనసులో మాట) ఏప్రిల్ 1:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రగ్బీ జట్ల ఎంపికలు ఘనంగా జరిగాయి. ఈ ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ జిల్లా చైర్మన్ వియ్యపు రమణరాజు, ముమ్మిడి గణేష్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన 53 మంది క్రీడాకారుల నైపుణ్యాన్ని పరిశీలించి, వారిలో 12 మంది పురుషులు, 12 మంది మహిళలు కలిపి మొత్తం 24 మందిని ఎంపిక చేసినట్లు నిర్వహణ కార్యదర్శి పి. లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 5వ తేదీన కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ రగ్బీ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ సెలక్షన్స్ కు న్యాయనిర్ణేతలుగా పి.డి. శేషు కుమారి, బి. వంశీ, కాకాడ చిన్నబ్బాయి, భార్గవ్, పవన్ వ్యవహరించారు.

## దాసం సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయం



**పిఠాపురం (మనసులో మాట) ఏప్రిల్ 01:** పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం మాజీ సర్పంచ్ దివంగత దాసం సూర్యనారాయణ 22వ వర్ధంతి సందర్భంగా బుధవారం గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్మారక సభలో సర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి శేఖర్, మాజీ జెడ్పీటీసీ జవ్వాది కృష్ణ మాధవరావు తదితరులు మాట్లాడుతూ.. సూర్యనారాయణ సర్పంచ్‌గా ఉన్న కాలంలో గ్రామాభివృద్ధికి, ముఖ్యంగా దళితుల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దాసం బాబ్జి, జ్యోతుల రాంబాబు, మాగాపు బుజ్జి, దాసం పట్టాభి, బాబులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన



**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 1..** కాకినాడ జిల్లా జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో బుధవారం సాయంత్రం హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులు నిలుపుదల చేసి వారందరికీ హెల్మెట్ వినియోగం, దాని యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## వైభవంగా వాడపల్లి వెంకన్న తెప్పోత్సవం



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 1..** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం గౌతమి గోదావరి లో సాయంత్రం విద్యుత్ దీపాలంకరణలతో అందంగా తీర్చిదిద్దిన హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. ఉదయం మేలుకొలుపు సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం విశేషార్చన, నిత్యహోమం, బలిహరణం, ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్ర పుష్పములు అనంతరం మహాదాశీర్వచనం అందించారు. నీరాజన మంత్రపుష్పములు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, శిష్ఠకుటుంబరావు, చలుమూరి రాంబాబు, వాడపల్లి సుందర శేషావతారం, ఆలయ సిబ్బంది, అర్చక స్వాములు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

KANCHARLA

మనసులో మాట

సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప







## కడప ఎయిర్‌పోర్ట్‌లో నారా భువనేశ్వరి ఘన స్వాగతం

**కడప (మనసులో మాట), ఏప్రిల్ 1:** కడప ఎయిర్‌పోర్ట్‌లో నారా భువనేశ్వరి ఘన స్వాగతం పలికిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా కడపకు విచ్చేసిన నారా భువనేశ్వరికి కడప ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భువనేశ్వరి కి అభివాదం చేశారు.

# ఏపికి అమరావతే ఏకైక రాజధాని

- ▸▸ ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు
- ▸▸ పార్లమెంటులో బిల్లుపై స్పందించిన సీఎం
- ▸▸ చేనేతలకు అండగా దండగా ప్రజా ప్రభుత్వం
- ▸▸ రాష్ట్రంలో 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు
- ▸▸ సుపరిపాలనా మహాయజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- ▸▸ రాష్ట్రంలో కొందరు చేసేవి హిట్ అండ్ రన్ నేర రాజకీయాలు
- ▸▸ నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో పాల్గొన్న సీఎం చంద్రబాబు





**నెల్లూరు బ్యూరో (మనసులో మాట )ఏప్రిల్ 1:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళం కూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, లోక్‌సభలో చట్టబద్దత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

**సంక్షేమానికి పెద్దపీట**

ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ.2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానం తోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్ లో తల్లికి వందనం కింద ఆర్ధిక సహకారం అందించామని.. ఈ ఏడాది జూన్ లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ.2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ.1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

**జువ్వలదిన్నెపై దుష్ప్రచారం**

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ.34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా నిలబడుతుందన్నారు. రూ.70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్దరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని .. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్ తో పాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని .. ఇఫ్కో సెజ్ లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ.285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని.. దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. 2019-24 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.

**..నేతన్నలకు వెన్నుదన్నుగా ఉచిత విద్యుత్**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇవాల్టి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్ లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామని.. ఉచిత విద్యుత్ పథకం వల్ల ఒక్కో చేనేత కుటుంబానికి వేల రూపాయల మేర ఆదా అవుతుందన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని.. 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు. 21 నెలల్లో 5.5 లక్షల గృహప్రవేశాలు చేయించామని.. డిసెంబరు లోగా 4.5 లక్షల ఇళ్లలో ప్రవేశించేలా నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలందరికీ పౌరసేవలు మెరుగ్గా అందించటంతో పాటు వాటిపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పౌరసేవలు సరిగా అందకపోయినా.. మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి కఠినంగా వ్యవహరిస్తానని సీఎం స్పష్టం చేశారు. సుపరిపాలనా మహాయజ్ఞానికి ఎవరు నష్టం కలిగించినా సహించబోనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజావేదిక సమీపంలో సూక్ష్మసేద్యం సహా డ్రోన్ సహకారంతో సేద్యానికి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదమస్తాన్ రావు, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేశ్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.



## గంగమ్మ జాతరకు విచ్చేయాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

**పలమనేరు, ఏప్రిల్ 1( మనసులో మాట):** పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరు వైయస్సార్ నగర్ లో వెలసి యుండు శ్రీ కనుమ గంగమ్మ జాతరకు విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ తో పాటుసభ్యులు బుధవారం ఆహ్వానించారు. ఆమేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన కలసి సన్మానించి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 4 తేదీ చాటింపు,13వ తేదీ అమ్మవారి శిరస్సు మెరవణి 14వ తేదీ అమ్మవారి విశ్వరూప దర్శనము, 15వ తేదీ జలధి కార్యక్రమాలు జరగనున్నట్లు వారు ఆయనకు తెలియజేశారు. కాబట్టి ఈ కార్యక్రమాలకు విచ్చేయాలని వారు ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్, పలమనేరు శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, గంటా వూరు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీఈడీ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలపై వీసీ ఆకస్మిక తనిఖీ



సర్వేపల్లి మనసులో మాట (ఏప్రిల్ 1)నెల్లూరు: నగరంలోని ఆర్ఎస్ఆర్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని బీఈడీ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఈడీ నాలుగవ సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాక్టికల్ రికార్డులు, టీచింగ్ ప్రాక్టీస్ విధానాన్ని ఆయన సమీక్షించారు. విద్యార్థుల బోధనా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయని, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునే వాతావరణం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లు నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేస్తున్న గ్రామ సర్పంచులకు ఘన సన్మానం



- గ్రామ ప్రథమ పౌరుడన్న పేరే గానీ వీధి లైట్లు వేయించాలన్నా సర్పంచులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన దుస్థితి
- గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది - కూటమి ప్రభుత్వంలో అధికారంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం
- కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడంలో భాగస్వాములు కండి
- సర్పంచుల పదవి విరమణ సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు, ఏప్రిల్ 1( మనసులో మాట):** కోవూరు నియోజకవర్గ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని ఈ రోజు పదవీ విరమణ చేస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన 43 మంది సర్పంచులకు నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి కార్యాలయంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. గతంలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా పదవీ విరమణ చేస్తున్న సర్పంచుల సేవలను కొనియాడుతూ వారికి నూతన వస్త్రాలతో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు గత ప్రభుత్వ నిర్వాకాలపై ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాలరాస్తూ స్థానిక సంస్థలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారన్నారు.

గ్రామ ప్రథమ పౌరులన్న పేరే గాని కనీసం వీధి లైట్లు వేయించాలన్నా వేయించాలన్నా సర్పంచులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన దుస్థితిని కల్పించారన్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచుల ప్రమేయం లేకుండా గత ప్రభుత్వం అడ్డగోలుగా దారి మళ్లించిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలపై మమకారంతో అప్పులు తెచ్చి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు బిల్లులు రాక గత ఐదేళ్లలో తీవ్ర మానసిక క్షోభ అనుభవించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పంచాయతీలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్ల నేతృత్వంలో ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13 వేల 326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాస్వామ్యానికి ఊపిరి పోశారన్నారు. ఉపాధి హామీ మరియు ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకే చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

పల్లె పండుగ పేరిట ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, తాగునీటి పథకాలు, పాఠశాలల మరమ్మతులే కాకుండా ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మిస్తూ గ్రామాల రూపు రేఖలే మారుస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో ఉన్న ప్రతి రూపాయి గ్రామాభివృద్ధికే ఖర్చు చేసేలా ప్రభుత్వం పారదర్శకతనుతీసుకొచ్చిందన్నారు.

తాను ఎమ్మెల్యే అయ్యాక మైపాడు బీచ్ లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం 5 కోట్లు 17 కోట్ల 50 లక్షలతో 323 సిసి రోడ్లు, 14 కోట్ల 74 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్స్, 800 మంది అనారోగ్య బాధితులకు 8 కోట్ల రూపాయలతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం, సీఎస్ఆర్ ఫండ్స్ మరియు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 21 నెలల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాజీలవుతున్న సర్పంచులు పదవి నుంచి మాత్రమే విరమణ పొందుతున్నారని ప్రజా సేవ నుంచి కాదని నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు పిలుపునిచ్చారు. పదవీ విరమణ సందర్భంగా గతంలో ఎన్నడూ ఈ విధంగా సన్మానాలు, సత్కారాలు జరగలేదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు తమను గుర్తించి గౌరవించడం చాలా సంతోషంగా వుందన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు సమస్యలపై స్పందిస్తున్న తీరు పట్ల పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# 95.4 శాతం పెన్షన్లు పంపిణీ

## - కమిషనర్ రమణారెడ్డి

**పలమనేరు ఏప్రిల్ 1( మనసులో మాట) :** ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వారు చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని వార్డు సచివాలయాల సెక్రటరీలు ద్వారా ఏప్రిల్2026 మాసపు పెన్షన్లు1-4-2026న ఉదయం 6 గంటల నుండి సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి (100) శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏప్రిల్2026 మాసపు పెన్షన్ లబ్ధిదారులు వారికి సంబంధించిన పెన్షన్ మొత్తం వారి వారి ఇంటి వద్దకే సంబంధిత సచివాలయ సిబ్బంది వెళ్లి పెన్షన్ మొత్తం అందించారు. ఈ మాసపు మొత్తం పెన్షన్లు4472కు గాను4250 మంది లబ్ధిదారులకు95.04 శాతంతో పెన్షన్ పంపిణీ చేయడమైనదని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# టు వీలర్ అదుపుతప్పి వ్యక్తి మృతి



**ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట)..** పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన కొండన్న (40) టు వీలర్ నడుపుతూ అదుపుతప్పి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండన్న ధర్మారం నుండి అనంతపురం టౌన్ కి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో టు వీలర్ నడుపుకుంటూ వస్తూ ఉండగా దారి మధ్యలో బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామం వద్ద తన టు వీలర్ను తనంతకు తాను అదుపు చేసుకోలేక రోడ్డు పక్కనే ఉన్న కాటమయ్య దేవాలయం స్తంభానికి వేగంగా డి కొట్టుకున్నాడు. కొండన్నకు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ధర్మవరం టౌన్ లో సిల్క్ హౌస్ లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. కొండన్న కు భార్య గీతాంజలి కలదు. సంతానం లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# అర్హత గల లబ్ధిదారునికి పెన్షన్ అందించడమే మా ధ్యేయం..

## - ఎంపీడీవో ఎం. లలిత



**ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట)..** మండల పరిధిలోని గ్రామపంచాయతీలో అర్హత గల లబ్ధిదారునికి పెన్షన్ అందించడమే మా ధ్యేయము అని ఎంపీడీవో ఎం. లలితా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, కలెక్టర్ ఆదేశాల మేరకు 6710 మంది పెన్షన్ దారులకు రూ.2,98,73,000 మంజూరు కావడం జరిగిందని, ఏప్రిల్ 1వ తేదీన సాయంత్రం ఐదు గంటల వరకు 6310 మంది పింఛనుదారులకు రూ.2,79,91,000 పంపిణీ చేయగా 94 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. మిగిలినది గురువారం పంపిణీ చేస్తామని తెలిపారు. ఎక్కడైనా పింఛన్దారులను లంచము అడిగినట్లు తెలిస్తే మాకు సమాచారము ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తం 120 మంది సచివాలయ ఉద్యోగులను పింఛన్ పంపిణీ కార్యక్రమానికి వినియోగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్ నబీ, పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలం దారికి చట్టాలు ఉన్నాయి

## రూల్ ఆఫ్ లా ప్రకారం.. ఏదైనా పొలం నుంచి మరొకరి పొలం ముందు ఉన్నప్పుడు వెనుక పొలానికి (ఈజ్ మెంట్ యాక్ట్, ఈజ్‌మెంట్ ఆఫ్ నెసెసిటీ) కచ్చితంగా దారి ఇవ్వాలి



**బాలాయపల్లి (మనుసులో మాట):-** గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తుంటారు. వ్యవసాయంవే ఆధారంగా ఉన్న కుటుంబాలు 80 శాతం ఉన్నాయి. కొంత మంది భూమి కౌలు చేసుకుంటూ ఉంటారు. మరికొంత మంది సొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ తమ జీవనోపాధిని మేరుగు పరుచుకుంటారు. వీరు జీవ సైలీ పొద్దున లేచిన దగ్గర నుంచి పొలంకి వేళ్ళి పనులు ముగుంచుకోని ఇంటికి తిరిగి వస్తారు. రైతులు ఎక్కువ సమయం వ్యవసాయ పోలంలోనే గడుపుతారు.

**ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ :-**

రైతులు కొంత మందికి తమ పొలానికి వెళ్లడానికి దారి ఉండదు. ఇరుగు పొరుగు పొలాల వారు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తారు. దింతో వారి అవస్థలు వర్ణనాతీతం. రైతులు తమ వ్యవసాయ పనిముట్లను పొలానికి తీసుకెళ్లాలి. దారి లేక వ్యవసాయ పోలంకు పనిముట్లు తీసుకుని వేళ్ళాలేక అవస్థలు పడుతున్నారు. దింతో ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ చేసింది. మీకు భూమి ఉన్నప్పుడు పొలంలో వ్యవసాయ కార్యకలాపాలు ఎంత ముఖ్యమో, ఆ క్షేత్రానికి ప్రాప్యత సరైనదని నిర్ధారించుకోవడం కూడా అంతే ముఖ్యం. దింతో తప్పన సరిగా వ్యవసాయ పోలంకు దారి ఇవ్వాల్సిందే.

**న్యాయ వ్యవస్థలో చట్టాలు ఉన్నాయి. :-**

పక్క రైతులను దారి అడిగితే నిరాకరిస్తుంటారు. ఇబ్బంది పెట్టాలని చూస్తుంటారు. ఇలాంటి సమయంలో మీరు చట్టాన్ని ఆశ్రయించవచ్చు. ఈ చట్టం ద్వారా మీ భూమికి ప్రాప్యత పొందవచ్చు. పొలానికి వెళ్లే దారి గురించి న్యాయ వ్యవస్థలో చట్టాలు ఉన్నాయి. ఈజ్‌మెంట్ యాక్ట్, ఈజ్‌మెంట్ ఆఫ్ నెసెసిటీని దీని గురించి చెబుతాయి. రూల్ ఆఫ్ లా ప్రకారం.. ఏదైనా పొలం మరొకరి పొలం ముందు ఉన్నప్పుడు వెనుక పొలానికి కచ్చితంగా దారి ఇవ్వాలి.

**రైతుకు నష్ట పరిహారం చెల్లించాలి:-**

వ్యవసాయ పోలం నుంచి మరో పొలానికి వెళ్లాలంటే.. కచ్చితంగా దారి ఇవ్వాల్సిందే. లేకుంటే నష్టపోయిన రైతు కేసు ఫైల్ చేయవచ్చు. కౌలు చట్టంలోని సెక్షన్ 251 ప్రకారం మీ పొలానికి వెళ్లేందుకు కొత్త రోడ్డును నిర్మించుకోవచ్చు. అలా అడ్డ పరిస్తే చర్యలు తప్పవు.


ఈవిషయమై తహసీల్దార్ పోను ద్వారా సంప్రదించగా అందుబాటులో లేరు.

# ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**సర్వేపల్లి మనసులో మాట (ఏప్రిల్ 1)..** ప్రైవేటు పాఠశాలలు గేటుగా ప్రభుత్వ పాఠశాలలో తీర్చిదిద్దుతున్నామని మండల విద్యాశాఖ అధికారి సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. వెంకటాచల మండలం తిక్కవరపాడు గ్రామపంచాయతీ లోని మల్లుగుంట సంఘం గిరిజన కాలనీలో ఆయనతో పాటు క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు , వి శ్రీనివాసరెడ్డి , వి వెంకటేశ్వర్లు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించ నిర్వహించారు. అంగన్వాడీలో చదువుతున్న 5 ప్లస్ వయసు కలిగిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య ఉందని అలాగే ఈ గ్రామంలో మోడల్ ప్రైమరీ స్కూల్ నందు నాలుగురు ఉపాధ్యాయులతో చక్కని విద్య అందిస్తున్నారని రాబోవు రోజులలో మరొక ఉపాధ్యాయులు కూడా వస్తారని మీ విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చేర్పించి డబ్బులు వృధా చేసుకోకుండా ఉండాలని చూచించారు పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం తో పాటు వారానికి ఐదు సార్లు గుడ్లు, వారానికి మూడుసార్లు చిక్కి, వారానికి మూడుసార్లు రాగి జావా, ప్రతి మంగళవారం అరటిపండు వంటి పౌష్టిక ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి 10 మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాల లో అడ్మిషన్ చేయించడం జరిగింది . అలాగే పాఠశాల యందు ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి దగ్గరలోనే జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల సర్వేపల్లి లో అడ్మిషన్ చేర్పించే దానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. పెంచలయ్య, శివానందమూర్తి క్లస్టర్ సి ఆర్.ఎం.టి డి మస్తానయ్య పాల్గొనినారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే



పలమనేరు ఏప్రిల్ 1( మనసులో మాట) :పలమనేరు నియోజకవర్గం లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని తన కార్యాలయంలో రెవిన్యూ, మున్సిపల్, అటవీ మరియు వైద్య శాఖ అధికారులతో ఆయన విడివిడిగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిపై వివరాలు రాబట్టారు. ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి విషయంగా ఉన్న అవరోధాలను ఆర్డిఓ భవాని తో పాటు తహసిల్దార్ ఇన్బనాథన్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ విషయంపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశం వారంలోపు తేల్చాలని, వెంటనే ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఇక ఆలస్యం జరగకూడదని అధికారులను ఆయన హెచ్చరించారు. అదేవిధంగా పలమనేరు రూరల్ మండలంలోని ఓ రోడ్డు నిర్మాణం విషయంలో అటవీ శాఖ అధికారులు అభ్యంతరం తెలపడంపై ఆయన వారితో చర్చించారు. రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మరోవైపు స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేయదలచిన లిఫ్ట్ మరియు ఫ్రీజర్ రూమ్ ఏర్పాటు, బ్లడ్ బ్యాంక్ తదితర అంశాలపై వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సబ్ డి ఎఫ్ వేణుగోపాల్ రెడ్డి, ఎఫ్ ఆర్ ఓ నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తాసిల్దార్ ఇన్బానాధన్ , మున్సిపల్ ఏఈలు స్నేహప్రియ, శిరీష,ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ మమతా రాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగరాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని కలిసిన డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్



**పలమనేరు ఏప్రిల్ 1 ( మనసులో మాట) :** పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని జనసేన నాయకులు డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి నాలుగు రోజుల క్రితం జనసేన పార్టీలో ఆయన చేరారు. దీంతో మొదటిసారి స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ని మరియు కూటమి నేతలను ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తనకు రాజకీయంగా తొలి గురు అమర్నాథ్ రెడ్డి అని వారి కుటుంబంతో తనకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉన్న విషయాన్ని తెలియజేశారు. తన ఆలోచనలకు అనుగుణంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ విధి విధానాలు నచ్చే జనసేన తీర్థం పుచ్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనకు తగిన గౌరవం గుర్తింపు లేని కారణంగానే వైకాపాను వీడియానని ఇక తన జీవితాంతం జనసేనలోనే కొనసాగుతూ ప్రజాసేవలో రాణిస్తానని ఆయన స్పష్టం చేశారు. కూటమి పార్టీ నేతలతో కలిసి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఏఎంసి వైస్ చైర్మన్ దిలీప్ కుమార్, కాపునాడు నాయకుడు పూల చైతు, నాగరాజు, చందు, అరుణ్, శివ, రాజేష్, రమేష్, నానబాల లోకేష్, హరీష్, వేణు,జన,లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఏ.పీ జేఏసీ పలమనేరు తాలూకా ఛైర్మన్‌గా కె.ఆనందబాబు ఎన్నిక




**పలమనేరు ఏప్రిల్ 1( మనసులో మాట):** జిల్లా ఏ.పీ జేఏసీ ఛైర్మన్ కె.వి. రాఘవులు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కె. రమేష్ సూచనల మేరకు పలమనేరు ఎన్‌జీఓ హోమ్‌లో ఏ.పీ జేఏసీ పలమనేరు తాలూకా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు,వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.పీ జేఏసీ పలమనేరు తాలూకా నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించగా ఛైర్మన్‌గా ఏ.పీ ఎన్‌జీఓస్ అధ్యక్షులు కె. ఆనందబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.టీ.యు నాయకులు లక్ష్మీ, నారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.సి. బాబు (యూటీఎఫ్), పి.మోహన్ రామ్ ప్రసాద్ (పంచాయతీ కార్యదర్శుల సంఘం)ఎస్. హరి (జీడబ్ల్యూఎస్) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కృష్ణమూర్తి (పెన్షనర్ల సంఘం) బాలు (క్లాస్-×ఎ ఉద్యోగుల సంఘం) ఎన్నిక కాగా ఖజానాదారుగా మోహన్ (ఏపీఎస్ఆర్టీసీ) ఎంపికయ్యారు. ఈ సమావేశంలో చిత్తూరు తాలూకా ఎన్‌జీఓ కార్యదర్శి ప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు డి.వి. రమణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొని, రానున్న రోజుల్లో ఉమ్మడి పోరాటాలకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# వారాహి మాత అవతారంలో భక్తులకు దర్శనం

**పలమనేరు ఏప్రిల్ 1 (మనసులో మాట) :** పట్టణ సమీపంలోని గంటవూరు బీసీ కాలనీ నందు ప్రతిష్ట కాంచిన శ్రీ తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం వారాహి మాత అవతారంలో భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. దర్శించుకోవడానికి భక్తులు వేల సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు అమ్మవారిదర్శనం తో పాటు అందరి మనసులు ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతులు మీదుగా అందించడం జరిగింది. చాలామంది భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం కోలాటాలు ఏర్పాటు చేశారు. గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామికి పూలతో అలంకరించారు.

# 40 వార్డులలో సోషల్ మీడియా కమిటీ సభ్యుల జాబితా వార్డు ఇన్చార్జి లకు అందజేత



ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట) పట్టణంలోని 40 వార్డులలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు సోషల్ మీడియా విభాగమునకు సంబంధించిన కమిటీ సభ్యుల జాబితాను ఆయా వార్డు ఇన్చార్జినకు అందజేయడం జరిగిందని సోషల్ మీడియా పట్టణ అధ్యక్షులు జక్కా భార్గవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా వార్డుల ద్వారా సోషల్ మీడియా సభ్యులతో సమావేశం ఏర్పరిచి వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుగ్గ ప్రవీణ్ కుమార్, చెన్నారెడ్డి, దివాకర్ నాయక్, హరినాథ్,, శ్రీహరి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల పని వేళల పునరుద్ధరణకు అధ్యాపకులు డిఐఈఓ కు వినతి పత్రం సమర్పణ



**ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ కలిసి డి ఐ ఈ ఓ కు కళాశాల పనివేళ పునరుద్ధనకు సంబంధించినటువంటి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నుండి కళాశాల యొక్క సమయం ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పని వేళలు పెట్టడం వలన విద్యార్థులు మరియు సిబ్బందికి అనేక ఇబ్బందులను కలిగిస్తున్నాయని వారు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు రవాణా సౌకర్యాల లేమి కారణంగా సాయంత్రం ఆలస్యంగా ఇంటికి చేరుకోవాల్సి రావడం వల్ల భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని వివరించడం జరిగిందన్నారు. అదేవిధంగా, సాయంత్రం 4:00 నుండి 5:00 గంటల మధ్య విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉండటం వల్ల ఆ అదనపు సమయం ప్రయోజనకరంగా లేదని తెలిపారు. మహిళా సిబ్బంది కూడా ఈ సమయ మార్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ నేపథ్యంలో, మునుపటిలాగే 2026 జూన్ నెల నుండి మొదలయ్యే తరగతులు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు పని వేళలను పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దేవుడు వెల్లంపల్లి నందు శ్రీ స్థంబాలగిరీ స్వామి వారి తిరునాళ్లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు

## - ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ



**నెల్లూరు /వెంకటగిరి(మనసులో మాట ), ఏప్రిల్ - 01:** డక్కిలి మండలం, దేవుడు వెల్లంపల్లి నందు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా జరిగే శ్రీ శ్రీ శ్రీ స్థంబాలగిరీశ్వర స్వామివారి తిరునాళ్ల మహోత్సవాలను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెంకటగిరి శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజుల పాటు సాగే ఈ తిరునాళ్లలో సుమారు 25 వేల నుండి 30 వేల మంది భక్తులకు ఎలాంటి లోటు లేకుండా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉన్న 16 బస్సుల సంఖ్యను ఈసారి 25 బస్సులకు పెంచారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, రాపూరు తదితర ప్రాంతాల నుండి భక్తులు సులభంగా చేరుకునేలా రవాణా శాఖ చర్యలు తీసుకుంటోంది. గత సంవత్సరాల్లో తలెత్తిన పార్కింగ్, ట్రాఫిక్, మరియు లైటింగ్ సమస్యలను ఈసారి అధిగమించేలా ప్రత్యేక ప్రణాళికలు రచించారు. గుడికి కిలోమీటర్ దూరంలోనే అన్ని సౌకర్యాలతో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం అన్యాక్రాంతమైన స్థలాలను సైతం తిరిగి స్వాధీనం చేసుకుని భక్తుల సౌకర్యార్థం వినియోగిస్తున్నారు. తిరునాళ్ల సమయంలో పారిశుద్ధ్యాన్ని కాపాడేందుకు ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ గారు స్వయంగా జెండా ఊపి 'స్వచ్ఛ రథం' వాహనాన్ని ప్రారంభించారు. సోషల్ మీడియాలో ఆలయం గురించి, ఉత్సవాల గురించి వచ్చే వదంతులను (ఫేక్ న్యూస్ ) ఎప్పటికప్పుడు అరికట్టేందుకు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ గారు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన దుకాణాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులు, నాయకులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డక్కిలి మండల అధ్యక్షులు, మాధవయ్యపాలెం పి ఏ సి ఎస్ అధ్యక్షులు, వెంకటగిరి, డక్కిలి ఎం ఆర్ ఓ లు, మండల నాయకులు, ఆలయ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## సోమిరెడ్డి నాలా కాదు
## అన్నీ పనులు పూర్తి చేస్తాడు
### - కాకాణి

- తిక్కవరప్పాడు పంచాయతీ, మంగళం పాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం లో భారీగా అక్రమ గ్రావెల్ తవ్వి తరలించడం తో ఏర్పడిన గుంతలలో పడి మృతి చెందిన గిరిజన బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి

**సర్వేపల్లి మనసులో మాట ( ఏప్రిల్ 1)..** కూటమి పాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందక ప్రజలు అలమటిస్తున్నారని మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలంలో బుధవారం పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమిరెడ్డి లాగా అవినీతి కి పాల్పడే అలవాటు నాకు లేదన్నారు. సోమిరెడ్డి పొదలకూరులో మంగళవారం వాస్తవాలు ఒప్పుకున్నాడన్నారు . కాకాణి గ్రామంలో జరగని పనులన్నీ పూర్తి చేస్తానన్న మాట వాస్తవమే సోమిరెడ్డి మాత్రం అదే విధానంతో ప్రవర్తిస్తూ, నేను చేయలేని పనులను ఆయన పూర్తి చేస్తున్నాడని తెలిపారు. సోమిరెడ్డి లాగా అవినీతి అక్రమాలకు పాల్పడడం మాకు అలవాటు లేదు కాకుటూరు శివాలయం భూములు ఆక్రమించేందుకు అనేకమంది ప్రయత్నించినా మేము అడ్డుకొని కాపాడాం సోమిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక కాకుటూరు శివాలయం భూములు ఆక్రమించి లేఔట్ వేసిన యజమాని అప్పగించి ముడుపులు తీసుకొని జోబులో వేసుకుని పని పూర్తి చేశాడనీ విరువూరు, సురాయపాలెం ఇసుక రీచ్ ల వైపు మేము ఏనాడు కన్నెత్తి చూడలేదు,సోమిరెడ్డి మాత్రం రేయం బవళ్ళు అక్రమంగా ఇసుక తరలిస్తూ, దోచుకుంటూ పని పూర్తి చేసుకుంటున్నాడన్నారు . లేఅవుట్ల యజమానులను నేను ఎన్నడూ బెదిరించలేదు, సోమిరెడ్డి లేఔట్ల యజమానులను కేసులు పెట్టి బెదిరించి, వారి వద్ద నుంచి ముడుపులు తీసుకునే పని పూర్తి చేశాడన్నారు.కాగితాల పూరు దగ్గర జాతీయ రహదారి వద్దనున్న 100 కోట్ల రూపాయల విలువైన భూమిని మేము కాపాడుకుంటూ వస్తే, అది కాజేసే పని పూర్తి చేసేందుకు సోమిరెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశాడన్నారు . నేను రోడ్డు మీద బంకర్లు ఆపి డబ్బులు వసూలు చేయలేకపోయా.. సోమిరెడ్డి మాత్రం రోడ్డు మీద బంకర్లు ఆపి డబ్బులు వసూలు చేసే కార్యక్రమాన్ని పూర్తి చేశాడన్నారు .గ్రావెల్, ఇసుక ,బూడిద మట్టి, తవ్వకాలలో సోమిరెడ్డి లాగా నేను పనులు పూర్తి చేయలా, సోమిరెడ్డి మాత్రం పనులు పూర్తి చేశాడు. మా హయాంలో అక్రమంగా తరలించిన గ్రావెల్ గుంతల్లో పడి ఎవరూ మరణించకుండా అడ్డుకున్నాం, సోమిరెడ్డి మాత్రం మరణ మృదంగం మోగిస్తూ, తన అక్రమ సంపాదనను కొనసాగిస్తూ తాటిచెట్టు లోతు గ్రావెల్ గుంతలు తీసే పని పూర్తి చేశాడన్నారు .

సోమిరెడ్డి రాబోయే రోజుల్లో నేను చేయలేని పనులు మరి ఎన్నెన్నో పూర్తి చేస్తాడని తెలిపారు.సర్వేపల్లి ప్రజలు సోమిరెడ్డి పాలనలో వింత వింత పనులు, కొత్త కొత్త పుంతలు తొక్కే విధంగా అవినీతి అక్రమాల తాలూకా మొత్తం పనులు పూర్తి చేస్తున్నాడన్నారు .మేము చేయలేకపోయిన అవినీతి, అక్రమాలన్నీ, సోమిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక చేస్తున్నాడు మేము అభివృద్ధి సంక్షేమ పథకాలలో సోమిరెడ్డితో పోటీ పడతాం తప్ప, ఆయన చేసే అవినీతి అక్రమాలలో పోటీ పడలేం సోమిరెడ్డి ధన దాహానికి ఇంకా ఎంతమంది అమాయకులు బలవుతారో తెలియని పరిస్థితి ఏర్పడింది. సర్వేపల్లిలో సోమిరెడ్డి పుణ్యమా అని సర్వం దోపిడి మయం అవుతుంది.సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు మాకు కుటుంబ సభ్యులు లాంటివారు. అధికారం ఉన్నా , లేకపోయినా సర్వేపల్లి నియోజకవర్గంలో ఏకుటుంబం ఇబ్బందుల్లో ఉన్నా, వారికి అండగా నిలిచి ఆదుకుంటాం గతంలో ప్రజలు గ్రామాల్లో తిరిగేందుకు అనేక రకాల ఇబ్బందులు పడుతుంటే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత సిమెంట్ రోడ్లు, సైడ్ కాలవలు వేశాం, ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు స్థలాలు ఇచ్చి, ఇళ్ళు నిర్మించి ఇచ్చాం గ్రామాల్లో ప్రజలు ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో గమనిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు వచ్చేవని కూటమి పాలన లో పింఛన్ తప్ప మరేమీ రావడం లేదని ప్రజలే స్వయంగా మా వద్దకు వచ్చి మొరపెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం, ప్రజల గురించి ఆలోచన చేయకుండా, అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పేదలను గోడుమనిపిస్తున్నారు.

పేదవారికి అభివృద్ధి,సంక్షేమ పథకాలు రాక అలమటిస్తున్నారు.అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన, పేదల పక్షాన నిలబడి, వారి అవసరాల కోసం సంపూర్ణ,సహాయ, సహకారాలు అందిస్తా మనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటేశ్వరయ్య మండల కన్వీనర్ కొణిదెనమోహన్ నాయుడు. స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబరు నాటికి
# వింజమూరు పాతూరు చెరువుకు నీళ్లు

- సోమశిల నీటితో చెరువును నింపేందుకు రూ.34 కోట్లు మంజూరు
- చెరువు అభివృద్ధికి శ్రమించిన వింజమూరు ప్రజలకు సీఎం అభినందనలు
- ఉదయగిరిలో రెండు రక్షణ పరిశ్రమలు ఏర్పాటు
- పర్యాటకంగా ఉదయగిరి కోట అభివృద్ధికి కృషి - సీఎం చంద్రబాబునాయుడు



**నెల్లూరు/వింజమూరు (మనసులో మాట) ఏప్రిల్ 1 :** పాతూరు చెరువును బాగుచేసుకునేందుకు వింజమూరు ప్రజలు చూపిన చొరవను నేను ఎప్పుడూ మరచిపోనని, 30ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో తాను చేపట్టిన జన్మభూమి స్ఫూర్తిని వింజమూరు ప్రజలు మళ్లీ గుర్తుచేశారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా వింజమూరు ప్రజలను అభినందించారు. బుధవారం వింజమూరులో పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన సీఎం మార్గమధ్యలో పాతూరు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సభలో సీఎం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ "70లక్షలు ఖర్చుపెట్టి రాత్రింబవళ్లు ప్రొక్లెయినర్స్, ట్రాక్టర్లు పెట్టి పాతూరు చెరువును అభివృద్ధి చేశారు. బ్రహ్మాండమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి చెరువును, చెరువు కట్టను అందంగా తయారుచేశారు. మీరు ఒక అడుగు వేస్తే నేను వంద అడుగులు వేస్తాను" అని సీఎం చంద్రబాబు వింజమూరు ప్రజల స్ఫూర్తిని అభినందించారు. ప్రజల పనితీరును మెచ్చిన సీఎం, వెంటనే సోమశిల కాలువ నుంచి పాతూరు చెరువుకు నీటిని తీసుకొచ్చేందుకు రూ.34 కోట్లు మంజూరు చేశారు. ఆరునెలల్లో పనులు పూర్తి చేసి ఈ ఏడాది అక్టోబర్ లోపు పాతూరు చెరువును సోమశిల నీటితో నింపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ నీటి వలన ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. తాగునీరు, సాగునీరు పుష్కలంగా లభిస్తాయన్నారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గం దుత్తలూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, ఉదయగిరిలో అనడ్రోన్ సిస్టమ్స్ అనే రెండు రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. వీటితో ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. ఒకప్పుడు ఉదయగిరి అంటే వలసలు వెళ్లే ప్రాంతమని, ఇప్పుడు పరిశ్రమలకు గమ్యస్థానంగా ఉదయగిరిని తీర్చిదిద్దుతామని, బయటప్రాంతాల్లో ఉన్న ఉదయగిరి వాసులందరూ తిరిగి ఉదయగిరిలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకురావాలని సీఎం పిలుపునిచ్చారు. అలాగే ఉదయగిరి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

## ధర్మవరంలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ

### - ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట)..** ధర్మవరం పట్టణంలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా పాల్గొని పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్డీఏ సంక్షేమ దిశగా 22 నెలల్లో రూ. ప్రభుత్వం అండగా నిలుస్త రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమం ధర్మవరం నియోజకవర్గంలో ఘనంగా కొనసాగింది అని తెలిపారు.ధర్మవరం పట్టణంలోని 5వ వార్డు శారదా నగర్, 30 , 31వ వార్డుల దుర్గా నగర్ ప్రాంతాల్లో మంత్రి ఇంటింటికి వెళ్లి పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం లబ్ధిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించారు.ప్రతి నెల 1వ తేదీ ఇప్పుడు గ్రామాల్లో గాని, పట్టణాల్లో గాని పేదలందరికీ ఒక పండగ వాతావరణంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ నాయకత్వంలో, ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు అందించడం జరుగుతోందని తెలిపారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను రూ.3000 నుంచి రూ.4000కు పెంచడమే కాకుండా, పాత బకాయిలను కూడా చెల్లిస్తూ ప్రభుత్వం విశ్వసనీయతను చాటుకుంటోందన్నారు. దివ్యాంగులకు పెన్షన్ మొత్తాన్ని పెంచడంతో వారు వ్యక్తం చేస్తున్న సంతోషం ఈ ప్రభుత్వానికి మరింత ప్రేరణనిస్తోందని తెలిపారు.ఇప్పటివరకు కేవలం 22 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.60,437 కోట్లను పింఛన్ల రూపంలో పేదలకు అందించగా, ఈ ఏప్రిల్ నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా 62.60 లక్షల మందికి రూ.2,724 కోట్ల పింఛన్లు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా, ప్రభుత్వం కేవలం పింఛన్లకే పరిమితం కాకుండా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేస్తూ, వైసీపీ పాలనలో ఒకటో తేదీకి ఉద్యోగులకు జీతాలు కూడా సమయానికి రాకపోయిన సందర్భాలు ఉన్నాయని, కానీ ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చి పారదర్శక పాలన అందిస్తోందన్నారు. అలాగే, స్వర్ణాంధ్ర విజన్2047లో భాగంగా పేదరిక నిర్మూలన లక్ష్యంతో అమలు చేస్తున్న పీ4 (గ్రా4) ప్రాజెక్టు ద్వారా పేద కుటుంబాలను గుర్తించి, ఆర్థికంగా బలపడేలా మార్గదర్శకులు దత్తత తీసుకునే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ధర్మవరం పట్టణం లో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి స్వయంగా ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం దుర్గా నగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను అబద్ధపు హామీలతో ఫూల్స్ చేస్తున్న ప్రభుత్వాలు



**ధర్మవరం ఏప్రిల్ 01 (మనసులో మాట)..** నిరుద్యోగులను అబద్ధపు హామీలతో ఫూల్స్ ప్రభుత్వాలు చేస్తున్నాయని ఏఐవైఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, వైయస్సార్ ఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు పురుషోత్తమ రాయల్, అమర్నాథ్ రెడ్డి, వాల్మీకి విష్ణు, పి ఆర్ ఎస్ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయినాథ్ రెడ్డి, ఏఐయుఎస్ఓ జిల్లా అధ్యక్షుడు దామోదర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయాలని,3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి విద్యార్థి, యువజన ఐక్య సంఘాల డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ ఆపాలి, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్లు విడుదల చేయాలి అని, జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి అని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి అని,ప్రైవేట్ పాఠశాలలు తీసిన యంత్రం చట్టాన్ని అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని,రాష్ట్రం లో ఖాళీలను భర్తీ చేయాలని.నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నీ విద్యార్థి, యువజన ఐక్య సంఘాల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం. ధర్మవరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేయడం జరిగింది అని తెలిపారు.రాష్ట్రంలో ఉన్నత విద్య పూర్తి చేసిన లక్షలాది మంది యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేని కారణంగా యువత ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలతో సమగ్ర మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ ఆపాలి, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలి, జీవో నెంబర్ 77 రద్దు చేయాలి అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాలకు పెంచి,పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 19,000 పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి బకాయితో సహా చెల్లించాలని, విద్యుత్, దేవదాయ, వ్యవసాయ, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమం, అటవీ తదితర శాఖల్లో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఆర్టీసీ సంస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిల్స్, స్టడీ మెటీరియల్, పారిశ్రామిక శిక్షణతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజనులను ఐక్యం చేసి దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే చలో అమరావతి కార్యక్రమానికి పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య యువజన విద్యార్థి సంఘాల నాయకులు మధు హర్ష వినోద్.రాము జావిద్ వెంకట్ అశోక్ కుల్లాయప్ప సాయి కుమార్ బాలు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



## రెండు తెలుగు రాష్ట్రాలకు
## సీఎం చంద్రబాబు ఒక వరం

- 21 నెలల్లో ఉదయగిరిలో అభివృద్ధి, సంక్షేమానికి 1200 కోట్లు ఖర్చుచేశాం
- ఉదయగిరి నియోజకవర్గంలో రెండు రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి
- 40ఏళ్ల ఉదయగిరి ప్రజల కలలను నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- రానున్నరోజుల్లో ఉదయగిరి రూపురేఖలు పూర్తి మార్చేందుకు కృషి
- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**నెల్లూరు బ్యూరో (మనసులో మాట ) ఏప్రిల్ 1:** ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వింజమూరుకు రావడం చాలా సంతోషంగా ఉందని, ఉదయగిరి నియోజకవర్గ ప్రజల తరపున సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ చంద్రబాబు ఒక వరం అని కొనియాడారు. దివంగత ఎన్‌టి రామారావు విద్యాసంస్కరణలతో ఇంజనీరింగ్ చేసిన తాను బాబు గారి ఐటీ విప్లవంతో అమెరికాకు వెళ్లి మంచిపేరు సంపాదించినట్లు చెప్పారు. తనలాగా ఎంతోమంది ఐటీరంగంలో ఉన్నతంగా రాణించినట్లు చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో ఉదయగిరిలో రెండు భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడం పట్ల అందరూ ఆశ్చర్యపోతున్నారన్నారు. దుత్తలూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, ఉదయగిరిలో అనడ్రోన్ సిస్టమ్స్ అనే రెండు రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమం కంటే కూడా రెట్టింపు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలో 600 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు ఖర్చుచేస్తే, జాతీయ రహదారుల ఏర్పాటుకు 600 కోట్లు ఖర్చుచేసినట్లు చెప్పారు. పాతూరు చెరువుకు నీళ్లు నింపేందుకు నిధులు, నందవరం–ఉదయగిరి రోడ్డు, క్రాకుటూరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులకు సీఎం అనుమతులు మంజూరు చేయడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రాకుటూరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా 16వేల ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. 40 ఏళ్ల ఉదయగిరి నియోజకవర్గ ప్రజల కలలను సీఎం సాకారం చేశారని చెప్పారు. అలాగే ఉదయగిరి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు. తమ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గం రూపరేఖలు పూర్తిగా మారనున్నాయని కాకర్ల సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్రమంతా గర్వించేలా అమరావతి రాజధాని
### - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



**సర్వేపల్లి మనసులో మాట (ఏప్రిల్ 1)..** భవిష్యత్తులో రాష్ట్రమంతా గర్వించేలా అమరావతిని చంద్రబాబు నాయుడు తీర్చిదిద్దడం ఖాయమని సర్వేపల్లి ఎమ్మెల్యేసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండల పర్యటన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతుల త్యాగాన్ని రాష్ట్రం మరిచి పోలేదన్నారు. అద్భుత రాజధానిగా అమరావతి నిర్మాణంతో చంద్రబాబు నాయుడు మరోసారి తన బ్రాండ్ చాటడం ఖాయం అన్నారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన జగన్ రెడ్డి డ్రామాలకు ఇక చెల్లు వని తెలిపారు. రాష్ట్రాలకు రాజధానులే ఉండవంటూ ఈ రోజు మరో కొత్త రాగం అందుకున్నారు. రాష్ట్ర రాజదానిగా అమరావతిని చట్టబద్ధం చేస్తూ లోక్ సభలో బిల్లు పెట్టడం చాలా సంతోషకర పరిణామం అన్నారు. అమరావతిని రాజధానిగా ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని కేంద్రం అంగీకరించడం శుభపరిణామం అన్నారు.దేశంలోనే మొదటిసారిగా ల్యాండ్ పూలింగ్ విధానాన్ని అంగీకరించి 34 వేల ఎకరాలు ఇచ్చిన అమరావతి రైతుల మేలును రాష్ట్రం ఎప్పటికీ మరిచిపోదని తెలిపారు. అమరావతికి చట్టబద్ధత లభించడంతో భూముల విలువ పెరగడంతో పాటు పెట్టుబడులు వస్తాయి..రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరందుకుంటుంది జగన్మోహన్ రెడ్డి సృష్టించిన గందగోళ వాతావరణానికి ఈ రోజుతో తెరపడిపోయింది.2019 ఎన్నికలకు ముందు రాజధాని అమరావతిలో తాను ఇల్లు కట్టుకుంటున్నానని ప్రజలను నమ్మించి అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అని కూడా సెలవిచ్చారు..అంటే యల్లహంకలోని 29 ఎకరాల ప్యాలెస్ లో ఉంటే అదే రాజధానిగా భావించాలేమో హైదరాబాద్ లోని లోటస్ పాండ్ లో ఉంటే అది కూడా రాజధాని అనుకోవాలేమో. ఆయన బాత్రూమ్ లో ఉంటే బాత్రూమ్, బెడ్రూమ్ లో ఉంటే బెడ్రూమ్ రాజధాని అవుతుందా రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదంటూ ఈ రోజు మరో కొత్తరాగం అందుకున్నారు. ఎప్పుడు ఏ మాట్లాడుతారో తెలియదు..ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఎలా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు . ఇలాంటి వ్యక్తిని రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని పరిస్థితి పార్లమెంటు బయట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అమరావతిని వ్యతిరేకించడం లేదంటారు..లోపలకెళ్లాక బిల్లును వ్యతిరేకిస్తున్నామని బయటకొస్తారు, రాష్ట్రానికి రాజధాని అనేది ఆషామాషీ విషయం కాదు..అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం...ఇలాంటి కీలక విషయంపై వైసీపీకి ఒక స్పష్టత లేదు. అప్పట్లో మన జగనన్న విశాఖ రాజధాని అన్నారు..అనంతపురం ప్రజలు విశాఖకు ఎన్ని గంటలు ప్రయాణించాలి, రాష్ట్రానికి నడిబొడ్డున అమరావతి ఉంది.రాజధానికి స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను సర్వనాశనం చేయాలని జగన్ రెడ్డి ప్రయత్నించారు కులాల పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు...వైసీపీ డ్రామాలు, కుట్రలన్నింటికి ఈ రోజుతో ఫుల్ స్టాప్ పడినట్టే అన్నారు.ఇప్పటి వరకు మనకు రాజధాని లేదనే బాధ కలచివేస్తుండేది...పొరుగు రాష్ట్రాల ప్రజలు రాజధాని గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేని దుస్థితి..ఇప్పటి నుంచి ఆ బాధ లేదు అమరావతి అద్భుత నగరంగా ఆవిష్కరించబడబోతోంది..చంద్రబాబు నాయుడి బ్రాండ్ అంటే ఏంటో మరోసారి అర్థమవబోతోంది. రాజధాని అమరావతికి ఇప్పటికే 66 జాతీయ సంస్థలు వచ్చాయి..60కి పైగా హైరేజ్ టవర్ల నిర్మాణం జరుగుతోంది.జాతీయ క్వాంటమ్ మిషన్ చేపట్టిన దేశంలోని మొదటి క్వాంటమ్ వ్యాలీ కూడా అమరావతిలోనే కావడం ప్రజలందరూ ఆనందించే విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల టిడిపి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన

## - ముఖ్యమంత్రి చంద్రబాబు





- ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ మహోత్సవం
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు



**ఒంటిమిట్ట, (మనసులో మాట) ఏప్రిల్ 1 :** శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని అనుసరించి ధర్మపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాముడు పేరు వినగానే గుర్తొచ్చేది రామరాజ్యం.. సుపరిపాలన అని వ్యాఖ్యానించారు. ఒంటిమిట్ట సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రికి ఆలయ పండితులు స్వామి వార్ల చిత్రపటాన్ని అందించి ప్రసాదాలను అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు.

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..**

'మనందరికీ ఈ రోజు చాలా పవిత్రమైనది. సీతారాముల వారి కళ్యాణోత్సవంలో పాల్గొనడం మనందరి అదృష్టం. వేంకటేశ్వరస్వామి కూడా మన రాష్ట్రంలోనే కొలువై ఉండటం గొప్పవరం. రాష్ట్రం ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని, రాముడు రామరాజ్యాన్ని అందించినట్లుగానే కూటమి పాలన సాగేలా ఆశీర్వదించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజలకు సందప, ఆరోగ్యం, ఆనందం ఇవ్వాలని శ్రీరాముణ్ని ప్రార్థించా. సమైక్య రాష్ట్రంలో భద్రాచలంలో శ్రీరామనవమి జరుపుకునేవాళ్లం. విభజన తర్వాత ఒంటిమిట్టను టీటీడీలో విలీనం చేసి ఏటా ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ రోజు లోక్‌సభలో అమరావతి రాజధానిగా ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. నాడు అమరావతి రాజధానిగా దేవేంద్రుడు పాలిస్తే... నేడు ప్రజారాజధానిగా అమరావతి ఉంది. రాముడు రామరాజ్యాన్ని ఇచ్చినట్లుగానే రాముడి ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.













KANCHARLA

మనసులో మాట

సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

గురువారం 02 ఏప్రిల్ 2026



# స్పీకర్‌కు న్యాయవాదుల కృతజ్ఞతలు!

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు - 2026 శాసనసభలో ఆమోదం పొందిన సందర్భంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు న్యాయవాదుల బృందం బుధవారం శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. బిల్లు ఆమోదానికి సహకరించినందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు పట్ల న్యాయవాద లోకం సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ని న్యాయవాదులు శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. న్యాయవాదుల భద్రత.. సంక్షేమం కోసం ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.న్యాయవాదుల వృత్తిపరమైన ఎదుగుదలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రక్షణ కవచం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు.. బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఈ వేసవిలో నిప్పుల కొలిమి!

- ఏప్రిల్ నుంచి జూన్ వరకు మండుటెండలు ఖాయం
- భారత వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలల పాటు దేశంలో ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని బులెటిన్ విడుదల చేసింది. ఏపీ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో సగటున మూడు నుంచి నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది రోజులకు పైగా వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి వేడి తీవ్రత కొనసాగుతుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉంటాయి. ఏప్రిల్‌లో గోదావరి జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరి దశకు చేరుకుందని, జూన్ నుండి ఎల్‌నినో మొదలవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొంది.



# కొత్త రైతులకు 'రైతు భరోసా'

## 85 వేల మందికి పెట్టుబడి సాయం..

ఏప్రిల్ 15 నుండి ఖాతాల్లో నగదు జమ: రేవంత్ సర్కార్ నిర్ణయం..



హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

తెలంగాణలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటి వరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని.. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 85 వేల మంది కొత్త రైతులు ఉన్నట్లు అంచనా వేయగా.. ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ ఈ దరఖాస్తులను ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. అర్హులైన రైతుల తుది జాబితాను మరో వారం పది రోజుల్లో సిద్ధం చేయనున్నారు.

### ఖాతాల్లోకి నగదు.. రికార్డు పంపిణీ

అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుండి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత నిధులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు 9,000 కోట్ల రూపాయలను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు.. ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తి సాయం అందనుంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి 6,000 చొప్పున.. మొత్తం 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల్లోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యలో నల్గొండ జిల్లా 5.22 లక్షల మందితో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు నిలిచాయి. ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా పట్టా పొందిన రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- 'భూభారతి'తో విప్లవం!
- ఐదు మండలాల్లో రేపటి నుంచే ప్రయోగాత్మక అమలు..
- ఇంటి నుంచే భూ సేవలు.. రోవర్లతో అత్యాధునిక సర్వే: మంత్రి పొంగులేటి..

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలిపారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ 'సమీకృత భూభారతి పోర్టల్'ను రూపొందించారు. ఈ కొత్త విధానాన్ని ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బుధవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.

### ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్

ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా




అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ఈ పోర్టల్ తొలిసారిగా అందుబాటులోకి వస్తుంది. రైతులు భూ సేవల కోసం మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. తమ స్మార్ట్ ఫోన్ ద్వారా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

### రోవర్లతో పక్కా సర్వే.. 'భూధార్' కేటాయింపు

పాతకాలపు గొలుసులు, టేపుల వాడకానికి స్వస్తి చెప్పి.. రోవర్ల ద్వారా కచ్చితమైన డిజిటల్ సర్వే నిర్వహిస్తారు. రైతు దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో పొరుగు రైతులకు నోటీసులు జారీ చేస్తారు. ఏడు రోజుల్లోపు సర్వే పూర్తి చేసి 'భూధార్' నంబరును, ఎల్ పి ఎమ్ మ్యాపును కేటాయిస్తారు. ప్రతి దశలోనూ రైతు రిజిస్టర్ మొబైల్ నంబరుకు ఎస్ ఎమ్ ఎస్ ద్వారా సమాచారం అందుతుంది. రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాపును జత చేసే నిబంధనను కూడా ఈ ఐదు మండలాల్లో అమలు చేయనున్నారు.

### రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పు

భూ సమస్యలు రైతు జీవితంలో పెద్ద అడ్డంకిగా మారాయని.. వాటిని తొలగించేందుకే ఈ పారదర్శక వ్యవస్థను తెచ్చామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పేర్కొన్నారు. ఈ సంస్కరణల వల్ల భూ వివాదాలు తగ్గి రైతులకు భద్రత లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఈ పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారి సేవలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా!

## కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం..

## తిరుచనూర్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు..

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, బుధవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న గవర్నర్ దంపతులకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన శివ ప్రతాప్ శుక్లా, తన సతీమణి జానకి శుక్లా, తో కలిసి ధ్వజస్తంభానికి మొక్కులు చెల్లించుకున్నారు. గర్భాలయంలోని శ్రీవారి మూలవిరాట్టును దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### వేద ఆశీర్వచనం.. సత్కారం

దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు గవర్నర్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి, గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, క్యాలెండర్లను అందజేశారు. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకున్న అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జానకి శుక్లా, దంపతులు తిరుచనూర్ పద్మావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు.

# జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు!

## మార్చిలో రూ. 2 లక్షల కోట్ల ఆదాయం..

గతేడాది కంటే 8.8 శాతం వృద్ధి: కేంద్ర గణాంకాలు..

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సరికొత్త గరిష్ఠానికి చేరుకున్నాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధి రేటుతో సుమారు 2 లక్షల కోట్ల రూపాయల వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతులు అధికం కావడంతో ఆదాయం ఈ స్థాయిలో పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు 1.83 లక్షల కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి.





### దిగుమతుల్లో భారీ వృద్ధి

దేశీయ విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో 1.46 లక్షల కోట్ల రూపాయల ఆదాయం రాగా.. దిగుమతుల ద్వారా 17.8 శాతం వృద్ధితో 53,861 కోట్ల రూపాయల వసూళ్లు జరిగాయి. రిఫండ్ల సర్దుబాటు తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు 1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో మొత్తం వసూళ్లు 22.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. పెరిగిన విక్రయాలు, దిగుమతులు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సంకేతంగా నిలుస్తున్నాయి.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు!

## నేరుగా ఖాతాల్లోకి జీతాలు.. మధ్యవర్తుల దందాకు చెక్!

## వేలాది మంది సిబ్బందికి లబ్ధి.. ఏప్రిల్ నుంచే అమలు



హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం గొప్ప ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న ఇబ్బందులను.. మధ్యవర్తుల అక్రమాలను తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి నెలా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నెల నుంచే ఈ విధానం అమలు కానుంది. దీనివల్ల వేలాది మంది సిబ్బందికి ఆర్థిక భరోసా లభించనుంది.

### పారదర్శకతకు పెద్దపీట

సాధారణంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రైవేటు సంస్థల ద్వారా జీతాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కోతలు.. నెలల తరబడి ఆలస్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి మేలు జరగనుంది. శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ ద్వారా వీరికి వేతనాలు అందనున్నాయి. ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు.

### పారిశుద్ధ్య కార్మికులకు ఊరట

ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, సాంకేతిక సిబ్బంది గతంలో పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు. ఇకపై స్థానిక పన్నుల వసూళ్లతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు!

**నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష..**

**ప్రజాసేవలో మంత్రి అంకితభావం అభినందనీయం..**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అంకితభావంతో పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రి పుట్టినరోజు సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు.

# అడుగంటిన జూరాల.. పాలమూరులో నీటి కష్టాలు!

**5 టీఎంసీల నీటి కోసం కర్ణాటకతో మంత్రి ఉత్తమ్ చర్చలు..**

**వచ్చే వారం బెంగళూరుకు వెళ్లనున్న మంత్రులు, ఎమ్మెల్యేల బృందం..**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. ఎండలు ముదురుతుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోయింది. దీనివల్ల కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందక సాగునీటితో పాటు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వాన్ని కోరారు.

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ**

రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుండి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తో ఫోన్ లో మాట్లాడి 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.

**బెంగళూరుకు మంత్రుల బృందం**

కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా.. సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరుకు వెళ్లనుంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ను నేరుగా కలిసి నీటి విడుదలపై చర్చించాలని నిర్ణయించుకున్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని పాలమూరు ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

# చికెన్ షాపుల సమ్మెకు 'బీసీ పొలిటికల్ ఫ్రంట్' మద్దతు!

**మార్జిన్ల తగ్గింపుపై ప్రభుత్వం చర్చలు జరపాలి..**

**స్టెరాయిడ్ చికెన్‌పై ఉక్కుపాదం మోపాలి: అయిలి వెంకన్న గౌడ్..**



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపుల నిర్వాహకులు చేపట్టిన సమ్మెకు బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పౌల్ట్రీ యాజమాన్యాలు చికెన్ షాపులకు ఇచ్చే మార్జిన్‌ను 30 రూపాయల నుండి ఒక్కసారిగా 16 రూపాయలకు తగ్గించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వారితో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. స్నేహ, సుగుణ, వెబ్ కాబ్ వంటి పెద్ద కంపెనీలు తెలంగాణను అడ్డాగా చేసుకుని స్టెరాయిడ్లతో కృత్రిమ చికెన్ తయారు చేస్తున్నాయని.. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అయిలి వెంకన్న గౌడ్, ఆరోపించారు. ప్రభుత్వం ఇటువంటి కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చికెన్ వ్యాపారులు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి కోళ్ల ఫారాల యజమానులు, మటన్, చేపల షాపుల నిర్వాహకులు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా పోరాడితేనే వ్యాపారుల ప్రయోజనాలు కాపాడబడతాయని పేర్కొన్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

# మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాల్సిందే!

- మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలి: పాడి కౌశిక్ రెడ్డి..
- ప్రశ్నించే గొంతును కేసులతో నొక్కలేరు: ఎమ్మెల్యే సంజయ్..

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**



రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై అసెంబ్లీలో హరీశ్ రావు ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం సీఐడీ విచారణ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఒక మంత్రిపై సీఐడీ విచారణ జరిగితే న్యాయం ఎలా జరుగుతుందని.. అధికారులు మంత్రిని ప్రశ్నించగలరా అని నిలదీశారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

**నిజాలు అడిగితే వేధింపులా?**

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి ఇప్పుడు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో స్పష్టం చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎంతో గౌరవం ఇచ్చి సిట్టింగ్‌ను కాదని టికెట్ ఇస్తే.. ఇప్పుడు ఆయననే విమర్శించడం తగదని హితవు పలికారు. దానం నాగేందర్ అసెంబ్లీలో బూతులు మాట్లాడుతున్నారని.. వాటిపై ఎథిక్స్ కమిటీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగుల పక్షాన, పెన్షన్ల పెంపు గురించి అడిగితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనను టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల తరపున పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలు గాలికొదిలేశారు**

ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అవినీతి మంత్రులను, పార్టీ మారిన వారిని వెనుకేసుకొస్తోందని విమర్శించారు. సభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా తోటి సభ్యులను తిట్టడానికే మంత్రులకు మైకులు ఇస్తున్నారని మండిపడ్డారు. స్వర్ణకారుల కష్టాలపై చర్చ లేదని.. కేవలం రాజకీయ కక్షసాధింపులే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చర్చలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని.. ఇకనైనా పాలసీల గురించి, ప్రజా సమస్యల గురించి మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి, కల్వంకుట్ల సంజయ్ పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం!

- దగడపల్లి, చిన్నదగడపల్లి గ్రామాల్లో మంత్రి జూపల్లి పర్యటన..
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ పడొద్దు: మంత్రి ఆదేశం..

**చిన్నంబావి, ఏప్రిల్ 1 (మనసులో మాట):**



వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లి, చిన్నదగడపల్లి గ్రామాల్లో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా ఉన్న సమస్యలను.. సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**నాణ్యమైన అభివృద్ధి పనులు**

గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. గ్రామస్థాయిలో తలెత్తే చిన్న చిన్న సమస్యలను సైతం ఎప్పటికప్పుడు గుర్తించి.. వాటిని వెంటనే పరిష్కరించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజకీయాలకు అతీతంగా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలన్నారు. పేదలకు అండగా ఉండటమే ప్రభుత్వ ధ్యేయమని.. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

# రాష్ట్రంలో రోడ్ల దుస్థితి దారుణం

**మరమ్మతులు లేక ప్రజల ఇబ్బందులు: వేముల ప్రశాంత్ రెడ్డి..**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**



రాష్ట్రంలో రోడ్లు.. బ్రిడ్జిల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, తీవ్ర విమర్శలు చేశారు. పంచాయతీ రాజ్.. ఆర్ అండ్ బీ శాఖల పరిధిలోని రహదారులు పూర్తిగా పాడైపోయాయని.. మోకాళ్ల లోతు గుంతల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన రెండు సంవత్సరాలుగా సరైన మరమ్మతులు చేపట్టలేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ - భీంగల్ మార్గంలోని ప్రధాన బ్రిడ్జి దెబ్బతిన్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని.. అధికారులు కనీసం పరిశీలించలేదని విమర్శించారు.

**నిధుల కొరత.. నిలిచిన పనులు**

బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ కేవలం 25 శాతం మాత్రమే విడుదల చేస్తున్నారని.. దీనివల్ల పనులు నిలిచిపోయాయని వేముల ప్రశాంత్ రెడ్డి, తెలిపారు. తమ ప్రభుత్వ కాలంలో కేసీఆర్, నాయకత్వంలో 25 వేల కోట్ల నిధులు విడుదల చేసి.. ప్రతి ఏటా సగటున 2,600 కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం కనీసం 4,000 కోట్లు అవసరమైన చోట 1,200 కోట్లు మాత్రమే ఇస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఇచ్చిన సమాధానాల ప్రకారం 2,070 కిలోమీటర్ల రోడ్ల పనులకు గాను కేవలం 112 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యాయని.. ఇది 5 శాతం కూడా కాదని ఎద్దేవా చేశారు.

**అవినీతి ఆరోపణలు**

ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న హ్యామ్ మోడల్ రోడ్లలో వేల కోట్ల రూపాయల స్కాం జరుగుతోందని వేముల ప్రశాంత్ రెడ్డి, ఆరోపించారు. టెండర్లలో మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట ముందుగానే నిధులు విడుదల చేయడం అనుమానాస్పదమన్నారు. రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్‌లో జాప్యం జరుగుతోందని.. అనుభవం లేని కంపెనీలకు పనులు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదేళ్లలో 8,439 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధి చేశామని.. అలాగే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం.. అమరవీరుల స్థూపం వంటి నిర్మాణాలకు వచ్చిన పేరును చెడగొట్టే ప్రయత్నాలు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

# డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీలో అక్రమాల కుట్ర!

**గ్రూప్-1 తరహాలోనే తమ వారికి కట్టబెట్టే ప్రయత్నం: కల్వకుంట్ల కవిత..**

**నిరుద్యోగులను వంచిస్తున్న జీవో నంబర్ 4ను వెంటనే రద్దు చేయాలి..**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

రాష్ట్రంలో గ్రూప్-1 తరహాలోనే డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులను తమ వారికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కకుండా ప్రభుత్వం వివిధ జీవోలను అడ్డంకులుగా మారుస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా డిగ్రీ లెక్చరర్ల నియామకాలకు అడ్డుగా ఉన్న జీవో నంబర్ 4ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**నిబంధనల మార్పుపై విమర్శలు**

పీహెచ్‌డీ అభ్యర్థులకు 25 మార్కుల వెయిటేజీ.. ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించడం తమ వారికి అనుకూలంగా నిబంధనలు మార్చుకోవడమేనని కవిత, విమర్శించారు. రాష్ట్రంలో పీహెచ్‌డీ ప్రవేశాల పరిస్థితి సరిగా లేకపోయినా ఈ విధంగా వెయిటేజీ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మూడేళ్లుగా సెట్ పరీక్ష నిర్వహించకపోవడంతో వేలాది మంది అభ్యర్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1 సమయంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడినట్లే.. ఇప్పుడు లెక్చరర్ పోస్టుల విషయంలోనూ అదే పద్ధతిని అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు.

**నిరుద్యోగులకు అన్యాయం**

ఉద్యోగ నియామకాల్లో అడ్డంకులుగా మారిన జీవోలను రద్దు చేయాలని కవిత, కోరారు. డీఎస్సీకి జీవో 104.. గ్రూప్స్‌కు జీవో 29.. పోలీసు ఉద్యోగాలకు జీవో 46.. గురుకులాలకు జీవో 81 వంటి నిర్ణయాలు నిరుద్యోగుల గొంతు కోస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 40 లక్షల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. జాబ్ క్యాలెండర్‌పై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పేదలపై కక్ష సాధింపు.. కొండగట్టు ఘటన**



కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి.. ఉన్న కార్డులను ఏరివేత పేరుతో తొలగించడం దుర్మార్గమని కవిత, పేర్కొన్నారు. ఐటీ రిటర్న్స్.. ప్రైవేట్ ఉద్యోగాల సాకుతో పేదల కార్డులు తీసేయడం సరికాదన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో పందిళ్లు కూలి భక్తులు గాయపడటంపై విచారం వ్యక్తం చేశారు. నాసిరకం ఏర్పాట్ల వల్లే ఈ ప్రమాదం జరిగిందని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# హనుమాన్ శోభాయాత్రకు సర్వం సిద్ధం!

- 3వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సీపీ వీసీ సజ్జనార్..



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

నగరంలో గురువారం జరగనున్న హనుమాన్ శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. యాత్ర ప్రశాంతంగా సాగేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు, ఉత్సవ నిర్వాహకులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రధాన యాత్రలో సుమారు 168 ఉప యాత్రలు కలవనున్న నేపథ్యంలో.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 3వేల మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు.

### నిర్వాహకులకు కీలక సూచనలు

యాత్రలో పాల్గొనే వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని.. రోప్ పార్టీ సభ్యులను సిద్ధం చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లైఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద అప్రమత్తంగా ఉండాలని.. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### యాత్ర మార్గం పరిశీలన

గౌలిగూడ రామమందిరం నుండి తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు గల 12 కిలోమీటర్ల యాత్ర మార్గాన్ని సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారులపై మట్టికుప్పలు, రాళ్లు లేకుండా చూడాలని.. అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించాలని ఆదేశించారు. ప్రజలందరూ సహకరించి శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నిశ్చితార్థం వేళ విషాదం

## కారు రూపంలో వచ్చిన మృత్యువు!

పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి..

మద్దులపల్లి గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు..




**ఖమ్మం, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

ఖమ్మం జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గురువారం నిశ్చితార్థం జరగాల్సిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద కిరాణా షాపునకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్ (28) వృత్తిరీత్యా పెయింటర్. అతనికి ఇటీవలే వివాహం నిశ్చయం కాగా.. గురువారం నిశ్చితార్థం జరగాల్సి ఉంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి అవసరాల కోసం షాపునకు వెళ్లిన ప్రసాద్.. తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిశ్చితార్థం రోజున యువకుడు మరణించడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదకర వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# 968 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన 'హైడ్రా'!

- అక్షయ ఎన్‌క్లేవ్‌లో కబ్జాదారుల కుట్ర భగ్నం..
- నకిలీ పత్రాలతో ఆక్రమణకు యత్నం: బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు..




**బాలానగర్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలంలోని అక్షయ ఎన్‌క్లేవ్‌లో ఆక్రమణకు గురవుతున్న 968 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు కాపాడారు. 1983వ సంవత్సరంలో 7.12 ఎకరాల్లో వేసిన ఈ లేఅవుట్ హుడా అనుమతి పొందింది. అందులోని పార్కు స్థలాన్ని అబ్దుల్ రెహ్మాన్, అలియాస్ గోపాల్, అనే వ్యక్తి తప్పుడు పత్రాలతో కాజేయాలని ప్రయత్నించారు. దీనిపై స్థానికులు 'హైడ్రా ప్రజావాణి'లో ఫిర్యాదు చేయడంతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

### తప్పుడు పత్రాలతో అనుమతులు

సదరు స్థలం పార్కుకు కేటాయించినదేనని అధికారులు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడ ప్రహరీ నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేశారు. అయితే కబ్జాదారులు 2019లో నకిలీ పత్రాల ద్వారా నిర్మాణ అనుమతులు కూడా పొంది ఆక్రమణలకు సిద్ధమయ్యారు. ఈ అక్రమాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు, సొసైటీ ప్రతినిధులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించారు. ఆక్రమణదారులు పార్కు స్థలంలో వేసిన సామగ్రిని హైడ్రా అధికారులు వెంటనే తొలగించారు. ఆ స్థలం ప్రభుత్వానికే చెందుతుందని.. అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరిస్తూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కులను కాపాడటంలో రాజీ పడేది లేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు అధికారుల చర్య పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కొండగట్టు అంజన్న ఆలయంలో ప్రమాదం!

చలువ పందిళ్లు కూలి 15 మందికి గాయాలు..

అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల తీవ్ర ఆగ్రహం..



**జగిత్యాల, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ఒక్కసారిగా కూలిపోవడంతో 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు నాణ్యత లేకుండా ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భక్తుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం!

- వంచనగిరిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం..
- అర్హులందరికీ దశలవారీగా ఇళ్ల మంజూరు: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి..



**గీసుగొండ, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

పేదల జీవితాల్లో వెలుగులు నింపడం.. సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, తెలిపారు. గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో మైనాల శ్రావణ్ కుమార్, నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి.. లబ్ధిదారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

### పేదల కళ్లలో ఆనందమే ధ్యేయం

ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. పేదల కళ్లలో ఆనందం నింపడమే ప్రభుత్వ ధ్యేయమని.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతామని వెల్లడించారు.

### పారదర్శకంగా ఇళ్ల మంజూరు

జిల్లా కలెక్టర్ సత్య శారద, మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శక పద్ధతిలో ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి.. సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీ పాంచాలరాయ స్వామి సేవలో ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్!

శాయంపేట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న రేవూరి ప్రకాశ్ రెడ్డి, సత్య శారద..



**గీసుగొండ, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

గీసుగొండ మండలం శాయంపేట గ్రామంలో వెలసిన శ్రీ పాంచాలరాయ స్వామి (శ్రీ కృష్ణ) బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద, కలిసి పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న అతిథులకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. రేవూరి ప్రకాశ్ రెడ్డి, సత్య శారద, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాట్లాడుతూ.. ప్రాచీన ఆలయాల వైభవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శాయంపేట వంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఆలయాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఆధ్యాత్మిక కేంద్రాలు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని వెల్లడించారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను, కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరం చేయాలి!

- మే 21 నుంచి జూన్ 1 వరకు పుష్కర వేడుకలు..
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆదేశం..

**భూపాలపల్లి, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో పుష్కరాల పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సూచించారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

ముఖ్యంగా ఘాట్ల అభివృద్ధి.. రహదారుల మరమ్మతులు.. తాగునీటి సౌకర్యం.. పారిశుద్ధ్యం.. విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ, తెలిపారు. రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కేటాయించిన పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

### భద్రత.. వైద్య సదుపాయాలు

పుష్కరాల సందర్భంగా భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ.. భద్రతా చర్యలు.. వైద్య సదుపాయాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

# హెల్మెట్ లేకుంటే ఊరిలోకి రావొద్దు!

**వెంకట్రాంపురం గ్రామస్థుల వినూత్న నిర్ణయం**

**గ్రామ శివారులో బ్యానర్ల ఏర్పాటు**




**బయ్యారం, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా తమ గ్రామంలోకి రావొద్దని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామస్థులు గ్రామ శివారులో మంగళవారం బ్యానర్ ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని.. హెల్మెట్ లేని వారికి గ్రామంలోకి ప్రవేశం లేదని వారు స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# పరిగిలో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

**అక్రమ గ్యాస్ సిలిండర్లు, కుళ్ళిన మాంసం, కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాలపై నిఘా..**

**పరిగి మున్సిపల్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్, ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్ కే అన్వర్ పాషా, వారి బృందం పరిగి పట్టణంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వ, కుళ్ళిన మాంసం విక్రయం, నిబంధనలకు విరుద్ధంగా ఐస్‌క్రీమ్‌ల తయారీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. పరిగి విద్యానగర్ కాలనీకి చెందిన కృష్ణ, అనే వ్యక్తి తన నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 సబ్సిడీ, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే కాలనీలో నివాసముండే మహ్మద్ ఖలీల్, అనే వ్యక్తి తన మటన్ షాపులో సుమారు 35 కిలోల కుళ్ళిన మాంసాన్ని విక్రయానికి ఉంచగా.. దానిని సీజ్ చేశారు. ఇటువంటి చర్యలు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తాయని పోలీసులు హెచ్చరించారు. పరిగి మెయిన్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా, గడువు ముగిసిన ముడి సరుకులు, పారిశ్రామిక రంగులు ఉపయోగిస్తున్న శ్రీ నిత్య ఐస్‌క్రీమ్ యూనిట్‌పై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు వర్కాల హన్మంతు, నుంచి కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సిద్ధార్థ కాలనీకి చెందిన కే. రమేష్, తయారీ తేదీలు లేకుండా మహా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా పట్టుబడ్డారు. నిందితులందరినీ పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్నేహ మెహ్రా, వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్, మాట్లాడుతూ.. కేవలం లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు విక్రయించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని.. ఇది చుట్టుపక్కల ప్రజల భద్రతకు ముప్పు అని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లు, ఐస్‌క్రీమ్ కేంద్రాలపై నిఘా ఉంచుతామని.. ప్రజలు కూడా తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# కుల వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి!

- నర్సంపల్లిలో దళితుల ఆలయ ప్రవేశం.. సహపంక్తి భోజనాలు..
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపు..



**కామారెడ్డి, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

కుల వివక్ష నిర్మూలన దిశగా కామారెడ్డి జిల్లా నర్సంపల్లి గ్రామంలో బుధవారం సమగ్ర సామాజిక సమానత్వ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని దళితులకు అన్ని దేవాలయాల్లో ప్రవేశం కల్పించి.. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**సమానత్వం మన బాధ్యత**

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య, మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వాన్ని కల్పించిందని.. సమాజంలో కులాల పేరుతో ఉన్న వివక్షను పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించేలా చూడటం మన అందరి బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న దురాచారాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం.. అధికారులు.. ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవాలయాలు.. పండుగలు.. సామాజిక వేడుకల్లో ప్రతి వర్గానికి సమాన అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.

**అన్యాయం జరిగితే కఠిన చర్యలు**

దళితులపై ఏ విధమైన అన్యాయం జరిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని బక్కి వెంకటయ్య, హెచ్చరించారు. బాధితులు భయం వీడి ఫిర్యాదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్, మాట్లాడుతూ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని.. గ్రామాలన్నీ ఐక్యతతో ఉండాలని కోరారు. అనంతరం అధికారులు.. ప్రజలు కలిసి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం.. శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గర్భగుడిలోకి అన్ని వర్గాల ప్రజలు ప్రవేశించి సామాజిక సమానత్వాన్ని చాటారు.

**ఐక్యత చాటిన సహపంక్తి భోజనాలు**

అనంతరం గ్రామస్తులతో కలిసి అధికారులు.. ప్రజాప్రతినిధులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో సామరస్య వాతావరణాన్ని నెలకొల్పింది. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వర్లు, సర్పంచ్ రవి, డీటీడీఓ సౌజన్య, తహసిల్దార్ హిమబిందు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి!

- పిప్రిలో బహిరంగ సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా..
- 50 వేల మందితో భారీ బహిరంగ సభ: లోటుపాట్లు ఉండకూడదని ఆదేశం..



**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈ నెల 6వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, తో కలిసి ఆయన పిప్రి గ్రామంలో పర్యటించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్.. బహిరంగ సభా స్థలిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

అనంతరం స్థానిక రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సభకు సుమారు 30 వేల నుండి 50 వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు డబుల్ బ్యారికేటింగ్ ఏర్పాటు చేయాలని.. ప్రజల రాకపోకలకు సౌకర్యవంతమైన మార్గాలు కల్పించాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని షామియానాలు.. నీడ ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.

**వైద్యం.. ట్రాఫిక్ నియంత్రణ**

సభకు వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం సభా ప్రాంగణం లోపలే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా, స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఐసీయూ అంబులెన్సులతో పాటు అత్యవసర మందులతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించాలని.. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని తెలిపారు. విధుల్లో పాల్గొనే అధికారులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కోరారు.

# భక్తాగ్రేసరుడు హన్మంతుడు

హైందవ సంస్కృతిలో పెక్కు పండగలున్నాయి. అవి రుతుపర, మత ప్రమేయ, పురాణేతిహాస సంబంధమైనవి. అందు అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు, నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు. అయిన హనుమత్ జయంతి ప్రాశస్త్య మైనది.

**అశ్వథామ బలిర్వ్యాస :** హనుమాన్ శ్చ విభీషణ: కృప : పరశురామశ్చ సప్తేతే చిరజీవిన : మార్కండేయస్తు అష్టమ: ప్రోక్త :

అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులు గా భావిస్తారు.



ఒక కల్పం అంటే నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో "మార్గళి" మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు అయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాథ అందరికీ తెలిసిందే.

హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువబడే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు.

భగవద్దాసులలో సాటిలేని ఆంజనే యుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది. రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు. అంతేకాదు హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**రామకిష్టయ్య సంగనభట్ల...**
**9440595494**

# బాన్సువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం!

- రైతులకు మద్దతు ధర దక్కాలి: పోచారం శ్రీనివాస రెడ్డి..
- వర్నిలో అభివృద్ధి పనులకు భూమిపూజ..



**బాన్సువాడ, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస రెడ్డి, గురువారం ప్రారంభించారు. కొల్లూరు, తిమ్మాపూర్, ఎస్ ఎన్ పురం, పాత వర్ని గ్రామాల్లోని సొసైటీల పరిధిలో ఈ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం వర్ని మండల కేంద్రంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు.

### మద్దతు ధరతోనే కొనుగోలు

ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస రెడ్డి, మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాలకే ధాన్యం తరలించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2,389 రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2,369 రూపాయలు చెల్లిస్తామని వెల్లడించారు. దేశంలో రైతుల నుండి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని పోచారం శ్రీనివాస రెడ్డి, సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# విధి నిర్వహణ సరేసరి... హక్కుల మాటేమిటి మరి

### ఏప్రిల్ 2... పోలీసు పతాక దినోత్సవం సందర్భంగా

శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్న సత్యం..

అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ళు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది అయిదు వసంతాలు దాటుతున్నా, వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోక పోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయ ప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించు కోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అను క్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట



అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో , కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల అగ్రహానికి గురి కాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో "ధర్మవీర కమిషన్" సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలోమార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. "సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా", ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు "స్వీయ రక్షణే" నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధి నిర్వహణలో మమేక మవుతున్నారు.

### "పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి"

తెలంగాణ గత ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. అలాగే పోలీసు స్టేషన్లకు పెద్దమొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్ కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలు తో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల 'హోంగార్డు'లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతరపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపై దృష్టి సారించ లేక పోయింది...అలాగే క్రింది స్థాయి పదోన్నతుల ప్రక్రియ కొనసాగించ లేక పోయింది. ప్రధానంగా "మీ వెంటే మేమున్నాం" అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, "మీ సంక్షేమమే మాకు ముఖ్యం" అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా కొత్త కాంగ్రెస్

రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది

**రామ కిష్టయ్య సంగనభట్ల,**
**9440595494**

# మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు!

- 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో వికారాబాద్ జిల్లాకు గర్వకారణం..
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ దీపక్ తివారీ, హర్షం..

**వికారాబాద్, ఏప్రిల్ 1 (మనసులో మాట):**

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'దీన్ దయళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల'కు మన రాష్ట్రంలోని రెండు గ్రామాలు ఎంపికయ్యాయి. వికారాబాద్ జిల్లా కోటపల్లి మండలంలోని మోత్కుపల్లి, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలంలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీలు ఈ గౌరవాన్ని దక్కించుకున్నాయి. ముఖ్యంగా మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో ఈ జాతీయ అవార్డు లభించింది.

గ్రామస్థులందరికీ ఆన్‌లైన్ పౌర సేవలు అందించడం.. భారత్ నెట్, సీఎస్సీ సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు పంచాయతీ ఆదాయ వ్యయాలు, అభివృద్ధి ప్రణాళికలను నూటికి నూరు శాతం 'ఈ-గ్రామ్ స్వరాజ్' వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అదేవిధంగా పీఎంజేడీవై, పీఎం ముద్రా, పీఎం కిసాన్, ఉమాంగ్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీ దిశ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ప్రజలకు చేరవేయడం.. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలను జవాబుదారీతనంతో నిర్వహించడం.. రికార్డులను పక్కాగా భద్రపరచినందుకు ఈ అత్యున్నత అవార్డు దక్కింది.



మోత్కుపల్లి గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన మోత్కుపల్లి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలతో పాటు ఎంపీఓ, ఎంపీడీఓ, డీఎల్పీఓ, జిల్లా పంచాయతీ అధికారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డు జిల్లాలోని ఇతర పంచాయతీలకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. పారదర్శక పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి

### ఏప్రిల్ 2...అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

**డెన్మార్క్ దేశానికి చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ 2 ఏప్రిల్ 1805 న జన్మించాడు. ఆయన పుట్టినరోజైన ఏప్రిల్ 2 ను అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది.1967 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు.**




పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటి ల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడా నికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**-రామ కిష్టయ్య సంగన భట.**
**9440595494**

# ధాన్యం సేకరణ పక్కాగా చేపట్టాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగాం, ఏప్రిల్ 1 (మనసులో మాట):** రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, తో కలిసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులను ఆదేశించారు. తూకం యంత్రాలు, తడి కొలిచే పరికరాలు, గోదాముల సౌకర్యం, టార్పాలిన్లు, గన్నీ సంచులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు తాగునీరు.. విశ్రాంతి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రసీదులు అందజేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎంసీఎస్ హాథీరామ్, ఆర్డీఓ శ్రీనివాస్ గౌడ్, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ వసంత, డీసీఎస్ఓ పావని, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అద్లూరి అసాధారణ ప్రయాణం



## దశాబ్దాల నిరీక్షణ.. అలుపెరుగని పోరాటం.. విద్యార్థి నాయకుడి నుండి రాష్ట్ర మంత్రి వరకు..

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరుగని పోరాటానికి, మొక్కవోని దీక్షకు నిలువుటద్దం అద్లూరి లక్ష్మణ్ కుమార్. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి వరకు ఆయన సాగించిన ప్రస్థానం కేవలం ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యంలో పట్టుదల ఉంటే ఏ స్థాయికైనా ఎదగవచ్చని నిరూపించే ఒక స్ఫూర్తిదాయక పాఠం. వరుస పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా, ప్రజాక్షేత్రమే తన కార్యక్షేత్రంగా మార్చుకున్న లక్ష్మణ్ కుమార్ రాజకీయ ప్రయాణం అత్యంత విలక్షణమైనది. 1968 ఏప్రిల్ 1న ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన, చిన్నతనం నుంచే సామాజిక స్పృహను కలిగి ఉండేవారు. ఆయన విద్యాభ్యాసం సాగుతున్న కాలంలోనే సమాజంలోని అసమానతలు, పేదరికం ఆయనను ఆలోచింప జేశాయి. ఈ క్రమంలోనే విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా, తోటి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం గొంతు ఎత్తడం ద్వారా ఆయన రాజకీయ ప్రస్థానానికి బలమైన పునాది పడింది.

లక్ష్మణ్ కుమార్ రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఎన్ఎస్‌యూఐ ద్వారా ప్రారంభమైంది. 1982 నుండి 1985 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. అనంతరం 1986 నుండి 1994 వరకు కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసి, జిల్లా వ్యాప్తంగా విద్యార్థి విభాగం బలోపేతానికి విశేష కృషి చేశారు. ఈ దశలో ఆయనకు ప్రజా సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకునే దృష్టి, సంస్థాగత నిర్వహణలో అపారమైన నైపుణ్యం ఏర్పడింది. యువజన దశలో ఆయన రాజకీయాలు మరింత విస్తరించాయి. 1996 నుండి 2001 వరకు ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా యువతను రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు యువజన శక్తిని సమీకరించి పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారు. ఈ కాలంలోనే ఆయనకు రాజకీయ వ్యూహరచనలో అనుభవం పెరిగి, నాయకత్వ సామర్థ్యం మరింత మెరుగు పడింది.

ఎన్నికల రాజకీయాల్లో ఆయన తొలి ప్రయత్నం 1999లో జరిగింది. మేడారం నియోజకవర్గం నుండి అసెంబ్లీకి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేక పోయారు. అయినప్పటికీ ఆయన వెనుకడుగు వేయకుండా ప్రజల మధ్యే ఉండి తన సేవలను కొనసాగించారు. 2006లో ధర్మారం (ఎస్సీ) రిజర్వుడ్ స్థానం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఈ విజయం ద్వారా ఆయనకు స్థానిక స్థాయిలో బలమైన ప్రజా మద్దతు ఏర్పడింది. పరిపాలనా అనుభవం కూడా ఆయనకు సమృద్ధిగా లభించింది. 2010 నుండి 2012 వరకు కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసి, జిల్లా అభివృద్ధికి పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా మరియు ఆరోగ్య రంగాల బలోపేతం వంటి అంశాల్లో ఆయన తీసుకున్న చర్యలు ప్రజల ప్రశంసలు పొందాయి. అనంతరం 2013 నుండి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి, దళితుల ఆర్థిక అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారు.

అయితే ఎన్నికల రాజకీయాల్లో ఆయనకు వరుసగా తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో, 2010 ఉప ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి చవిచూశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా 2014, 2018 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేక పోయారు. వరుసగా నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా, ఆయన నియోజకవర్గాన్ని వదిలి వెళ్లలేదు. "ఓటమి గెలుపుకు తొలిమెట్టు" అనే నానుడిని ఆయన అక్షరాలా నిజం చేశారు. ప్రతి పరాజయాన్ని విశ్లేషించి, ప్రజలతో మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ తన స్థాయిని పెంచుకున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు పార్టీ సంస్థాగత బాధ్యతలు కూడా లభించాయి. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులై, పార్టీని గ్రామ స్థాయి నుంచి పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేశారు.

దశాబ్దాల నిరీక్షణకు, పట్టుదలకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితం దక్కింది. ధర్మపురి (ఎస్సీ) నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన లక్ష్మణ్ కుమార్, తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22,039 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈ విజయం ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలక ఘట్టం. దాదాపు రెండు దశాబ్దాల పాటు చేసిన కృషికి ఇది ప్రతిఫలంగా నిలిచింది. అనంతరం 2023 డిసెంబర్ 9న ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి, ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతలను ప్రారంభించారు. ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం, 2023 డిసెంబర్ 15న ఆయనను ప్రభుత్వ విప్‌గా నియమించింది. శాసనసభలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ బాధ్యతలో ఆయన చూపిన సమర్థత, నాయకత్వం ఆయనకు మంత్రిత్వ స్థానం పొందడానికి దోహదపడింది.

2025 జూన్ 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జూన్ 11న ఆయనకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి కీలక శాఖలను కేటాయించడం జరిగింది. ఈ శాఖలు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి సంబంధించినవిగా ఉండటంతో, ఆయనపై బాధ్యత మరింత పెరిగింది. తదుపరి ఆయనకు పరిపాలనా బాధ్యతలు మరింత విస్తరించాయి. 2025 జూన్ 12న నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులై, ఆ జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతలను స్వీకరించారు. జూన్ 21న సచివాలయంలో మంత్రిగా అధికారికంగా బాధ్యతలు చేపట్టి, పాలనలో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే 2025 జూలై 7న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్‌చార్జ్ వ్యవస్థలో భాగంగా వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కూడా నియమితులయ్యారు.

అద్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రస్థానం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక దిక్సూచి. రాజకీయం అంటే కేవలం పదవులు అనుభవించడం కాదు, అపజయాలను ఎదుర్కొంటూనే ప్రజల కోసం నిలబడటం అని ఆయన నిరూపించారు. సామాన్య విద్యార్థి నాయకుడి నుండి రాష్ట్ర మంత్రి వరకు సాగిన ఆయన ప్రయాణం తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. ఆయన వ్యక్తిత్వంలో స్థిరత్వం, సంస్థాగత నైపుణ్యం, సామాజిక నిబద్ధత అనే మూడు ప్రధాన అంశాలు కనిపిస్తాయి. రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ ఓడిపోయినప్పుడు నియోజకవర్గాన్ని మార్చకుండా అదే స్థానంలో నిలబడి పోరాడటం ఆయన గొప్పతనం. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసిన తీరు, కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూడటం ఆయన ప్రత్యేకత. దళిత, గిరిజన మరియు మైనారిటీ వర్గాల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి ఆయన చేపట్టే వినూత్న కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

రాబోయే రోజుల్లో ఆయన నేతృత్వంలో తెలంగాణలోని వెనుకబడిన వర్గాల జీవితాల్లో వెలుగులు నిండుతాయని సామాన్య ప్రజలు ఆశిస్తున్నారు. ముఖ్యంగా సంక్షేమ శాఖల మంత్రిగా ఆయన వికలాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత కోసం తీసుకునే నిర్ణయాలు సామాజిక న్యాయం దిశగా సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో క్రమశిక్షణ, పట్టుదల, సామాజిక నిబద్ధత కలగలిపిన ప్రస్థానంతో ఎదిగిన నాయకుల్లో అద్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారు. ఆయన జీవితం సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ఒక నాయకుడి స్ఫూర్తిదాయక గాథ. ప్రజా సేవయే పరమావధిగా భావించి, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆయన పాత్ర భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో మరింత ప్రాధాన్యతను సంతరించు కోవడం ఖాయం. క్రమశిక్షణ, ప్రజా సేవా దృక్పథం కలగలిపితే రాజకీయాల్లో విజయాన్ని సాధించవచ్చని ఆయన నిరూపించారు. సంక్షేమ పథకాల అమలు, విద్యా అవకాశాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాల్లో ఆయన చూపుతున్న చొరవ ప్రజల్లో విశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది.




# అండమాన్ గడ్డపై అరుదైన గౌరవం పొందిన ధర్మపురి వాసి

## క్రమశిక్షణే ఆయుధంగా.. సమయపాలనే ప్రాణంగా: డాక్టర్ గోపాల్ శాస్త్రి జీవన యానం

తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి పుణ్యనేలపై జన్మించి, నమ్మిన విలువల కోసం అహర్నిశలు శ్రమించి, విద్యా-రక్షణ రంగాల మధ్య ఒక బలమైన సేతువుగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం డాక్టర్ గోపాల్ కెవి శాస్త్రి. ఒక సాధారణ గ్రామీణ వాతావరణంలో అడుగులు వేసి, తన క్రమశిక్షణ, పట్టుదల, మేధస్సుతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో కార్యనిర్వాహక ఉన్నతాధికారిగా ఎదగడం ఆయన అసాధారణ ప్రయాణానికి నిదర్శనం. ఆధునిక సాంకేతిక యుగంలో ముంబై కేంద్రంగా సాగిన ఆయన వృత్తి జీవితం కేవలం కార్పొరేట్ విజయాలకే పరిమితం కాలేదు. అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్, మానవ వనరుల వినియోగంలో ఆయన ప్రదర్శించిన నైపుణ్యం సంస్థాగత వృద్ధికి పీఠం వేయడమే కాక, దేశసేవ పట్ల ఆయనలో ఉన్న అచంచలమైన నిబద్ధతను ఎప్పటికప్పుడు చాటుతూనే ఉంది. సాంకేతిక శిఖరాలను అధిరోహించినప్పటికీ, తన మూలాలను మరువకుండా సమాజ శ్రేయస్సు కోసం ఆయన పడ్డ తపన ఆరాధనీయం.

డాక్టర్ శాస్త్రి జీవితంలో అత్యంత కీలకమైన మరియు హృదయ విదారకమైన ఘట్టం 1993 నాటి మహారాష్ట్ర లోని లాతూర్ భూకంపం. దేశాన్ని కుదిపేసిన ఆ మహా విపత్తు సమయంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అటువంటి సంక్షోభ సమయంలో కేవలం సానుభూతి చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో పునర్నిర్మాణానికి ఆయన ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేశారు. విపత్తు నిర్వహణలో సమయపాలన, వనరుల సమర్థ వినియోగం, పక్కా ప్రణాళికాబద్ధమైన పునరావాస చర్యలతో ఆయన రూపొందించిన ప్రాజెక్ట్ ప్రభుత్వానికి, సమాజానికి ఒక దిశానిర్దేశం చేసింది. ఈ నిరుపమాన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, ఆయనను 'భారత రాష్ట్రపతి అవార్డు'తో సత్కరించడం ఆయన కృషికీ, మానవతా దృక్పథానికీ దక్కిన అత్యున్నత గౌరవం. దేశాధ్యక్షుని చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆయన వ్యక్తిగత జీవితంలో చిరస్మరణీయ ఘట్టమే కాక, విపత్తు సమయంలో సామాజిక బాధ్యతను ఎలా నెరవేర్చాలో భవిష్యత్ తరాలకు ఒక పాఠంలా నిలిచింది.

డాక్టర్ శాస్త్రి కేవలం సాంకేతిక నిపుణుడే కాదు, సైనిక క్రమశిక్షణను పుణికి పుచ్చుకున్న యోధుడు. ఎయిర్ వింగ్‌లో ఫ్లైట్ క్యాడెట్‌గా శిక్షణ పొందిన అనుభవం ఆయనలో మొక్కవోని ధైర్యాన్ని, సమయపాలన పట్ల అంకితభావాన్ని నూరిపోశాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆయన చేపట్టిన పలు ప్రాజెక్టులు విద్యా, రక్షణ రంగాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాయి. ఈ క్రమంలోనే ఇటీవల అండమాన్ నికోబార్ దీవుల్లోని కోశిష్ హాల్‌లో జరిగిన ఒక అపురూప వేడుక ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది. భారత సైన్యానికి చెందిన 19 పంజాబ్, 154 టిఏ బీహార్, 2/4 గోర్ఖా రైఫిల్స్, 172 టిఏ మద్రాస్ వంటి ప్రసిద్ధ యూనిట్ల కమాండింగ్ అధికారులు, డిప్యూటీ కమాండర్ల సమక్షంలో బ్రిగేడియర్ జి. పి. సింగ్ చేతుల మీదుగా ఆయన "హానర్ ఫర్ ఎక్సలెన్స్ ఉ అంఫిబియన్ యోధ ఉ గౌరవ పతకం" అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు మేజర్ చిన్మయ్ గోపాల్ శాస్త్రి కూడా పాల్గొనడం, ఆ కుటుంబంలో తరతరాలుగా ప్రవహిస్తున్న దేశభక్తికి, కర్తవ్య నిష్ఠకు అద్దం పట్టింది.




ఆ వేదికపై డాక్టర్ శాస్త్రి చేసిన ప్రసంగం ఆలోచింపజేసేదిగా సాగింది. "ఆర్మ్డ్ ఫోర్సెస్‌లో సమయపాలన" అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రంలో ఒక సెకను కాలం కూడా ప్రాణాలను కాపాడగలదని లేదా ప్రాణాంతకం కాగలదని ఎంతో లోతుగా వివరించారు. సైనిక శిక్షణలో సమయపాలన అనేది కేవలం ఒక నియమం కాదని, అది ఒక జీవన విధానమని ఆయన ఉద్ఘాటించారు. నేటి డిజిటల్ యుగంలో యువత సమయాన్ని వృధా చేస్తున్న తరుణంలో, సైనిక వ్యవస్థలోని క్రమశిక్షణను సామాన్య ప్రజలు కూడా అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రసంగం ముగిసిన తర్వాత అక్కడ ఉన్న సైనిక ఉన్నతాధికారులందరూ లేచి నిలబడి చప్పట్లతో ఆయనకు 'స్టాండింగ్ ఓవేషన్' ఇవ్వడం ఆయన సందేశం ఎంతటి ప్రభావాన్ని చూపిందో తెలియ జేస్తుంది.

ధర్మపురిలో మొదలైన ఒక సామాన్య ప్రయాణం, రాష్ట్రపతి భవన్ మెట్లు ఎక్కి, నేడు అండమాన్ నికోబార్ దీవుల్లో సైనిక వందనం అందుకునే స్థాయికి చేరడం నిజంగా స్ఫూర్తిదాయకం. దేశ రక్షణ, సామాజిక సేవ, వృత్తిపరమైన ఉత్కృష్టత ఈ మూడింటి కలయికే డాక్టర్ గోపాల్ కెవి శాస్త్రి. ఆయన జీవితం రాబోయే తరాలకు నిరంతరం వెలుగునిచ్చే దారిదీపం.


రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్-9440595494




## ఐపీఎల్ పాస్‌లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌పై
# ఈడీకి టీసీఏ ఫిర్యాదు

**హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని వినతి**

**హైదరాబాద్:** ఐపీఎల్ పాస్ లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఈడీ కి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పెద్దలు.. ఐఐపీఎల్ టికెట్లు, పాస్ లు బ్లాక్ మార్కెట్ వైపు మళ్లించారని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. గత 10 ఏళ్లలో దాదాపు 600 కోట్ల వరకు అవినీతి జరిగిందని.. హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని కోరింది. ప్రభుత్వ సంస్థల క్రికెట్ క్లబ్ లను ఒక్కొకటి 2 నుంచి 2.5 కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, తప్పుడు ఖాతాల నమోదు, నకిలీ పత్రాలతో పెద్ద ఎత్తున స్కాం లు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదు లో పేర్కొన్నది. జీహెచ్‌ఎంసీ/ఎంసీహెచ్‌కి చెందిన 17 క్రికెట్ క్లబ్‌లను అక్రమంగా ప్రైవేటీకరించి, ప్రతి క్లబ్‌ను.. ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించింది. 103 ఒరిజినల్ క్లబ్ లను మాయం చేసి.. 80 కి పైగా నకిలీ క్లబ్ లను హెచ్‌సీఏలో చేర్చారని ఫిర్యాదులో పేర్కొంది.


diversion of institutional funds, causing wrongful loss to HCA and unlawful gain to private individuals and persons in control of HCA. The said amount is public accountable money and must be recovered by attaching properties and freezing bank accounts of those responsible.

**(C) Illegal Privatization / Sale of Government GHMC/MCH Clubs:**
It is reliably represented that 17 GHMC/MCH cricket clubs, which are public Government/municipal assets meant for public sports development, were illegally privatized/handed over/sold to private individuals by HCA office bearers in collusion with private persons. Such acts amount to illegal alienation of Government property and unlawful occupation of public assets.

**(D) Membership Fraud and Vote Manipulation:**
HCA has allegedly:
- caused disappearance of 103 genuine member clubs,
- illegally added 80+ fraudulent clubs,
- Manipulated voter lists and election process

# ప్రియ ముందంజ

**ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**


**ఉలన్‌బాతర్(మంగోలియా):** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 60కిలోల బౌట్‌లో ప్రియ 5–0 తేడాతో రిమ్మా వోలెసెంకో(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ప్రియ... పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడుతూనే మరోవైపు ప్రత్యర్థికి దీటుగా బదులిస్తూ ముందుకు సాగింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో జాదుమణిసింగ్ 2–3 తేడాతో రిమా యమగుచి(జపాన్)పై పోరాడి ఓటమిపాలయ్యాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బాక్సర్‌గా కొనసాగుతున్న యమగుచికి జాదుమణి దీటైన పోటీనిచ్చాడు.



# ఢిల్లీ క్యాపిటల్స్ ‘సూపర్’ విక్టరీ!

### ఆరు వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం..

### బౌలింగ్‌లో నటరాజన్, ఎంగిడి..
### బ్యాటింగ్‌లో సమీర్ రిజ్వీ, అదుర్స్



**ఢిల్లీ :** ఉత్కంఠభరిత మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల విజృంభణకు తోడు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో లక్నో పెట్టిన మోస్తరు లక్ష్యాన్ని ఢిల్లీ సునాయాసంగా ఛేదించింది. పదిహేడు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని సత్తా చాటింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ సారథి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు.. ఢిల్లీ బౌలర్ల ధాటికి పెవిలియన్ కు క్యూ కట్టారు. అబ్దుల్ సమద్, (25 బంతుల్లో 36 పరుగులు).. మిచెల్ మార్ష్, (28 బంతుల్లో 35 పరుగులు) కాస్త పోరాడినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో లక్నో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. షాబాజ్ అహ్మద్, 16 బంతుల్లో 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇరవై ఓవర్లు కూడా పూర్తి చేయకుండానే.. 18.4 ఓవర్లలో 141 పరుగులకే లక్నో జట్టు ఆలౌట్ అయ్యింది.



**ఢిల్లీ బౌలర్ల మాయాజాలం..**


లక్నో పతనాన్ని శాసించడంలో ఢిల్లీ బౌలర్లు కీలక పాత్ర పోషించారు. పేసర్ లుంగి ఎంగిడి, కేవలం 3.4 ఓవర్లు వేసి 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మన తెలుగోడు నటరాజన్, కూడా నాలుగు ఓవర్లలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీసి లక్నో నడ్డివిరిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు.

**సమీర్ రిజ్వీ, ఒంటిచేత్తో..**

142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే తడబాటు ఎదురైనా.. ఆ తర్వాత నిలకడగా ఆడి విజయం సాధించింది. ముఖ్యంగా యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ, అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు. 47 బంతులు ఎదుర్కొన్న రిజ్వీ.. 70 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్, 32 బంతుల్లో 39 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి మ్యాచ్ ను ముగించాడు. నితీష్ రాణా, 15 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు 17.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 145 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది.

**పోరాడిన ప్రిన్స్ యాదవ్,**

లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మూడు ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. మొహ్సిన్ ఖాన్, మొహమ్మద్ షమీ, చెరో వికెట్ తీసుకున్నారు. తక్కువ స్కోరును రక్షించుకునే క్రమంలో లక్నో బౌలర్లు శాయశక్తులా ప్రయత్నించినా.. ఢిల్లీ బ్యాటర్ల ముందు వారి పప్పులు ఉడకలేదు. తుది ఫలితంగా లక్నోకు పరాజయం తప్పలేదు.



# స్లో ఓవర్ రేట్..

### కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్



**ఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు బోణి కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఈ గెలుపు సంబరాల్లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టి షాక్ ఇచ్చింది. మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఉన్న అయ్యర్‌పై భారీ జరిమానా విధిస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.

**తప్పని ‘స్లో ఓవర్ రేట్’ దెబ్బ**

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్ణీత సమయంలోగా ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించినందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఈ నిబంధన కింద జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. ఇది మొదటి తప్పు కావడంతో కేవలం ఫైన్‌తో సరిపెట్టారని, ఇదే పునరావృతమైతే కెప్టెన్‌పై నిషేధం పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

**కూపర్ కానలీ మెరుపులు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 162 పరుగులు చేసింది. అనంతరం 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన యువ ఆటగాడు కూపర్ కానలీ అద్భుత ఇన్నింగ్స్ ఆడి పంజాబ్‌ను గెలిపించాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు గెలిచినప్పటికీ, బ్యాటింగ్‌లో కేవలం 18 పరుగులకే వెనుదిరగడం, చేతికి గాయం కావడం, దానికి తోడు భారీ జరిమానా పడటంతో అయ్యర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 3 కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్–2



రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.




# 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

# బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

## మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి




టాలీవుడ్ హీరో ఎన్టీఆర్– కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.



# సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

## మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆ ఆరోపణలను రంజిత్ తోసిపుచ్చినప్పటికీ, తాజాగా మరో నటి ఫిర్యాదు చేయడంతో ఆయన చుట్టూ ఉచ్చు బిగిసినట్లయింది.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861